www.manatelangana.news

Mana Telangana

మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 7 | సంచిక: 196 | శనివారం | 5 జనవరి, 2019

Published from: **Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad**


పేజీలు: 16 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00



రాహుల్ మళ్లీ కన్ను గీటారు

లోక్‌సభలో తంబిదురై మాట్లాడుతుండగా వేరొకరిని చూసి కన్ను గీటిన రాహుల్

16



చందమామా పైలమా?

అరుదైన చంద్రమండల చిత్రాలు పంపిన చైనా వ్యోమనౌక

16

రేపు దుబాయ్‌కి సిఎం కెసిఆర్ ?

3

పెట్టుబడుల సదస్సులో పాల్గొనేందుకు పయనం

సిఎం వెంట మరో నలుగురు అధికారులు

వారం రోజులపాటు పర్యటన



నిరుద్యోగభృతిపై కసరత్తు



7 రాష్ట్రాల్లో అమలు తీరుపై అధ్యయనం

వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి అమలు

మన తెలంగాణ /హైదరాబాద్

రాష్ట్రంలోని నిరుద్యోగులకు ప్రతీ నెలా భృతి ఇచ్చే హామీని అమలుచేయడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందులో భాగంగా ఇప్పటికే ఏడు రాష్ట్రాల్లో ఈ పథకం అమలవుతున్న తీరు, రూపొందించిన మార్గదర్శకాలు, చెల్లిస్తున్న భృతి, ప్రభుత్వంపై పడే భారం తదితర పలు అంశాలను సంబంధిత అధికారులు అధ్యయనం చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారం సందర్భంగా ముఖ్యమంత్రి కెసిఆర్ ఈ హామీని ఇవ్వడం, ఎన్నికల మేనిఫెస్టోలో కూడా పొందుపర్చినందున హామీలను అమలు చేయడంపై ఇప్పటికే దృష్టి పెట్టారు. ఎన్నికల ఫలితాలు వెలువడి నెల రోజులు కూడా పూర్తి కాక ముందే దీనిపై దృష్టి పెట్టడం, అధికారులతో చర్చించడం, వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న తీరును అధ్యయ నం చేయాల్సిందిగా ఆదేశించడం గమనార్హం. సిఎం ఆదేశించడమే తరువాయి అధికారులు కూడా అంతే వేగంగా చత్తీస్‌గఢ్, హిమాచల్ ప్రదేశ్, కేరళ, మధ్యప్రదేశ్, రాజస్థాన్, హర్యానా రాష్ట్రాలతో పాటు పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న తీరుపై అధ్యయనం ప్రారంభించారు. ఆయా రాష్ట్రాల నుంచి వివరాలను కూడా తెప్పించుకున్నారు. ఆ తరువాయి 6లో

పంచాయతీ, పార్లమెంట్ ఎన్నికల్లో మరింతగా కృషి

మళ్లీ విజయ భేరీ

■ చొప్పదండి, హుజూర్‌నగర్ కార్యకర్తల సమావేశంలో కెటిఆర్



కాంగ్రెస్ నేతలకు రిటైర్మెంట్ తప్పదు కెసిఆర్ చొప్పదండి అల్లుడు అభివృద్ధి చేస్తారు

మన తెలంగాణ /హైదరాబాద్

సింహం సింగిల్‌గా వస్తుందన్నట్లు కెసిఆర్ కూడా ఒంటరిగానే పోటీ చేయాలన్న నిర్ణయం తీసుకుని పార్టీని ఊహించని మెజారిటీతో గెలిపించారని, ఒంటిచేత్తో విజయం సాధ్యమైందని టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ వ్యాఖ్యానించారు. చొప్పదండి, హుజూర్‌నగర్ నియోజకవర్గాల పార్టీ కార్యకర్తలతో తెలంగాణ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో తాజా అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ సాధించిన విజయాలను ప్రస్తావించడంతో పాటు రానున్న పంచాయతీ, తరువాయి 6లో

కుంటెపోటు



ఇదిగో బ్యాండు వాయించాలంతే.., ఎవర్నో బ్యాండు బజాయించడం కాదు!

మీది బూటకం నాటకం





రాఫెల్‌పై లోక్‌సభలో వాడి చర్చ

- రెండు గంటల పాటు నిర్మలా సీతారామన్ వివరణ
- బోఫోర్స్ మిమ్మల్ని గద్దె దింపింది, రాఫెల్ మమ్మల్ని మళ్లీ గద్దె ఎక్కిస్తుంది : నిర్మల
- మేము అధికారంలోకి వస్తే రాఫెల్ పై దర్యాప్తు : రాహుల్

న్యూఢిల్లీ: రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు ఒప్పందంపై కాంగ్రెస్ పార్టీ అసత్యాలు ప్రచారం చేస్తూ దేశాన్ని తప్పుదోవ పట్టిస్తోందని రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ దుయ్యబట్టారు. అంతేకాదు బోఫోర్స్ కుంభకోణం కాంగ్రెస్ పార్టీని అధికారం నుంచి దించేస్తే రాఫెల్ ఒప్పందం ప్రధాని మోడీని మరో సారి అధికారంలోకి తీసుకు వస్తుందని ప్రకటించారు. రాఫెల్ ఒప్పందంపై లోక్‌సభలో వాడీ వేడిగా సాగిన చర్చకు శుక్రవారం ప్రధాని మోడీ తరఫున నిర్మలా సీతారామన్ సుదీర్ఘ వివరణ ఇచ్చారు. దాదాపు రెండు గంటల పాటు సుదీర్ఘంగా చేసిన ప్రసంగంలో తరువాయి 6లో

నయీం ఆస్తులు 1200 కోట్లు

ఫహీం పేరు మీద 350, ఫర్హానా పేరుతో 250, ఇతరుల పేరు పై 250 కోట్లు

ఐటి విచారణ పూర్తి

జప్తుకు రంగం సిద్ధం



2



కాకతీయకు సిబిఐపి పురస్కారం

సమీకృత జల నిర్వహణలో అద్భుత పథకంగా ప్రశంస

7

చైనీస్ మాంజాపై నిషేధం

7

వైఎస్‌ఆర్‌సిపిలోకి నటుడు ఆలీ



6

నయీం ఆస్తుల విలువ రూ.1200 కోట్లు



మన తెలంగాణ/హైదరాబాద్ : గ్యాంగ్‌స్టర్ నయీం ఆస్తుల అటాచ్ మెంట్‌కు రంగం సిద్ధమైంది. నయీం ఆస్తులపై ఐటి అధికారుల విచారణ పూర్తి అయ్యింది. మార్కెట్ విలువ ప్రచారం రూ. 1200 కోట్లుగా గుర్తించారు. బినామీ ప్రాపర్టీస్ ప్రొబిషినరీ యూనిట్ కింద ఆస్తులను అటాచ్ చేయనున్నారు. అడ్జ్యుకేటింగ్ అథారిటీతో బినామీ ప్రాపర్టీస్ కింద ఆస్తులను అటాచ్ చేయాలని ఇన్‌కంట్యాక్స్ పిటిషన్ వేసింది. ఇప్పటికే నయీం ఆస్తులపై ఈడి కేసు నమోదు చేసిన విషయం విదితమే. ఇదిలావుండగా 2016 ఆగస్టు 8న షాద్‌నగర్ పట్టణ శివారులోని మిలీనియం టౌన్‌షిప్‌లోని ఒ ఇంట్లో దాక్కున నయీంను పోలీసులు చుట్టుముట్టి ఎన్‌కౌంటర్ చేశారు. నయీం అక్రమంగా ఆర్జించిన మొత్తాలకు చార్టెడ్ అకౌంటెంట్ ద్వారా పక్కాగా లెక్కలు ఉన్నప్పటికీ ఆదాయ పన్నుల చెల్లించలేదని ఐటి అధికారుల దర్యాప్తులో తేలింది. అప్పట్లో సిట్ వర్గాల దర్యాప్తులో సైతం ఆదాయ పన్ను కట్టినట్లు ఏలాంటి ఆధారాలు దొరకలేదు. నయీం సంపాదించిన ఆస్తులను బినామీల పేరున ఉంచాడని, ఈక్రమంలో తన వరుసకు సోదరుడయ్యే ఫహీం పేరుతో రూ.350 కోట్లు, తన అనుచరురాలు ఫర్హానా పేరుపై రూ.250 కోట్ల మేర ఆస్తులు, అలాగే నయీం ముఖ్య అనుచరుడైన శేషన్న సంబంధీకుల పేరు మీద దాదాపు రూ. 250 కోట్ల ఆస్తులు పెట్టినట్లు అప్పట్లో సిట్ గుర్తించింది. కాగా నయీం భార్య పేరుతో కొద్ది పాటి ఆస్తులను ఉంచినట్లు సమాచారం. ఐటి అధికారుల దర్యాప్తులో హైదరాబాద్ నగర శివారులోని తుక్కుగూడలో 12 ఎకరాల ఫాం హౌస్‌ను అరబ్ దేశాల్లో ఉంటున్న తన దూరపు బంధువు పేరిట ఉంచినట్లు తేలింది. వెరసి నయీంకు చెందిన రూ.1200 కోట్ల ఆస్తులను బినామీ ప్రాపర్టీస్ ప్రొబిషినరీ యూనిట్ కింద ఆస్తులను అటాచ్ చేయనున్నారు.

అభ్యర్థుల ప్రచారంపై నిఘా

- ఎక్కువే ఖర్చు చేసే అవకాశం... దృష్టిసారిస్తాం : రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ వి.నాగిరెడ్డి



మన తెలంగాణ/హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో ఖర్చు చేసినట్లు గ్రామ పంచాయతీ ఎన్నికలకు ఖర్చు పెడుతున్నారని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ వి. నాగిరెడ్డి అన్నారు. పంచాయతీ ఎన్నికల ఖర్చును తగ్గించే ప్రయత్నం చేస్తామన్నారు. ఎన్నికల సాధారణ, వ్యయ పరిశీలకులతో శుక్రవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పోటీలో ఉండే అభ్యర్థుల ఖర్చులు, ఎన్నికల కోడ్ అమలుపై చర్చించి, పలు సూచనలు చేశారు. అనంతరం కమిషనర్ మీడియాతో మాట్లాడారు. నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. పోలింగ్ స్టేషన్ల వారీగా ఓటర్ల జాబితాలు ఆన్‌లైన్ లో కూడా పెట్టడం జరిగిందని, ఓటర్లకు అవసరమైన ఫోటో ఓటర్ స్లిప్పులు పంచడానికి కూడా అవసరమైన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రభుత్వ వాహనాలు, భవనాలు అధికార దుర్వినియోగం కాకుండా చూడాలన్నారు. గ్రామ పంచాయతీల్లో ఖర్చులు తక్కువని, అయితే ఈసారి అధిక మొత్తంలో ఖర్చు పెట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తుందన్నారు. 5 వేల కంటే ఎక్కువ జనాభా ఉన్న గ్రామాల్లో సర్పంచ్ అభ్యర్థి రూ.2.50 లక్షల వరకు,వార్డు సభ్యుడు గరిష్టంగా రూ.50 వేలు ఖర్చు చేయవచ్చునన్నారు. 5 వేల జనాభా కంటే తక్కువ ఉన్న గ్రామాల్లో సర్పంచ్ అభ్యర్థికి రూ.1.50 లక్షలు.. వార్డు సభ్యుడిగా బరిలో ఉన్న వారు రూ.30 వేల వరకు ఖర్చులపై పరిమితి ఉందన్నారు. సాధారణ వ్యయ పరిశీలకులు అభ్యర్థులు ఎన్నికల కోడ్ ప్రకారం నడుచుకుంటున్నారా లేదా అనేది పరిశీలన చేస్తారన్నారు. సర్పంచ్ అభ్యర్థులు తప్పుడు లెక్కలు రాస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అవసరమైతే అనర్హత వేటు వేస్తామని హెచ్చరించారు. లెక్కల విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



ప్రతి జిల్లాకు ముగ్గురు పరిశీలకులు ఉంటారన్నారు. పోలింగ్‌లో ఏమైనా ఇబ్బందులు తలెత్తినా, కౌంటింగ్‌లో సమస్యలు వచ్చినా వాటిని తమకు సమాచారం ఇచ్చి నిలిపివేసే అధికారం అధికారులకు ఉందన్నారు. ప్రభుత్వం కొత్త స్కీంలు ప్రవేశ పెట్టవద్దన్నారు. జిహెచ్‌ఎంసి, మున్సిపల్ కార్పొరేషన్‌లకు ఎన్నికల కోడ్ వర్తించదన్నారు. రాజకీయ నాయకులు కోడ్ ఉల్లంఘించిన విషయం తమ దృష్టికి రాలేదన్నారు. రూరల్ ప్రాంతాల్లో ఎలాంటి ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాజకీయ నాయకులు పాల్గొనవద్దని స్పష్టం చేశారు. బోగస్ ఓట్లు వేసే అవకాశం లేకుండా చూస్తామన్నారు. బ్యాలెట్ బాక్సుల వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో పంచాయతీ రాజ్ కమిషనర్ నీతూ ప్రసాద్, రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి అశోక్ కుమార్, ఎన్నికల పరిశీలకులైన సీనియర్ అధికారులు, ఆడిట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సిఎస్, డిజిపితో సమావేశం

గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ కార్యాలయంలో కమిషనర్ వి.నాగిరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌కె.జోషి, డిజిపి మహేందర్ రెడ్డితో సమావేశమయ్యారు. రాష్ట్రంలోని గ్రామ పంచాయతీ ఎన్నికలు జరిగే ప్రాంతాలలో శాంతి భద్రతలు, బడ్జెట్, రవాణా ఏర్పాట్లు, ఎన్నికల నిర్వహణకై పోలింగ్ సిబ్బంది నియామకం తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.

డాగ్‌స్క్వాడ్ సాయంతో అటవీ నేరగాళ్ల అరెస్టు

రాష్ట్రంలో తొలి ప్రయోగంగా నమోదు

మన తెలంగాణ / హైదరాబాద్ : అటవీ ప్రాంతాల్లో నేరాల అదుపునకు ఆ శాఖ పలు ర కాల వినూత్న ప్రయత్నాలకు శ్రీకారం చుట్టింది. ఈ ప్రయత్నాలకు తగిన సత్ఫలితాలు అందుతున్నాయని అటవీశాఖ ఉన్నతాధికారులు తెలిపారు. ఇందులో ప్రధానంగా డాగ్ స్క్వా డ్ ద్వారా రాష్ట్రంలోనే మొద టిసారి అటవీ వేట గాళ్లను పట్టుకున్నట్లు తెలిపారు. మంచి ర్యాల జిల్లా జన్నారం డివిజన్‌లో ప్రయో గాత్మ కంగా ప్రవేశపెట్టిన డాగ్‌స్క్వాడ్ ద్వారా దొం గ లపై నిఘా ఉంచారు. దీంతో డాగ్‌స్క్వాడ్ తన పనిని మొదలు పెట్టింది. చింతగూడ పరిధిలో దుప్పిని చంపి మాంసం విక్రయం కోసం ప్రయత్నించిన నింది తులను డాగ్ స్క్వాడ్ సహాయం ద్వారా ప ట్టుకున్నారు. ఇద్దరు నిందితులను అదు పు లోకి తీసుకున్న అధికారులు వారిపై వన్యప్రాణి చ ట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తర లించారు. వేటగాళ్లు దుప్పిని వేటడారని పసి గట్టిన అటవీ సిబ్బంది వెంటనే డాగ్ స్క్వా డ్‌ను రంగం లోకి దింపారు. వాసన ద్వా రా పసిగట్టే కుక్క దుప్పిని వేటాడి మాంసాన్ని ఉం చిన ప్రదేశంతో పాటు నిందితులను జాడను కనిపెట్టింది. ఉమ్మడి రాష్ట్రం, తెలంగాణలో డాగ్ స్క్వాడ్ ద్వారా అటవీ నేరగాళ్ళను పట్టుకోవడం ఇదే తొలిసారని అటవీశాఖ అధికారులు తెలిపారు.



వణికించిన చలి

- రెండురోజుల్లో ఆరుగురి మృత్యువాత
- తగ్గుముఖం దిశగా వణుకు
- ఉత్తర దిశ మార్చుకున్న శీతలగాలులు
- వాతావరణ శాఖ అధికారి రాజారావు

మన తెలంగాణ/హైదరాబాద్ : కొద్ది రోజులపాటు వణికించిన చలికి కొందరు మృత్యువాతపడగా, మరికొందరు మంచాన పడ్డారు. విపరీతమైన శీతలగాలులు దాదాపు వారం రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలను వణికించాయి. ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో బుధవారం ముగ్గురు, గురువారం ముగ్గురు చలితో మృత్యువాత పడినట్లు రాష్ట్ర అధికారులు గుర్తించారు. చలిగాలులతో వృద్ధులు, పిల్లలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాష్ట్రం మొత్తం మీద చలి తీవ్రత తగ్గుముఖం పట్టిందని, రానున్న రెండు మూడు రోజుల్లో వాతావరణంలో పెద్దగా మార్పులు ఉండవని వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు. ఉత్తర దిశ నుంచి వీస్తున్న శీతల గాలులు దిశ మార్చుకోవడమే చలి తీవ్రత తగ్గడానికి కారణమని వివరించారు. శీతాకాలంలో రాత్రిపూట ఉష్ణోగ్రత తగ్గడం, పగలు పెరగడం మాములేనని, కోస్తాతో పోలిస్తే రాయలసీమ, తెలంగాణలోని దక్కన్ పీఠభూమిలో ఈ తేడాలెక్కువని అధికారులు తెలిపారు. మాములుగా శీతాకాలంలో పగలు 28 డిగ్రీల వరకు వేడి నమోదు కావాల్సి ఉన్నా అలాకాకుండా ఈసారి 20 డిగ్రీల కంటే తగ్గిపోయిందని, పగటి పూట కూడా 19 నుంచి 20 డిగ్రీలు ఉండడంతో రాత్రుళ్లు చలి మరింతగా పెరిగిందని అధికారులు పేర్కొన్నారు.

పగటిపూట సూర్యకాంతి పడకపోవడంతో...

పశ్చిమబెంగాల్ సమీపంలో అల్పపీడనం కేంద్రీకృతం అయి ఉండడం, వాయువ్య భారతదేశంలో ఉష్ణోగ్రతలో మాములుగా ఈ కాలంలో ఉండే దానికంటే 3 నుంచి 4 డిగ్రీలు పడిపోవడంతో చలి గాలుల తీవ్రత పెరిగింది. శీతాకాలంలో డిసెంబర్ చివరితో పాటు జనవరి మొదటి వారంలో ఉదయం పూట వేడి (ఉష్ణోగ్రత) ఉత్తర భారతంలో 12 నుంచి 13 డిగ్రీలు, దక్షిణాన 16 డిగ్రీల వరకు ఉండడం సాధారణం. పగలు సూర్యకాంతి పడకపోవడంతో ఈసారి మరింత చలి త్రీవత పెరిగిందని వాతావరణ శాఖ అధికారులు సూచిస్తున్నారు.


శుక్రవారం ఉష్ణోగ్రతల వివరాలు : ఆదిలాబాద్ జిల్లా , బీమ్‌పూర్ మండలం హర్లీ 7.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. సిద్ధిపేట జిల్లా,పోతారెడ్డి పేటలో 7.8, కామారెడ్డి జిల్లా, భిక్కనూర్‌లో 7.8, ఇదే జిల్లా లచ్చపేటలో 8.4, రంగారెడ్డి జిల్లా, షాబాద్ మండలం, తాళ్లపల్లిలో 7.9, చందవెల్లిలో 8.4, కొమురంభీం ఆసిఫాబాద్ గిన్నెధారిలో 7.9, సిర్పూర్‌లో 8.3, సంగారెడ్డి జిల్లా అలగోలేలో 7.9, సత్వార్‌లో 8.6 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రత నమోదైందని వాతావరణ శాఖ అధికారి రాజారావు తెలిపారు.

ట్రేడ్ యూనియన్ల సమ్మెకు సిపిఐ మద్దతు

శబరిమలలో ఘర్షణలో ఆర్‌ఎస్‌ఎస్ హస్తం – సురవరం సుధాకర్‌రెడ్డి



మన తెలంగాణ/హైదరాబాద్ : కేంద్రం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా చేసే సమ్మెకు తాము మద్ధతు ఇస్తున్నామని సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఈనెల 8,9వ తేదీల్లో ట్రేడ్ యూనియన్ల ఆధ్వర్యంలో జరిపే సమ్మెకు తమ పార్టీ పూర్తి మద్ధతిస్తుందన్నారు. ఈ సమ్మెలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. శబరిమలలో ఆర్‌ఎస్‌ఎస్ ఆగడాల వెనుక కేంద్ర ప్రభుత్వం ఉందన్నారు. సుప్రీంకోర్టు తీర్పుల్లో బిజెపిది రెండునాల్కల ధోరణి అని ఆయన పేర్కొన్నారు. శబరిమల ఆలయంలోకి మొదట్లో మహిళలకు ప్రవేశం ఉండేదని ఆయన తెలిపారు. కేరళలో జెండర్ సమానత్వం కోసం ప్రజాస్వామికమైన పోరాటం జరుగుతుందన్నారు. ఆర్‌ఎస్‌ఎస్, బిజెపిలు భారత రాజ్యాంగానికి, సుప్రీంకోర్టులకు వ్యతిరేకంగా పనిచేస్తున్నాయన్నారు. ఈ రెండు కూడా మనుధర్మాన్ని అమలు చేయాలని ప్రయత్నిస్తున్నాయన్నారు. మహిళలకు కనీస హక్కులు ఉండవా అని ఆయన ప్రశ్నించారు. నరేంద్రమోదీ పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారన్నారు. మోదీ ఇప్పటి దాకా ఒక్క ప్రెస్ కాన్ఫరెన్స్ కూడా పెట్టకపోవడం దారుణమన్నారు. మోదీ మాట్లాడేది ప్రజలు వినాలి, ప్రజలు మాట్లాడేది మోదీ వినరా అని ఆయన ప్రశ్నించారు. ఫ్రెడరల్ ఫ్రంట్ గురించి తనకు తెలియదని మోదీ మాట్లాడడం హాస్యాస్పదమన్నారు. మోదీ పత్రికలు చదవరా అని ఆయన ప్రశ్నించారు. రాఫెల్ విషయంలో జెపిసిని వేయకపోవడంలోనే మోదీ నిజాయితీ అర్ధమవుతుందన్నారు. జేపిసిని వేయాలని సిపిఐ డిమాండ్ చేస్తుందన్నారు. నల్ల ధనాన్ని రద్దు చేయడంలో మోదీ విఫలమయ్యారని ఆయన ఆరోపించారు. 2019లో బిజెపికి గుణపాఠం చెప్పాలన్నారు. తాము మతాలకు అతీతం కాదని, వ్యతిరేకంకాదని ఆయన పేర్కొన్నారు. కేరళలో అయ్యప్పకు కమ్యూనిస్ట్ భక్తులున్నారన్నారు. బిజెపి అధికారంలో ఉన్న చోట ఒకలా, లేనిచోట ఒకలా ప్రవర్తిస్తుందన్నారు. శబరిమల విష యాన్ని బిజెపి ఎన్నికల స్టాండ్‌గా ఉపయోగి ంచు కుంటుం దన్నారు. ట్రంప్ లాగే మోదీ కూడా మీడియాకు భయపడుతున్నారని ఆయన ఆరోపించారు.



కృష్ణా అంటే ఆనందం

చినజీయర్ స్వామీజీ

మనతెలంగాణ, సిటీబ్యూరో : ఈ మానవజాతినంతటినీ కూడా తన సంతానంగా భావించింది గోదాదేవి అని ప్రముఖ ఆధ్యాత్మిక గురువు చినజీయర్ స్వామీజి తన ప్రవచనల్లో చెప్పారు. శుక్రవారం నగరంలోని నందగిరి హిల్స్‌లో మై హోం గ్రూపుల అధినేత జూపల్లి రామేశ్వర్ రావు నివాస ప్రాంగణంలో నిర్వహిస్తున్న ధనుర్మాస ఉత్సవాల్లో ఆయన 20 రోజు తన ప్రవచనాలను వినిపించారు. ఉత్తమ పురుషార్థం అంటే ఆనందమని ఆయన తెలిపారు. కృష్ణా అని అంటే శాశ్వతమైన, ఉత్తమమైన, ఆనందమును ఇచ్చువాడని, తానే అనందమైనవాడు కృష్ణుడు అని ఆండాళ్ తల్లి తెలిపినట్టు ఆయన వివరించారు. ''నారాయణ ననే నమకే పరైతరువాన్'' అనే మంత్రం ద్వారా కృష్ణుడు ఆనందమని తెలిపినట్టు ఆయన చెప్పారు. రుషులందరిలో అధికారకుడైన వ్యక్తి వేద వ్యాసుడు అని ఆయన పేర్కొన్నారు. కలి యుగానికి పూర్వం ద్వాపర యుగమున్నదని, దీని అంతిమ సమయంలో వేదవ్యాసుడున్నాడని తెలిపారు.

కలి యుగం కాలపరిమితి 432000 సంవత్సరాలు కాగా అందులో 5 వేల సంవత్సరాలు ఇప్పటికీ గడిచాయని ఆయన తెలిపారు. ద్వాపర యుగం కాలం 864000 వేల సంవత్సరాలని, ఈ యుగం చివరలోనే వ్యాసుడు నివసించిన వారని ఆయన వెల్లడించారు. వేద విజ్ఞానాన్నంతటిని క్రమపద్ధతిన ఏర్పాటు చేశారన్నారు. వేదవ్యాసుడు తనకు తెలిసిన జ్ఞాన 545 బ్రహ్మ సూత్రాలను రూపొందించారని, 156 అంశాలను ఈ 545 సూత్రాల్లో వివరించారని, అందులో అతి ఉత్తమమైనది, అతి శక్తివంతమైనది, అతి సులభమైనటువంటి మంత్రం మనందరికీ సౌలభ్యంగా ఉన్నది నారాయణ మంత్రమని జీయర్ స్వామీజి వెల్లడించారు. సహజ సిద్ధమైన సంబంధం చాలాచాలా ప్రకృతిపరమైనది అక్కడ ఎలాంటి నియమనిబంధనలు ఉండవని, వర్తించవని ఆయన తెలిపారు. నారాయణ మంత్రానికి జీవరాశికి సహజ సిద్ధమైన సంబంధమున్నట్టు భగవద్గీతలో భగవంతుడు చెప్పుకున్నట్టు ఆయన పేర్కొన్నారు.



భగవంతుడికి, జీవరాశికి 9 సంబంధాలు కలిగి ఉన్నాయని ఆయన చెప్పారు. జీవరాశికి, భగవంతుడికి మధ్య ఉన్న సంబంధం పితృ సంబంధమని జీయర్ స్వామీజి అన్నారు. శేష, శేషి అనే బంధం, మనందరినీ భరించేవాడు భగవంతుడైతే... ఆయనచేత భరింపబడేవాళ్లం మనందరం కూడా అని ఆయన పేర్కొన్నారు. భగవంతుడికి 'గ్నేయం' అని కూడా పేరున్నదని, మనల్ని రక్షించేది తత్ జ్ఞానం అనేది, దేవుడికి, మనకి మధ్య ఉన్న సంబంధం ''జ్ఞాతృ, గ్నేయ'' అని అంటారని ఆయన వెల్లడించారు. వస్తువును సొత్తు అని, మనమంతా దేవుడి సొత్తులమని, మనకు, భగవంతుడికి స్వా, స్వామి భావ సంబంధమున్నదని, మనస్సులో ఉన్న దేవుడు మనల్ని నడిపిస్తాడని, మనస్సులో నుంచి ఆయన వెళ్ళిపోగానే మనల్ని అంతిమసంస్కారం చేసేస్తారని జీయర్ స్వామీజి వెల్లడించారు. మనస్సులో ఉండి నడిపించేవాడు 'అంతర్యామి' అంటారని ఆయన తెలిపారు. మనిషిలో జరిగే క్రియలను చేయించేది 'ఆత్మ' అని, మనం తీసుకునే అన్ని రకాల క్రియలను జరిపించేది 'దైవం' అని ఆయన విశదీకరించారు. లోపల ఉండి మనల్ని నడిపించేది 'మంత్రం' అంటారని జీయర్ స్వామీజి చెప్పారు. ఇవన్నీ ఓంకారంలో నుంచి పుట్టినవేనని, వేదాలు, మంత్రాలు, నారాయణ మంత్రం ఎనిమిది అక్షరాలు ఓంకారంతో ఆరంభమవుతుందని నమః పదంతో సాగుతుందని, నారాయణ పదంతో ముగిస్తుందని ఆయన వెల్లడించారు.

నలుగురు ఎస్‌పిలకు డిఐజి పదోన్నతి

మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రంలో 2004 ఐపిఎస్ బ్యాచ్‌కు చెందిన నలుగురు ఎస్‌పి స్థాయి అధికారులకు డిఐజి హోదా కల్పిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శైలేంద్ర కుమార్ జోషి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ రాష్ట్ర క్యాడర్‌కు చెందిన నలుగురు ఐపిఎస్‌లు ప్రస్తుతం హైదరాబాద్ ఇంటెలిజెన్స్ ఎస్‌పి శివకుమార్, కరీంనగర్ కమిషనర్ కమల్‌హాసన్‌రెడ్డి, వెస్ట్‌జోన్ డిసిపి ఏ.ఆర్ శ్రీనివాస్, సంగారెడ్డి ఎస్‌పి చంద్రశేఖర్‌రెడ్డిలుగా కొనసాగుతన్న నేపథ్యంలో వారికి డిఐజిలుగా పదోన్నతి లభించింది.

టెక్నాలజీని సద్వినియోగం చేసుకోవాలి



మన తెలంగాణ/ ముషీరాబాద్ : మారుతున్న కాలం ప్రకారం పెరుగుతున్న టెక్నాలజీని తెలంగాణ వ్యాపారులు అందిపుచ్చుకుని ఆర్థికంగా బలపడాలని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. రమణారెడ్డి, సంపత్‌రెడ్డి, రాజిరెడ్డి, శేఖర్‌ల సంయుక్తాధ్వర్యంలో చిక్కడపల్లి ప్రధాన రోడ్డు మార్గంలో ఆధునిక టెక్నాలజీతో ఏర్పాటు చేసిన మాత డిజి ప్రెస్‌ను శుక్రవారం హరీశ్‌రావు ముఖ్య అతిథిగా హాజరై ముషీరాబాద్ శాసన సభ్యుడు ముఠా గోపాల్, ఎల్లారెడ్డి పేట ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ సుధాకర్‌రెడ్డి, జిహెచ్‌ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యుడు, స్థానిక కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి, గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ముఠా పద్మతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ టెక్నాలజీ ప్రకారం ప్రజలు కూడా మారాల్సిన అవసరముందన్నారు. నిర్వాహకులు మాట్లాడుతూ తెలంగాణలో తొలిసారి ఫొటో అల్బమ్స్ తయారీలో 7900 వివిహెచ్‌పి ఇండిగో పింక్ అండ్ గ్రీన్ మిషన్‌ను అందుబాటులో తెచ్చామన్నారు. ఈ మిషన్ ద్వారా తయారు చేసిన అల్బమ్ 200 సంవత్సరాల పాటు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌పి సంస్థ ప్రతినిధులు అప్పాదురై, రమేష్, జానకిరామ్ తదితరులున్నారు.

గవర్నర్‌తో పబ్లిక్ సర్వీసు కమిషన్ ఛైర్మన్ భేటీ



మన తెలంగాణ/హైదరాబాద్ : గవర్నర్ నరసింహన్‌ను రాష్ట్ర పబ్లిక్ సర్వీసు కమిషన్ ఛైర్మన్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి రాజ్‌భవన్‌లో శుక్రవారం కలిశారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో ఇప్పటివరకు చేపట్టిన ఉద్యోగాలకు సంబంధించిన నివేదికను ఈ సందర్భంగా గవర్నర్‌కు అందచేశారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో చేపట్టిన సంస్కరణలతో పాటు రానున్న రోజుల్లో తీసుకోనున్న విషయాలపై గవర్నర్ వారితో చర్చించినట్టు తెలిసింది. ఛైర్మన్‌తో పాటు పలువురు సభ్యులు గవర్నర్‌ను కలిసిన వారిలో ఉన్నారు. జేఎన్‌టీయూ వైస్ చాన్స్‌లర్ ఏ.వేణుగోపాల్ రెడ్డి కూడా శుక్రవారం గవర్నర్ నరసింహన్‌ను కలిశారు. మర్యాదపూర్వకంగానే గవర్నర్‌ను కలిసినట్టు రాజ్‌భవన్ వర్గాలు తెలిపాయి.

సిఎం ఒఎస్‌డిగా దేశపతి బాధ్యతలు

డిసెంబర్ 13వ తేదీ నుంచే నియామకం అమల్లోకి



మన తెలంగాణ/హైదరాబాద్ : సిఎం కెసిఆర్ ఓఎస్‌డిగా దేశపతి శ్రీనివాస్ శుక్రవారం సచివాలయంలో బాధ్యతలను స్వీకరించారు. ఈనెల 3వ తేదీన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.కె.జోషి ఉత్తర్వులను జారీ చేశారు. గతంలోనూ కెసిఆర్ వద్ద దేశపతి ఇవే బాధ్యతలను నిర్వర్తించారు. దేశపతి నియామకం డిసెంబర్ 13వ తేదీ నుంచే అమల్లోకి వచ్చినట్లు ఆ ఉత్తర్వుల్లో సిఎస్ జోషి పేర్కొన్నారు. కెసిఆర్ పదవిలో కొనసాగినన్ని రోజులు లేదా వారి అవసరం ఉన్నన్ని రోజులు ఆయన ఆ పోస్టులో కొనసాగనున్నారు.

మతం పేరిట విద్వేషం : నసీరుద్దీన్

న్యూఢిల్లీ : భారతదేశంలో మతం పేరిట విద్వేషపు అడ్డుగోడలు కడుతున్నారని ప్రముఖ నటుడు నసీరుద్దీన్ షా విమర్శించారు. అన్యాయంపై పోరాడే వారిని ఎంచుకుని శిక్షించే వేధించే పద్ధతులు చోటుచేసుకున్నాయని తెలిపారు. అమ్నెస్టీ ఇండియా తరపున వెలువడ్డ వీడియోలో నసీరుద్దిన్ వ్యాఖ్యలు పొందుపర్చారు. స్వచ్ఛంద సంస్థలపై భారత ప్రభుత్వం అణచివేతకు పాల్పడుతోందని ఆరోపిస్తూ అమ్నెస్టీ ఈ వీడియో వెలువరించింది. అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థకు సంఘీభావంగా ఈ నటుడి వ్యాఖ్యలు వెలువడ్డాయి. న్యాయం కోసం గళమెత్తిన వారిని జైళ్లలోకి తోస్తున్నారని షా మండిపడ్డారు. కళాకారులు, నటులు, మేధావులు, కవులు సాహితీవేత్తలు పలు రకాలుగా గొంతు నులమబడుతున్నారని, జర్నలిస్టులు కలమెత్తకుండా చేస్తున్నారని ఈ నటుడు వ్యాఖ్యానించారు.

రేపు దుబాయ్‌కి సిఎం కెసిఆర్?

- పెట్టుబడుల సదస్సులో పాల్గొనేందుకు పయనం
- సిఎం వెంట మరో నలుగురు అధికారులు



మన తెలంగాణ / హైదరాబాద్ : దుబాయ్ నగరంలో ఈ నెల 6వ తేదీ నుంచి 13వ తేదీ వరకు జరగనున్న 'ఇన్వెస్టర్స్ మీట్'లో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి కెసిఆర్‌తో పాటు మరో నలుగురు అధికారులు ఆదివారం బయలుదేరనున్నారు. వారం రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు అవసరమైన 'పొలిటికల్ క్లియరెన్స్' తీసుకోవాల్సిందిగా ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖకు గురువారం రాత్రి లేఖ అందింది. ముఖ్యమంత్రి వెంటన ఆయన కార్యాలయ ముఖ్య కార్యదర్శి నర్సింగ్‌రావు, రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్‌శర్మ, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి అరవింద్‌కుమార్, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్ కూడా వెళ్ళనున్నారు. ఈ ఐదుగురికి అవసరమైన పొలిటికల్ క్లియరెన్స్ ప్రక్రియను సాధారణ పరిపాలన శాఖ ఇప్పటికే ప్రారంభించింది. ఇందుకు విదేశాంగ శాఖ నుంచి అనుమతి కోరుతూ జిఏడి అధికారులు లేఖ రాశారు. అయితే షెడ్యూలును కొద్దిగా కుదించుకోవడం మంచిదంటూ విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్ సూచించినట్లు తెలిసింది. తుది అనుమతి కోసం ఈ వ్యవహారానికి సంబంధించిన ఫైల్ ప్రధాని కార్యాలయానికి చేరినట్లు సమాచారం. ప్రధాని కార్యాలయం నుంచి వచ్చే సూచనలు, అనుమతి ప్రకారం ఈ పర్యటనలో అవసరమైన మార్పులు చేర్పులు ఉండే అవకాశం ఉందని రాష్ట్ర జిఏడి అధికారులు పేర్కొన్నారు. శనివారం మధ్యాహ్నం కల్లా స్పష్టత రావచ్చని తెలిసింది.

విభాగాల కార్యదర్శులకు అదనపు బాధ్యతలు

దుబాయ్ పర్యటనకు సిఎం కెసిఆర్ వెళ్ళడంపై అధికారికంగా ఇంకా ఎలాంటి సమాచారం రానప్పటికీ నలుగురు అధికారులు వెళ్ళడం మాత్రం దాదాపు ఖాయమైనట్లు తెలిసింది. ఈ నలుగురు అధికారుల దుబాయ్ పర్యటనను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కె జోషి ఇతర విభాగాలకు చెందిన కార్యదర్శులకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు (జిఓ నెం. 26) శుక్రవారం జారీ చేశారు. పట్టణాభివృద్ధి ముఖ్య కార్యదర్శి అరవింద్ కుమార్ దుబాయ్ వెళ్తున్నందువల్ల ఆ శాఖ బాధ్యతలను ఆయన తిరిగొచ్చేంత వరకు నిర్వహించాల్సిందిగా మహిళా శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.జగదీశ్వర్‌కు అదనంగా అప్పగించారు. పరిశ్రమలు, వాణిజ్యం, ఐటి తదితర శాఖల ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ కూడా వెళ్తున్నందున ఆయన బాధ్యతలను తిరిగి వచ్చేంత వరకు రోడ్లు భవనాల శాఖ ముఖ్య కార్యదర్శి సునీల్ శర్మ చూసుకోవాల్సిందిగా ప్రధాన కార్యదర్శి అదనపు బాధ్యతలు అప్పగించారు.

గ్రంథాలయ ఉద్యమానికి అంకురార్పణ











- గ్రంథాలయాల జిల్లా అధ్యక్షులతో కెటిఆర్ సమావేశం...అభివృద్ధికి మూలధనం ఏర్పాటు
- రాష్ట్రవ్యాప్తంగా గ్రంథాలయాలకు పక్కా భవనాలు

మనతెలంగాణ/హైదరాబాద్: మరో ఉద్యమంగా గ్రంథాలయ ఉద్యమాన్ని నిర్వహించేందుకు అధికార టిఆర్‌ఎస్ పార్టీ కార్యాచరణ రూపొందిస్తుంది. తెలంగాణ భాష. యాస, సంస్కృతి తరతరాలకు చెదరని విజ్ఞాన సంపదగా ప్రజలకు అందించేందుకు, గ్రంథాలయ వ్యవస్థను పటిష్టం చేసేందుకు అధికార పార్టీ టిఆర్‌ఎస్ ధృఢ నిశ్చయంతో ఉంది. సుమారు రూ.100కోట్ల మూల నిధితో గ్రంథాలయాలను అధునీకరించేందుకు అధికార టిఆర్‌ఎస్ సిద్ధమైంది. టిఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం జిల్లా గ్రంథాలయ చైర్మన్లతో టిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు సమావేశమయ్యారు. రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆయాచితం శ్రీధర్ తోపాటు జిల్లా చైర్మన్లు, ముఖ్యనాయకులు ఈసమావేశంలో పాల్గొని తెలంగాణ గ్రంథాలయాల అభివృద్ధి కోసం తీసుకోవల్సిన కార్యక్రమాలపై సుధీర్ఘంగా చర్చించారు. ఆంతరంగికంగా జరిగిన సమావేశంలో పలు నిర్ణయాలపై చర్చించినట్లు తెలిసింది. సుమారు వందకోట్ల మూల నిధితో గ్రంథాలయ సంస్థ బలోపేతం చేసేందుకు ప్రణాళికలను రూపొందించేందుకు పాలకవర్గం సిద్ధంగా ఉందని కెటిఆర్ చెప్పారు. సమావేశం అనంతరం జిల్లా చైర్మన్లు ఈ అంశాన్ని ధృవీకరరించారు. అలాగే ఇటీవల మీట్‌ది ప్రెస్‌లో కెటిఆర్ గ్రంథాలయవ్యవస్థను ఉద్యమస్ఫూర్తితో అభివృద్ధిచేయనున్నట్లు హామీ ఇచ్చారు. రూ.100 కోట్లతో గ్రంథాలయ వ్యవస్థ తీర్చి దిద్దడంతో పాటు అవసరమైతే నిధుల కొరత లేకుండా ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని కెటిఆర్ ఈసమావేశంలో చెప్పారు. స్వాతంత్ర్య పోరాటాల్లో ప్రముఖ భూమిక పోషించిన గ్రంథాలయ ఉద్యమం కాలక్రమేణ తగ్గిపోయిందన్నారు. అయితే తెలంగాణ ప్రభుత్వం గ్రంథాలయాలను తీర్చిదిద్ది సాహిత్యం,విజ్ఞానాన్ని ప్రజలకు మరింత దగ్గరకు చేర్చేందుకు కృషి చేస్తుందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో గ్రంథాలయాల అభివృద్ధి నత్తనడక నడిచిందన్నారు. ఈ సమావేశంలో పలువురు చైర్మన్లు గ్రంథాలయాలకు పక్కా భవనాలు లేకపోవడంతో ఇబ్బందులు వస్తున్నాయని కెటిఆర్ దృష్టికి తీసుకు రాగా రాష్ట్రవ్యాప్తంగా గ్రంథాలయాలకు పక్కాభవనాలు నిర్మించేందుకు అధికార టిఆర్‌ఎస్ యోచిస్తుందని కెటిఆర్ తెలిపారు. అలాగే గ్రంథాలయాల ఉద్యమాన్ని నిర్వహించి పక్కా భవనాల నిర్మాణాల కోసం గ్రంథాలయ చైర్మన్లు కృషిచేయాలని చెప్పారు. తెలంగాణ సంస్కృతిని,భాషా వికాసాన్ని తరతరాలకు అందించేందుకు గ్రంథాలయ వ్యవస్థ అత్యంత కీలకమని కెటిఆర్ సమావేశంలో చెప్పారు. గ్రంథాలయాల భివృద్ధికి తీసుకోవల్సిన చర్యలపై సమగ్రసమాచారంతో చైర్మన్లు రావాలని చెప్పినట్లు తెలిసింది. అలాగే గ్రంథాలయ చైర్మన్లు పలు అంశాలను కెటిఆర్ దృష్టికి తీసుకువచ్చినట్లు సమాచారం. గ్రంథాలయాలను అభివృద్ధి చేసేందుకు కెటిఆర్ ఉత్సహంగా ఉన్నారని సమావేశంలో పాల్గొన్న చైర్మన్లు చెప్పారు. కొత్తగా ఆవిర్భవించిన తెలంగాణ ఇప్పటికే అనేక పథకాల్లో దేశానికి ఆదర్శంగా నిలిచిందని పలువురు జిల్లా గ్రంథాలయ చైర్మన్లు ఆనందం వ్యక్తం చేశారు. అలాగే తెలంగాణలో ప్రారంభమయ్యే గ్రంథాలయ ఉద్యమం కూడా దేశానికి ఆదర్శం అయ్యేవిధంగా చేయనున్నట్లు తెలిపారు. వేగవంతమైన అభివృద్ధికి మరింత విజ్ఞానాన్ని అందించాలంటే గ్రంథాలయవ్యవస్థను తీర్చి దిద్దాల్సిన అవశ్యకత తను కెటిఆర్ గుర్తించడం ఎంతో ఆనందంగా ఉందని సమావేశం అనంతరం పలువురు జిల్లా గ్రంథాలయ అధ్యక్షులు ప్రశంసించారు.

సందడిగా.. టిఆర్‌ఎస్ కార్యాలయం

కార్యకర్తలు,అభిమానులతో మమేకమైన కెటిఆర్

కెటిఆర్‌కు శుభాకాంక్షలు తెలిపిన నాయకులు, కార్యకర్తలు

ఉదయం నుంచి సాయంత్రం వరకు బిజీబిజీ

టిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు పార్టీ కార్యాలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు అవిశ్రాంతంగా కార్యకర్తలు, నాయకులతో మమేకమయ్యారు. టిఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు అభిమానులు,పార్టీనాయకులను కలిశారు. నూతనసంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ పార్టీ కార్యాలయంలో అభిమానులు కిక్కిరిసి పోయారు. అయినప్పటికీ ప్రతి ఒక్కరిని పలకరిస్తూ కార్యకర్తల్లో ఉత్సాహాన్ని పెంపొందిస్తూ కార్యక్రమాలు నిర్వహించారు. కెటిఆర్‌కు శుభాకాంక్షలు తెలిపిన నాయకుల్లో శాసనసభ్యులు పైల శేఖర్ రెడ్డి, రవిశంకర్, బాల్కసుమన్, గొల్లమల్లయ్య యాదవ్, శాసన మండలి సభ్యులు కుసుకుంట్ల ప్రభాకర్, భానుప్రసాద్ తదితరులు ఉన్నారు. అలాగే సెట్విన్ చైర్మన్ అలీ భాక్రీ, తెలంగాణ పోలీసు హౌజింగ్ కార్పోరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్‌తోపాటు పలువురు నాయకులు,కార్యకర్తలు బారులు తీరి కెటిఆర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు, అలాగే తెలంగాణ విద్యుత్ ఇంజనీర్ల అసోసియేషన్ నాయకుడు ఎం.శివాజి కార్యవర్గ సభ్యులతో కెటిఆర్ తో కొద్ది సేపు సమావేశమై నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిరారు. విద్యుత్ ఇంజనీర్ల డైరీ అవిష్కరణకు టిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌ను ఆహ్వానించగా అంగీకరించారని శివాజీ తెలిపారు. మహేశ్వరం నియోజక వర్గం నుంచి మోహన్ రెడ్డితో పాటు పలువురు నాయకులు కెటిఆర్‌ను కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలోని పలు నియోజకవర్గాలనుండి కార్యకర్తలు,నాయకులు,అభిమానులు అత్యధికంగా పార్టీ కార్యాలయానికి రావడంతో కార్యాలయ పరిసరాలు కిక్కిరిసి పోయాయి. బారులు తీరి కెటిఆర్‌కు పుష్పగుచ్చాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలపడంతో పండుగ వాతావరణం ఏర్పడింది. ఒక వైపు పార్టీ కార్యక్రమాలు, సమావేశాలు నిర్వహిస్తూ మరో వైపు పార్టీ శ్రేణులను కలుకుంటూ కెటిఆర్ విధులు నిర్వహించారు.

రుణ మాఫీ సర్వరోగ నివారిణి కాదు


సంపాదకీయం

రైతు రుణ విమోచన నేటి రాజకీయ పాస్‌వర్డ్ అయిపోయింది. దానిని ఉపయోగిస్తేగాని ఎన్నికలలో విజయావకాశాలు తెరుచుకోవనే అభిప్రాయం అంతటా నాటుకున్నది. చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ ఎన్నికల్లో దీనిని ప్రధాన ప్రచారాంశం చేసుకొని కాంగ్రెస్ పార్టీ అధికారం సాధించుకొని జాతీయ స్థాయిలో కూడా విజయ సాధనంగా దీనినే మలుచుకోవాలని అది సంకల్పించిన తర్వాత రైతు రుణ మాఫీ అనేది ప్రతినోటా నానుతోంది. గత కొద్ది సంవత్సరాల్లో దేశ రాజధానిలో, ఇతర ప్రధాన నగరాల్లో రైతులు జరిపిన చరిత్రాత్మక ర్యాలీలు కూడా రుణ మాఫీ వైపు దృష్టి పెట్టక తప్పని పరిస్థితిని పాలకులకు సృష్టించాయి. అందుచేత ఇది జాతీయ స్థాయిలో కూడా ఎప్పుడూ లేనంతగా చర్చనీయాంశమైంది. సంప్రదాయ ఆర్థిక శాస్త్రజ్ఞులు అప్పుడే గగ్గోలు ప్రారంభించారు. రుణ మాఫీ వల్ల బ్యాంకులు దివాళా తీస్తాయని, రైతులు రుణాలు ఎగ్గొట్టడానికి అలవాటు పడిపోతారనే అభిప్రాయాన్ని వారు వ్యక్తం చేస్తున్నారు. రుణ మాఫీయే రైతుకు ఏకైక రక్షాకవచమా? దీనివల్ల వారి ఆర్థిక బాధలన్నీ అంతమయిపోతాయా? తరచిచూస్తే రుణ మాఫీ పొందిన రైతులు కూడా ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని అర్థమవుతుంది. హైదరాబాద్‌లోని ఆర్థిక, సాంఘిక అధ్యయనాల కేంద్రం (సెస్) తరపున జరిగిన ఒక పరిశీలనలో రుణ మాఫీ పొందని రైతుల్లో సుమారు 76 శాతం మంది ఆత్మహత్యకు పాల్పడుతుండగా పొందిన వారిలో కూడా 20 శాతానికిపైగా ప్రాణాలు తీసుకుంటున్నారని వెల్లడయింది. రుణ మాఫీ వల్ల ఆత్మహత్యలు పూర్తిగా ఆగిపోలేదని, ఆర్థికంగా బాగుపడి జీవితంలో పై మెట్టు ఎక్కడం లక్ష్యంగా రైతులు వేసుకున్న ప్రణాళికలు విఫలమవుతున్నాయని, పర్యవసానంగా కౌలు సాగుదార్లు వ్యవసాయాన్ని విడిచిపెట్టి వేరే బతుకు మార్గాల వెంట పోతున్నారని ఈ అధ్యయన కర్తలు స్పష్టం చేశారు. గుంటూరు జిల్లాలో జరిపిన ఈ అధ్యయనం ప్రధానంగా 2008లో కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన రుణ మాఫీ ప్రభావంపై దృష్టి కేంద్రీకరించింది. రుణ మాఫీ రైతుల అప్పుల భారాన్ని ఎంతోకొంత తగ్గించగలదేకాని పూర్తిగా తొలగించబోదని ఈ అధ్యయనం తేల్చి చెప్పింది. పెను మంట మీద చిలకరింపుగా చల్లే నీళ్లు తాత్కాలిక ఉపశమనాన్నే ఇస్తాయిగాని అగ్గిని పూర్తిగా ఆపలేవు.

రైతును నిరంతరాయంగా కాల్చుకొని తింటున్న 'కొనబోతే కొరివి, అమ్మబోతే అడవి' అనే అగ్ని గుండాన్ని ఆర్పడం రుణ మాఫీ వంటి వితరణ చర్యల వల్ల కాదుకదా కాదు. వాస్తవానికి రుణ మాఫీని ఆత్మాభిమానం గల రైతులు నిండు మనసుతో ఆహ్వానించరు. తన కష్టానికి తగిన ఫలితం లభించాలని, దానితో వడ్డీ సహా అప్పులు లక్షణంగా తీరిపోవాలని, ఇంటిల్లిపాదీ సుఖంగా బతికి కొంత మొత్తం భవిష్యత్తు కోసం మిగుల్చుకొనే పరిస్థితి ఉండాలని, పూర్వం మాదిరిగా నగా నట్రా చేయించుకొని హాయిగా జీవితం గడిపేలా వ్యవసాయం తోడ్పడాలని రైతులు కోరుకుంటారు. వాస్తవానికి ప్రకృతి వైపరీత్యాలు ఎదుర్కోకతప్పని వ్యవసాయ రంగం వాటి వల్లనే నష్టాల పాలవుతున్నది. అతివృష్టి, అనావృష్టులు పొలం నుంచి ఇంటికి పంట చేరకముందే రైతుతో వికృత క్రీడ సాగించి నిలువెల్లా ముంచుతాయి. అందుచేత వ్యవసాయ రాబడి రైతు అప్పులూ, అవసరాలూ తీరి ఎంతో కొంత మిగుల్చుకొనే స్థితిలో ఉండాలి. అందుకు విరుద్ధంగా ఉన్నదీ లేనిదీ అమ్ముకున్నా అప్పులు తీరక రైతులు ఆత్మహత్యల బాట పడుతున్నారు. పంట దండిగా పండినప్పుడు మార్కెట్‌లో ధర పాతాళపతనం చెంది దగా పడుతున్నారు. ఎరువులు, పురుగు మందులు తదితర సాగు పరికరాల ధరలు నానాటికీ విజృంభించి వ్యవసాయం భరించలేని ఖర్చుతో కూడుకున్నదవుతున్నది. ఈ దుస్థితిని తొలగించడానికి బహుముఖమైన సదుపాయాలను రైతులకు కల్పించడం ప్రభుత్వాల బాధ్యత.

పండించే రైతుకూ, వినియోగదారులకు మధ్య కొరకరాని కొయ్యగా పాతుకుపోయిన దళారీ వ్యవస్థను నామరూపాల్లేకుండా చేయాలి. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులమేరకు సంతృప్తికరమైన మద్దతు ధర చిన్న, పెద్దా రైతులందరికీ అందేలా చూడాలి. మంచి ధర వచ్చే వరకు పంటను నిల్వ చేసుకొనేందుకు వీలుగా రైతుకు ఆర్థిక సాయంతోపాటు గిడ్డంగులు మున్నగు సదుపాయాలను విరివిగా అందుబాటులోకి తీసుకురావాలి. ప్రభుత్వ సంస్థలే నేరుగా అవినీతి రహితంగా గిట్టుబాటు ధరకు పంటను కొనుగోలు చేసేలా చూడాలి. ఇలా అనేక వ్యవస్థాగతమైన మార్పులు తీసుకురావాలేగాని రుణ మాఫీల తాయిలాలతో సరిపెట్టినంత కాలం రైతు దుస్థితి తొలగదు.

అగ్ని సరస్సున విరిసిన కలువలు



దక్షిణ కశ్మీరులో పుల్వామా, షోపియన్ జిల్లాలు ఎన్‌కౌంటర్లతో దద్దరిల్లుతున్నాయి. గత కొంతకాలంగా కశ్మీరులో ఎటు చూసినా అలజడి, కల్లోలమే. ఇలాంటి పరిస్థితుల్లో కూడా స్థానిక ప్రజల పట్టుదల, సంకల్పం, కఠిన పరిశ్రమ అక్కడి పిల్లలు చదువుకు దూరం కాకుండా కాపాడింది. పదవ తరగతి పరీక్షల్లో పిల్లలు అద్భుతమైన ఫలితాలు సాధించారు.

జమ్ము– కశ్మీర్ రాష్ట్ర పాఠశాల విద్యా బోర్డు ఇటీవల పదవ తరగతి పరీక్షల ఫలితాలు ప్రకటించింది. ఉగ్రవాద కదలికలు, ఎన్‌కౌంటర్లు, నిరసనలు, ఆందోళనలతో అట్టుడుకుతున్న దక్షిణ కశ్మీరులోని పుల్వామా, షోపియన్ జిల్లాల విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో ఉత్తీర్ణులై అందరినీ ఆశ్చర్యానికి గురి చేశారు. మిగిలిన ప్రాంతాల కన్నా ఈ ప్రాంతాల విద్యార్థుల ఉత్తీర్ణతా శాతం ఎక్కువగా ఉండడం చూసి చాలా మంది నమ్మలేకపోయారు. పుల్వామా జిల్లాలో 84.5 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. షోపియన్ జిల్లాలో 83 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఈ రెండు జిల్లాల్లో ఉత్తీర్ణతా శాతం శ్రీనగర్ కన్నా ఎక్కువగా ఉంది. శ్రీనగర్‌లో ఉత్తీర్ణతా శాతం కేవలం 81.9 శాతం. మొత్తం కశ్మీరులో విద్యార్థుల ఉత్తీర్ణతా శాతం ఈ సంవత్సరం పెరిగింది. గత సంవత్సరం కేవలం 62.94 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఈ సంవత్సరం 75.44 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన సమాచారం ప్రకారం ఈ రెండు జిల్లాల్లో అసలు పిల్లలు చదువుకునే పరిస్థితే లేదు.

చూపు

2018లో అల్లర్లు, కల్లోలాల కారణంగా స్కూళ్ళు మూతపడే ఉన్నాయి. అంటే పిల్లలు స్కూలుకు వెళ్ళి చదువుకునే అవకాశమే లేకుండా పోయింది. పుల్వా మా జిల్లాలో 170 రోజులు స్కూళ్ళు మూతపడే ఉన్నాయి. షోపియన్ జిల్లాలో 118 రోజులు స్కూళ్ళు పని చేయలేదు. అంటే ఈ సంవత్సరం స్కూళ్ళు పని చేసిందే లేదని చెప్పాలి. స్కూళ్ళు మూతపడడానికి కారణం అందరికీ తెలిసిందే. అలజడి, కల్లోలాల వాతావరణంలో స్కూళ్ళు పని చేయడం సాధ్యపడలేదు. ఇవి కాక స్కూళ్ళకు సాధారణంగా ఏటా ఇచ్చే సెలవులు కూడా ఉన్నాయి. ఇవన్నీ కలిపితే మొత్తం సంవత్సరంలో స్కూలు పని చేసింది లేనేలేదు.

మరో వాస్తవమేమంటే, 2016లో టెర్రరిస్టు నాయకుడు బుర్హాన్ వానీ ఎన్‌కౌంటర్ తర్వాత తీవ్రమైన అలజడి చెలరేగింది. కర్ఫ్యూ చాలా కాలం కొనసాగింది. అప్పట్లో 32 స్కూళ్ళు దహనమయ్యాయి. ఈ స్కూళ్ళలో దక్షిణ కశ్మీరులోని పుల్వామా, షోపియన్ జిల్లాల్లోనివే ఎక్కువ. ఈ స్కూళ్ళ పునర్నిర్మాణం కూడా జరగలేదు. 2017లో మానవ వనరుల శాఖ కశ్మీరులో విద్యాభివృద్ధికి ప్రణాళికలు, దారి పటం సిద్ధం చేసింది. ఈ ప్రణాళికలో స్కూలు భవనాల నిర్మాణం కూడా ఉంది. కాని ఇదంతా కాగితాలపైనే. కాగితాల గడప దాటి ఆచరణలో జరిగిందేమీ లేదు. ఒక్క స్కూలు కూడా కట్టించడం జరగలేదు. పుల్వామా, షోపియన్ జిల్లాల్లో స్కూలు భవనాల గురించి నాయకులు మాట్లాడ్డమే తప్ప ఆచరణలో చేసింది ఏదీ లేదు.

ఇప్పుడు ఈ రెండు జిల్లాల్లో పిల్లలు అద్భుతమైన ఫలితాలు సాధించిన తర్వాత జిల్లా యంత్రాంగం ఈ ఘనకార్యం సాధించింది తామే అన్నట్లు చెప్పుకోవడం ప్రారంభించింది. ప్రభుత్వం తీసుకున్న అద్భుతమైన చర్యల వల్లనే పిల్లలు పెద్ద సంఖ్యలో పరీక్షల్లో పాసయ్యారంటూ జిల్లా యంత్రాంగం చెప్పుకుంటున్న మాటలు విని జనం నవ్వుకుంటున్నారు. స్కూలు టీచర్లు కూడా వాస్తవాలు తెలుసు కాబట్టి ఈ ప్రచారాన్ని ఖండిస్తున్నారు. స్థానిక ప్రజలు తీసుకున్న శ్రద్ధ, కఠిన ప్రయత్నాలు, పట్టుదల వల్లనే పిల్లల చదువు సాగిందని టీచర్లు తెలియజేశారు.

అసలు సంవత్సరమంతా స్కూళ్ళు మూతపడే ఉన్నాయి. కశ్మీరు తగలబడుతూనే ఉంది. స్కూళ్ళు మూతపడి ఉంటే పిల్లల సిలబస్ పూర్తయ్యే అవకాశమే లేదు. ఈ పరిస్థితి గమనించిన స్థానిక ప్రజలు ఎక్కడికక్కడ కమ్యూనిటీ స్కూళ్ళు ప్రారంభించారు. జిల్లాలో వివిధ ప్రాంతాల్లో ఇలాంటి స్కూళ్ళు ప్రారంభమయ్యాయి. ఈ కమ్యూనిటీ స్కూళ్ళలో పిల్లలు చదువుకునే అవకాశం లభించింది. నిజానికి ఇవి పూర్తిస్థాయి స్కూళ్ళు కూడా కాదు, కోచింగ్ తరగతుల వంటివి ప్రజలే ఏర్పాటు చేశారు. అది కూడా ప్రత్యేక భవనాల్లో ఏర్పాటు చేసినవి కాదు, ఎవరో ఒకరి ఇంట్లో కొందరు టీచర్లు రావడం, అక్కడికి పిల్లలను పిలిచి వారికి బోధించడం లేదా ఏదన్నా కమ్యూనిటీ సెంటరు దొరికితే అక్కడికి టీచర్లు వచ్చి పిల్లలను పిలిచి చదివించడం జరిగింది. పట్టణ ప్రాంతాల కన్నా గ్రామీణ ప్రాంతాల్లో ఈ ప్రయత్నాలు ఎక్కువగా జరిగాయి.

స్కూళ్ళు మూతపడి ఉన్నందువల్ల పిల్లలు ఇంట్లోనే పుస్తకాలు ముందేసుకుని కూర్చుని చదవడం, సందేహాలు రాసుకోవడం, టీచర్లు కోచింగ్ క్లాసుల్లో కనబడినప్పుడు వారినడిగి సందేహాలు తీర్చుకోవడం ద్వారా విద్యార్థులు పరీక్షలకు సిద్ధమయ్యారు. విద్యార్థులు, టీచర్లు, స్థానికులంతా కలిసి సాధించిన విజయమిది. కర్ఫ్యూ ఉన్నప్పుడు కమ్యూనిటీ స్కూళ్ళు కూడా పని చేసే అవకాశం లేదు. కాని గ్రామీణ ప్రాంతాల్లో కర్ఫ్యూ ఉన్నప్పటికీ ఎవరో ఒకరి ఇంట్లో కమ్యూనిటీ స్కూలు నడుస్తూనే ఉండేది.

పిల్లలు కష్టపడి సాధించిన విజయమిదంతా అంటున్నారు అక్కడి స్థానిక ప్రజలు. చదువుకోవాలన్న బలమైన సంకల్పం ఉన్నందువల్లనే స్కూళ్లు మూతపడినా చదువును అటకెక్కించకుండా పిల్లలు కష్టపడ్డారని పలువురు ప్రశంసిస్తున్నారు. పుల్వామా జిల్లాలో ఐదు నెలల పాటు స్కూలు తలుపులు తెరుచుకోలేదు. సిలబస్ పూర్తయ్యే అవకాశమే లేదు. ఈ ఇబ్బందులు, అడ్డంకులు కశ్మీరు విద్యార్థులను ఆపలేకపోయాయి. వాళ్ళు చదవడమే కాదు, పరీక్షల్లో పాసయ్యారు. అత్యుత్తమ ఫలితాలు సాధించి అందరినీ ఆశ్చర్యానికి గురిచేశారు.

అల్లర్లు, కర్ఫ్యూలు, ఆందోళనలు, ర్యాలీలు, ఎన్‌కౌంటర్లు కొనసాగుతున్నప్పటికీ స్థానిక ప్రజలు చదువు ప్రాముఖ్యాన్ని నిర్లక్ష్యం చేయలేదు. పిల్లలు చదువుకునేలా ప్రోత్సహించారు. స్కూళ్ళు మూతపడితే కమ్యూనిటీ స్కూళ్ళకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. పిల్లలు కూడా తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయలేదు. కశ్మీరులో ముఖ్యంగా దక్షిణ కశ్మీరులో విద్యార్థులకు స్కూళ్ళు సంవత్సరంలో చాలా కాలం మూతపడే ఉంటాయన్నది బాగా తెలుసు. అందువల్లనే ఇండ్లలో చదువుకోడానికి అలవాటు పడ్డారని, చదువు తప్ప మరేదీ తమ సమస్యలకు పరిష్కారం కాదన్నది గుర్తించారని, అందువల్లనే దక్షిణ కశ్మీరు విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి చూపిస్తున్నారని పలువురు విశ్లేషిస్తున్నారు.

* కృతికా శర్మ (ది ప్రింట్)

భవిష్యత్తుపైనా ఆశ లేనట్లా?



టంకశాల అశోక్
9848191767

తెలంగాణ ప్రతిపక్షాలు తమకు భవిష్యత్తుపై కూడా ఆశలేనట్లే వ్యవహరిస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికలు ముగిసి ఇప్పటికి ఇంకా నెల కూడా పూర్తి కాలేదు. అందువల్ల ఈ మాట ఇపుడే అనటం తొందరపాటుగా తోచవచ్చు. ఒక విధంగా చూసినపుడు అంతే. కాని మరొక విధంగా చూసినపుడు ఆమాట అనవలసివస్తున్నది.

ఎందువల్ల ? అసెంబ్లీ ఎన్నికలలో ఈ తరహా పరాజయం ఎదురయినప్పుడు అందుకు గురైనవారు స్పందించే తీర్లు సాధారణంగా మూడు విధాలుగా ఉంటాయి. కొందరు పూర్తిగా కుంగిపోయి రంగం నుంచి ఉపసంహరించుకునే ధోరణిలోపడతారు. కొందరు ఆ ఓటమిని ధైర్యంగా, నిజాయితీగా సమీక్షించుకొనేందుకు ప్రయత్నిస్తారు. ఆ సమీక్ష నుంచి పాఠాలు నేర్చుకుని ముందుకు పోతామంటారు. మరి కొందరు తాము నేర్చుకోవలసింది ఏమీలేనట్లు, తప్పులన్నీ గెలిచిన వారివి, ప్రజలవి, ఎన్నికల సంఘానివి అయినట్లు ప్రవర్తిస్తారు. ఒకవేళ గెలిచిన వారి మంచి పనులు వేటినైనా ప్రస్తావించినా, అది కూడా గెలిచిన వారి దోషమన్నట్లు మాట్లాడుతారు. తెలంగాణ ప్రతిపక్షాలు ఈ చివరి తరగతిలోకి వస్తాయి.

ప్రజలు ప్రతిపక్షాలను చిత్తుగా ఓడించినా, దాని అర్థం అసలు ప్రతిపక్షాలు ఉండకూడదని కోరుకున్నట్లు కాదు. అసెంబ్లీలోనైనా, ఎక్కడైనా సరే ''అడిగేవారంటూ ఉండాలి'' అన్నది ప్రజల ఇంగిత జ్ఞానం. అది ప్రజాస్వామ్యానికి అవసరమన్నది సరేసరి. ప్రభుత్వపు మంచి చెడులను ప్రశ్నించగల వారు, అది కూడా సరైన విధంగా చేయగలవారు అవసరమని ప్రజలకు బాగా తెలుసు. అది వారికి జీవితం నేర్పిన పాఠం. అటువంటి స్థితిలో, ఎన్నికలలో ఓడినప్పటికీ ఎన్నో కొన్ని సీట్లు తెచ్చుకునే ప్రతిపక్షాలు, ఆ కొద్దిపాటి సభ్యులైనా ఒక మంచి ప్రతిపక్షం పాత్ర నిర్వహించేట్లు చూసుకోవాలి. మంచి ప్రతిపక్షం అంటే ఎంతసేపూ కేకలు వేయటం, సభా కార్యక్రమాలను అడ్డుకోవటం, ప్రభుత్వం పైన ఆరోపణలు చేస్తుండటం కాదు. అందువల్ల తమపై ప్రజలకు మరింత ఏవగింపు కలుగుతుంది. ఒక్క మాటలో చెప్పాలంటే తమది క్లిష్టమైన దృష్టి తీసుకునే నిర్మాణాత్మక ప్రతిపక్షం పాత్ర కావాలి. 2014 ఎన్నికల తర్వాత ఏర్పడిన గత అసెంబ్లీలో కాంగ్రెస్ అటువంటి పాత్ర నిర్వహించలేదు. వారు ప్రజల దృష్టిలో గౌరవాన్ని కోల్పోవటానికి అది కూడా ఒక కారణం. ఈసారి అయినా వారి తీరు మారగలదేమో చూడాలి.

అటువంటి నిర్మాణాత్మకమైన మంచి ప్రతిపక్షంగా రూపొందాలంటే అందుకు తగిన ఆలోచనలు, వ్యూహ రచన ఈ దశలోనే జరగాలి. కాంగ్రెస్‌ను, ఇద్దరు టిడిపి, ఒక బిజెపి సభ్యులను మినహాయిస్తే ఇతర ప్రతిపక్షాలేవీ లేవు. మజ్లిస్ పార్టీ ప్రజల సమస్యలను ప్రస్తావిస్తుండటం నిజమైనా ఇతర ప్రతిపక్షాల కన్న భిన్నమైన వ్యవహారణ ఉంటుంది. ఈ స్థితిలో ఒక్క కాంగ్రెస్‌నే ప్రతిపక్షంగా భావించటంలో తప్పుండదు. ఆ పార్టీకి 19 మంది సభ్యులున్నారు. విషయాలు తెలిసి బాగా మాట్లాడగల సభ్యులు కొందరు ఓడినా ఇంకా కొద్ది మంది మళ్లీ ఎన్నికయ్యారు. కనుక ప్రతిపక్ష స్వరాన్ని బాగానే వినిపించగలగాలి. కాని సమస్య కాంగ్రెస్ పార్టీ ధోరణి, సభా వ్యూహాలు. ఒక మంచి నిర్మాణాత్మక ప్రతిపక్షంగా ఉంటూ, ప్రజల గౌరవాన్ని కూడా పొందగలగాలంటే 19 మంది సభ్యుల సంఖ్య తక్కువ దేమీ కాదు. తప్పక ప్రభావాన్ని చూపవచ్చు.

కాని సమస్య, అందుకు సన్నాహాలేమీ జరుగుతున్నట్లు లేవు. గత మూడు వారాలలో కాంగ్రెస్ ధోరణిని గమనించగా తిరిగి వెనుకటి పద్ధతులనే అనుసరించే అనుమానం కలుగుతున్నది. జరిగిన దానిపై ఆత్మ పరిశీలనలకు బదులు ఇతరులలో తప్పులెన్ని సంతృప్తి పడటం, తమ వైఫల్యాలపై దాడికి బదులు గెలిచిన వారిపైన దాడి జరపటం, ఆ విధంగా ఆత్మవంచనలకు, పరవంచనలకు పాల్పడటం మనకు కన్పిస్తున్నది. ఓడిన ఆగ్రహం, అవమానం ఉంటాయి గనుక అటువంటిదేమో కొంత చేసినా, తక్కున దానిలో నిజాయితీ కనిపిస్తే అర్థం చేసుకోవచ్చు. కాని అంతా అదే అయినపుడు వారిపట్ల ఆశాభావం కలగదు. డిసెంబర్ 31 నాటి సోకాల్డ్ సమీక్షా సమావేశం లోనూ వారు చేసిన పని అదే. ఎఐసిసి నుంచి పరిశీలకులుగా వచ్చేవారు పరిణతితో ఉంటారని, స్థానిక పార్టీకి తగిన దిశానిర్దేశం చేయగలరని భావిస్తాము. కాని రాష్ట్ర పార్టీ పర్యవేక్షకుడు అయిన ఎఐసిసి ప్రధాన కార్యదర్శి, స్థానిక నాయకులకు తీసిపోని అసమర్థునిగా తేలిపోయారు. ఎన్నికల దశలో, ఆ తర్వాత నేటి వరకు కూడా. అందువల్ల సమీక్షలు, భవిష్యత్ వ్యూహ రచనలు అంతే బలహీనంగా కనిపిస్తున్నాయి. ఈ స్థితిలో పంచాయతీ ఎన్నికలు, లోక్‌సభ ఎన్నికల ఏ విధంగా సాగవచ్చునో ఎవరైనా అంచనా వేయవచ్చు.

ప్రజలు ప్రతిపక్షాలను చిత్తుగా ఓడించినా, దాని అర్థం అసలు ప్రతిపక్షాలు ఉండకూడదని కోరుకున్నట్లు కాదు. అసెంబ్లీలోనైనా, ఎక్కడైనా సరే ''అడిగేవారంటూ ఉండాలి'' అన్నది ప్రజల ఇంగిత జ్ఞానం. అది ప్రజాస్వామ్యానికి అవసరమన్నది సరేసరి. ప్రభుత్వపు మంచి చెడులను ప్రశ్నించగల వారు, అది కూడా సరైన విధంగా చేయగలవారు అవసరమని ప్రజలకు బాగా తెలుసు. అది వారికి జీవితం నేర్పిన పాఠం. అటువంటి స్థితిలో, ఎన్నికలలో ఓడినప్పటికీ ఎన్నో కొన్ని సీట్లు తెచ్చుకునే ప్రతిపక్షాలు, ఆ కొద్దిపాటి సభ్యులైనా ఒక మంచి ప్రతిపక్షం పాత్ర నిర్వహించేట్లు చూసుకోవాలి. మంచి ప్రతిపక్షం అంటే ఎంతసేపూ కేకలు వేయటం, సభా కార్యక్రమాలను అడ్డుకోవటం, ప్రభుత్వం పైన ఆరోపణలు చేస్తుండటం కాదు.

నిర్మాణాత్మక ప్రతిపక్షంగా మారి ప్రజల ఆదరణ సంపాదించాలంటే చేయవలసిన రెండవ పని, అసెంబ్లీ బయట కూడా తమ తీరు మారటం. గత నెల రోజుల కాలపు కాంగ్రెస్ మాటల పద్ధతిని గమనించిన మీదట మనకు అటువంటి సూచనలు కన్పించటం లేదు. దీనిని బట్టి వారు రాగల అయిదు సంవత్సరాలు సభ బయట, లోపల ఇది వరకు వలెనే వ్యవహరించగలరని భావించవలసి వస్తున్నది. ఇంత వరకు వారన్నది ఏమిటా? తమ ఓటమికి కారణాలను ఇవిఎంలు, డబ్బు పంపిణీ, అధికార దుర్వినియోగం, ఓటర్ జాబితా అవకతవకలు మొదలైన వాటిపైకి తోసి సంతృప్తి చెందారు. డిసెంబర్ 31 నాటి సమీక్షలో అదేపని మరొకసారి చేసారు. ఇదంతా నిజమా కాదా అన్నది అట్లుంచితే, అధికార పక్షమైన టిఆర్‌ఎస్‌కు అన్ని వర్గాలలో స్పష్టమైన ఆదరణ కన్పించిందన్నది పరిశీలకులంతా అంగీకరిస్తున్న విషయం. ఆ మాట నిజమని ప్రతిపక్షాలు ఎందుకు గుర్తించటం లేదన్నది అతి ప్రధానమైన ప్రశ్న. అటువంటి ఆదరణకు కారణాలు ఏమిటో గ్రహించటం మొదట జరగవలసిన పని. ఆదరణ ఉందనే సత్యాన్ని ఒప్పుకుంటే తమ అవగాహనలు, వ్యూహాలు, ప్రవర్తన అందుకు అనుగుణంగా ఉండాలి. తక్కినవన్నీ ఆ తర్వాత వస్తాయి. కాంగ్రెస్ వారు అందుకు ససేమిరా సిద్ధంగా లేరు. ఆ కారణం వల్ల వారు రానున్న కాలంలో ఒక మంచి ప్రతిపక్షం కాగలరనిగాని, తిరిగి అధికారంపై ఆశపెట్టుకోవచ్చుననిగాని తోచటం లేదు.

ఇతర ప్రతిపక్షాల ధోరణిలో తేడా ఏమైనా ఉన్నదా? టిడిపికి మిగిలిన అవశేషంలో ఏ తేడా కన్పించటం లేదు. ఇద్దరు సభ్యులున్నారు గనుక మాట్లాడుకోవటం తప్ప నిజానికి ఆ పార్టీ గురించి చర్చించవలసింది ఏమీ లేదు. ఇక బిజెపి వెతుకుతున్న ఓటమి కారణాలకు కాంగ్రెస్ చెప్పే వాటితో భిన్నత్వం లేదు. ఒక జాతీయ పార్టీ అయి, కేంద్రంలో అధికారంలో ఉన్నపుడు కొంత న్యాయంగా, హేతుబద్ధంగా ఆలోచించి మాట్లాడాలి. వారి కేంద్ర నాయకత్వపు విశ్లేషణలు ఏమిటోతెలియవుగాని, రాష్ట్ర స్థాయి నాయకుల ధోరణి పూర్తిగా కాంగ్రెస్‌ను పోలి ఉంది. తక్కిన ప్రతిపక్షాల తీరునే తాము కూడా నష్టపోయారంటే అందుకు గల కారణాలు అందరికీ ఒకే విధంగా వర్తించాయన్నమాట. అసలు వీరంతా నిజాయితీతో, ఆత్మపరిశీలనతోనే ప్రయోజనం ఉంటుంది తప్ప ఆత్మవంచనలో కాదని ఎందువల్ల అర్థం చేసుకోవటం లేదో బోధపడదు. నిజాయితీ అన్నది అవమానకరమని అపోహపడుతున్నారు కావచ్చు. అటువంటి పార్టీలు ఎప్పటికీ బాగు పడలేవు.

కమ్యూనిస్టులు ఇపుడు అరకొరగా ఒకటి అంగీకరిస్తున్నారు. ఇవిఎం లోటుపాట్లు, ధన ప్రవాహం వంటి ఆరోపణలు చేస్తూనే, సంక్షేమ పథకాలు, కరెంటు సమస్య పరిష్కారం ఓటర్లపై ప్రభావం చూపాయంటున్నారు. ప్రజలలోగల ఈ వాస్తవ పరిస్థితులు వారికి ఎన్నికలకు ముందు తెలియలేదంటే వారేమీ కమ్యూనిస్టులవుతారు? వీరు ఈ కూటమిని వదిలేందుకు చాలా కారణాలున్నాయి. సిపిఐ ఆపని చేసి, సిపిఎం వారు తెలంగాణ ఏర్పాటును సమర్థించి, ఉభయులూ తమ అవగాహనలు, పని తీరును మార్చుకోవటం మంచిది.

భద్రత లేని వృద్ధులు

ఆధునిక సమాజంలో అక్షరాస్యత శాతం పెరిగింది. ఉన్నత విద్యను అభ్యసించిన విద్యాధికులు అధికంగానే ఉన్నారు. దానికితోడు శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం అందరికీ అందుబాటులోకి వచ్చింది. అభివృద్ధి అనే దాన్ని చూడదగినంత దగ్గరగా చూడగలుగుతున్నప్పటికీ సనాతనాచారాలను, సంప్రదాయాలను, మానవ సంబంధాలను మూటగట్టి, అటకెక్కించి, కన్నవారిని మరచి జీవిస్తున్నాము. మనకు దూరమైనవి, కళ్ళకు కనబడనివాటిని మరచినట్టుగానే మన కళ్ళెదుట కనబడుతున్న, మనలను కన్నతల్లిదండ్రుల ఆలనాపాలనా చూడకుండా నిరాదరణకు గురిచేస్తూ వారి మనసులు క్షోభించే విధంగా వ్యవహరించడం బాధాకరం. సాటి మనిషిని గౌరవించినప్పుడే మనిషి విలువ పెరుగుతుంది. ఉమ్మడి కుటుంబంలో నివాసాల కొరత, భార్యాభర్తలిద్దరూ లేక ఒక్కరైనా ఉద్యోగం, ఉపాధి కోసం స్వగ్రామాలు వదలి ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్ళడం, ఆర్థిక ఇబ్బందులతో పెద్ద కుటుంబానికి సరిపడా అద్దె ఇండ్లు లభించకపోవడం వంటి సమస్యలతో ఇంటి పెద్దలను (తల్లిదండ్రులను) ఒంటరిగా వదలి దూరంగా జీవించేందుకు వెళుతున్నారు. ఆధునిక జీవితానికి అలవాటుపడిన ఒక కుటుంబంలో కొడుకు చీదరించుకుంటే, మరో కుటుంబంలో కోడలు, ఇతర కుటుంబ సభ్యులు చీదరించుకుని పెద్దలను దూరం చేసుకుంటున్నారు. దీనితో వయోవృద్ధులు నిరాదరణకు గురవుతూ మానసిక క్షోభను అనుభవించవలసి వస్తున్నది. తల్లిదండ్రులను పోషించడం భారంగా భావించిన కొందరు కొడుకులు పెద్దలను వృద్ధాశ్రమాల్లో, బస్టాండుల్లో, ఊరి చివరికి స్మశానాల్లో వదిలి పెట్టిన కొడుకులూ లేకపోలేదు. ఈ విధంగా ఆధునిక జీవనశైలికి, ఆర్థిక లావాదేవీలకు అలవాటుపడి పెద్దలను ఒత్తిడిలకు, హింసలకు, క్షోభకు గురిచేస్తూ మానవ విలువలతోపాటు నైతిక విలువలకు తిలోదాకాలిస్తున్నారు.

దీనితో ఉమ్మడి కుటుంబాలు చిన్నాభిన్నమై చిన్న కుటుంబాలు గా మారుతున్నాయి. పర్యవసానంగా ముందు తరాలవారికి కుటుం బ పెద్దలతో సత్సంబంధాలు తెగిపోయి పెద్దల ప్రాధాన్యతను తెలుకోలేకపోతున్నారు. మన వారసులైన పిల్లలు ముమ్ముందు మనం నడచిన బాటలోనే నడవగలరేమోననే వాస్తవాన్ని కూడా గ్రహించలేకపోతున్నారు. ఫలితంగా వృద్ధాప్యంలో తమను ప్రేమతో చేరదీసి, ఆదరిస్తారని ఎన్నో ఆశలు పెట్టుకున్న తల్లిదండ్రులు గుండెవిసేలా ఘోషించవలసిన దుస్థితి ఏర్పడింది. అంతేకాకుండా తాము కన్నవారికి దూరమయ్యామనే మానసిక వ్యధను అనుభవిస్తున్న వయోవృద్ధులు వివిధ రకాల వ్యాధుల బారినపడుతున్నారు. వృద్ధాప్యంలో తమ పిల్లలపై ఆధారపడి జీవించే వయసులో హక్కులు ఉన్నాయి కదాని ప్రశ్నిస్తే, ఆదరించేవారు దూరమవుతారేమోననే భయంతో వృద్ధులు తమ బాధను తామే దిగమింగుతూ, కుమిలిపోతూ మనసు చంపుకొని జీవనం సాగిస్తు హక్కుల గురించి ప్రశ్నించలేకపోతున్నారు.

మహిళలకు, బాలలకు, దివ్యాంగులకు చట్టాలు చేసినట్టుగానే వయోవృద్ధులకు కోసం కూడా ప్రభుత్వాలు కొన్ని చట్టాలు రూపొందించాయి. హిందూ దత్తత, పోషణ చట్టం 1956 ప్రకారం వృద్ధులైన తల్లిదండ్రుల పోషణ బాధ్యత పిల్లలదే. ఈ చట్టం ప్రకారం పిల్లలను అడిగే హక్కు తల్లిదండ్రులకు ఉంది. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ 1973 లో సెక్షన్ 125 ప్రకారం తల్లిదండ్రులు తమను తాము పోషించుకోలేని స్థితిలో ఉన్నప్పుడు చట్టమే వారి పోషణ కయ్యే ఖర్చులను పిల్లల నుంచి ఇప్పిస్తుంది. కానీ కడుపున పుట్టిన పిల్లలపై ప్రేమ, మమకారంతోపాటు కుటుంబం ప్రతిష్ట దిగజారుతుందన్న భయం, కేసును నడిపించుటకు వెచ్చించవలసిన సమయం, డబ్బును దృష్టిలో పెట్టుకొని చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలపై కేసులు వేయలేకపోతున్నారు. కనీసం పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు కూడా ముందుకు రాలేకపోతున్నారు.

వృద్ధులకు సంరక్షణ కల్పించే ఉద్దేశంతో 'తల్లిదండ్రులకు, వృద్ధులకు అవసరమైన పోషణను కల్పిస్తూ గుర్తింపు గల భరోసా నివ్వగల సంక్షేమాన్ని అందించేందుకు, తత్సంబంధ చర్యలను వేగంగా చేపట్టేందుకు వీలైన చట్టాన్ని ప్రభుత్వం 2007లో తీసుకు వచ్చింది. 'తల్లిదండ్రుల, వృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం 2007'ను రూపొందించింది. ఈ చట్టంలో తల్లిదండ్రులను, వృద్ధులను పోషించడం, వారి ప్రాణ, ఆస్తులను రక్షించడం, వృద్ధాశ్రమాలు స్థాపించడంవంటి ప్రధానాంశాలు ఉన్నాయి. ఈ చట్టం ప్రకారం తమ స్వంత సంపాదనతో తమను తాము పోషించుకోలేని వృద్ధులు, తల్లిదండ్రుల ఆస్తులను అనుభవిస్తున్న వారినిగానీ, వారసత్వంగా పొందుతున్నవారినిగానీ వృద్ధులు తమ పోషణ గురించి అడగవచ్చు. వృద్ధుల పోషణలో భాగంగా నివాసం, ఆహారం, దుస్తులు, వైద్య సహాయం, చికిత్స వీటన్నింటికీ అవసరమయ్యే ఖర్చు పది వేల రూపాయల వరకు, రాష్ట్ర ప్రభుత్వం సూచించిన మొత్తాన్ని పోషణ నిమిత్తం వృద్ధులకు ఇవ్వవలసిందిగా ట్రిబ్యునల్ ఆదేశించింది. ఈ చట్టం ప్రకారం వృద్ధులు ఎవరి నుండి పోషణ ఖర్చులు కోరుతున్నారో వారి పేర్లు, చిరునామాతో సహా పూర్తి వివరాలు తమ వ్యవహారిక భాషలో దరఖాస్తు చేసుకోవాలి. వృద్ధుల పోషణ బాధ్యత చేపట్టిన వారు వారిని చీదరించుకొని ఎక్కడైనా వదిలిపెట్టినట్టు తెలిస్తే అట్టి వ్యక్తులకు మూడు నెలల జైలు శిక్ష, లేదా రూపాయలు ఐదు వేలు జరిమానా లేదా ఆ రెండూ అమలయ్యే శిక్షపడవచ్చు. వయోవృద్ధుల పోషణకు అవసరం అనుకున్నప్పుడు వారి పిల్లలు అందుబాటులోలేని సమయంలో, పిల్లలు ఉండి కూడా తల్లిదండ్రులను పోషించలేని పరిస్థితిలో, ఉన్నప్పుడు, లేదా సంతానంలేని వయోవృద్ధులవారి పేరున ఉన్న స్థిరాస్తులను బ్యాంకులో రివర్స్ మార్టిగేజ్ (తనఖా) పెట్టి, నెలనెలా వారి ఖర్చులకు అవసరమయ్యే నగదును బ్యాంకు ద్వారా పొందుటకు ప్రభుత్వం వీలు కల్పించింది. వయోవృద్ధుల తదనంతరం వారి వారసులు బ్యాంకువారు ఇచ్చిన రుణాన్ని తీర్చి అట్టి ఆస్తిని స్వాధీనం పరచుకోవచ్చు. లేదంటే అట్టి ఆస్తిని బ్యాంకు వారే వేలం వేసి వచ్చిన నగదు నుండి తమ అప్పును తీర్చుకొని మిగిలిన నగదును వారి వారసులకు అందజేయుటకు వీలుకల్పించింది. ఈ విధంగా తల్లిదండ్రుల, వృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం 2007 వృద్ధులకు రక్షణగా నిలువగలదు. ఈ చట్టానికి తోడు ఎలాంటి ఆధారంలేని నిరాశ్రయులు, నిరాదరణకు గురైనవారు, రక్షణ కరువైనవారు, అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధులకు ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుంది.

కుటుంబ సభ్యుల నుంచి, సమాజం నుంచి గౌరవం లభించకపోతే ఆత్మాభిమానానికిలోనై అన్నీ వృథానే అనుకుంటారు పెద్దలు. అందుకే తల్లిదండ్రులు, వృద్ధులు ఆత్మగౌరవంతో హాయిగా జీవించా లంటే చట్టాలను అమలు పరచవలసిన బాధ్యత ప్రభుత్వాధికారులపై వుంది. అదే విధంగా చట్టాలకు పని కల్పించకుండా, పెద్దలు వృద్ధాశ్రమాలబాట పట్టకుండా మన తల్లిదండ్రులను మన కుటుంబంలో ఒకరిగా, ప్రేమానురాగాలతో మన పిల్లలతో సమానంగా పోషించుకోవాలి. అది కొనసాగితే మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుని, మానవత్వాన్ని నిలుపుకున్నవారమవుతాము. చట్టాలతో మార్పు రాకపోయినప్పటికీ మానవునిలో వచ్చే పరివర్తనతో మార్పు సాధించగలము. అది సాధించకపోతే.. పూర్వ కాలంలో మన పూర్వీకులు అనే పదాలు చెప్పుకునేందుకు అవకాశాలు లేకుండాపోయే ప్రమాదం ఎదురుకా గలదు.

* రేపాల నర్సింహా రాములు
9849934558

మన తెలంగాణ
5
హైదరాబాద్
శనివారం
5 జనవరి, 2019
www.manatelangana.news

రవికె రాజసం

ఒకప్పుడు చీర కొంటే దాంతోపాటే రవికె ముక్క కూడా ఉండేది. కుట్టించుకోవడానికి పెద్దగా ఇబ్బంది పడేవారు కాదు. ట్రెండ్ మారింది. చీరలో ఉన్న ముక్కను పక్కన పెట్టి, డిజైనర్ బ్లవుజుల వెంట పడుతున్నారు పడతులు. చీర కంటే బ్లవుజు ధరే ఎక్కువగా ఉంటోంది. డిజైన్‌ను బట్టి ధరన్న మాట. దాంట్లో బోలెడన్ని వెరైటీలు. కాసులపేరూ, లోలాకులూ, పూసల దండలూ, ముత్యాలు... ఇలా ఏవయినా సరే బ్లవుజుపై డిజైన్లుగా అమరిపోతున్నాయి. కొత్త అందాన్ని తెస్తున్నాయి. అవేంటో మీరూ చూసేయండి మరి.



















అంగవైకల్యాన్ని జయించింది...



భారత కీర్తి పతాకాన్ని అంతర్జాతీయ స్థాయిలో రెపరెపలాడించి దేశ ఖ్యాతిని మరొకసారి ప్రపంచానికి చాటింది ప్రద్మశ్రీ అరుణిమ సిన్హా . అంగవైకల్యాన్ని కూడా లెక్కచేయకుంటే సాహసమే ఊపిరిగా ముందుకు సాగి జాతీయ పతాకాన్ని అంటార్కిటికా శిఖరంపై ఎగరేసి ప్రపంచ దృష్టిని ఆకర్షించింది.


2003లో ప్రపంచంలోని అత్యున్నత శిఖరం 'ఎవరెస్టు' ను అంగవైకల్యంతో అధిరోహించిన మొదటి దివ్యాంగ మహిళగా చరిత్ర సృష్టించిన అరుణిమ, ప్రసుత్తం అంటార్కిటికా శిఖరాన్ని అధిరోహించిన మొదటి దివ్యాంగ మహిళగా మరొక రికార్డును సొంతం చేసుకుంది.

ఈ విషయాన్ని సిన్హా ట్విట్టర్ ద్వారా తెలియజేసింది.ఆమె ధైర్య సాహసాలకు మెచ్చి ప్రపంచ వ్యాప్తంగా అభినందలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధాని నరేంద్ర మోది కూడా అరుణిమ మరిన్ని విజయాలు సాధించిలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

సిన్హా, జాతీయ స్థాయి వాలీబాల్, ఫుట్‌బాల్ క్రీడాకారిణి. ఏప్రిల్ 12, 2011 జరిగిన సంఘటన ఆమె జీవితాన్ని ఊహించని మలుపు తిప్పింది. లక్నో నుంచి ఢిల్లీకి పద్మావతి ఎక్స్‌ప్రెస్ జనరల్ కంపార్టుమెంట్‌లో ఆమె ప్రయాణిస్తుండగా బరేలీ సమీపంలో ముగ్గురు వ్యక్తులు ఆమె మెడలోని బంగారు గొలుసు లాగేందుకు ప్రయత్నించారు. ఆమె ప్రతిఘటించడంతో దుండగులు రైలు నుంచి కిందకు తోసేశారు. పక్కనే ఉన్న ట్రాక్ మీద పడటంతో సిన్హా పైకి లేవలేకపోయింది. క్షణాల్లో రైలు ఆమె కుడి కాలుపై నుండి దూసుకుపోయింది. ఆ ప్రమాదంలో ఆమె కుడికాలు, తొడ ఎముక తీవ్రంగా దెబ్బతిన డంతో మోకాలు కింది భాగాన్ని వైద్యులు తొలగించారు. ప్రతిఒక్కరూ ఆమెపై సానుభూతి చూపడం మొదలుపెట్టారు. ఇది భరించలేని అరుణిమ ఏదో ఒక సాహసకార్యం చేయాలని నిర్ణయించుకుని ఈ స్థాయికి ఎదిగింది.

మన రంగవల్లులు

21 చుక్కలు, మధ్య చుక్క 11వచ్చేవరకు





ఎ.గోవిందమ్మ, సిరిసిల్ల



యం. శ్రీజ, నాగర్ కర్నూల్

22 చుక్కలు, 2 వరుసలు, 2 వచ్చేవరకు





వైఎస్ఆర్ పార్టీలోకి కమెడియన్ ఆలీ!



మన తెలంగాణ/హైదరాబాద్ : సినీ నటుడు, కమెడియన్ ఆలీ త్వరలో వైఎస్సార్ పార్టీలో చేరనున్నారు. ఈనెల 9న జగన్ పాదయాత్ర ముగింపు కార్యక్రమం సందర్భంగా ఇచ్ఛాపురంలో ఏర్పాటు చేసే కార్యక్రమంలో వై.ఎస్ జగన్ సమక్షంలో ఆలీ పార్టీ తీర్థం పుచ్చుకోనున్నారు. గత నెల 28న శంషాబాద్ ఎయిర్‌పోర్టులో జగన్‌ను కలిసిన ఆలీ కలిసి రాజకీయ ప్రవేశంపై చర్చించాడు. రాజకీయాల్లో చేరి ప్రజాసేవ చేయాలన్న తన అభిప్రాయాన్ని వైఎస్ జగన్ అభినందించారని ఆలీ మీడియాతో పేర్కొన్నారు. ఇరవై ఏళ్ల తరువాత రాజకీయాల్లోకి తాను ప్రత్యక్ష రాజకీయాల్లోకి వస్తున్నానని జగన్ ఆదేశిస్తే ఎన్నికల బరిలో నిలుస్తానని ఆలీ పేర్కొంటున్నారు.

ఆన్‌లైన్‌లో 63,311 ఆర్జితసేవా టికెట్లు



మనతెలంగాణ/తిరుమల ప్రతినిధి : శ్రీవారి ఆర్జిత సేవలకు సంబంధించి ఏప్రిల్ నెల కోటాలో మొత్తం 63,311 టికెట్లను శుక్రవారం ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేసినట్లు టిటిడి ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ తెలిపారు. ఆన్‌లైన్ డిప్ విధానంలో 10,061 సేవా టికెట్లు విడుదల చేశామని, ఇందులో సుప్రభాతం 7,836, తోమాల 130, అర్చన 130, అష్టదళపాదపద్మారాధన 240, నిజపాద దర్శనం 1,725 టికెట్లు ఉన్నాయని ప్రకటించారు. ఆన్‌లైన్‌లో జనరల్ కేటగిరిలో 53,250 సేవాటికెట్లు ఉండగా, వీటిలో విశేషపూజ 2,500, కల్యాణం 11,875, ఊంజల్‌సేవ 3,750, ఆర్జిత బ్రహ్మోత్సవం 6,875, వసంతోత్సవం 12,650, సహస్రదీపాలంకారసేవ 15,600 టికెట్లు ఉన్నాయని వివరించారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో శుక్రవారం డయల్ యువర్ ఈవో కార్యక్రమం జరిగింది.

బొగ్గు సరఫరా పెంచాలి

మన తెలంగాణ/హైదరాబాద్ : లక్ష్యసాధనకు వీలుగా బొగ్గు ఉత్పత్తి, సరఫరాను పెంచాలని సింగరేణి సిఎండి ఎన్.శ్రీధర్ అధికారులకు పిలుపునిచ్చారు. 2019–20 ఆర్థిక సంవత్సరంలో లక్ష్య సాధనకు మిగిలిన మూడు నెలల కాలంలో 2.15 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణా లక్ష్యంగా పనిచేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. సింగరేణి భవన్‌లో శుక్రవారం అన్ని ఏరియాల జనరల్ మేనేజర్ల సమీక్షా సమావేశంలో ఆయన పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. అన్ని గనులకు సంబంధించి కొత్త యంత్రాలు, స్పేర్లు, వనరులు, కాంట్రాక్టులకు సంబంధించిన పనులు మొత్తం ఇప్పుడే పూర్తిచేయాలని, కొత్త ఆర్థిక సంవత్సరం మొదటి నెలకల్లా సర్వం సంసిద్ధమై ఉత్పత్తి లక్ష్యాల సాధనకు పూనుకోవాలన్నారు. రానున్న వర్షాకాలంలో బొగ్గు ఉత్పత్తి, రవాణాలు మందగించకుండా సరైన ప్రణాళికలు, ఇప్పటి నుంచే రూపొందించుకోవాలని సూచించారు. సత్తుపల్లి, కిష్టారం ఓసి, ఇల్లందు కోయగూడెం ఓసి 3 గని, భూపాలపల్లి కెటికె ఓసి 3, రామగుండం రీజియన్‌లో ఇందారం ఓసి, జిడికె 5 ఇంక్లైన్ ఓసిలకు సంబంధించి అన్ని పనులు సత్వరమే పూర్తిచేయాలని, వాటిని అనుకున్న సమయానికే ప్రారంభించాలని కోరారు. వచ్చే ఆర్థిక సంవత్సరం ప్రారంభానికి జెవిఆర్, సిహెచ్‌పి, కెకె సిహెచ్‌పి, శ్రీరాంపూర్ సిహెచ్‌పిల నిర్మాణం పూర్తికావాలని గడువు విధించారు. సమావేశంలో డైరెక్టర్లు ఎస్.శంకర్, ఎస్.చంద్రశేఖర్, బి.భాస్కరరావు, ఎన్.బలరాం, ఇడి (కోల్ మూమెంట్) జె.అల్విన్, సలహాదారు (మైనింగ్) డిఎన్. ప్రసాద్, సలహాదారు (ఫారెస్ట్రీ) సురేంద్రపాండే, జిఎంలు ఆంథోని రాజా, టి.నాగేశ్వరరావు, రాజేశ్వరరెడ్డి, వైజికె మూర్తి, రుష్యేంద్రుడు, కొండయ్య, సుధాకరరావు, జక్కం రమేష్, నాయుడు, అన్ని ఏరియాల జిఎంలు పాల్గొన్నారు.

నిరుద్యోగ భృతిపై కసరత్తు

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రాలు ఏ తరహాలో మార్గదర్శకాలను రూపొందించారు, వాటి వలన ఎంత సంఖ్యలో నిరుద్యోగులకు లబ్ధి చేకూరుతోంది, లక్ష్యం ఏ మేరకు ఫలిస్తోంది, ఈ భృతితో వారికి కలుగుతున్న ప్రయోజనం, ఉపాధి కల్పనకు తీసుకుంటున్న ప్రత్యామ్నాయ చర్యలు తదితరాలన్నింటిపై రాష్ట్ర ప్రభుత్వం అధ్యయనం చేస్తోంది. తెలంగాణ రాష్ట్ర స్వభావానికి, నిరుద్యోగ యువత ఆకాంక్షలకు అనుగుణంగా ఏ రాష్ట్రం అమలుచేస్తున్న విధానం సహేతుకంగా ఉంటుందో, ఎంత ఎక్కువ మంది నిరుద్యోగులకు ప్రయోజనం కలుగుతుందో రాష్ట్ర అధికారులు అంచనా వేస్తున్నారు. ఒకవేళ పదవ తరగతిని కనీస విద్యార్హతగా తీసుకుంటే రాష్ట్రం మొత్తం మీద ఎంత మంది నిరుద్యోగులు ఉంటారు, ఇంటర్ నుంచి ప్రారంభిస్తే ఎంత మంది ఉంటారు, గరిష్ఠ వయో పరిమితిని ఎక్కడి వరకు నిర్ణయించవచ్చు తదితర అంశాలపై చర్చలు జరుగుతున్నాయి. నిరుద్యోగులకు అసంతృప్తి లేకుండా ఉండాలని, వీలైనంత ఎక్కువ మంది లబ్ధి పొందేలా ఉండాలని ముఖ్యమంత్రి ఆదేశించినందున వయసును, విద్యార్హతను, కుటుంబ వార్షిక ఆదాయ పరిమితిని, ఇటీవలి కాలంలో ప్రైవేటు ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటున్నందున మార్గదర్శకాల్లో వాటిని ఏ మేరకు ప్రస్తావించవచ్చు, ఉపాధి కల్పనా సంస్థ (ఎంప్లాయ్‌మెంట్ ఎక్ఛేంజ్)లో పేరు నమోదు చేసుకోవడం తప్పనిసరిగా ఉండాలా అధికారులు చర్చిస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఇలా ఎక్ఛేంజ్‌లో పేర్లు నమోదు చేసుకున్నవారు ఎంత మంది ఉంటారు, ఇంకా నమోదు చేసుకోవాల్సివారు ఎంత మంది ఉండే అవకాశం ఉంది తదితరాలపై కూడా అధ్యయనం జరుగుతోంది.

ఒక్కో రాష్ట్రంలో ఒక్కో రకమైన నిర్వచనం

నిరుద్యోగులంటే ఎవరో నిర్వచించడానికి ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న విధాన నిర్ణయం ఒక్కో తీరులో ఉంది. ఉదాహరణకు చత్తీస్‌ఘడ్ ప్రభుత్వం 18 ఏళ్ళు నిండి 35 ఏళ్ళ లోపు ఉన్న పన్నెండవ తరగతిలో ఉత్తీర్ణులై వార్షికాదాయం రెండు లక్షల రూపాయలు దాటని ఉపాధి లేనివారందరినీ నిరుద్యోగులుగా పరిగణించింది. వీరికి ప్రతీ నెలా వెయ్యి రూపాయల చొప్పున 'నిరుద్యోగ భృతి'ని అందిస్తోంది. యాభై శాతం లేదా అంతకంటే ఎక్కువ అంగవైకల్యంతో బాధపడుతున్న యువత అయినట్లయితే రూ. 1500గా అమలుచేస్తోంది. హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వంసైతం ఇంతే మొత్తంలో నిరుద్యోగ భృతిని అందిస్తున్నప్పటికీ కనీస వయసును మాత్రం ఇరవై సంవత్సరాలుగా నిర్ణయించింది. కానీ హర్యానా ప్రభుత్వం మాత్రం దీన్ని చాలా భిన్నమైన తీరులో అమలుచేస్తోంది. ఉత్తీర్ణులైతే నెలకు రూ. 100, పన్నెండవ తరగతి పాసైతే రూ. 900, గ్రాడ్యుయేషన్ పూర్తయితే రూ. 1500, పోస్టుగ్రాడ్యుయేషన్ పూర్తయితే రూ. 3000 చొప్పున వయసు 35ఏళ్ళు పూర్తయ్యేంత వరకు వర్తించేలా అమలుచేస్తోంది. వార్షిక ఆదాయం మాత్రం అన్నిరాష్ట్రాల తరహాలోనే రెండు లక్షలకు పరిమితం చేసింది.

రాష్ట్రాలు, నిరుద్యోగ భృతి అమలు

చత్తీస్‌ఘడ్ : 18 – 35 ఏళ్ళు, పన్నెండవ తరగతి ఉత్తీర్ణం, వార్షిక ఆదాయం రెండు లక్షల రూపాయలు; నిరుద్యోగ భృతి నెలకు వెయ్యి రూపాయలు, వికలాంగులకు రూ. 1500

హిమాచల్‌ప్రదేశ్ : 20 – 35 ఏళ్ళు, పన్నెండవ తరగతి ఉత్తీర్ణం, వార్షిక ఆదాయం రెండు లక్షల రూపాయలు; నిరుద్యోగ భృతి నెలకు వెయ్యి రూపాయలు, వికలాంగులకు రూ. 1500

కేరళ : 18 – 35 ఏళ్ళు, తప్పనిసరిగా పదవ తరగతి పాసై ఉండాలి. మూడేళ్ళ తర్వాత మూడు సంవత్సరాల సీనియారిటీ వర్తింపు; నెలకు రూ. 120 చొప్పున నిరుద్యోగ భృతి

మధ్యప్రదేశ్ : 22 – 35 ఏళ్ళ మధ్య యువత, పన్నెండవ తరగతి తప్పనిసరిగా పాసై ఉండాలి, వార్షిక ఆదాయం రూ. 3 లక్షల లోపు; నెలకు రూ. 1000, వికలాంగులకు రూ. 1500 చొప్పున నిరుద్యోగ భృతి.

రాజస్థాన్ : 21 – 35 ఏళ్ళ మధ్య యువత, పన్నెండవ తరగతి తప్పనిసరిగా పాసై ఉండాలి, వార్షికాదాయం రూ. 3 లక్షలు మించరాదు; పురుషులకు నెలకు రూ. 650, మహిళలకు రూ. 750 నిరుద్యోగ భృతి

హర్యానా : పదవ తరగతి పాసైంది మొదలు గరిష్ఠంగా 35 ఏళ్ళ వయసు వచ్చేంత వరకు యువతకు నిరుద్యోగ భృతి పొందే అర్హత ఉంటుంది. వార్షికాదాయం మాత్రం రూ. 2 లక్షలు మించరాదు. పదవ తరగతి పాసైనవారికి నెలకు రూ. 100, పన్నెండవ తరగతి పాసైనవారికి రూ. 900, గ్రాడ్యుయేషన్ పూర్తయినవారికి రూ. 1500, పోస్టు గ్రాడ్యుయేషన్ పాసైనవారికి రూ. 3000 చొప్పున ప్రతీ నెలా నిరుద్యోగ భృతి చెల్లింపు

ఆంధ్రప్రదేశ్ : 22 – 35 ఏళ్ళ మధ్య యువత, గ్రాడ్యుయేషన్ లేదా రెండేళ్ళ డిప్లొమా పాసైనవారందరికీ, వార్షికాదాయం రెండు లక్షలు దాటరాదు; ప్రతీ నెలా వెయ్యి రూపాయల చొప్పున నిరుద్యోగ భృతి.

చైనీస్ మాంజాపై నిషేధం

- పర్యావరణంతో పాటు పక్షులు, మనుషులకు ప్రమాదం
- నిషేధంపై విస్తృతంగా ప్రచారం... మూడు భాషల్లో పోస్టర్లు
- వివిధ శాఖలతో పాటు ఎన్‌జిఓలతో సమన్వయం
- నిషేధాన్ని ఉల్లంఘిస్తే చట్టపరంగా కఠిన చర్యలు
- మీడియాకు వెల్లడించిన పిసిసిఎఫ్ పికె.ఝా





మన తెలంగాణ / హైదరాబాద్ : దేశవ్యాప్తంగా చైనీజ్ మాంజాగా వాడుకలో ఉన్న నైలాన్ దారం ఉత్పత్తి, విక్రయాలతో పాటు వినియోగాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా నిషేధించిందని అటవీశాఖ ప్రధాన సంరక్షణ అధికారి ప్రశాంత్‌కుమార్ ఝా తెలిపారు. దీన్ని ఉత్పత్తి చేసినా, విక్రయించినా, వినియోగించినా కఠినమైన చర్యలుంటాయని తెలిపారు. మూడేళ్లుగా ఈ నిషేధం అమల్లో ఉన్నా ఇప్పటివరకు హెచ్చరికలతో సరిపెట్టామని, ఇక నుంచి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్లాస్ కోటింగ్‌తో ఉండే నైలాన్, సింథటిక్ మాంజా ఏళ్ళ తరబడి అలాగే ఉంటుందని, ఇది ప్రకృతిలో కలిసిపోదని, ఫలితంగా పర్యావరణానికి తీవ్రమైన హాని కలగడంతో పాటు పక్షులు, మనుష్యుల ప్రాణాలకు కూడా ప్రమాదమేర్పడుతుందన్నారు. పర్యావరణ ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ 2017 జూలై 11వ తేదీన నిషేధిస్తూ వెలువరించిన తీర్పును రాష్ట్ర ప్రభుత్వం కూడా అమలు చేస్తోందన్నారు. ఈ నిషేధాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇందులో భాగంగానే శుక్రవారం ఆరణ్యభవన్‌లో పలు ఎన్‌జిఓ సంస్థల ప్రతినిధులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారి నుంచి వచ్చిన సలహాలు, సూచనలను కూడా పరిగణలోకి తీసుకుని మాంజ నిషేధానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. చైనీస్ మాంజ వల్ల కలిగే అనర్థాలతో పాటు పర్యావరణ కలిగే నష్టాన్ని ప్రజలకు వివరించేందుకు మరింత విస్తృతంగా చర్యలు తీసుకుంటు న్నామని చెప్పారు. ఇందులో భాగంగా మూడు రకాల భాషాల్లో పోస్టర్లను కూడా ముద్రించినట్లు చెప్పారు. నిషేధాన్ని పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు అటవీశాఖ ఇతర శాఖలతో ప్రధానంగా పోలీస్, ఎన్‌జిఓలతో సమన్వయం చేసుకుంటుందని తెలిపారు.

శోభాయమానంగా సంక్రాంతి జరగాలి

తెలంగాణలో ప్రజలు శోభయామానంగా సంక్రాంతి సంబురాలను నిర్వహించుకోవాలని పిసిసిఎఫ్ పికె.ఝా తెలిపారు. అయితే మనుష్యులు, పక్షలకు అనర్థాలు కలిగే వాటితో పాటు పర్యావరణానికి ముప్పు కలిగించే చైనీస్ మాంజను పూర్తిగా విస్మరించాలని సూచించారు. ప్రస్తుతం సంకాంత్రి సంబరాలు ప్రారంభమయ్యాయని తెలిపారు. సంకాంత్రి అంటే తెలంగాణలో పతంగుల పండుగ ప్రారంభమవుతుందన్నారు. ఈ నేపథ్యంలో చైనీస్ మాంజ ఉత్పత్తి, విక్రయాలపై ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పండుగకు వారం రోజుల ముందు నుంచే వీటి వల్ల అనేక అనర్థాలు జరగడం ప్రారంభమవుతాయని తెలిపారు. ఆ తర్వాత సంబురాలు ముగిసిన తర్వాత ఒకటి, రెండు నెలల పాటు వీటి బారిన పడి అనేక పక్షులు, మనుష్యులు కూడా గాయాలకు గురవుతున్నారని తెలిపారు. ముఖ్యంగా చెట్ల కొమ్మలు, కరెంటు స్తంభాలతో పాటు ఇతర ఎత్తేన పరికరాలకు మాంజ ఎక్కడికక్కడ పేరుకుపోయి పర్యావరణానికి తీవ్రంగా నష్టం కలిగిస్తుందన్నారు. మిగిలిపోయిన దారంతో పక్షులు ఇరుకొని కాళ్లు, రెక్కలు తెగుతా యని తెలిపారు. మనుష్యులు మృతి చెందిన సంఘటనలు కూడా లేకపోలేదని అధికారులు తెలిపారు. ఇందులో ఢిల్లీ నగరంతో పాటు హైదరాబాద్‌లోని కొండపూర్‌కు చెంది న వారు మృతి చెందారని అటవీశాఖ అధికారి శంకరన్ తెలిపారు.

చట్టపరంగా కఠిన చర్యలు

మాంజ ఉత్పత్తి, విక్రయం, రవాణా, నిల్వ చేసే వారిపై చట్టపరంగా కఠిన చర్యలుంటాయని అధికారులు తెలిపారు. మాంజను విక్రయిస్తే ఐదేళ్ల జైలు శిక్షతో పాటు లక్ష రూపాయల వరకు జరిమానా, పక్షులు ఎలాంటి గాయాలు గురైనా ఏడేళ్ల జైలు శిక్షతో పాటు పదివేల రూపాయల జరిమానా ఉంటుందన్నారు. మనుష్యుల విషయంలో మరింత కఠినమైన చర్యలున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో మాంజపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మాంజ ఉత్పత్తి, విక్రయాలతో పాటు రవాణా, నిల్వ చేసిన వారిపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ నేపథ్యంలో ట్రాన్స్‌పోర్టు, హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులు, డీలర్లకు కూడా ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. మాంజ వాడకంతో పాటు విక్రయాలపై ఇప్పటి వరకు 123 కేసులు నమోదు చేసినట్లు పిసిసిఎఫ్ తెలిపారు. అయితే ఎవరిని అరెస్టు చేయలేదని కేవలం హెచ్చరికలకే పరిమితం చేశామన్నారు. దీంతో పాటు 900 కేజీల మాంజను కూడా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మాంజ నిషేధంపై కైట్ అసోసియేషన్లు వారి సభ్యులకు తగిన అవగాహనను కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నెంబర్‌తో పాటు ఫోన్‌ను కూడా అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. 1800 425 5364 టోల్ ఫ్రీ నెంబర్, 040 23231440 ఫోన్ నెంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

మరింతగా కృషి.. మళ్లీ విజయభేరీ

(మొదటిపేజీ తరువాయి)

పార్లమెంటు ఎన్నికల్లోనూ అంతకు మించిన ఉత్సాహంతో ప్రతీ కార్యకర్త పనిచేసి పార్టీకి విజయాన్ని సాధించిపెట్టాలని కోరారు. గత ఎన్నికల కంటే ఈసారి ఎక్కువ మెజారిటీతో తాను గెలవడానికి కారణం సిరిసిల్ల నియోకవర్గంలోని బూత్‌స్థాయి కార్యకర్తలు కమిటీలుగా ఏర్పడి సమిష్టిగా కృషి చేయడమేనని, ఇది పార్లమెంటు ఎన్నికల్లో సైతం అన్ని నియోజకవర్గాల్లో పునరావృతం కావాలని అన్నారు. చంద్రబాబు నోట్ల కట్టకలకు ఆశపడిన కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో దాసోహమైందని, నిశ్శబ్ద విప్లవం అని ప్రగల్భాలు పలికిన నాయకులకు ప్రజలు గూబ గుయ్‌మనే తీర్పు ఇచ్చారని, శబ్ద విప్లవం ఎలా ఉంటుందో స్పష్టం చేశారని అన్నారు. ఎన్నికల ఫలితాలతో ఇప్పటికే చాలా మంది కాంగ్రెస్ నాయకులు తెరవెనక్కు పోయారని, మరికొద్ది మంది సీనియర్ నాయకులు రిటైర్‌మెంట్ తీసుకునే యోచనలో ఉన్నారని అన్నారు. పార్టీ అధినేత కెసిఆర్ చొప్పదండి అల్లుడని, రానున్న కాలంలో ఆ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తారని హామీ ఇచ్చారు. త్వరలో జరిగే పంచాయతీ ఎన్నికల్లో తండాలు సహా అనేక చోట్ల ఏకగ్రీవం కానున్నాయని, గిరిజనులు, ఆదివాసీలకు కెసిఆర్ ఇచ్చిన హామీ మేరకు చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా తండాలను పంచాయతీలు చేయడంతో వారి గ్రామాలను వారే అభివృద్ధి చేసుకునే అవకాశం లభించిందన్నారు. పార్టీని గ్రామ స్థాయి నుంచి పటిష్టం చేసేందుకు వీలుగా ప్రతీ వంద మంది ప్రజలకు ఒక కార్యకర్త, ప్రతీ పది ఇండ్లకు ఒక కార్యకర్త ఉండేలా వృద్ధి చెందాలని సూచించారు.

చరిత్రను తిరగరాసిన కెసిఆర్

ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు ఇచ్చిన తీర్పుతో కాంగ్రెస్ నేతలకు దిమ్మతిరిగిందని కెటిఆర్ వ్యాఖ్యానించారు. వివిధ పార్టీలకు చెందిన పలువురు నేతలు, కార్యకర్తలు తెలంగాణ భవన్‌లో శుక్రవారం కెటిఆర్ సమక్షంలో టిఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ, గతంలో ఉమ్మడి రాష్ట్రంలో ముందస్తు ఎన్నికలకు వెళ్లిన వారెవ్వరూ గెలవలేదని, ఆ అనుభవాలను ఉటంకిస్తూ చాలా మంది రాజకీయ పండితులు కెసిఆర్‌కు 'ముందస్తు' ఆలోచన వద్దని సూచించారని గుర్తుచేశారు. కానీ కెసిఆర్ మాత్రం చాలా దూరదృష్టితో, వాస్తవిక పరిస్థితులను సరైన పద్ధతిలో విశ్లేషించి ఆ మాటలను పట్టించుకోకుండా ముందస్తు ఎన్నికలకు వెళ్లి చరిత్రను తిరగరాశారన్నారు. ప్రజలిచ్చిన తీర్పుతో చాలా మంది కాంగ్రెస్ నేతలు ఎన్నికల ఫలితాల తర్వాత ముఖం చాటేశారని, మరికొద్ది మంది సీనియర్లు రాజకీయాల నుంచి రిటైర్మెంట్ కానున్నారని వ్యాఖ్యానించారు.

పోయినచోటే వెదుక్కోవాలి

గత సాధారణ ఎన్నికల్లో నల్లగొండ జిల్లాలోని పన్నెండు అసెంబ్లీ స్థానాల్లో టిఆర్ఎస్ ఆరింటిని గెల్చుకుందని, నాలుగేళ్ళ కాలంలో ఆ జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ పనులను అనుభవంలోకి తీసుకున్న ప్రజలు స్పష్టమైన నిర్ణయానికి వచ్చారని, కాంగ్రెస్‌కు చెందిన చాలా మంది సీనియర్ మహామహులు ఈ ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోయారని అన్నారు. హుజూర్‌నగర్‌లో ట్రక్కు గుర్తుతో పాటు కొన్ని టక్కు టమార విద్యల వల్ల ఉత్తమ్‌కుమార్‌రెడ్డి గెలిచారని అన్నారు. సింహం సింగిల్‌గా వస్తుందన్నట్టు కెసిఆర్ సింగిల్‌గా వచ్చి గెలిచారని, ఎన్నికల ఫలితాల తర్వాత కాంగ్రెస్ నేతల బుర్రలు పాడయ్యాయన్నారు. మళ్ళీ ఎన్నికలు పెట్టాలంటూ తెలంగాణ పిసిసి మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య డిమాండ్ చేస్తుంటే నవ్వాలో, ఏడవాలో అర్థం కావడం లేదని, కాంగ్రెస్ నేతల ఆలోచనా పరిస్థితి అలా ఏడ్చిందన్నారు. ఓటర్లు ఇచ్చిన తీర్పుకు కాంగ్రెస్ నేతలు కొంతమంది మీడియాకు దూరమయ్యారని గుర్తుచేశారు. కాంగ్రెస్ నేతలు ఇక గెలిచే పరిస్థితి లేదన్నారు. ఓడిన చోటనే వెతుక్కోవాలన్నట్టుగా హుజూర్‌నగర్ కార్యకర్తలు పనిచేయాలని, ఆ నియోజకవర్గంతో పాటు కాంగ్రెస్ గెలిచినచోట్ల టిఆర్ఎస్ పరిస్థితిని బాగా మెరుగుపర్చుకోవాలని, ఎక్కడెక్కడ టిఆర్ఎస్‌కు బలం తక్కువగా ఉందో గుర్తించి బలోపేతం చేయడంపై దృష్టి పెట్టాలని కార్యకర్తలకు సూచించారు. ఉత్తమ్ కుమార్‌రెడ్డి లాంటి అహంకారి మరొకరు లేరన్నారు. ట్రక్కు గుర్తుతో కలిపి టిఆర్ఎస్‌కు యాభై శాతం ఓట్లు వచ్చాయని, రానున్న ఎన్నికల కోసం బూత్ స్థాయి కమిటీలను పటిష్టం చేసుకోవాలని సూచించారు. ప్రతీ పది ఇండ్లకో కార్యకర్తను, ప్రతీ వంద మంది ప్రజలకో కార్యకర్త నియమించుకోవాలన్నారు. సిరిసిల్లలో పటిష్టమయిన బూత్ కమిటీలతోనే తనకు మెజారిటీ పెరిగిందని, ఇది అన్ని చోట్లా ప్రతిబింబించాలన్నారు. పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పోటీచేసే పరిస్థితి లేదని, టిఆర్ఎస్ కార్యకర్తలు సమష్టిగా పనిచేసి వీలైనన్ని స్థానాలను ఏకగ్రీవం చేసుకోవాలని సూచించారు. అధికారం వచ్చిందనే గర్వం కార్యకర్తలకు పనికిరాదని, బాధ్యతతో ప్రజలతో మమేకం కావాలని సూచించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 47 శాతం ఓట్లు టిఆర్ఎస్‌కు పడ్డాయని కెటిఆర్ చెప్పారు. ట్రక్కు గుర్తుతో సుమారు 2 లక్షల ఓట్లు దూరమయ్యాయని, ఆ పరిస్థితి ఎదురుకాకుండా ఉన్నట్లయితే 50 శాతం ఓట్లు వచ్చేవన్నారు. పంచాయతీ, పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ శాతాన్ని పెంచాలని నేతలకు, కార్యకర్తలకు సూచించారు. ప్రజల్లో నిరంతరం ఉంటూ వారి విశ్వాసాన్ని, అభిమానాన్ని చూరగొనాలని పిలుపునిచ్చారు. చొప్పదండి శాసనసభ్యుడు రవిశంకర్‌తో పాటు హుజూర్‌నగర్ అభ్యర్థి సైదిరెడ్డిలతో పాటు ఆయా నియోజకవర్గాల కార్యకర్తలు, మండల స్థాయి నాయకులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

మీది బూటకం నాటకం



(మొదటిపేజీ తరువాయి)

చర్చ సందర్భంగా రాహుల్ గాంధీతో పాటుగా ప్రతిపక్షాలు లేవనెత్తిన ప్రతి అంశానికి ఆమె సమాధానమిచ్చారు. తొలుత నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ, దేశ భద్రత కోసం ఈ ఒప్పందం చేసుకున్నామని చెప్పారు. ఈ దశలో రాహుల్ గాంధీ జోక్యం చేసుకుంటూ, రాఫెల్ విమానాల ధరను రహస్యంగా ఉంచే అంశమేమీ కాదని, ప్రధాని మోడీ ఆధ్వర్యంలోనే ఈ కుంభకోణం జరిగిందని ఆరోపించారు. దీనికి నిర్మలా సీతారామన్ ఘాటుగా స్పందించారు. బోఫోర్స్ కుంభకోణమని, రాఫెల్ కాదని అన్నారు.' బోఫోర్స్ ఒప్పందమే కుంభకోణం. రాఫెల్ కాదు, దేశ ప్రయోజనాల కోసమే రాఫెల్ ఒప్పందాన్ని చేసుకున్నాం. బోఫోర్స్ కుంభకోణం వల్లనే కాంగ్రెస్ పార్టీ గతంలో ఓటమి చవిచూసింది. కానీ రాఫెల్ విషయంలో ప్రధాని మోడీ మరోసారి విజయం సాధిస్తారు. రాఫెల్ ఒప్పందం విషయంలో మీకు ఎలాంటి ప్రయోజనం చేకూరలేదు. అందుకే వైమానిక దళ అవసరాలను కూడా పట్టించుకోకుండా మీరు ఒప్పందాన్ని పూర్తి చేయలేదు. కానీ మా ప్రభుత్వం అలా కాదు. దేశప్రయోజనాల కోసమే ఒప్పందాన్ని పూర్తి చేశాం' అని అంటూ కాంగ్రెస్‌పై ధ్వజమెత్తారు. రాఫెల్ ఒప్పందం విషయంలో వైమానిక దళాన్ని విశ్వాసంలోకి తీసుకోలేదన్న కాంగ్రెస్ ఆరోపణలను మంత్రి తిప్పికొడుతూ, యుపిఏ ప్రభుత్వ హయాంలో 18 రాఫెల్ విమానాలను కొనుగోలు చేయాలని అనుకోగా, 36 యుద్ధ విమానాలను కొనుగోలు చేయాలని భారత వైమానిక దళమే సూచించిందన్నారు. పొరుగు దేశాలైన చైనా, పాకిస్తాన్‌లు రక్షణ సంబంధ విషయాల్లో దూకుడుగా ముందుకు పోతూ ఉంటే యుపిఏ ప్రభుత్వం 18 యుద్ధ విమానాలను కొనుగోలు చేయాలని నిర్ణయించి భారత్‌ను ఎటూ కదలలేని స్థితికి తెచ్చిందని ఆరోపించారు. ఉత్తర, పశ్చిమ సరిహద్దుల్లో యుద్ధ వాతావరణం ఉన్న నేపథ్యంలో తగిన సామగ్రిని అత్యవసరంగా సమకూర్చుకోవలసిన అవసరం ఉందన్నారు. అందుకే దీన్ని అత్యవసరంగా గుర్తించామన్నారు. కాంగ్రెస్ పార్టీ తన ఖజానా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని దేశ ప్రయోజనాలను పణంగా పెట్టిందని ఆమె ఆరోపించారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేయగా నిర్మలా సీతారామన్ వారికి గట్టిగా చురకలంటించారు. ఎన్‌డిఏ కుదుర్చుకున్న ఒప్పందం కింద తొలి రాఫెల్ విమానం ఈ ఏడాది సెప్టెంబర్‌లో డెలివరీ అవుతుందని, చివరి విమానం 2022లో డెలివరీ అవుతుందని ఆమె చెప్పారు. రాఫెల్ యుద్ధ విమానాల ధర విషయంలో కాంగ్రెస్ పార్టీనేతలు తమకు తోచింది మాట్లాడుతున్నారన్నారు. ఏం మాట్లాడినా ఆలోచించి మాట్లాడాలని ఆమె కాంగ్రెస్ సభ్యులకు హితవు చెప్పారు. యుపిఏ ప్రభుత్వం కుదుర్చుకున్న ధరతో పోలిస్తే ఎన్‌డిఏ ప్రభుత్వం కుదుర్చుకున్న ధర తొమ్మిది శాతం తక్కువని కూడా ఆమె చెప్పారు. రాఫెల్ హెచ్ఎఎల్ హక్కంటూ రాహుల్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి మండిపడ్డారు. హెచ్ఎఎల్ విషయంలో కాంగ్రెస్ నేతలు మొసలి కన్నీరు కారుస్తున్నారన్నారు. 'రాఫెల్ మీ హక్కు. దాన్ని మీరే తయారు చేయాలి' అని అంటూ బెంగళూరు హెచ్ఎఎల్ వద్ద జరిగిన ఒక కార్యక్రమంలో రాహుల్ చేసిన వ్యాఖ్యలను ఆమె ఎద్దేవా చేస్తూ, హెచ్ఎఎల్‌కు ఎందుకు ఇవ్వలేదో తెలుసుకోవాలన్నారు. హెచ్ఎఎల్ గొప్పలే కాదు, లోపాలనూ గుర్తించాలన్నారు. తేజస్ విషయంలో హెచ్ఎఎల్ వేగంగా పని చేయలేదన్నారు. అంత ప్రేమ ఉంటే మీరు అగస్టా హెలికాప్టర్ల కాంట్రాక్ట్‌ను దానికి ఎందుకివ్వలేదని ప్రశ్నించారు. అలా చేసి ఉంటే హెలికాప్టర్లు మాత్రమే వచ్చి ఉండేవని, ముడుపులు వచ్చేవి కావంటూ కాంగ్రెస్‌కు చురకలు వేశారు. తమకు ఏదయినా ప్రయోజనం జరిగే వరకు వాళ్లు ఒప్పందాన్ని ఆపేశారని ఆరోపించారు. 'డిఫెన్స్ డీల్‌కు, డీలింగ్ ఇన్ డిఫెన్స్'కు చాలా తేడా ఉందన్నారు. మోడీ ప్రభుత్వం దేశ భద్రతకు పెద్ద పీట వేసిందని ఆమె స్పష్టం చేశారు. 2013 నాటి అఫ్‌సెట్ గైడ్‌లైన్స్ ప్రకారమే రాఫెల్ ఒప్పందం కుదిరిందని ఆమె స్పష్టం చేశారు. మోడీని దొంగని వ్యాఖ్యానించడంతో పాటుగా ప్రధాని గౌరవానికి భంగం కలిగిస్తున్నారని దుయ్యబట్టారు. ప్రభుత్వాన్ని అవమానించిన కాంగ్రెస్ పార్టీ ఎందుకు క్షమాపణ చెప్పలేదని రక్షణ మంత్రి ప్రశ్నించారు.

రక్షణ మంత్రి నాటకం ఆడుతున్నారు

- నా ప్రశ్నల్లో దేనికీ సమాధానం చెప్పలేదు
- మేం అధికారంలోకి వస్తే రాఫెల్‌పై దర్యాప్తు
- నిర్మలా సీతారామన్‌పై రాహుల్ విమర్శలు



న్యూఢిల్లీ : రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ నాటకం మొదలు పెట్టారని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఆరోపించారు. రాఫెల్ ఒప్పందంపై లోక్‌సభలో సుదీర్ఘంగా ప్రసంగించినప్పటికీ తాను అడిగిన ప్రశ్నలకు మాత్రం సమాధానం చెప్పకుండా పలాయనం చిత్తగించారని ఎద్దేవా చేశారు. రాఫెల్ ఒప్పందంపై లోక్‌సభలో జరిగిన చర్చకు శుక్రవారం రక్షణ మంత్రి సమాధానం చెప్పిన తర్వాత పార్లమెంటు వెలుపల విలేఖరులతో మాట్లాడుతూ రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. చర్చ చివర్లో తాను రెండే రెండు ప్రశ్నలు వేశానని, వాటికి 'ఔను', లేదా 'కాదు' అని సూటిగా సమాధానం చెప్పాలని అడిగానని, వాటికి కూడా ఆమె సమాధానం చెప్పలేదని రాహుల్ అన్నారు. ఆమె రెండు గంటల పాటు ప్రసంగించినా ఎక్కడా అనిల్ అంబానీ పేరు ప్రస్తావించలేదన్నారు. ప్రధాని మోడీ ' బైపాస్ సర్జరీ' చేసినప్పుడు వైమానిక దళం అభ్యంతరం వ్యక్తం చేసిందా? అని తాను అడిగినప్పటికీ ఆమె సమాధానం చెప్పలేదన్నారు. ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా ఆమె నాటకం మొదలుపెట్టారని అన్నారు. తనకు అవమానం జరిగిందని, తనను అబద్ధాల కోరని ఆరోపించారని అంటున్నారని రాహుల్ దుయ్యబట్టారు. దేశంలోని యువతను తప్పుదోవ పట్టించడానికి రక్షణ మంత్రి ప్రయత్నించారన్నారు. ప్రధానమంత్రి పార్లమెంటుకు రాలేదన్నారు. మాజీ రక్షణ మంత్రి మనోహర్ పారికర్ తన దగ్గర ఓ ఫైలుందంటున్నారు. రెండు గంటలు ప్రసంగించిన రక్షణ మంత్రి ఏ ప్రశ్నకూ సమాధానం చెప్పలేదన్నారు. 2019 లోక్‌సభ ఎన్నికలో తమ పార్టీ అధికారంలోకి వస్తే రాఫెల్ ఒప్పందంపై విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షిస్తుందని రాహుల్ స్పష్టం చేశారు. రాఫెల్‌పై చర్చ అంటే నరేంద్ర మోడీ పారిపోతున్నారన్నారు. రాఫెల్‌పై విచారణ అక్కరలేదని సుప్రీంకోర్టు ఎక్కడా చెప్పలేదని, దీనిపై విచారణకు ఆదేశించే అధికారం తమ పరిధిలోకి రాదని మాత్రమే చెప్పిందని అన్నారు. ' ప్రధాని తరఫున రక్షణ మంత్రి సమాధానం చెప్పినప్పుడు మేము లేవనెత్తిన ప్రతి ప్రశ్నకు సమాధానం చెప్పి తీరాలి. మాతో పాటుగా మొత్తం ప్రతిపక్షం కోరుతున్నది అదే' అని రాహుల్ స్పష్టం చేశారు. తాను అడిగిన ప్రశ్నలు ఈ దేశ యువత అడుగుతున్న ప్రశ్నలని కూడా ఆయన అన్నారు.



రబీకి సాగర్ నీటి విడుదల అసాధ్యమే

మనతెలంగాణ/ ఖమ్మం : నాగార్జున సాగర్ ఎడమ కాలువ పరిధిలోని యకట్టుకు రబీ సీజన్‌కు నీటి విడుదల సాధ్యం కాని పరిస్థితులను రైతులకు తెలియజేసి అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నగరంలోని టీటీడీసీ సమావేశ మందిరంలో నీటి పారుదల, రెవెన్యూ, వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులతో కలెక్టర్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. నాగార్జున సాగర్ డ్యాంలో గల ప్రస్తుత నీటి లభ్యతను బట్టి జిల్లాలోని ఎన్నెస్పీ ఎడమ కాలువ ఆయకట్టు పరిధిలోని జోన్2, జోన్3 ఆయకట్టుకు సరిపడా నీటి లభ్యత లేనందున రబీకి నీటి విడుదల చేయటం సాధ్యం కాదని ఎన్నెస్పీ ఎస్‌ఈ కలెక్టర్‌కు వివరించారు. దీనిపై కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నెస్పీ ఎడమ కాలువ ఆయకట్టు పరిధిలోని రైతులు నష్టపోకుండా ముందస్తుగానే మండల, గ్రామ స్థాయిలో వ్యవసాయ, రెవెన్యూ, ఉద్యానవన శాఖ అధికారులు రైతులతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలని ఆదేశించారు. అదే విధంగా గ్రామాల్లో చాటింపుల ద్వారా, పత్రికల ద్వారా రైతులకు ఈ విషయాన్ని తెలియజేయాలన్నారు. అంతే కాకుండా నీటి లభ్యత లేనందున ప్రత్యామ్నాయ పంటలు వేసుకునే విధంగా వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు పంటల గురించి అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఆయేషా మస్రత్‌ఖానం, సబ్ కలెక్టర్ అనురాగ్ జయంతి, పర్యవేక్షక ఇంజనీర్ పి. సుమతీదేవి, కల్లూరు ఆర్డీవో బి. శివాజీ, నీటిపారుదలశాఖ ఎస్‌ఈ నరసింహారావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి ఝాన్సీలక్ష్మి కుమారి, ఉద్యానవనశాఖ అధికారి అనసూయ,ఎన్నెస్పీ డీఈ వెంకటేశ్వర్లు, తహశీల్దార్లు, వ్యవసాయశాఖ మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు

జైళ్లశాఖ అమలు చేస్తున్న పథకాలు భేష్



మన తెలంగాణ/మాదన్నపేట్ : తెలంగాణ జైళ్లశాఖ ఖైదీల్లో మార్పు కోసం అమలు చేస్తున్న పథకాలు సమాజానికి ఎంతో ఉపయోగపడుతాయని గుజరాత్ హోంశాఖ డిప్యూటీ కార్యదర్శి మహేందర్‌కుమార్ రాతిలాల్ సోని అన్నారు. జైలులో ఖైదీల మార్పు కోసం తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను తెలుసుకోవడానికి గుజరాత్ అధికారులు మహేందర్‌కుమార్, ధర్మేంద్ర శర్మ, జీఆర్ తరల్‌లు శుక్రవారం చంచల్‌గూడ జైలును సందర్శించారు. జైలు సూపరింటెండెంట్ అర్జున్‌రావు వారికి క్లుప్తంగా వివరించి తెలిపారు. మొదటి ములాఖత్‌కు వచ్చిన వారికి ఏర్పాటు చేసిన లాంచ్ రూం,జైలులో ఖైదీల ఆరోగ్యం కోసం యోగా,పిటి,జైలులో ఉపాధిపై శిక్షణల గురించి వివరించారు. విడుదలైన అనంతరం వారికి రుణ సౌకర్యం,ఉన్నతి కార్యక్రమం ద్వారా కౌన్సెలింగ్,విడుదలైనంతరం వారిని పర్యవేక్షించడం మేరకు ప్రత్యేక సెల్ ఏర్పాట్ల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్‌లు సాయిబాబా,భరత్ దండ, జైలర్లు వెంకటేషం,శశికాంత్ తదితరులు పాల్గొన్నారు.

జగన్‌పై హత్యాయత్నం కేసు ఎన్‌ఐఎకు అప్పగింత


అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఎపి ప్రభుత్వం కేంద్ర హోంశాఖకు లేఖ

మన తెలంగాణ/హైదరాబాద్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అక్టోబరు నెల 25న విశాఖపట్నం విమానాశ్రయంలో జరిగిన హత్యాయత్నం కేసును ఎన్‌ఐఎకు అప్పగిస్తూ ఎపి హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. విశాఖ ఎయిర్‌పోర్టులోని క్యాంటిన్‌లో పనిచేసే శ్రీనివాస్ అనే వ్యక్తి కోడికత్తితో వైఎస్ జగన్‌పై జరిపిన హత్యాయత్నం కేసుపై శుక్రవారం ఎపి హైకోర్టు విచారణ జరిపింది. ఎన్‌ఐఎ యాక్ట్ ప్రకారం కేసును ఎన్‌ఐఎకి బదిలీ చేయాలని వైఎస్ జగన్ తరపు న్యాయవాది గత విచారణలో కోర్టుకు విన్నవించారు. కేసు దర్యాప్తు ఆలస్యమైతే సాక్షాధారాలు తారుమారు అయ్యే అవకాశం ఉందని పిటిషనర్ తరపు న్యాయవాది కోర్టు దృష్టికి పలుమార్లు తీసుకెళ్లారు. ఈ కేసును ఎన్‌ఐఎకి అప్పగించడంపై కేంద్ర, రాష్ట్రాలను హైకోర్టు గతంలోనే అడిగి తెలుసుకుంది. ఈ కేసును ఎన్‌ఐఎకి అప్పగించడంపై కేంద్ర నిర్ణయం తీసుకోకపోతే తామే ఈ నిర్ణయం తీసుకుంటామని హైకోర్టు తేల్చిచెప్పడంతో కేంద్రం తలొగ్గి ఎన్‌ఐఏ విచారణకు సుముఖత తెలిపింది. ముఖ్యంగా దాడి జరిగిన ప్రదేశం (విమానాశ్రయం లాంజ్) కేంద్ర ప్రభుత్వం పరిధిలోకి వస్తుదని కాబట్టి జాతీయ దర్యాప్తు సంస్థలకు ఇవ్వవచ్చని ధర్మాసనం కేసును ఎన్‌ఐఎకు అప్పగించింది. దాడి కేసును ఎన్‌ఐఎకు హైకోర్టు అప్పగిస్తూ తీర్పు వెలువరించకముందే కేంద్ర ప్రభుత్వం ఈ కేసులో ఎన్‌ఐఎ కొన్ని మార్గదర్శకాలు చేసింది. ఈ మేరకు జనవరి 1 వ తేదీ సాయంత్రమే ఎన్‌ఐఎ హైదరాబాద్ విభాగం ఈ కేసుకు సంబంధించి ఎఫ్‌ఐఆర్ నమోదు చేసినట్లు సమాచారం. సిఐఎస్‌ఎఫ్ అసిస్టెంట్ కమాండర్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసింది. కేసు నమోదు చేసిన విషయాన్ని ఎపి హైకోర్టుకు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం ఈ కేసులో సుప్రీం కోర్టును ఆశ్రయించాలని యోచిస్తున్నట్లు సమాచారం.

కేంద్ర హోంశాఖకు ఎపి ప్రభుత్వం లేఖ

కోడి కత్తి కేసు ఎన్‌ఐఎకు ఇవ్వడంపై ఎపి సర్కారు కేంద్ర హోంశాఖకు లేఖ రాసింది. ఉగ్రదాడులు, విమానాల హైజాక్ తదితర కీలక కేసులు దర్యాప్తు చేసే ఎన్‌ఐఎ సంస్థ అని కోడికత్తి కేసు అప్పగించడంపై ఎపి ప్రభుత్వం అభ్యంతరం తెలిపింది. కోడికత్తి కేసు ఎన్‌ఐఎ పరిధిలోకి రాదని ప్రభుత్వ న్యాయవాదులు కోర్టులో వాదనలు వినిపించారు. ఇప్పటికే కోడికత్తి కేసు దర్యాప్తును ఎపి ప్రభుత్వం పూర్తి చేసి నివేదికను పోలీసులు సీల్డ్ కవర్‌లో కోర్టుకు సమర్పించారని న్యాయవాదులు వెల్లడించారు. ఈక్రమంలో కోడి కత్తి కేసును ఎన్‌ఐఎకు అప్పగించడాన్ని తప్పుబడుతూ కేంద్ర హోంశాఖకు లేఖ రాసినట్లు సమాచారం.

ఏకగ్రీవమైన దేగావత్ గ్రామపంచాయతీ



మనతెలంగాణ/రుద్రంగి : రాజన్న సిరిసిల్ల జిల్లాలో నూతనంగా ఏర్పడినా రుద్రంగి మండలంలోని దేగావత్ తండా గ్రామపంచాయతీ సర్పంచ్,ఎనిమిది వార్డు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. టిఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కెటిఆర్ ఇచ్చిన పిలుపు మేరకు ఏకగ్రీవంగా ఎన్నికైతే ప్రభుత్వం ఇచ్చే 10లక్షలతో పాటు ఎంఎల్‌ఏ నిధుల నుంచి 15 లక్షలతో కలిపి మొత్తం 25 లక్షలు ఇస్తామని ప్రకటించడంతో నాయకులు గ్రామపంచాయతీలను ఏకగ్రీవం చేయడానికి ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. రుద్రంగి మండలంలోని పది గ్రామాలు మొదటి విడతలో ఎన్నికలు నిర్వహించడం కోసం 7న నోటిఫికేషన్ జారీ చేసే అవకాశం ఉంది. మండలంలోని 10గ్రామాల్లో మొత్తం 84వార్డు సభ్యులు ఉండగా దేగావత్ తండా గ్రామ సర్పంచ్, ఎనిమిది మంది వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికైన వారిలో సర్పంచ్ దేగావత్ సరితా తిరుపతి, ఉప సర్పంచ్ కునూసోత్ రబిక రాజు, ఉప సర్పంచ్ మొదటి వార్డు, లావణ్య రెండవ వార్డు, దేవేందర్, బానోతు అనిత, బానోతు వసంత, భూక్య శారద, గుగులోతు మెరవన్, బానోత్ కవితలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మిగతా గ్రామాలు(తాండాలు) ఆశావహులు ఏకగ్రీవం కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. మొన్నటి దాక ఎమ్మెల్యే ఎన్నికల వంతు ముగిసింది. ఇప్పుడు నోటీఫికేషన్ వస్తున్న తరుణంలో మహిళలు ఆసక్తి చూపుతున్నారు.

అమల్లోకి ఐరిస్ విధానం

- మొదటి విడతగా 16 జిల్లాల్లో అమలుకు శ్రీకారం
- దీని ద్వారా 5,186 దుకాణాల నుంచి సరుకుల పంపిణీ
- నాలుగు రోజుల్లో 15.20 లక్షల మందికి సరుకులు
- త్వరలోనే రాష్ట్రంలోని 17,200 దుకాణాల్లో అమలు
- ఐరిస్ విధానం అమలు తీరును పరిశీలించిన కమిషనర్



మన తెలంగాణ / హైదరాబాద్ : 'ఐరిస్' విధానం ద్వారా ప్రజా పంపిణీ వ్యవస్థకు పౌరసరఫరాలశాఖ శ్రీకారం చుట్టింది. నూతన సంవత్సరం నుంచి రాష్ట్రంలోని 16 జిల్లాల్లో ఈ విధానా న్ని అమలు చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 5,186 చౌక దుకాణాల ద్వారా 15.20 లక్షల మందికి సరుకుల పంపిణీ జరిగింది. కేవలం నాలుగు రోజుల వ్యవధిలోనే పదిహేనున్నర లక్షల మందికి డీలర్లు సరుకులను అందజేశారు. లబ్ధిదారులకు మరింత ప్రయోజనం కలిగేలా సులువుగా రేషన్ సరుకులను తీసుకునేందుకు ఈ విధానాన్ని ప్రవేశపెట్టినట్లు పౌరసరఫరాలశాఖ కమిషనర్ అకున్ సబర్వాల్ తెలిపారు. వేలిముద్రలతో పాటు కను పాపల ద్వారా కూడా లబ్ధిదారులకు రేషన్ సరుకులను అందజేస్తున్నట్లు తెలిపారు. దాదాపు ఏడాది నుంచి పౌరసరఫరాలశాఖ 'ఈ పాస్' (బయో మెట్రిక్) విధానం ద్వారా సరుకులను పంపిణీ చేస్తోంది. ఈ విధానంలో వృద్ధులు, మహిళల వేలి ముద్రలు అరిగిపోవడం వల్ల బయోమెట్రిక్ మిషన్లు గుర్తించలేక పలు రకాల సమస్యలు తలెత్తాయి. లబ్ధిదారులు సరుకులు అందుకోలేక ఇబ్బందిపడ్డారు. ఈ ఇబ్బందులు పునరావృతం కాకూడదన్న ఉద్దేశ్యంతో కమిషనర్ 'ఐరిస్' విధానానికి శ్రీకారం చుట్టారు. వేలిముద్రలను బయోమెట్రిక్ మిషన్లు ధృవీకరించని చోట విఆర్‌ఓ, విఎఓ, పౌరసరఫరాలశాఖ ఇన్స్‌పెక్టర్లకు అంథటికేషన్ సౌకర్యం కల్పించడంతో అక్కడక్కడా దుర్వినియోగం జరుగుతుందనే విషయాలను గుర్తించిన పౌరసరఫరాల శాఖ అడ్డుకట్ట వేసేందుకు 'ఐరిస్' పరిష్కారమని భావించింది. ఆ ఆలోచన నుంచే 'ఐరిస్' విధానం ఒక నిర్ణయంగా మారింది. గత ఏడాది ఆగస్టులో ప్రయోగాత్మకంగా నాలుగు జిల్లాల్లో ఈ విధానాన్ని అమలు చేసిన అధికారులు మంచి ఫలితాలు రావడంతో నూతన సంవత్సరం నుంచి మొదటి విడతగా 16 జిల్లాల్లో అమలు చేస్తున్నారు. రాష్ట్రంలోని 17,200 రేషన్ దుకాణాల్లో దశలవారీగా ఈ విధానాన్ని అమలు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఇందులో భాగంగానే ఈ నెల మొదటి నుంచి 16 జిల్లాల్లో 5,186 దుకాణాల్లో ఈ విధానాన్ని అమల్లోకి తెచ్చినట్లు చెప్పారు. నూతన విధానం అమలును కమిషనర్ పలు జిల్లాల్లో పర్యటించి స్వయంగా పరిశీలించారు. ఇందులో సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాల్లో ఐరిస్ విధానం అమలు తీరును పరిశీలించారు. త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా అన్ని చౌక దుకాణాల్లో ఈ విధానం అమలుల్లోకి వస్తుందన్నారు. ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా అర్హులైన పేదలు మరింత సులువుగా నిత్యావసర సరుకులు పొందడానికి ఈ విధానం ఎతగానో ఉపయోగపడుతుందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. మొదటి విడతగా ఐరిస్ విధానం అమల్లోకి వచ్చిన జిల్లాల్లో ఆదిలాబాద్, నాగర్‌కర్నూల్, సూర్యాపేట, ఖమ్మం, నల్గొండ, కొత్తగూడెం, గద్వాల్, నిర్మల్, భువనగిరి, మంచిర్యాల, కామారెడ్డి, జగిత్యాల, సిద్దిపేట, మహబూబ్‌నగర్, సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల్లో అమల్లోకి వచ్చింది. ఆయా జిల్లాల్లో మొత్తం 8,635 దుకాణాలుండగా ప్రస్తుతం 5,186 దుకాణాల్లో మాత్రమే ఈ విధానాన్ని అమలు చేస్తున్నట్లు కమిషనర్ వివరించారు.

12న అమెరికాలోనే అంత్యక్రియలు



- శ్రీనివాస్ నాయక్ కుటుంబీకులు 20 మంది అంత్యక్రియల్లో పాల్గొనేలా చర్యలు
- తండా వాసులకు సర్కార్ అండ

మన తెలంగాణ/కొండమల్లెపల్లి : అమెరికాలో ఉన్నత చదువుల కోసం వెళ్లి డిసెంబర్ 25వ తేదీన అగ్నిప్రమాదంలో మృత్యువాత పడ్డ గిరిజన శ్రీనివాస్ నాయక్ కుటుంబానికి అని విధాలుగా అండగా నిలిచేందుకు అవసరమైన చర్యలను ప్రభుత్వం తీసుకుంటుందని ఎంపి గుత్తాసుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే రవీంద్రకుమార్, టిఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యవతి రాథోడ్ అన్నారు. శుక్రవారం నేరేడుగొమ్ము మండల పరిధిలోని గుర్రపుతండాలోని మృతుల కుటుంబీకులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మృతి చెందినశ్రీనివాస్ నాయక్ ముగ్గురు పిల్లలు 1 సాత్వికనాయక్, 2 సుహాస్ నాయక్, 3 జ్యాయినాయక్‌ల మృతదేహాలను ఇక్కడకు తెచ్చే పరిస్థితి లేకపోవడంతో ఈ నెల 12న అంత్యక్రియలను అమెరికాలో జరుపుతున్నారని అన్నారు. ఈ క్రమంలో మృతుల కుటుంబీకులు 20 మందిని అమెరికాలో జరిగే అంత్యక్రియల్లో పాల్గొనేలా టిఆర్‌ఎస్ ప్రభుత్వం అవసరమైన ఏర్పాట్లు చేస్తుందన్నారు. మృతుల కుటుంబీకుల తెలంగాణ నుంచి అమెరికాకు వెళ్లే ఖర్చులు ఎంతైనా ప్రభుత్వమే భరిస్తుందని టిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ భరోసా ఇచ్చారని అన్నారు. అమెరికాలోని కోలిర్‌విల్ పట్టణంలో ఓ ఇంట్లో క్రిస్‌మస్ వేడుకలు జరుపుకుంటుండగా జరిగిన భారీ అగ్ని ప్రమాదంలో గుర్రపుతండాకు చెందిన ముగ్గురు తెలంగాణ విద్యార్థులు మృతి చెందిన విషయం విదితమే. దీంతో విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు వెంటనే మృతదేహాలను స్వస్థలానికి తరలించేలా తెలంగాణ ప్రభుత్వాన్ని విన్నవించారు. ఈ విషయమై దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ టిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ దృష్టికి తీసుకెళ్లి మృతదేహాల తరలింపు గురించి వివరించారు. దీంతో కెటిఆర్ వెంటనే స్పందించి అమెరికా ప్రభుత్వ రాయబారి కార్యాలయం అధికారులతో చర్యలు జరిపారు. అయితే పూర్తిగా కాలిపోయిన విద్యార్థుల మృతదేహాలను ఇండియాకు తీసుకొచ్చేందుకు సాధ్యపడదని వారు చెప్పడంతో మృతుల తల్లిదండ్రులు అమెరికాలోనే అంత్యక్రియలు నిర్వహించేందుకు నిర్ణయించారు. అయితే అమెరికాలోనే అంత్యక్రియలు నిర్వహిస్తుంటంతో స్థానిక ఎమ్మెల్యే రవీంద్రకుమార్ ప్రభుత్వంతో చర్చలు జరిపి కెటిఆర్ చొరవతో 20 మందిని ఈ నెల 12న జరిగే అంత్యక్రియలకు ప్రభుత్వం అమెరికాకు తీసుకువెళ్ళెందుకు ఒక్కక్కరికీ రూ.1.50 లక్షలతో మొత్తం 20 మందిని ప్రభుత్వమే భరించి పంపుతున్నట్లు వారు తెలిపారు. కెటిఆర్ చూపిన ప్రత్యేక చొరవకు తండావాసుల కృతజ్ఞతలు తెలిపారు. పరామర్శించిన వారిలో జడ్పీటీసీ ఆలంపల్లి నర్సింహ్మా, హన్మంత్ వెంకటేష్‌గౌడ్, వశ్యానాయక్, టివిఎన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అడవి పందులను తప్పించబోయి
కారు బోల్తా

టిఆర్‌ఎస్ నాయకుడు బుచ్చన్న యాదవ్ మృతి, ఇద్దరికి గాయాలు



మన తెలంగాణ/పూడూరు : అడవి పందులను తప్పించబోయి ప్రమాదవశాత్తు కారు చెట్టును ఢీకొని టిఆర్‌ఎస్ నాయకుడు మృతి చెందగా, మరో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయిన సంఘటన చన్‌గోములు పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం జరిగింది. ఎస్‌ఐ అరుణ్‌కుమార్ తెలిపిన కథనం ప్రకారం వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా పరిధిలోని కొడంగల్ నియోజకవర్గం బొమ్మరాస్‌పేట్ మండల, గౌరారం గ్రామానికి చెందిన టిఆర్‌ఎస్ నాయకుడు, జిల్లా యాదవ సంఘం ప్రధాన కార్యదర్శి మహేశ్వరం బుచ్చన్న యాదవ్(42) శుక్రవారం ఉదయం తన టిఎస్ 34 ఏ 9265 నెంబర్ గల కారులో హైదరాబాద్‌కు రామకృష్ణయాదవ్, మధులతో కలిసి వెళ్తుండగా పూడూరు మండలం కండ్లపల్లి స్టేజ్ సమీపంలోకి రాగానే అడవి పందులు రోడ్డు పైకి అడ్డం వచ్చాయి. వీటిని తప్పించడానికి ప్రయత్నించగా ప్రమాదవశాత్తు చెట్టుకు కారు ఢీకొంది. ఈ ఘటనలో బుచ్చన్న యాదవ్ అక్కడిక్కడే మృతి చెందగా, బొంరాస్‌పేట్‌కు చెందిన రామకృష్ణ యాదవ్, ఉడిమేశ్వరం గ్రామానికి చెందిన మధులకు తీవ్రగాయాలయ్యాయి. గాయాలైన ఇద్దరిని చికిత్స నిమిత్తం మహవీర్ ఆసుపత్రికి రేఫర్ చేశారు. ఈ మేరకు కేస్ నమోద్ చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కార్మిక చట్టాలను మోడీ కాలరాస్తున్నారు

మన తెలంగాణ/హైదరాబాద్ : మొద్దునిద్రలో ఉన్న మోడీ ప్రభుత్వం కళ్లు తెరిపించడానికి దేశవ్యాప్తంగా జాతీయ కార్మిక సంఘాలు జనవరి 8,9వ తేదీల్లో నాల్గవసారి జాతీయ సమ్మెకు సన్నద్ధమవుతున్నాయని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో అన్ని రంగాలకు సంబంధించిన కార్మిక వర్గాలు, రైతులు, కూలీలు పెద్ద సంఖ్యలో పాల్గొనడానికి సంసిద్ధతను వ్యక్తం చేయడం, మోదీ ప్రభుత్వం అణచివేతకు అద్ధం పడుతుందన్నారు. మూడుసార్లు సమ్మె చేస్తే మోదీకి చీమకుట్టినట్టుగా కూడా లేదని ఆరోపించారు. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కాలరాయడానికి పూనుకోవడం దుర్మార్గమని తెలిపారు. ప్రపంచలోనే అతిపెద్ద సార్వత్రిక కార్మికవర్గం కదం తొక్కడం ప్రత్యేకమన్నారు.

దేశవ్యాప్త రైతుబంధుతో రాష్ట్రానికి ఉపశమనం!


- కేంద్రం 70 శాతం, రాష్ట్రాలు 30 శాతం భరించే అవకాశం?
- దాదాపు రూ.7500 కోట్లు మిగులు



మన తెలంగాణ/హైదరాబాద్ : దేశవ్యాప్తంగా రైతుబంధు లాంటి పథకాన్ని అమలు చేస్తే రాష్ట్రానికి ఆర్థిక ఉపశమనం తగ్గనుంది. ఇప్పటికే రైతులకు ముందస్తు పెట్టుబడి ఇచ్చేలా రైతుబంధులాంటి పథకాన్ని ప్రవేశపెట్టే ప్రక్రియను వేగవంతం చేసింది. దీంతో నిధుల మొత్తం కేంద్రం భరించదని, వ్యవసాయం రాష్ట్రాల పరిధిలోనిది కనుక వాటాల రూపంలో చెల్లించేందుకు కసరత్తు చేస్తోంది. అయితే ప్రస్తుతం కేంద్ర పథకాలకు సాధారణంగా 60:40 శాతంలో నిధుల కేటాయింపులు ఉంటాయి. అదే ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనకు వచ్చే సరికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరిసగం భరిస్తున్నాయి. అదే పద్ధతిలో రైతు బంధు నిధులకు కేటాయింపులు చేయాలని కేంద్రం భావిస్తోందని రాష్ట్ర ఉన్నతాధికారి ఒకరు పేర్కొన్నారు. అయితే పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్నందున ఈ పథకం కేంద్రమే అమలు చేస్తుందన్న భావన తీసుకురావాలంటే ఎక్కువ మొత్తంలో నిధులు తామే భరిస్తున్నామనే సంకేతాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేలా ప్రధానమంత్రి నరేంద్రమోడి ప్లాన్ చేస్తున్నట్లు తెలిసింది. అందులో భాగంగానే కేంద్రం 70 శాతం, రాష్ట్రాలు 30 శాతం భరించేలా చేస్తే ఎలా ఉంటుందన్న ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. మన రాష్ట్రంలో ఎటువంటి పరిమితులు లేకుండా పంట సాగు చేసినా, చేయకపోయినా ఎన్ని ఎకరాలు ఉంటే అంతకు మొత్తం ఎకరాకు రూ.4వేల చొప్పున ఇచ్చారు. ఇందుకోసం బడ్జెట్‌లో రూ.12 వేల కోట్లు కేటాయించగా, దాదాపు రూ.11 వేల కోట్లు ఖర్చు చేసింది. అయితే కేంద్రం మాత్రం అలా కాకుండా కొన్ని పరిమితులు విధించాలనే యోచనలో ఉన్నట్లు తెలిసింది. రైతుకు ఉన్న మొత్తం భూమికి కాకుండా సీలింగ్ విధించాలనుకుంటుందని సమాచారం. ఒక వేళ కేంద్రం 70 శాతం వాటాను భరిస్తే రాష్ట్రానికి దాదాపు రూ.7500 కోట్లు మిగిలే అవకాశం ఉందని, ఇది భారీ ఉపశమనమని ఒక అధికారి వ్యాఖ్యానించారు. రైతుబంధు పథకం అమలు చేయడంలో వ్యవస్థీకృతంగా ఎలాంటి లోపాలు తలెత్తవని, అక్రమాలు కూడా జరగవని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బిఐ) తన పరిశోధన పత్రంలో పేర్కొంది. ఇప్పటికే పలువురు ఆర్థికవేత్తలు, వ్యవసాయ నిపుణులు రైతుబంధు పథకంపై ప్రశంసలు కురిపిస్తున్నారు. దీంతో రైతుబంధు పథకాన్ని దేశవ్యాప్తంగా అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. రైతుబంధు పథకాన్ని దేశవ్యాప్తంగా అమలు చేస్తే రూ.3 లక్షల కోట్ల ఖర్చు అవుతుంది ఎస్‌బిఐ తన పరిశోధన ప్రతంలో పేర్కొంది. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో అమలు చేస్తే రూ.3 లక్షల కోట్లు ఖర్చు అవుతుందని విశ్లేషించింది. దేశవ్యాప్తంగా సాగు 34.59 కోట్ల ఎకరాల, నికర వ్యవసాయ సాగు భూమిని లెక్కలోకి తీసుకుంటే ఆ స్థాయిలో ఖర్చు అవుతుందని తేల్చి చెప్పింది.

తెలంగాణకు 'సిబిఐపి ఎక్సెలెన్స్' అవార్డు

కేంద్రమంత్రి చేతులమీదుగా అందుకున్న సిఇ శ్యాంసుందర్



మన తెలంగాణ/న్యూఢిల్లీ, హైదరాబాద్: సమీకృత జలనిర్వహణలో విజయవంతమైన పథకంగా 'మిషన్ కాకతీయ'కు కేంద్ర ప్రభుత్వ సంస్థ సెంట్రల్ బోర్డు ఆఫ్ ఇరిగేషన్ అండ్ పవర్ (సిబిఐపి)పురస్కారాన్ని ప్రదానం చేసింది. డిల్లీలో 'స్కోప్' కాంప్లెక్స్‌లో శుక్రవారం రాత్రి జరిగిన 91వ సిబిఐపి దినోత్సవం సందర్భంగా ఈ పురస్కారాన్ని చిన్న నీటి వనరుల (మైనర్ ఇరిగేషన్) చీఫ్ ఇంజనీర్ శ్యాంసుందర్ కేంద్ర మంత్రి ఆర్.కె. సింగ్, కేంద్ర జలసంఘం చైర్మన్ మసూద్ హుస్సేన్ చేతుల మీదుగా అందుకున్నారు. జాతీయ స్థాయిలో నీరు, విద్యుత్, భూమి సమర్థ నిర్వహణతో పాటు, వృధాను అరికట్టడం, పొదుపును ప్రోత్సహించడం, ఫలితాలు క్షేత్రస్థాయికి చేరి, ప్రజల సామాజిక, ఆర్థిక జీవనంలో మార్పులు రావడం వంటి పలు అంశాలపై ఆధారపడి, ఉత్తమ ఫలితాలు తెచ్చిన సంస్థలను, పథకాలను సిబిఐపి అవార్డుతో ప్రతి ఏటా సత్కరిస్తుంది. ఇందులో భాగంగా తెలంగాణ ఇరిగేషన్ శాఖ ప్రతిష్టాత్మకంగా 'మిషన్ కాకతీయ' పేరుతో చేపట్టిన చెరువుల పునరుద్ధరణ, అభివృద్ధి కార్యక్రమానికి సిబిఐపి 'ఎక్సెలెన్స్ ఇన్ ఇంటిగ్రేటెడ్ వాటర్ రిసోర్సెస్ మేనేజ్‌మెంట్' అవార్డు వచ్చింది. ఇదే వేదికపై సమీకృత నీటి వనరులు, భూమి అభివృద్ధికి కేంద్ర జలవనరుల శాఖ చేపట్టిన జాతీయ హైడ్రాలజీ ప్రాజెక్టుకు కూడా అవార్డు లభించింది. పోలవరం ప్రాజెక్టు ఉత్తమ ప్రణాళిక, నిర్మాణానికిగాను ఎపి జలవనరుల శాఖకు, వ్యాప్కోస్‌కు, పారిశ్రామికపరంగా నీటి నిర్వహణకు కృషిచేస్తున్న 'నెటాఫిమ్' సంస్థకు, పురస్కారాలు దక్కాయి. కేంద్ర జలవనరుల శాఖ మాజీ కార్యదర్శి అమర్‌జిత్ సింగ్‌కు జీవనకాల సాఫల్య పురస్కారాన్ని వ్యక్తిగత హోదాలో అందజేశారు. ఎపికి లభించిన పురస్కారాన్ని ఆ రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, ఎపి ఇఎన్‌సి వెంకటేశ్వరరావు తీసుకున్నారు.

'మిషన్ కాకతీయ' ఉత్తమ ఫలితాలకే ఈ అవార్డు : సిబిఐపి ఉపాధ్యక్షుడు

సాగునీటి రంగంలో విశేష కృషిచేసి దేశంలోనే తెలంగాణ మైనర్ ఇరిగేషన్ అగ్రగామిగా నిలిచిందని, చీఫ్ ఇంజనీర్ శ్యాంసుందర్‌ను 'సిబిఐపి ఎక్సెలెన్స్' అవార్డుకుఎంపిక చేసినట్లు సిబిఐపి ఉపాధ్యక్షుడు మసూద్ హుస్సేన్ ప్రకటించారు. నీటిపారుదల నిల్వలు, సరస్సుల పునరుద్ధరణ విభాగంలో ఉత్తమ ఫలితాలు సాధించిందని, అందువల్లనే ప్రతిష్టాత్మకమైన సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇరిగేషన్ అవార్డు ప్రదానం చేసినట్లు వ్యాఖ్యానించారు.

సిఎం కెసిఆర్ దూరదృష్టికి లభించిన గుర్తింపు ఇది

అవార్డును అందుకున్న అనంతరం రాష్ట్ర మైనర్ ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ శ్యాంసుందర్ మీడియాతో మాట్లాడుతూ, మార్చి 12, 2015న కామారెడ్డి జిల్లా సదాశివనగర్‌లో 'మిషన్ కాకతీయ' పథకానికి ముఖ్యమంత్రి కెసిఆర్ శంకుస్థాపన చేశారని, ఇంతటి అద్భుత ఫలితాలు సాధించి రైతులకు ప్రయోజనాలు చేకూర్చడమే కాకుండా జాతీయ స్థాయిలో గుర్తింపు లభించి ఇప్పుడు 'ఎక్సెలెన్స్' అవార్డు అందుకోవడం ఆయన దూరదృష్టికి నిదర్శమని, ఆ గుర్తింపు కెసిఆర్‌కే దక్కుతుందన్నారు. గ్రామీణ జీవనాన్ని బలోపేతం చేసే దిశలో సిఎం కెసిఆర్ ఈ ప్రాజెక్ట్‌కు రూపకల్పన చేశారని, మిషన్ కాకతీయ సాధిస్తోన్న విజయాలను తెలుసుకునేందుకు రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఉత్తరాఖండ్, తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వాలు అసక్తి చూపించాయని గుర్తుచేశారు. ఈ పథకం కింద సుమారు రూ. 8,700 కోట్లతో 27,167 చెరువుల పునఃరుద్ధరణ పనులు జరిగాయని, భూగర్భ జలాల నిల్వలు పెరిగాయని తెలిపారు. చెరువుల్లో నీరు ఇంకిపోయే సామర్థ్యం 4 నుంచి 7 రోజులు పెరిగిందని, చెరువు పూడిక తీసిన మట్టి తరలింపులో దాదాపు రూ. 900 కోట్లు ప్రభుత్వం ఆదా చేయగలిగిందని శ్యాంసుందర్ తెలిపారు.

కమనీయంగా భద్రాద్రి రామయ్య నిత్య కల్యాణం



మన తెలంగాణ/భద్రాచలం : భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలంయలో శుక్రవారం భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారి నిత్య కల్యాణం భక్తజన సందోహం మధ్య అంగరంగ బైభవంగా నిర్వహించారు. ముందుగా ఆలయం తలుపులు తెరచి మేళతాళాలతో, వేదమంత్రోచ్ఛారణల నడుమ అర్చకులు తీర్ధ బిందెను ఆలయానికి తీసుకుని వచ్చి, గర్భగుడిలో సుప్రభాత సేవ చేసారు. శుక్రవారం సందర్భంగా లక్ష్మీ తాయారు అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. బాలభోగం స్వామివారికి నైవేద్యం సమర్పించారు. అనంతరం ఉత్సవమూర్తులను ఊరేగింపుగా బేలా మండపానికి తీసుకు వెళ్ళి స్వామికి విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, ఆరాధన జరిపి కల్యాణ క్రతువు ప్రారంభించారు. భక్తులకు గోత్రనామాలతో కంకణాలు కట్టి స్వామివారి కల్యాణం జరిపించారు. మద్యాహ్నం రాజభోగం నిర్వహించి ఆలయం తలుపులు మూసివేసారు. సాయత్రం దర్బారు సేవ నిర్వహించారు.

రేషన్ సరుకులు ఇస్తున్నారా.. పరేషాన్ చేస్తున్నారా..?

- బద్దెనపల్లి,రామన్నపల్లి రేషన్ దుకాణాల తనిఖీ



మన తెలంగాణ/తంగళ్లపల్లి : ప్రతి నెల రేషన్ సరుకులు ఇస్తున్నారా..లేక డీలర్లు ఏమాన్నా పరేషాన్ చేస్తున్నారా అంటూ రాష్ట్ర పౌరసరఫరాలశాఖ కమీషనర్ అకున్ సబర్వాల్ లబ్దిదారులతో ముచ్చటించారు.మండలంలోని బద్దెనపల్లి,రామన్నపల్లె గ్రామాల్లోని డీలర్లు సిలివేరి ప్రసన్న,జక్కుల పుష్పలతల రేషన్ దుకాణాలను ఆయన జెసి యాస్మిన్ భాషాతో కలిసి సందర్శించారు.పేదల కోసం ప్రభుత్వం అందిస్తున్న చౌకధరల వస్తువులు సమంగా పంపిణీ జరుగుతుందా అని లబ్దిదారులను అడిగి తెలుసుకున్నారు.ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టిన ఐరిస్ పద్దతిని పరిశీలించారు.గతంలో అనుసరించిన బయోమెట్రిక్ పద్దతి ఎలా ఉందని నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు.గ్రామంలోని లబ్దిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రభుత్వం సూచించిన తేదిలలో తప్పకుండా అందుబాటులో ఉంటూ సరుకులను పంపిణీ చేయాలని సూచించారు. ప్రతి నెల రిజిష్టర్‌లో అమ్మకాలను నమోదు చేస్తుండాలని ఎవరైనా సరుకులు తీసుకోవడంలో ఆలస్యం ఐతే వారికి నిర్ణీత సమయంలో తీసుకునేలా అవగాహన కల్పించాలన్నారు.గ్రామంలోని లబ్దిదారులు డీలర్లు సకాలంలో సరుకులు అందిస్తున్నారని తెలుపడంతో వారిని అభినందించారు. ఆయన వెంట పౌరసరఫర శాఖ అధికారులు,తహశీల్దార్ ఎల్.రాంరెడ్డి,మండల డీలర్ల సంఘ అద్యక్షులు శ్రీనివాస్,తదితరులు ఉన్నారు.

భారీగా పేలుడు పదార్థాలు స్వాధీనం



మన తెలంగాణ/కరీంనగర్‌క్రైం: కరీంనగర్ కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది భారీ మొత్తంలో పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకుని ఒక వ్యక్తిని అదుపులోనికి తీసుకోవడం జరిగింది. గత కొన్ని నెలలుగా జరుగుతున్న ఈ వ్యాపారం జరుగుతుండగా టాస్క్‌ఫోర్స్ సిబ్బందికి అందిన సమాచారం మేరకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి పేలుడు పదార్థాల వ్యాపారానికి చెక్ పెట్టారు. కరీంనగర్ కమిషనరేట్ ఎసిపి శోభన్‌కుమార్ సంఘటన సంబంధించిన వివరాలను తెలియజేశారు. ఆయన కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. హుజురాబాద్‌లోని కాట్రపల్లికి చెందిన సురభి రాజ్‌గోపాల్‌రావు, తాడూరి రమేష్, హన్మకొండకు చెందిన చాద మహిపాల్‌రెడ్డిలు కలిసి చాలాకాలంగా హుజురాబాద్‌ను కేంద్రంగా చేసి పేలుడు పదార్థాల వ్యాపారం చేస్తున్నారు. హుజురాబాద్ నుండి కరీంనగర్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తమ వ్యాపార లావాదేవీలను నిర్వహిస్తూ విక్రయాలు సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో వీరిని గురించి సమాచారం అందుకున్న కరీంనగర్ కమిషనరేట్ పోలీసులు సురభి రాజ్‌గోపాల్‌రావును అదుపులోనికి తీసుకుని విచారించారు. అతను తాము పేలుడు పదార్థాలు వ్యాపారం చేస్తున్నట్లు ఒప్పుకోవడంతో పాటు తన భాగస్వాముల వివరాలను కూడా పోలీసులకు అందజేశాడు. దీంతో రాజ్‌గోపాల్‌రావు వద్ద నుండి 40 కిలోల గన్‌పౌడర్, 4500 మీటర్ల వైర్ బెండళ్ళు, 800 జిలిటెన్ స్టిక్స్ స్వాధీనం చేసుకోవడం జరిగింది. స్వాధీనం చేసుకున్న వాటిని సైదాపూర్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే పోలీసులు స్వాధీనం చేసుకున్న పేలుడు పదార్థాల విలువ దాదాపు రూ.లక్ష వరకు ఉంటుందని తెలియజేశారు. ఏలాంటి లైసెన్స్ అనుమతులు లేకుండా పేలుడు పదార్థాల వ్యాపారం చేయడమే కాకుండా క్వారీని కూడా నిర్వహిస్తూ నిబంధనలకు విరుద్దంగా టి.ఎస్ 03 ఇ.యు 2288 అనే నంబర్ గల కారులో పేలుడు పదార్థాలను తరలిస్తుండగా పట్టుకోవడం జరిగిందని ఎసిపి శోభన్‌కుమార్ తెలిపారు. ఈ వ్యాపారంలో భాగస్వాములైన చాద మహిపాల్‌రెడ్డి, తాడూరి రమేష్‌లు పరారీలో ఉన్నట్లు ఆయన వివరించారు. ఇదిలా ఉండగా కరీంనగర్ కమిషనరేట్‌లో టాస్క్‌ఫోర్స్ దాడులను మరింత ఉధృతం చేస్తామని ఎసిపి శోభన్‌కుమార్ తెలిపారు. ఈ దాడులో ఎసిపి శోభన్‌కుమార్ తోపాటు సిఐలు సుందరగిరి శ్రీనివాస్‌రావు, జనార్ధన్‌రెడ్డి, ఎఎస్.ఐ నర్సయ్య టాస్క్‌ఫోర్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అప్పల బాధతో రైతు ఆత్మహత్య

మనతెలంగాణ/మల్హార్ : మండలంలోని అన్‌సాన్‌పల్లి గ్రామానికి చెందిన నల్లమల్లారెడ్డి(36) అనే రైతు శుక్రవారం అప్పుల భాదతో ఒంటిపై కిరోసిన్ పోసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.పత్తి పంట కోసం మల్లారెడ్డి ప్రైవేటు అప్పు చేయగా వర్షాలు లేక దిగుబడి రాక పోవడంతో అప్పులు తీర్చడం ఎలా అని మనస్తాపానికి గురై ఒంటి పై కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.ఈసంఘటనపై కొయ్యూరు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.మృతునికి బార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.మృతుని కుటుంబానికి రైతు భీమా అందేలా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పర్యాటక ప్రాంతంగా సింగపట్నం

- మారుతున్న రూపురేఖలు
- అభివృద్ధి కోసం రూ.6.50 కోట్లు నిదులు
- కాటేజీలు, రెస్టారెంట్ల నిర్మాణం
- 15 నుంచి లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



మన తెలంగాణ / కొల్లాపూర్: రాష్ట్ర ప్రభుత్వం చొరవతో పర్యటక ప్రాంతాల అభివృద్ధికి పెద్దపీట వేశారు. ఆలయాలతో పాటు ఆహ్లాదకర వాతావరణాన్ని ఏర్పాటు చేసి వచ్చే సందర్శకులకు అవసరమైన ఏర్పాట్లను సైతం చేస్తుంది. కొల్లాపూర్ ప్రాంతంలోని సింగవట్నం లక్ష్మి నరసింహస్వామి స్వయంభువుడిగా వెలసిన ఈ క్షేత్రంలో పర్యటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం రూ.6.50కోట్లు మంజూరు చేసింది. ఇక్కడికి వచ్చే భక్తుల సౌకర్యార్థం కాటేజీలు, రెస్టారెంట్లు, శ్రీవారి సముద్రంలో బోటింగ్ వంటి వాటిని అభివృద్ధి చేస్తుంది. ఈ నెల 15 నుంచి శ్రీ లక్ష్మి నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఇందుకు అధికారులు భక్తుల సౌకర్యార్థం సకల ఏర్పాట్లు చేస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం పర్యటక రంగాన్ని అభివృద్ధి చేసే క్రమంలో మాజి మంత్రి జూల్లి కృష్ణారావు ప్రత్యేక చొరవ కొల్లాపూర్ మండలంలోని సింగవట్నం శ్రీ లక్ష్మి నరసింహ స్వామి ఆలయ పిరిసరాలను పర్యటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు రూ.6.50 కోట్లు మంజూరు చేశారు. దీంతో అభివృద్ధి పనులు చెపట్టారు. ఈ పనులు చివరి దశలో ఉన్నాయి. భక్తుల సౌకర్యార్థం కాటేజిలు, బోటింగ్, చెరువు కట్టను సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. దీంతో చెరువు కట్ట ప్రాంతం, బోటింగ్, ఆలయ పరిసరాలు, లక్ష్మి దేవమ్మ గుట్ట వద్ద ఏర్పాటు చేస్తున్న కాటేజీలు, ఆలయ పరిసరాలు, నీటి గుండం ప్రాంతాలకు పర్యాటక శోభ సంతరించుకుంది.

జనవరి 15 నుంచి బ్రహ్మోత్సవాలు

ప్రతి ఏడాగి జనవరి 15 నుంచి (మకరసంక్రాంతి మరుసటి రోజు నుంచి) 20 వరకు సింగవట్నం లక్ష్మి నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. జనవరి 16న 8 గంటలకు లక్ష్మి నరసింహ స్వామి కళ్యాణం, 17న ప్రభోత్సవం, 18న సాయంత్రం స్వామి వారి రథోత్సవం(తేరు) , 19న తెప్పోత్సవాలు జరుగుతాయని ఆలయ కమిటి తెలిపింది. బ్రహ్మోత్సవాలను పుస్కరించుకొని ఆలయాన్ని, పరిసర ప్రాంతాలను సర్వాంగ సుద్ధరంగా తీర్చిదిద్దుతున్నారు. ఆలయ పరిసరాల్లో పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు.



ఇది ఆలయ చరిత్ర



పూర్వం 16వ దశకంలో సింగవట్నం గ్రామానికి చెందిన రైతు తన వ్యవసాయ పొలంలో నాగలితో దుక్కి దున్నుతుండగా రాయి అడ్డుపడింది. రాయిని తొలంగించి గట్టుపై పెట్టిన రైతు మరుసి రోజు తిరిగి పొలాన్ని దున్నుతున్న సమయంలో రాయి అడ్డుతగలడంతో రాయిని తొలగించి గుట్టుపై పెట్టాడు. ఇలా కొన్ని రోజుల పాటు జరిగింది. జటప్రోలు సంస్థానాదీశులైన భూపాలుడి కలలోకి లక్ష్మ నరసింహస్వామి వచ్చి సింగవట్నం ప్రాంతంలో కొలువై ఉన్నానిన చెప్పాడు. దీంతో తన సేవకుల ద్వారా స్వామి వారు ఉన్న ప్రాంతాన్ని గుర్తించి అక్కడ ఆలయాన్ని నిర్మించారు. ఆలయంలో స్వామి నిత్య పూజల కొరకు వందలాది ఎకరాలు స్వామి వారికి కేటాయించారు. ఆలయంలో శ్రీ లక్ష్మి నరసింహస్వామి స్వయంభుగావెలిశారు. స్వామి వారికి ఎదురుగా ఉన్న రత్నగిరి కొండపై రత్నలక్ష్మి అమ్మవారు కొలువయ్యారు. స్వామి వారి ఆలయంలో శివకేశవులు ఇరువురు ఉండడం ఇక్కడి ప్రత్యేకత. ఇక్కడి లక్ష్మి నరసింహస్వామి వారు లింగ రూపంలో భక్తులకు దర్శనమిస్తారు.

లక్ష్మి నరసింహస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని తెలంగాణ, ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటక ప్రాంతాలనుంచి భక్తులు వచ్చి తమ మొక్కులు తీర్చుకుంటారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఆర్టీసి అధికారులు ప్రత్యేక బస్సులను సైతం నడుపుంటారు.

పర్యాటక అభివృద్ధి ఇలా..

ప్రభుత్వం పర్యటక క్షేత్రాల అభివృద్ధిలో బాగంగా శ్రీలక్ష్మి నరసింహ స్వామి ఆలయ పరిసరాలను అభివృద్ధి కోసం రూ. 1.50 కోట్లతో పనులు చేపట్టింది. ఇందులో బాగంగా చెరువుకట్టను సర్వాంగ సుందరంగా తీర్చిద్దారు. కట్టపై పర్యాటకుల సౌకర్యార్థం పాదచారుల కోసం సిమెంటు టైల్స్‌తో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కట్ట వెంట పూల మొక్కల పెంపకం, లైటింగ్ ఏర్పాట్లు చెశారు. పర్యాటకులు కూర్చునేందుకు సిమెంటు కుర్చీలుఏర్పాటు చెశారు. చెరువులో ప్రమాదాలు జరుగకుండా చెరువు వైపు రేలింగ్ పనులు చెపట్టారు. పర్యాటకుల కోసం కాటేజిల నిర్మాణం చెపట్టారు. అలాగే రెస్టారెంట్ నిర్మాణం చెపట్టారు. కాటేజి పరిసరాల్లో పచ్చదనానికి ప్రాముఖ్యత ఇచ్చారు. సాంస్కృతిక కార్యాక్రమాల నిర్వహన కోసం ఆడిటోరియం నిర్మాణం చెపట్టారు. దీంతో అక్కడికి వెళ్లగానే ఆ ప్రాంత వాతావరణం ఆహ్లాదంగా అనిపిస్తుంది. తెలంగాణ టూరిజం శాఖ ఆద్వర్యంలో చెరువులో బోటింగ్ చేసేందుకు సుమారు రూ. కోటి వ్యయంతోతో బోటింగ్ తయారు చెశారు. లక్ష్మి నరసింహస్వామి బ్రహోత్సవాల సమయం నాటికి పనులు మొత్తం పూర్తి అయ్యి పర్యటకులకు అందుబాటులోకి రానున్నాయి. బ్రహోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పర్యటక శాఖ, ఆలయ అధికారులు కృషి చేస్తున్నారు.

కనులవిందు చేసే శ్రీవారి సముద్రం

సింగవట్నం లక్ష్మి నరసింహస్వామి ఆలయానికి ఉత్తరాన శ్రీవారి సముద్రం ఉంటుంది. సురభిరాజుల కాలంలో శ్రీలక్ష్మి నరసింహస్వామి ఆలయం నుంచి రత్నగిరి కొండ వరకు సుమారు కిలో మీటరు పొడవున 1200 ఎకరాల్లో నీటి నిల్వ ఉండేలా రాతితో గొలుసు కట్టు నిర్మాణం చేపట్టారు. ఎంజికేఎల్‌ఐ నీటి ద్వారా నిండుకుండలా మారిన శ్రీవారి సముద్రం కన్నుల విందు చేస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక అభివృద్ధిలో బాగంగా చెరువులో బోటింగ్‌కు ఏర్పాటు చేసింది.



దిగి వచ్చిన అధికారులు

- లంబాడీ, ఆదివాసి గిరిజనుల భూ పరిష్కారం
- భూమి లేని ఆదివాసీ గిరిజనులకు కొనుగోలు చేసి ఇస్తాం
- ఆదిలాబాద్ ఆర్డీవో హామీ.. ఇరువర్గాల మద్య సయోధ్య



మన తెలంగాణ/సిరికొండ : సిరికొండ మండలంలోని ముత్యంపేట గ్రామ ఆదివాసి గిరిజనుల భూ సమస్యలకు ఎట్టకేలకు పరిష్కారమర్గాం లభించింది. గత 6 నెలల నుంచి ఆదివాసి, లంబాడా గిరిజనుల మద్య భూ సమస్య తలెత్తింది. దీంతో తరుచుగా ఇరువర్గాల మద్య ఘర్షణ వాతావరణం నెలకొంటుంది. ఒకప్పుడు ఆదివాసీ గిరిజనులు అటవీ భూములను కొట్టుకొని సాగు చేసుకుంటూ వాటికి పట్టాలు సాధించుకున్నారు. అయితే అనివార్య కారాణాల వల్ల కొందరు ఆ భూములను వదిలి ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు వలసవెల్లారు. మరి కొందరు ఇతరులకు విక్రయించుకున్నారు. తమ భూములు తమకు కావాలని, లంబాడాలు తమ భూములకు అక్రమంగా పట్టా చేయించుకున్నారని అంటూ ఆదివాసి గిరిజనులు ఆ భూమలను అక్రమించుకునేయత్నం, చేశారు. ఆ భూములు మావే అంటూ, పట్టాలు సైతం పట్టుకొని పోలీస్ స్టేషన్, తహసిల్ధార్, కార్యాలయాల్లో ఫిర్యాదులు చేశారు. ఈ మేరకు అధికారులు ఆ భూముల పై 145 సెక్షన్ వీదించి తమ ఆదీనంలోకి తీసుకున్నారు. సమస్యను పరిష్కరించే వరకు ఆ భూముల జోలికి ఎవరు వెర్లు వద్దంటూ తహసిల్ధార్, పోలీసులు వారికి హెచ్చరికలు జారి చేశారు. ఆ భూములు వివాద స్పదంగా బీడు భూములుగా మిగిలి పోయాయి. అయినప్పటికి కొందరు లంబాడీలు వాటిని సాగు చేసుకునేందుకు యత్నించగా ఆదివాసీ గిరిజనులు అడ్డుకొని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనికి శాశ్వత మార్గం కోసం అధికారులు రంగంలోకి దిగారు. జిల్లా కలెక్టర్ దివ్యదేవారజన్ ఆదేశాల మేరకు గురువారం ఆదిలాబాద్ ఆర్డీవో సూర్యనారాయణ, ఉట్నూర్ డీఎస్పీ వెంకటేశ్‌ల ఆద్వర్యంలో మొదట ముత్యం పేట గ్రామ సమస్యను పరిష్కరించేందుకు ఆదివాసి గిరిజనులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. భూమిలేని ఆదివాసి గిరిజనుల పేర్లను సేకరించారు. వారందరికి ముత్యంపేట గ్రామ సమీపంలో ఉన్న ఒక దళితునికి చెందిన 20 ఎకరాల వ్యవసాయ భూమిని కొనుగోలు చేసి భూమిలేని వారందరికి పంచి ఇస్తామని, త్వరలో పట్టాల సైతం అందజేసి ఆభూమి అభివృద్ధికి సహకరిస్తామని హామీ ఇచ్చారు. వివాదంలో ఉన్న భూముల జోలికి ఎవరు వెల్లవద్దని, పట్టాలు పొంది ఉన్న వారికి సాగుచేసుకొనివ్వాలని ఆర్డీవో సూర్యనారాయణ, డిఎస్‌పి వెంకటేశ్‌లు వారికి నచ్చచెప్పి ఇరువర్గాల మధ్య సయోధ్య కుదుర్చారు.

దీంతో పాటుగా ముత్యం పేట ఆదివాసీ గిరిజనులతో ఇక నుంచి కలిసి మెలసీ ఉంటామని, లంబాడలు సాగుచేస్తున్న భూముల జోలికి వెల్లమని హామి పత్రాన్ని రాయించుకున్నారు. దీంతో భూ సమస్య పరిష్కారమైంది. గ్రామ పటేల్ భీంరావ్ కారోబాయి, మారుతి, కోలాం ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు కొడప సోనేరావు, సిరికొండ తహసిల్దార్ రాజేశ్వర్, ఉప తహసిల్దార్ మదుసూదన్, ఆర్ఐ యోగేంధర్ రెడ్డి, విఆర్ఒ భాస్కర్, ఏఎస్సై రమేష్, ఉన్నారు.



కంచెలో చిక్కుకున్న పులి.. తప్పించుకుంది

మనతెలంగాణ/ మాక్లూర్: నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలంలోని మామిడిపల్లి గ్రామ శివారులోని శుక్రవారం ఉదయం చిరుత పులి కనిపించింది. స్థానికుల కథనం ప్రకారం పొద్దుటూరి సదానంద్‌ట్రస్ట్‌లోని మామిడితోటలో పడిచేయడానికి వెళ్లిన కూలీలకు ఇనుపకంచెలో చిక్కుకున్న పులి కనిపించింది. పులిని చూసిన కూలీలు భయంతో పరుగులు తీశారు. సమాచారం అందుకున్న ఫారెస్టు అధికారులు అక్కడికి చేరుకొని ఇనుప కంచెలో చిక్కుకున్న పులిని రక్షించేందుకు చాలాసేపు యత్నించారు. అయితే వారి ప్రయత్నాలు ఫలించలేదు. కాసేపటి తర్వాత ఇనుప కంచె నుంచి తప్పించుకున్న పులి సమీపంలోని అటవీ ప్రాంతంలోకి వెళ్లిపోయింది. కాగా పులికి ఎలాంటి గాయాలు కాలేదని ఫారెస్ట్ అధికారులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎఫ్‌ఆర్‌ఒలు అమృత, నరసింహ, ఎఫ్‌డిఒలు రాములు, ప్రసాద్, ఎస్‌ఐ సాయినాథ్‌లు ఉన్నారు.

నంబాల శివాలయంలో చోరీ

- హుండీని పగల గొట్టేందుకు విఫలయత్నం
- ఉత్సవ విగ్రహాల అపహరణ



మనతెలంగాణ/ రెబ్బెన: మండలంలోని నంబాల శివారులో గల ప్రసన్న పరమేశ్వర ఆలయంలో గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఆలయ తాళాలను పగలగొట్టి గర్భగుడిలోని ఉత్సహ విగ్రహాలు (పంచలోహ విగ్రహాలు) ఆపహరించారు. స్థానికుల కథనం ప్రకారం రోజు మాదరి గానే ఆలయ పూజారి వెంకన్న వాచ్‌మెన్ బక్కయ్యలు గురువారం రాత్రి ఆలయ సమీపంలోని వసతీ గృహంలో పడుకున్నారు. రోజు వారి పూజా కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం ఉదయం పూజారి వెంకన్న పూజా కార్యక్రమాలు చేపట్టేందుకు ఆలయానికి చేరుకోగా ఆలయ తాళాలు పగలగొట్టి ఉండటాన్ని గమనించాడు. ఆలయ ప్రాంగణంలో హుండి పడేసి ఉండటంతో పాటు గర్భగుడిలో ఉండాల్సిన స్వామి వారి పంచలోహ ఉత్సవ విగ్రహం కనిపించకపోవడంతో వెంటనే గ్రామస్తులతో పాటు పోలీసులకు సమాచారం అందించారు. దాంతో హుటహుటిన సంఘనట స్థలానికి చేరుకున్న ఆసిఫాబాద్ డిఎస్పీ సత్యనారాయణ, రెబ్బెన సీఐ రమణమూర్తి, ఎస్‌ఐ దీకొండ రమేష్ హుండితో పాటు గర్భాలయాన్ని పరిశీలించారు. గర్భగుడి ముందు ఉన్న హుండిని ఆలయ ప్రాంగణంలోకి తీసుకువచ్చి గునపాలు , సుత్తిలతో పగలగొట్టేందుకు విఫలయత్నం చేసిన దుండగులు హుండి ఎంతకు తెరుచుకోకపోవడంతో గునపాలు, సుత్తిలను అక్కడే పడేసి పంచలోహ విగ్రహాలతో ఉడాయించి ఉంటారని అభిప్రాయపడ్డారు. వెంటనే దొంగల వేలిముద్రలను సేకరించేందుకు ఆసిఫాబాద్ నుంచి క్లూస్ టీంను పిలిపించి వేలిముద్రలను సేకరించారు. అనంతరం బెల్లంపల్లి నుంచి డాగ్ స్కాడ్‌ను పిలిపించి దొంగల ఆచూకీ కోసం ప్రయత్నించగా, డాగ్ స్కాడ్ ఆలయ పరిసరాల్లో తిరిగి నేరుగా గ్రామంలోకి ప్రవేశించి ఇరువురి ఇడ్లలోకి ప్రవేశించింది. దీంతో పోలీసులు ఈ కోణంలో దర్యాప్తుత వేగవంతం చేశారు. అయితే ఉత్సవ విగ్రహాల ప్కనే వెండి అభరాణలు ఉన్నప్పటికీ వాటని ముట్టుకోకపోవడంతో పట్ల పలు అనుమానలు వ్యక్తమవుతున్నాయి. పంచలోహా విగ్రహాలకు ఉండే మహాత్యాన్ని తెలిసిన వారే ఈ చోరీకి పాల్పడి ఉంటారని, భక్తులకు అభిప్రాయపడ్డారు. కాగా విషయాన్ని తెలుసుకున్న రెబ్బెన తహసీల్దార్ ఇంతియాజ్ అహ్మద్ , ఎంపీటిసి శ్రీనివాస్, సింగిల్ విండో డైరెక్టర్ సత్యనారాయణ, రవీందర్, టిఆర్ఎస్ నాయకులు సోమేశ్వర్‌లు, సంఘటన స్థలాన్ని పరిశీలిచారు.



నిందితులను త్వరలోనే పట్టుకుంటాం: డిఎస్పీ సత్యనారాయణ

నంబాల శివాలయంలో చోరీకి పాల్పడిన నిందితులను సాధ్యమైనంత తొందరలోనే పట్టుకుంటామని ఆసిఫాబాద్ డిఎస్పీ సత్యనారాయణ తెలిపారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఆయ విలేకరులతో మాట్లాడుతూ శివాలయంలో పంచలోహా విగ్రహాలను దొంగలు ఆపహరించటం విచారకరమన్నారు. చోరీకి పాల్పడింది స్థానికులా లేక బయటి వ్యక్తులా అనే విషయాన్ని పరిశీలిస్తున్నామన్నారు. సంఘటన స్థలంలో చోరీకి ఉపయోగించి వదిలేసిన పనిముట్లు స్థానికంగా లభించేవి కాకపోవటంతో ఆ దిశగా సైతం విచారణ జరుపుతున్నారు. భవిష్యత్తులోచోరీలు, నేరాలు పునరావృతం కాకుండా తక్షణమే ఆలయంలో నాలుగు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. గంగాపూర్ లోని బాలాజీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో సైతం వారం లోగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తామన్నారు. అంతేకాకుండా మండలంలోని పలు గ్రామాల్లోను నేరాలను నియంత్రిచేందుకు ప్రధాన రహదారులతో పాటు ముఖ్య కూడళ్లలో , నాయకులు,ప్రజల సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు.

నిప్పంటుకొని రూ.5 లక్షలు నష్టం



మన తెలంగాణ / ఊట్కూర్ : మండల కేంద్రంలో శుక్రవారం వెంకటేశ్వర నగర్ కాలనీలో మధ్యాహ్నం పెంకుటిల్లుకు నిప్పంటుకొని రూ.5 లక్షల ఆస్తి నష్టం వాటిల్లగా మానసిక వికలాంగురాలు సురక్షితంగా బయటపడిన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా ఊట్కూర్ మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామస్థులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం ఊట్కూర్ మండల కేంద్రంలోని వెంకటేశ్వరనగర్ వీధికి చెందిన కుర్వ కిష్టప్ప, భార్య సావిత్రమ్మ శుక్రవారం ఉదయం గొర్రెల కాపరులతో వెళ్లగా తమ కూమార్తెను మానసిక వికలాంగురాలు ఇంట్లో ఉంచి ఇంటికి తాళం వేసి వెళ్లగా ప్రమాదవశాత్తు ఇంటికి నిప్పంటుకోవడంతో పొగలు, మంటలు విపరీతంగా వ్యాపించడంతో ఇంటి పక్కన ఉన్నవారు పొగలను చూసి తలుపులను బద్దలు కొట్టడంతో ఇంటిలోపల ఉన్న బాలికను సురక్షితంగా బయటికి తీయడం జరిగింది. విషయం తెలుసుకున్న గ్రామస్థులు, చుట్టుపక్కల వారు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించగా వారు ఆలస్యంగా రావడంతో యువకులు మంటలు ఆర్పి బాధితురాలిని ప్రాణాలతో కాపాడి దీంతో బాధితుడు కుర్వకిష్టప్ప, భార్య సావిత్రమ్మ వచ్చి చూడగా పత్తి విక్రయించిన డబ్బు సుమారు రూ.1,20,000, మూడు తులాల బంగారం, ధాన్యం, దుస్తులు అగ్నికి ఆహుతైనట్లు వారు బోరున విలపించారు. రెండు తులాల బంగారం కొంత మేరకు కాలిపోయినా అగ్నిమాపక సిబ్బంది ఆలస్యంగా రావడంతో గ్రామస్థులు అగ్నిమాపక సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

నా భర్తను వెంటనే కోర్టులో హాజరుపర్చండి



మన తెలంగాణ/ఖమ్మం కల్చరల్ : వైరాలో శ్రేష్ట చిట్ ఫండ్ పెట్టి సభ్యులు చెల్లించాల్సిన సొమ్మును కట్టకపోవటంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఐపి దాఖలు చేసిన తన భర్త నాగబత్తిన క్రాంతిని వెంటనే కోర్టులో హాజరుపరచాలని ఆయన భార్య నాగబత్తిని తనూజ, కుమారుడు జశ్వంత్, కూతురు శ్రేష్టలు డిమాండ్ చేసారు. శుక్రవారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తన భర్త నాగబత్తిని క్రాంతి చిట్‌ఫండ్ వ్యాపారం చేసారని , ఈ వ్యాపారంలో సభ్యులు తాము చెల్లించాల్సినవి చెల్లించకపోవటంతో ఐపి పెట్టాల్సి వచ్చిందని చెప్పారు. తన భర్తకు ప్రాణహాని ఉందని, ఆయనకు రక్షణ కల్పించాలని తాను ఈనెల 2న పోలీస్ కమీషనర్‌ను కుటుంబ యుక్తంగా కలిసి విన్నవించామని చెప్పారు. ఆ రోజు తన భర్తను వైరా పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి రెండు కోట్ల రూపాయలను సభ్యులకు కట్టాలని ఒత్తిడి చేస్తారని ఆమె ఆరోపించారు. ఈ విషయంలో పోలీసు శాఖ వారు చాలా ఇబ్బందులకు గురిచేస్తున్నారని చెప్పారు. తన భర్త క్రాంతిని అదుపులోకి తీసుకుని మూడు రోజులు గడుస్తుందని, ఆయన్ను వెంటనే కోర్టులో హాజరుపరచాలని వారు కోరారు.

చలి తీవ్రతతో వృద్ధుడు మృతి

మన తెలంగాణ/ఇల్లందు టౌన్: గత కొన్ని రోజులుగా వాతావరణంలో మార్పుల కారణంగా చలి తీవ్రత అధికమవ్వడంతో వృద్ధుడు మృతి చెందిన సంఘటన పట్టణంలో శుక్రవారం చోటుచేసుకుంది. కుటుంబసభ్యుల కథనం ప్రకారం పట్టణంలోని ఆర్‌ఆర్ నిర్వాసితుల కాలనీలో నివాసముంటున్న గట్టుపల్లి కొమరయ్య(70) చలి తీవ్రత తాళలేక ఉదయం 7 గంటల ప్రాంతంలో మరణించాడన్నారు. మృతుడు కొమరయ్య మరణంతో ఒంటరైన ఆయన భార్య సుగుణమ్మను ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు మండల తహసిల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

రామాయంపేటలో దొంగల స్వైర విహారం

• తాళం వేసిన ఇళ్లే టార్గెట్



మనతెలంగాణ/రామాయంపేట : రామాయంపేటలో దొంగలు స్వైర విహారం చేస్తున్నారు..తాళం వేసిన ఇళ్లే టార్గెట్ చేస్తూ పట్టపగలే దోపిడిలకు ఎగబడుతున్నారు.. మొన్న పట్టణంలో ఓఇంట్లో చోరి చేయగా , గురువారం నాడు మండలంలోని గొల్పర్తిలో ఓఇంటిల చొరడి సుమారు 2లక్షల సొత్తును ఎత్తుకెల్లారు.దీంతో ప్రజలు ఇంటికి తాళం వేసి బయటకు వెల్లాలంటేనే భయపడుతున్నారు. వివరాల్లోకి వెలితే గత రెండు రోజుల క్రితం రామాయంపేటలో నివాసం ఉంటున్న మిరిదొడ్డి మండలం జంగంపల్లి గ్రామానికి చెందిన బక్కన్న గారి గాల్‌రెడ్డి ఇంటికి తాళం వేసి ఊరికి వెల్లగా దానిని పగుల కొట్టి ఇంట్లో ఉన్న సుమారు 3లక్షల నగదును ఎత్తుకెల్లారు.అట్టి ఘటన మరవక ముందే గురువారం నాడు రామాయంపేట పంచాయితీ పరిధిలోని గొల్పర్తిగ్రామంలో తాళం వేసిన ఇంట్లో దొంగలు పడి సుమారు 2లక్షల సొతును ఎత్తుకెల్లారు. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పేరాని సంతోష తన ఇంటికి తాళం వేసి బ్యాంకు పని నిమిత్తం పట్నానికి వచ్చారు. ఇంటికి తిరిగి వెల్లగా ఇంటి ముందర డోర్‌కు వేసిన తాళం తీసుకుని లోపలికి వెల్లగా ,కాగా వెనుక బాగంలో ఉన్న మరో డోర్ తెరిచి ఉంది.అక్కడి నుంచి దొంగలు ఇంట్లోకి చొరబడి బీరువా తాళం పగుల కొట్టారు. వస్తువులను చిందర వందరగా వేసి అందులో ఉన్న 5తులాల బంగారంతో పాటు 80తులాల వెండి,25 వేల నగదును ఎత్తుకెల్లారు. దీంతో ఆమె ఇట్టి విషయాన్ని పోలీసులకు తెలిపారు.దీంతో పేట పోలీసులు అక్కడికి పరిశీలించారు.బాధితురాలి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని ధర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

ముగ్గురు వీఆర్‌ఓల సస్పెండ్

మనతెలంగాణ/తొర్రూరు : మండలంలోని చింతలపల్లి గ్రామ వీఆర్‌ఓ లక్ష్మణ్, వెలికట్ట వీఆర్‌ఓ ఎ.రాజు, పెద్దవంగర మండల కేంద్రానికి చెందిన వీఆర్‌ఓ జి.నర్సయ్యలను సస్పెండ్ చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావు, జిల్లా కలెక్టర్ ఉన్నతాధికారులతో రైతుబంధు పథకంపై రైతులతో కలిసి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో వీరు ముగ్గురు గ్రామంలోని రైతుల వద్ద లంచాలు తీసుకొని అవినీతి అక్రమాలకు పాల్పడి పాసు పుస్తకాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆయా గ్రామాల రైతులు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయడంతో వీరిని సస్పెండ్ చేస్తున్నట్లు చెప్పారు.

మాయమైపోతున్న జోడెడ్ల ఎవుసం

• పెరిగిన యాంత్రీకరణ

• కనుమరుగవుతున్న ఎడ్లు



మన తెలంగాణ / కమ్మర్‌పల్లి : ఒకప్పుడు రైతన్నా, వ్యవసాయమన్నా ముందుగా గుర్తొచ్చేది ఇంటి ముందు కొట్టంలో ఉండే జోడెడ్లు, ఎద్దుబండి, కర్రు, నాగలి, ఇప్పుడు పరిస్థితి మారింది. పరికరాలన్నీ కనుమరుగైపోతున్నాయి. పశువుల పేడతో తయారైన సహజ సిద్ధమైన సేంద్రియ ఎరువును వ్యవసాయ భూముల్లో వాడేవారు. నాణ్యమైన పంట, అధిక దిగుబడి వచ్చేది. నేడు పశువులను పెంచుకోవాలంటే రైతులు జంకుతున్నారు. మండల పశువైద్యాధికారిణి డాక్టర్ అనూష తెలిపిన వివరాల ప్రకారం కమ్మర్‌పల్లి మండలంలో 6000 గోజాతి, 5000 గేదెజాతులు ఉన్నాయి. వాటికి కావల్సిన దాణా, పశువులను కాసే వాళ్లు దొరకక నిర్వహణ బారమవడంతో రైతులు ఆసక్తి కనబరచడంలేదు.

జీవం కోల్పోతున్న భూములు

పశువుల పేడ దొరక్కపోవడం విచ్చలవిడిగా రసాయనాలు చల్లడం వంటి పరిణామాలతో భూములు జీవం కోల్పోతున్నాయి. భూసారం తగ్గుతోంది. పెట్టుబడులు ఏటికేడు పెరిగిపోతున్నాయి. దానికి తోడు వ్యవసాయ అధికారులు ఎంత అవగాహన కల్పించిన భూసార పరీక్షలు, విత్తనశుద్ధి వంటి జాగ్రత్తలు పాటించకపోవడంతో పంట దిగుబడి తగ్గిపోతుంది.

యంత్రాలే శరణ్యం

ఎడ్ల కోరత, సమయాభావంతో అధిక శాతం మంది రైతులు పోలాలు దున్నటానికి ట్రాక్టర్లు, నాటు వేయడానికి డ్రమ్‌సీడర్లు, కలుపు తీయడానికి వీడర్లు, పవర్ స్ప్రేమర్లు, కోతలను హార్వెస్టర్లు వంటి యంత్రాలు ఉపయోగిస్తున్నారు. ప్రభుత్వం సబ్సీడీ రూపంలో యంత్రాలు అందించడంలో రైతులు అటువైపే మొగ్గ చూపుతున్నారు. రానున్న రోజుల్లో వ్యవసాయ పనుల్లో కూలిలు కనిపించక పోయినా ఆశ్చర్య పోనవసరంలేదని రైతులు పేర్కోంటున్నారు.



భూసార పరీక్షలు చేయించుకోవాలి..

ప్రతీ రైతు భూసార పరీక్షలు చేయించుకోవాలి. వాతావరణ పరిస్థితులు, నీటి వసతిని బట్టి ఏ పంటను వేసేకోవాలో నిర్ణయించుకోవాలి. సేంద్రియ ఎరువులు విత్తనాల తయారీ విధానాలపై స్వంతంగా అవగాహన పెంచుకోవాలి.

– శ్రీహరి, కమ్మర్‌పల్లి మండలవ్యవసాయఅధికారి.



యంత్రాల వైపే మొగ్గు

వ్యవసాయంలో రైతులు ఎక్కువగా యంత్రాల వైపే మొగ్గు చూపుతున్నారు. యాంత్రీకరణ ద్వారా సమయం ఆదా అవడంతో పాటు ఎక్కువ మంది కూలీల అవసరముండదు. కోన్నేళ్లుగా మేం హార్వెస్టర్‌తోనే వరి కోస్తున్నాం.

– పెంట పురుషోత్తం యువరైతు కమ్మర్‌పల్లి



శ్రమైక జీవనం.. చెమటే ఇంధనం



మన తెలంగాణ/నేరడిగొండ: నిత్యం రాళ్లతో కుస్తి పడుతూ చెమటనే ఇందనంగా మార్చి ఎండనకా వాననకా కష్టపడుతూ జీవనం సాగిస్తూ ఎదుగూ బోదుగూ లేని జీవనం సాగిస్తున్నారు. వారు. ఆకుటుంబాలు తెల్లవారు జామునే గన్ను, సుత్తి, తదితర సామాను తమా భుజన వేసుకొని రాళ్ల గుట్టలకు ప్రయనం ఆవుతారు. వారు శ్రమైక్య జీవనానికి నిలువెత్త రూపాలు. మండల కేంద్రానికి చెందిన ఒడ్డెర కుటుంబాలు దశాబ్దాలుగా రాళ్లు కొట్టే వృత్తి నమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. సమీపంలోని గుట్టల రాళ్లు కొట్టి వాటిని విక్రయించగా వచ్చిన డబ్బులతో కుటుంబాలను సాకుతున్నారు.అయితే వీరికి ప్రభుత్వ నుంచి ఎలాంటి రాయితీలు అందడం లేదని వాపొతున్నారు. రాళ్లు కొట్టె సమయంలొ ఏవైన ప్రమాదల భారిన పడితే ఇక ఆకుటుంబం పస్తులె ఉండాల్సిందెనాని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తమను ఆదుకొవాలని వారు కొరుతున్నారు. మండల కేంద్రంలో 50 కుటుంబలు కుల వృత్తుల తోనే జీవనం సాగిస్తున్నారు. కష్టం ఎక్కువ... పలితం తక్కువ పచ్చి రాయిని గన్ను తో పగులగొట్టడం చాలా కష్టంతో కుడుకున్న పని కావడంతొ పని ఎక్కువ ఫలితం తక్కువ అన్న చందగా తమా బతుకులు మారాయని వారు అవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజుకు 50 నుంచి 100 రాయిల వారకు కొడుతాం ఓకొక్క రాయికి రూ. 4 లకు కొడుతాం పని దొరికిన రొజున కొడుతం లెని రొజున కాలిగానే ఉంటమాని తెల్పుతున్నారు.

రాళ్లు పగుల గొట్టె సామయంలొ రాళ్ల పెచ్చులు ఎగిసి పడి కళ్లాకు,చుపులు పొయిన సంఘటనాలు ఉన్నాయని అంటున్నారు. నిత్యం ఏదొ ఒక విదంగా గాయాలై రక్తం చిందించాల్సిందేనాని అంటున్నారు. తమ కులస్థుకు ప్రభుత్వం రాయితీలూ కల్పించి మా కుటుంబాలను ఆదుకొవాలని రాళ్లు కొట్టె కూలీలు కొరుతున్నారు. నిత్యం ప్రమాదల బారిన పడుతు జీవనం సాగిస్తున్నామని ఆవేదన చేందుతున్నారు. ఎంత చేసినా పొట్ట, బట్టకు సరిపొవడం లెదని తెల్పుతున్నారు. ప్రభుత్వం తమాను ఆదుకొవాలని కొరుతున్నారు.

ఇసుక అక్రమ తరలింపు

భూగర్బ జలాలు అడుగంటి పోతున్నాయి రైతుల ఆవేదన

మన తెలంగాణ/పినపాక :

పినపాక మండలంలో ఇసుకాసురులు ఇసుకను యదేచ్ఛగా అక్రమంగా తరలిస్తున్నారు.మండలంలోని వీరాపురం ర్యాంపులో అక్కమార్కులు తమ ఇష్టారాజ్యంగా ఇసుకను దోచేస్తూ రాజదానికి తరలిస్తున్నారు.తెలంగాణ రాష్ట్ర ఖనిజ సంపద సంస్థ ద్వార నిర్దేశిత వేబిల్లు కంటె ఎక్కువ ఇసుకను తోడుకెల్తున్నారని ఆగ్రామ రైతులు పలు ఫిర్యాదులు చేసారు.అమాయక గిరిజనులను పావులుగా వాడుకొని బడా కాంట్రాక్టర్లు రాజదానిలో ఉంటూ తతంగం నడిపిస్తున్నారని పలు ఆరోపణలు ఉన్నాయి. అలాగే మండలంలోని ఏడూళ్లబయ్యారం, రాయిగూడెం,పోట్లపల్లి,గడ్డలపల్లి గ్రామాలలో కూడా స్తానిక ట్రాక్టరల్లో బిటిపియస్‌కు అర్ధరాత్రి వేలలో అక్రమ రవాణ చేస్తున్నారన్నారు.

ఈ వ్యాపారం మూడు పువ్వులు,ఆరుకాయలుగా సాగుతున్న ప ట్టించుకున్న అధికారి లేదు. స్తానిక ప్రజలు పినపాక తాహశీల్దారుకు ఎన్ని సార్లు విన్నవించిన పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు.రాత్రి వేలల్లో ఇసుకాసురుల ట్రక్కుల మోతతో,డెక్కల సౌండులతో దద్దరిల్లుతూ నిద్రాబంగానికి గురిచేస్తున్నారన్నారు.ఇదే పనిగా ఇసుకను తరలిస్తే భూగర్బ జలాలు ఎండిపోయి వ్యవసాయన్ని ఎండబెట్టాల్సి వస్తుందని రైతులు ఆందోలన చెందుతున్నారు.వేసవిలో త్రాగడానికి కూడా నీరు దొరకడంలేదని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు.ఇలాగే అక్రమ ఇసుక రవాణ జరిగితే పినపాక బీడు పారిపోతదని,అదికారులు ఇసుకాసురులు ఇచ్చే మాముల్లకు అలవాటు పడి అడుడ్కోకపోతె తీవ్ర నష్టంజరుగుతుందని,ఉన్నతాదికారులు జోక్యం చేసుకొని భూబకాసురులను అడ్డుకొని ఈ ప్రాంత వాసులకు న్యాయం చేయాలని మండలప్రజలు కోరుతున్నారు.

అక్రమ రేషన్ బియ్యం పట్టివేత.. కేసు నమోదు

24 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం



మన తెలంగాణ /కొత్తకోట : మండల కేంద్రంలో శుక్రవారం అక్రమ రేషన్ బియ్యాన్ని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ తెలిపారు. అధికారుల వివరాల ప్రకారం పట్టణ కేంద్రంలోని మార్కెండేయ ఆలయం సమీపంలోని శ్రీధర్‌శెట్టి ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 24 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఉమ్మడి జిల్లా విజిలెన్స్ అడిషనల్ ఎస్‌పి కె.చిట్టిబాబు ఆదేశాల మేరకు బియ్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. తహశీల్దార్ హేమమాలిని డిసిడిఒ సురేష్,తదితరులు ఉన్నారు.

రేషన్ బియ్యం దందా..

మండల కేంద్రానికి చెందిన బడా అక్రమ రేషన్ బియ్యం వ్యాపారి సహకారంతో ప్రతి రోజు మండల కేంద్రంనుండి మండల పరిధిలోని మిరాసిపల్లి,పెబ్బేరు మండలంలోని పలు రైస్ మిల్లులకు అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలించి సొమ్ము చేసుకుంటున్న క్రిందిస్థాయి అధికారులు మాత్రం చోద్యం చూస్తుం డడం వల్ల పలు విమర్శలు వినిపిస్తున్నాయి. పట్టణ కేంద్రంలో పలుమార్లు ప్రజలే రేషన్ బియ్యాన్ని పట్టు కొని సంబంధిత అధికారులకు, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు సమాచారం ఇస్తే కూడా ఆలస్యంగా వచ్చి నామమాత్రంగా రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారేతప్పా కఠిన నిర్ణయాలు తీసుకోక పోవడంతో వ్యాపారులు ఇష్టానుసారంగా రేషన్ దందా మూడు పువ్వులు ఆరుకాయలుగా కొనసాగుతుంది. గత కొంత కాలంగా మండల పరిధిలోని ఒక రైస్ మిల్లును అడ్డగా చేసుకొని కిందిస్థాయిఉద్యోగులను మచ్చిక చేసుకొని మాములు మత్తులో దించి వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. రాష్ట్ర అధికారులకు గాని ,ఉన్నత స్థాయి అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం ఇస్తేనే తప్పా అక్రమ రేషన్ వ్యాపారులపై చర్యలు తీసుకోరని పలువురు ఆరోపిస్తున్నారు. ఏది ఏమైనా తెలంగాణ ప్రభుత్వం బంగారు తెలంగాణ సాధనకు కిందిస్థాయి అధికారులు ప్రభుత్వ నిబంధనలు పాటించకుంటే సర్కార్ ఆశలు నిరాశలవుతాయని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

అరణ్య రోదనగా వన్యప్రాణుల సంరక్షణ

• తాజాగా జన్నారంలో ఇద్దరు వేటగాళ్ల అరెస్టు • విచ్చల విడిగా సాగుతున్న జంతువుల వేట

• వేటగాళ్ల ఉచ్చుకు బలవుతున్న మూగజీవాలు • పట్టణాలకే పరిమితమై రక్షణ మరిచిన అటవీ అధికారులు • వేటగాళ్ల కదలికలపై లోపిస్తున్న నిఘా





మనతెలంగాణ/మంచిర్యాలప్రతినిధి : అభయారణ్యాల్లో వన్యప్రాణుల సంరక్షణ అరణ్య రోదనగా మారుతోంది. వేటగాళ్లు విచ్చలవిడిగా మూగజీవాలకు ఉచ్చులు బిగించి వేటాడుతున్నారు. వన్యప్రాణుల సంరక్షణకు ప్రత్యేక చట్టాలు ఉన్నప్పటికీ వేటగాళ్లపై సరైన చర్యలు తీసుకోవడం లేదు. పట్టణ ప్రాంతాలకే పరిమితమైన అటవీ అధికారులు వన్యప్రాణుల సంరక్షణపై చర్యలు తీసుకోవడం లేదు. దీంతో వేటగాళ్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ అడవి జంతువులను వేటాడుతున్నారు. తాజాగా శుక్రవారం జన్నారం మండలంలోని చింతగూడ అడవుల్లో ఇద్దరు వేటగాళ్లు కొడవళ్ల సాయంతో జింకను హతమార్చారు. ఈ సంఘటనలో బొమ్మెన గ్రామానికి చెందిన ఇద్దరు వేటగాళ్లు ఆరె ఎల్లయ్య, కొమ్మెర రాజంలను అటవీ అధికారులు అదుపులో తీసుకొని పోలీసులకు అప్పగించారు. చింతగూడ అడవుల్లో జింకను హతమార్చిన సమాచారం మేరకు డాగ్‌స్క్వాడ్‌ల సహాయంతో అటవీ అధికారులు గాలింపు చేయగా జింక మాంసాన్ని స్వాధీనం చేసుకొని ఇద్దరిని అరెస్టు చేశారు. గతంలో కూడా సిర్పూర్ అటవీ ప్రాంతంలో మూగజీవాలను వేటాడి హతమార్చిన ఆరుగురు వేటగాళ్లను పట్టుకొని అరెస్టు చేశారు. జిల్లా వ్యాప్తంగా పులులు, మొసళ్లు, కృష్ణజింకల అభయారణ్యాలు ఉన్నాయి. అటవీ శాఖలో అధికారులకు కేటాయించిన ఏరియాల్లో ఉండకుండా జిల్లా కేంద్రంలో ఉంటూ అప్పుడప్పుడు అటవీ ప్రాంతాన్ని సందరిస్తుండగా వేటగాళ్ల అగడాలకు అంతులేకుండా పోతుంది. జన్నారం అటవీ రేంజ్‌లో అడవి జంతువుల వేట యదేచ్ఛగా కొనసాగుతుండగా కోటపల్లి మండలంలో నిక్రృష్ణజింకల అభయారణ్యంలో కూడా జింకలను వేటగాళ్లు విచ్చలవిడిగా హత మారుస్తున్నారు. హతమార్చిన జంతువుల మాంసాన్ని పట్టణ ప్రాంతాలకు తరలిస్తూ విక్రయాలు జరిపి సొమ్ము చేసుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా 1.05, 806 చదరపు కిలోమీటర్ల పరిధిలో అటవీ ప్రాంతం విస్తరించి ఉండగా మంచిర్యాలలో కృష్ణజింకల, మొసళ్ల అభయారణ్యాలు ఉండగా జన్నారం మండలం కవ్వాల్‌లో పులుల సంరక్షణ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో జంతువుల గణన కార్యక్రమాన్ని నామమాత్రంగా చేసి, వదిలేస్తుండగా వేటగాళ్ల ఉచ్చుకు బలైన మూగ జీవాలు అధికారుల రికార్డులకు ఎక్కడం లేదు. కోటపల్లి మండలంలోని కృష్ణజింక అభయారణ్యంపై పర్యవేక్షణ లోపించడంతో వేటగాళ్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. దాదాపు 30 నుంచి 40 కృష్ణ జింకలు మాత్రమే ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం కృష్ణజింకల ఆనవాళ్లు కూడా కనిపించకుండా పోతున్నాయి. అటవీశాఖలో పని చేస్తున్న బీట్, సెక్షన్, రేంజ్ ఆఫీసర్‌లు డివిజన్ స్థాయి అధికారులు వారికి కేటాయించిన ప్రాంతాల్లో స్థానికంగా నివాసం ఉండకుండా జిల్లా కేంద్రానికి పరిమితమయ్యారు. అధికారులు పట్టణాలకు పరిమితి కావడంతో అటవీ ప్రాంతంతో నిఘా లోపించడంతో జింకలు బలైపోతున్నాయి. ఇటీవల హైదరాబాద్‌కు చెందిన నలుగురు వేటగాళ్లు కృష్ణజింకను హతమార్చి కారులో తీసుకెళ్తుండగా అటవీ అధికారులకు అందిన సమాచారం మేరకు వాహనాన్ని సీజ్ చేశారు. వేటగాళ్లు వాహనం వదిలేసి పారిపోగా ఇప్పటి వరకు వారిపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఉన్నతాధికారులు పర్యటించిన సమయంలో స్థానిక అధికారులు ఎల్ మదుగులో అప్పుడప్పుడు బోటింగ్‌పై పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారే తప్ప వాటిని సంరక్షణకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఏది ఏమైనా అటవీ అధికారులు వన్యప్రాణుల సంరక్షణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



ల్యాండ్ సర్వే డిప్లొమా చేయాలంటే..?



ల్యాండ్ సర్వే డిప్లొమా చేయాలనుకునేవారు బీఎస్‌సీ మేథమేటిక్స్ లేదా బీటెక్ పూర్తిచేసి ఉండాలి. బీటెక్ పూర్తిచేసినవారు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సర్వేయింగ్ అండ్ మ్యాపింగ్ వారు అందించే సర్వేయింగ్ సూపర్‌వైజర్ కోర్సు అందుబాటులో ఉంది. ఇంటర్మీడియట్ పూర్తిచేసినవారికి సర్వేయింగ్ టెక్నీషియన్, కార్టోగ్రఫీ టెక్నీషియన్ కోర్సులు చేయడానికి అవకాశం ఉంది. జీఐఎస్, జీపీఎస్, డిజిటల్ ఫొటో గ్రామెటరీ వినియోగం పెరగడంతో ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో శిక్షణ పొందిన మానవవనరుల అవసరం ఎక్కువగా ఉంది. అడ్మిషన్ల కోసం www.iism.nic.in వెబ్‌సైట్‌ను చూడొచ్చు.

కొత్త కోర్సులతో నైపుణ్యాల వృద్ధి



ఏదైనా పరిస్థితుల వల్ల చదువుకోలేకపోయినా, మధ్యలో చదువు ఆపేసినా,ఉద్యోగంలో ప్రమోషన్ పొందాలన్నా..అలాంటి వారికి ఓ వరం దూరవిద్య. రెగ్యులర్‌గా కళాశాలకు వెళ్లి చదువుకోలేకపోయిన వారికి చక్కని అవకాశం కల్పిస్తోంది. విద్యార్హతలు పెంచుకోవాలనుకున్నవారికి ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) కొన్ని కొత్త కోర్సులకు అందిస్తోంది.

ఉపాధ్యాయులు, వైద్యులు, నర్సులు, మార్కెటింగ్ నిపుణులు, మెడికల్ రిప్రజెంటేటివ్స్, టూర్ ప్లానర్స్, అకౌంటెంట్స్...ఇలా అన్ని వృత్తులు, రంగాలకు ఉపయోగపడే కోర్సులను అందుబాటులోకి తెచ్చింది. విదేశీ భాషలు, ఆంగ్లంలో నైపుణ్యాలు, రచనలో సృజనాత్మకతకు మెరుగులద్దే కోర్సులను కూడా ఇగ్నో అందిస్తోంది. సర్టిఫికెట్, డిప్లొమా, డిగ్రీ, పీజీ డిప్లొమా, పీజీ స్థాయిలో ఎన్నో కోర్సులను అభ్యర్థులు ఎంచుకోవచ్చు. జనవరి, జూలై సెషన్లలో ఇవి ప్రారంభం కానున్నాయి. తాజాగా జనవరి 2019 కోర్సుల ప్రకటన వెలువడిన విషయం తెలిసిందే.

మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్ కౌన్సెలింగ్: పాఠశాలలు, కార్పొరేట్ కంపెనీలు, వైద్యశాలలు, సంక్షేమ సంస్థలు...ఇలా ప్రతిచోట్లా కౌన్సెలర్ల అవసరం ఉంటుంది. ప్రభుత్వ రంగాలు, ఎన్జీవో సంస్థల్లోనూ వీరికి ఎక్కువగా అవకాశాలు లభిస్తున్నాయి. ఉద్యోగుల్లో ఒత్తిడి తగ్గించడం, కుటుంబ సభ్యుల కలహాలు తీర్చడం, విద్యార్థుల్లో భయాలు పోగొట్టడం, రోగుల్లో అవగాహన పెంచడం...ఇలా ప్రతి సందర్భంలోనూ వీరి సేవలు అత్యంత అవసరంగా మారాయి. పునరావాస కేంద్రాలు, ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలు, వృద్ధులు, మాదక ద్రవ్య బానిసలు ఇలా అందరిలోనూ స్ఫూర్తి నింపాల్సిన బాధ్యత కౌన్సెలర్లదే. ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులు ఈ కోర్సులో చేరవచ్చు. బోధన ఆంగ్ల మాధ్యమంలో ఉంటుంది. రెండేళ్ల కోర్సుకు రూ.36,000 ఫీజుగా చెల్లించాలి. ఇందులో ఏడాది వ్యవధితో పీజీ డిప్లొమా కోర్సు సైతం ఉంది. ఫీజు రూ.15,000

పీజీ డిప్లొమా ఇన్ ఫార్మాస్యూటికల్ సేల్స్ మేనేజ్‌మెంట్:
మెడికల్ రిప్రజెంటేటివ్‌గా రాణించాలని ఆశించేవారికి ఈ కోర్సు బాగుంటుంది. ఇంటర్మీడియెట్‌లో సైన్స్ కోర్సు చదివి ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులు ఇందులో చేరవచ్చు. రెండేళ్ల పని అనుభవం ఉన్న నాన్ సైన్స్ గ్రాడ్యుయేట్లు కూడా ఇందులో చేరడానికి అర్హులు. కోర్సు వ్యవధి ఏడాది. ఫీజు రూ.8400.

పీజీ డిప్లొమా ఇన్ ఎన్విరాన్‌మెంట్ అండ్ సస్టెయినబుల్ డెవలప్‌మెంట్: ఇగ్నో మరికొన్ని సంస్థలతో కలిసి ఈ కోర్సును అందిస్తోంది. వాటిలో బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఒకటి. డిగ్రీ పూర్తిచేసుకున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. కోర్సు వ్యవధి ఏడాది. ఫీజు రూ.6600.

పీజీ డిప్లొమా ఇన్ అప్లయిడ్ స్టాటిస్టిక్స్: ప్రస్తుతం చాలా రంగాల్లో స్టాటిస్టిక్స్ అవసరం ఎక్కువగా ఉంది. సమాచార విశ్లేషణలో స్టాటిస్టిక్స్ పాత్ర ముఖ్యమైంది. సాఫ్ట్‌వేర్, ఫార్మా, ల్యాబొరేటరీలు, పరిశోధనా సంస్థలు, విద్యా సంస్థలు...ఇలా వివిధ విభాగాల్లో స్టాటిస్టీషియన్లకు అవకాశాలు లభిస్తున్నాయి. ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులు ఇందులో చేరవచ్చు. కోర్సు వ్యవధి ఏడాది. ఫీజు రూ.7200.

పీజీ డిప్లొమా ఇన్ ఎడ్యుకేషనల్ టెక్నాలజీ: బోధనలో సాంకేతికత పాత్ర పెరుగుతోంది. దీన్ని ఎక్కడి నుంచైనా నేర్చుకునే అవకాశం ఉంది. దీంతో బోధన రంగంలో విప్లవాత్మకమైన మార్పులు వస్తున్నాయి. టెక్నాలజీని జోడించి బోధిస్తే మెరుగైన ఫలితాలు రాబట్టవచ్చు. డిగ్రీ చదివినవారు ఈ కోర్సులో చేరవచ్చు. కోర్సు వ్యవధి ఏడాది. ఫీజు రూ.6600.

డిప్లొమా ఇన్ ఈవెంట్ మేనేజ్‌మెంట్: పుట్టిన రోజు, పెళ్లి రోజు, ఫ్రెషర్స్ డే, యాన్యువల్ డే, ఎంగేజ్‌మెంట్, రిటైర్‌మెంట్...ఇలా ప్రతీ సందర్భాన్నీ అట్టహాసంగా జరుపుకోవడానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. వీటన్నింటినీ జరుపుకోవాలంటే హైరానా పడాల్సిన అవసరం లేదు. ఈవెంట్ మేనేజర్ల చేతిలో పెడితే చాలు. అంతా వారే చూసుకుంటారు. కార్పొరేట్ సంస్థలు, పారిశ్రామిక విభాగాలు...సైతం వాటి పరిధిలో నిర్వహించుకునే కార్యక్రమాలకు ఈవెంట్ మేనేజర్లపైనే బాధ్యతలు పెడుతున్నాయి. బ్రాండ్ ప్రమోషన్, ప్రొడక్ట్ లాంచింగ్, ఆడియో ఫంక్షన్...ఇలా కార్యక్రమం ఏదైనా ప్రణాళిక ప్రకారం నిర్వహణ నైపుణ్యాలను ఈవెంట్ మేనేజర్లు ప్రదర్శిస్తారు. ఇంటర్ ఉత్తీర్ణులు ఇందులో చేరడానికి అర్హులు. ఆంగ్ల మాధ్యమంలో కోర్సు ఉంటుంది. ఈవెంట్ ప్లానింగ్, కోఆర్డినేషన్, మార్కెటింగ్...మొదలైనవి నేర్పుతారు. కోర్సు వ్యవధి ఏడాది. ఫీజు రూ.8000.

సర్టిఫికెట్ ఇన్ ఫుడ్ అండ్ న్యూట్రిషన్: ఎలాంటి విద్యార్హతలు లేకుండా 18 ఏళ్లు పైబడినవారు ఈ కోర్సులో చేరవచ్చు. ఆరోగ్య స్పృహ పెంపొందించడానికి దీన్ని రూపొందించారు. ఆహార పదార్థాలు ఎంచుకోవడం, ఆహార తయారీ, వివిధ వయసులవారికి కావాల్సిన పోషక పదార్థాలు, కిచెన్ గార్డెనింగ్, తక్కువ ఖర్చుతో పర్యావరణ అనుకూలంగా పోషకాలు ఉన్న ఆహారం తయారుచేసుకోవడంపై అవగాహన కల్పిస్తారు. కోర్సు వ్యవధి 6 నెలలు. ఫీజు రూ.1400.

సర్టిఫికెట్ ఇన్ న్యూట్రిషన్ అండ్ చైల్డ్: ఇంటర్ విద్యార్హతతో ఈ కోర్సులో చేరవచ్చు. పోషణ, శిశు వికాసానికి సంబంధించి ఈ కోర్సు పూర్తి అవగాహన కల్పిస్తుంది. పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తయారుచేయడం, పోషణ లోపిస్తే వచ్చే సమస్యలు, ఆహారాన్ని ఎంచుకోవడం, భద్రపర్చడం, ఫుడ్ బడ్జెట్ సూత్రాలు...కోర్సులో భాగంగా నేర్పుతారు. అప్పుడే పుట్టిన శిశువు నుంచి ఆరేళ్ల చిన్నారి వరకు కావాల్సిన పోషణ, వికాస సంబంధ కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తారు. కోర్సు వ్యవధి 6 నెలలు. ఫీజు రూ.1800.

విదేశీ భాషలు: ఇంటర్ ఉత్తీర్ణులు సర్టిఫికెట్ ఇన్ ఫ్రెంచ్/ అరబిక్ / జపనీస్/ కొరియన్/ స్పానిష్ లాంగ్వేజ్ కోర్సుల్లో చేరవచ్చు. ఆంగ్లం వచ్చినవారు విద్యార్హతలు లేకుండానే రష్యన్‌లో సర్టిఫికెట్ కోర్సు చేసుకోవచ్చు. వ్యవధి 6 నెలలు.

సర్టిఫికెట్ ఇన్ ఫంక్షనల్ ఇంగ్లిష్: ఆంగ్ల భాషలో ప్రాథమిక నైపుణ్యాలను మెరుగుపర్చుకోవడానికి ఈ కోర్సు ఉపయోగపడుతుంది. వివిధ సందర్భాల్లో ఆంగ్లంలో ఎలా మాట్లాడాలో తెలుసుకోవచ్చు. ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నవారు ఇందులో చేరడం ద్వారా ప్రయోజనం పొందవచ్చు. ఆంగ్లంలో సంభాషణ, రాత నైపుణ్యాలను మెరుగుపర్చుకోవచ్చు. కోర్సు వ్యవధి 6 నెలలు. ఫీజు రూ.3000.

పౌల్ట్రీ ఫార్మింగ్: చాలామంది ఔత్సాహికులు, నిరుద్యోగులు స్వయం ఉపాధిపై దృష్టిసారించడం మనకు తెలిసిందే. తక్కువ పెట్టుబడితో ఏడాది పొడవునా చేతికి ఆదాయం అందించడం పౌల్ట్రీ ప్రత్యేకత. అయితే ఈ రంగంలో సిరులు కురవాలంటే కోళ్ల పెంపకం, వాటి పోషణ, ఫారాల నిర్వహణపై శాస్త్రీయ అవగాహన తప్పనిసరి. తెలుగు మాధ్యమంలో ఇగ్నో 'పౌల్ట్రీ ఫా ర్మింగ్' కోర్సు అందిస్తోంది. కోర్సు వ్యవధి 6 నెలలు. ఫీజు రూ.3600. ఎనిమిదో తరగతి విద్యార్హతతో ఇందులో చేరవచ్చు.

బీ కీపింగ్: ఇదే విద్యార్హతతో తేనె తయారీ కోసం 'బీ కీపింగ్' కోర్సును ఆంగ్ల మాధ్యమంలో అందిస్తున్నారు. 6 నెలల వ్యవధి గల ఈ కోర్సు ఫీజు రూ.1400.

డెయిరీ ఫార్మింగ్ అవేర్‌నెస్: ఈ కోర్సును కూడా తెలుగు మాధ్యమంలో అందిస్తున్నారు. పాడిపరిశ్రమపై ఆసక్తి ఉన్నవారు ఇందులో చేరవచ్చు. జంతువుల పెంపకం, రోగాల బారినుంచి వాటిని సంరక్షించడం, పాల దిగుబడి పెంచడం, దాణా ఎంచుకోవడం..తదితరాలు ఇందులో నేర్పుతారు. ఈ కోర్సులో చేరడానికి ఎలాంటి విద్యార్హతలూ అవసరం లేదు. కోర్సు వ్యవధి 2 నెలలు. ఫీజు రూ.1100.

సర్టిఫికెట్ ఇన్ ఆర్గానిక్ ఫార్మింగ్: వ్యవసాయంలో రసాయనాలు, ఎరువుల వినియోగం బాగా పెరుగుతోంది.
ఈ పరిణామాలు ఆరోగ్యం, పర్యావరణంపై దుష్ప్రభావాన్ని చూపుతున్నాయి. వ్యవసాయదారుల్లో సేంద్రియ సాగుపై అవగాహన కల్పించడం, ఆ విధానంలో పండించిన ఉత్పత్తులకు గుర్తింపు (సర్టిఫికేషన్) తెచ్చుకోవడంపై అవగాహన కల్పించేలా కోర్సు రూపొందించారు. కోర్సు వ్యవధి 6 నెలలు. ఇంటర్ ఉత్తీర్ణులు చేరవచ్చు. ఫీజు రూ.4800.

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: జనవరి 15, 2019
వివరాలకు వెబ్‌సైట్: http://ignou.ac.in

ఉద్యోగ అవకాశాలు

ప్రభుత్వ ఉద్యోగాలు

మేనేజ్‌లో డిప్లొమా

హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్ (మేనేజ్) 201819కిగాను పీజీ డిప్లొమా ఇన్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్ (డిస్టెన్స్ విధానంలో) కోర్సులో ప్రవేశాల కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది.



కోర్సు పేరు: అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్ (డిప్లొమా)
అర్హతలు: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి అగ్రికల్చర్ లేదా అనుబంధ సబ్జెక్టుల్లో బ్యాచిలర్ డిగ్రీలో ఉత్తీర్ణత.
దరఖాస్తు: ఆఫ్‌లైన్‌లో
చిరునామా: డిప్యూటీ డైరెక్టర్, ప్రిన్సిపల్ కో ఆర్డినేటర్ (పీజీడీఏఈఎం), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్ (మేనేజ్), రాజేంద్రనగర్, హైదరాబాద్ 500030
చివరితేదీ: జనవరి 31, **వెబ్‌సైట్:** www.manage.gov.in

న్యాక్‌లో ఉపాధి శిక్షణ

హైదరాబాద్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్) గ్రామీణ నిరుద్యోగ యువతకు కింది కోర్సుల్లో ఉచితంగా శిక్షణ కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.
కోర్సులు –అర్హతలు: ఎలక్ట్రికల్, హౌజ్ వైరింగ్
అర్హత: 10వ తరగతి ఉత్తీర్ణత. ప్లంబింగ్, శానిటేషన్/వెల్డింగ్, పెయింటింగ్, డెకరేషన్ పదోతరగతి పాస్/ఫెయిల్.
ల్యాండ్ సర్వేయర్ ఇంటర్/ఐటీఐ
స్టోర్ కీపర్– ఏదైనా డిగ్రీ కోర్సు వివరాలు:
మూడునెలలు ఉచిత శిక్షణ. భోజన, వసతి.
యూనిఫాం, బుక్స్, సేఫ్టీ హెల్మెట్, షూస్ ఇస్తారు.
శిక్షణ పూర్తియిన తర్వాత న్యాక్ సర్టిఫికెట్, ప్రైవేట్ రంగంలో ఉపాధి కల్పిస్తారు. ఈ కోర్సులో ప్రవేశానికి గ్రామీణ యువత, 1835 ఏండ్ల మధ్య ఉన్నవారు మాత్రమే అర్హులు.
ప్రవేశానికి కావాల్సిన పత్రాలు: ఆధార్‌కార్డ్, రేషన్‌కార్డ్, స్టడీ సర్టిఫికెట్లు, కులధ్రువీకరణ పత్రం జిరాక్సులతోపాటు ఆరు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు. **సంప్రదించాల్సిన చిరునామా:** న్యాక్, హైటెక్స్, కొండాపూర్, హైదరాబాద్84

వాలంతరిలో సర్టిఫికెట్ కోర్సు

రాజేంద్రనగర్ (హిమాయత్‌సాగర్)లోని నీరు, భూమి యాజమాన్య శిక్షణ & పరిశోధన సంస్థ (వాలంతరి) 4 నెలల సర్టిఫికెట్ కోర్సులో ప్రవేశానికిఆసక్తిగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.
సర్టిఫికెట్ కోర్సు పేరు : భూమి & నీటి యాజమాన్యంతో సుస్థిరమైన లాభసాటి వ్యవసాయం
కాలవ్యవధి : జనవరి 25 మే 24
అర్హత: ఇంటర్/ఐటీఐ లేదా డిప్లొమా చదివిన 18 నుంచి 30 ఏండ్ల మధ్యన ఉన్న గ్రామీణ అభ్యర్థులు. కోర్సు సమయంలో ఉచిత భోజనం , వసతి కల్పిస్తారు. ఈ సర్టిఫికెట్ పూర్తిచేసిన వారు ఆదర్శరైతు లేదా వ్యవసాయ రంగంలో కన్సల్టెంట్‌గా స్వయం ఉపాధి పొందవచ్చు.
కోర్సుఫీజు: రూ. 1200/, **ఎంపిక:** మౌఖిక పరీక్ష ద్వారా
చివరితేదీ: 2019 జనవరి 10, **వెబ్‌సైట్:** www.tswalamtari.cgg.gov.in

జర్నలిజంలో ప్రవేశాలు

హైదరాబాద్‌లోని ఏపీ కాలేజ్ ఆఫ్ జర్నలిజం 2019, 20 విద్యా సంవత్సరానికి వివిధ జర్నలిజం (డిప్లొమా) కోర్సుల్లో ప్రవేశాల కోసం ప్రకటన విడుదల చేసింది.
కోర్సుల వివరాలు
పీజీ డిప్లొమా ఇన్ జర్నలిజం , డిప్లొమా ఇన్ టీవీ జర్నలిజం డిప్లొమా జర్నలిజం కోర్సులన్నీ రెగ్యులర్‌గాను లేదా కరస్పాండెన్స్‌లోను చేయవచ్చు.
దరఖాస్తు: ఆఫ్‌లైన్‌లో. పూర్తి వివరాలకు మొబైల్ నంబర్: 9848512767లో సంప్రదించవచ్చు.
చివరితేదీ: 2019 జనవరి 12, **వెబ్‌సైట్:** http://apcj.in

బీఎస్‌ఎఫ్‌లో మెడికల్ ఆఫీసర్లు

బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్‌ఎఫ్)లో కాంట్రాక్టు ప్రాతిపదికన స్పెషలిస్ట్, డెంటల్ సర్జన్స్, జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.
పోస్టులు: జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్59 ఖాళీలు
జీతం: నెలకు రూ. 75,000/
అర్హత: ఎంబీబీఎస్, ఇంటర్న్‌షిప్ చేసినవారు
స్పెషలిస్టులు18 ఖాళీలు
విభాగాలు: మెడిసిన్, సర్జరీ, జీ అండ్ ఓ, రేడియాలజిస్ట్, సైకియాట్రి, పాథాలజీ, అనెస్థీషియా, ఆప్తాల్మాలజీ.
అర్హతలు: సంబంధిత స్పెషాలిటీలో పీజీ/డిప్లొమాతోపాటు ఏడాదిన్నర అనుభవం ఉండాలి. **జీతం:** నెలకు రూ.85,000/
డెంటల్ సర్జన్ 2 పోస్టులు
అర్హతలు: బీడీఎస్‌లో కనీసం 60 శాతంమార్కులతో ఉత్తీర్ణత. పీజీ ఉన్నవారికి ప్రాధాన్యం ఇస్తారు.
జీతం: నెలకు రూ.75,000/ , **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా
ఇంటర్వ్యూ తేదీలు: జనవరి 14 నుంచి 18 వరకు
వెబ్‌సైట్: http://bsf.nic.in

భారతీయ రైల్వేలో ఖాళీలు

దేశవ్యాప్తంగా ఉన్న వివిధ రైల్వే జోన్లు/ప్రొడక్షన్ యూనిట్లలో ఖాళీగా ఉన్న జూనియర్ ఇంజినీర్ తదితర పోస్టుల భర్తీకి రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు (ఆర్‌ఆర్‌బీ) దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.
అర్హతలు: గుర్తింపు పొందిన బోర్డు/యూనివర్సిటీ నుంచి సంబంధిత విభాగం/బ్రాంచీల్లో మూడేండ్ల డిప్లొమా లేదా బ్యాచిలర్ ఆఫ్ ఇంజినీరింగ్, పీజీడీసీఏ, బీఎస్సీ (కంప్యూటర్ సైన్స్), బీసీఏ, బీటెక్ (ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ), ఫిజిక్స్/కెమిస్ట్రీ సబ్జెక్టులతో బీఎస్సీ, బీఈ/బీటెక్ (కంప్యూటర్ సైన్స్) లేదా డీవోఈఏసీసీ బీ లెవల్ కోర్సు సర్టిఫికెట్ ఉండాలి.
వయస్సు: 2019 జనవరి 1 నాటికి 18 నుంచి 33 ఏండ్ల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేండ్లు, ఓబీసీలకు మూడేండ్లు, పీహెచ్‌సీలకు పదేండ్ల వరకు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.



పే స్కేల్ : 35,400/(7వ వేతన సవరణ ప్రకారం)
అప్లికేషన్ ఫీజు: జనరల్/ఓబీసీ అభ్యర్థులు రూ.500/, ఎస్సీ/ఎస్టీ, పీహెచ్‌సీ, ఎక్స్‌సర్వీస్‌మ్యాన్/ఈబీసీ, మహిళలకు రూ. 250/, ఎంపిక విధానం: రెండు దశల్లో (కంప్యూటర్ బేస్డ్ టెస్ట్) ఉంటుంది. ఆబ్జెక్టివ్ విధానంలో స్టేజీ1లో మెరిట్ సాధించిన వారికి స్టేజీ 2 రాతపరీక్షను నిర్వహిస్తారు. ఇంటర్వ్యూ లేదు.
దరఖాస్తు: ఆన్‌లైన్‌లో, దరఖాస్తులు ప్రారంభం: 2019 జనవరి 2 నుంచి **దరఖాస్తులకు చివరితేదీ:** 2019 జనవరి 31
వెబ్‌సైట్: www.rrbsecunderabad.nic.in
మొత్తం పోస్టులు: 14,033
విభాగాలవారీగా ఖాళీలు:
జూనియర్ ఇంజినీర్13,034,జూనియర్ ఇంజినీర్ (ఐటీ)49
డిపో మెటీరియల్ సూపరింటెండెంట్456,
కెమికల్ అండ్ మెటలర్జికల్ అసిస్టెంట్494

గురుకులంలో ఇంటర్ ప్రవేశాలు

హైదరాబాద్‌లోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న ప్రతిభ కళాశాలల్లో 2019, 20కిగాను ఇంటర్‌లో ప్రవేశాల కోసం నిర్వహించే ప్రవేశ పరీక్ష నోటిఫికేషన్ విడుదలైంది.
ప్రతిభ కళాశాలల్లో ప్రవేశాలు
గ్రూపులు: ఎంపీసీ, బైపీసీతోపాటు ఐఐటీ/ఎన్ఐటీ, నీట్ ఉచిత శిక్షణలు కూడా ఇస్తారు.
కళాశాల వారీగా వివరాలు: టీటీడబ్ల్యూఆర్ ఐఐటీ స్టడీ సెంటర్ రాజేంద్రనగర్ (బాలురు), టీటీడబ్ల్యూఆర్ సీఓఈ వరంగల్ (బాలికలు), కురవి (బాలికలు), ఎస్ఓఈఖమ్మం (బాలురు), టీటీడబ్ల్యూఆర్ సీఓఈ వనపర్తి (బాలికలు), ఎల్లారెడ్డిపేట (బాలికలు), కురవి (బాలికలు), కల్వకుర్తి (బాలికలు), దేవరకొండ (బాలికలు), బాలానగర్ (బాలురు), దమ్మపేట (బాలురు) , మిర్యాలగూడ (బాలురు), నార్నూర్ (బాలురు), గాంధారి (బాలురు), కరీంనగర్ (బాలురు)
ప్రతి కళాశాలల్లో ఎంపీసీ40, బైపీసీ40 సీట్లు, రాజేంద్రనగర్ సెంటర్లో ఎంపీసీ50, బైపీసీ40 సీట్లు, ఖమ్మంలో ఎంపీసీ45, బైపీసీ45 సీట్ల చొప్పున మొత్తం 1220 సీట్లు ఉన్నాయి.
టీటీడబ్ల్యూఆర్ ఆధ్వర్యంలో పీవీటీజీ (సీఓఈ పీవీటీజీబాలురు) మొయినాబాద్, సీఓఈ పీవీటీజీహయత్‌నగర్) కళాశాలలు కూడా నడుస్తున్నాయి. వీటిలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ కోర్సులు ఉన్నాయి. ప్రతి గ్రూప్‌కి 40 చొప్పున మొత్తం 320 సీట్లు ఉన్నాయి.
అర్హత: తెలంగాణ రాష్ట్రానికి చెందిన గిరిజన బాలబాలికలు, 2019 మార్చిలో పదోతరగతి పరీక్షలు హాజరవుతున్న విద్యార్థులు.
ఎంపిక: ప్రవేశపరీక్ష ఆధారంగా. స్క్రీనింగ్ టెస్ట్ (లెవల్1, లెవల్2)ను ఆబ్జెక్టివ్, డిస్క్రిప్టివ్ విధానంలో ఉంటుంది. ప్రవేశపరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో మొత్తం 160 మార్కులకు ఉంటుంది. ఎంపీసీ గ్రూప్‌వారికి ఇంగ్లిష్40, మ్యాథ్స్40, ఫిజిక్స్40, కెమిస్ట్రీ40, బైపీసీ వారికి ఇంగ్లిష్ 40, బయాలజీ40, ఫిజిక్స్40, కెమిస్ట్రీ40 ప్రశ్నలు ఇస్తారు.
దరఖాస్తు: ఆన్‌లైన్‌లో **చివరితేదీ:** జనవరి 21
ప్రవేశ పరీక్ష (లెవల్1): ఫిబ్రవరి 10 ,ప్రవేశ పరీక్ష (లెవల్2): మార్చి 10 , వెబ్‌సైట్: http://tgtwgurukulam.telangana.gov.in

వాక్‌ఇన్ ఇంటర్వ్యూ

సీఐటీడీ, హైదరాబాద్
హైదరాబాద్‌లోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్ (సీఐటీడీ) కింది కాంట్రాక్టు పోస్టుల భర్తీకి వాక్‌ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తోంది.
పోస్టులు: టీచింగ్ ఫ్యాకల్టీ, ఆఫీస్ అసిస్టెంట్లు
విభాగాలు: క్యాడ్, వీఎల్ఎస్ఐ, ఎలక్ట్రికల్, ఇంగ్లిష్, మ్యాథమేటిక్స్
అర్హత: సంబంధిత బ్రాంచిల్లో బీఈ/ బీటెక్, బీకాం/ బీఎస్సీ, ఎంఈ/ ఎంటెక్, ఎంఏ/ ఎంఎస్సీ, అనుభవం.
వాక్‌ఇన్ తేది: జనవరి 5
వేదిక: సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్, బాలానగర్, హైదరాబాద్500037. **వెబ్‌సైట్:** https://www.citdindia.org/

ప్రభుత్వ ఉద్యోగాలు

ఏపీలో గ్రూప్స్, అధ్యాపక పోస్టులు
ఆంధ్రప్రదేశ్ సివిల్, పోలీస్, ట్యాక్స్, ఎక్సైజ్, రిజిస్ట్రేషన్, మునిసిపల్ కమిషనర్ సబార్డినేట్, రెవెన్యూ సబార్డినేట్ సర్వీసులు, సాంకేతిక/ కళాశాల విద్య తదితర శాఖల్లో వివిధ పోస్టుల భర్తీకి డిసెంబరు 31న



ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఏడు నోటిఫికేషన్లను విడుదల చేసింది.
పోస్టులు–ఖాళీలు: గ్రూప్ 1 సర్వీసులు 169, గ్రూప్ 2 ఆఫీసర్ 446, పాలిటెక్నిక్ లెక్చరర్ 405, డిగ్రీ కళాశాల అధ్యాపకులు 308, ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ 43, అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫిషరీస్ 10, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇన్ఫర్మేషన్ ఇంజినీర్ 05.
మొత్తం పోస్టులు 1,386.
అర్హతలు: పోస్టును అనుసరించి ఏదైనా డిగ్రీ లేదా సంబంధిత విభాగంలో బ్యాచిలర్ డిగ్రీ, డిప్లొమా, పీజీ, నెట్/ స్లెట్, పీహెచ్‌డీ తదితర కోర్సుల్లో ఉత్తీర్ణులై ఉండాలి.
పోస్టుల వారీ ఆన్‌లైన్ దరఖాస్తు చివరితేదీలు: గ్రూప్ 1 సర్వీసులు జనవరి 28, గ్రూప్ 2 ఆఫీసర్ జనవరి 31, డిగ్రీ కళాశాల అధ్యాపకులు ఫిబ్రవరి 26, పాలిటెక్నిక్ లెక్చరర్ ఫిబ్రవరి 27, ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్/ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫిషరీస్ ఫిబ్రవరి 08, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇన్ఫర్మేషన్ ఇంజినీర్ ఫిబ్రవరి 12.
వెబ్‌సైట్: https://psc.ap.gov.in/

సీడ్యాక్, హైదరాబాద్

హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ (సీడ్యాక్) కింది కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.
కోర్సు: డిప్లొమా ఇన్ మాడర్న్ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ ఎసెన్షియల్స్
కాలవ్యవధి: 5 నెలలు.
అర్హత: సంబంధిత సబ్జెక్టుల్లో బీఈ/ బీటెక్, ఎంఎస్సీ, ఎంసీఏ ఉత్తీర్ణత.
దరఖాస్తు: ఆన్‌లైన్.
చివరితేదీ: జనవరి 13
వెబ్‌సైట్: http://www.meghsikshak.in/cdac/dmsde





ఎస్ లక్ష్మీనారాయణ
డైరెక్టర్, రామయ్య
కాంపిటీటివ్ కోచింగ్ సెంటర్
దిల్‌సుఖ్ నగర్, హైదరాబాద్,
8885555202

ఫ్రెంచి తొలి వర్తక కేంద్రం ఎక్కడ?

III ఇంగ్లాండ్ / బ్రిటీష్ / ఆంగ్లేయులు

- BEICని 1599లో ' మర్చంట్ అడ్వంచర్స్ గ్రూప్' అనే సంస్థ ఏర్పాటు చేసింది.
- ఈ కంపెనీని బ్రిటీష్ రాణి ఎలిజబెత్ – 1, 1600 డిసెంబర్ 31న ఆమోదించింది.
- ఇది 70,000Pounds, 24 డైరెక్టర్స్ బోర్డు ద్వారా ఏర్పాటు చేయబడింది. బ్రిటిష్ నౌక హెక్టార్ జేమ్స్ లంకాస్టర్ ఆధ్వర్యంలో సూరత్‌కు చేరుతుంది.
- 1608 – కెప్టెన్ విలియం హాకిన్స్, BEIC రాయబారిగా జహంగీర్ ఆస్థానాన్ని సందర్శించి సూరత్ వద్ద శాస్వత వర్తక స్థావరం ఏర్పాటుకు అనుమతి పొందడంలో విఫలమయ్యాడు.
- 1611 – దక్షిణ భారతదేశంలో, తూర్పు తీరంలో బ్రిటీష్ వారి మొట్టమొదటి వర్తకస్థావరం – కెప్టెన్ హిప్పన్ (4వ నౌక గ్లోబ్) ఏర్పాటు చేశాడు.
- 1613 – బ్రిటీష్ కెప్టెన్ బెస్ట్ పోర్చుగీస్ వారిని సాల్వీయుద్ధంలో ఓడించి జహంగీర్‌చే సూరత్ వద్ద శాశ్వత వర్తకస్థావర ఏర్పాటుకు అనుమతి పొందాడు.
- 1615 – బ్రిటీష్ రాజు మొదటి జేమ్స్ – తన రాయబారిగా సర్ థామస్ రోను జహంగీర్ ఆస్థానానికి పంపాడు. థామస్‌రో భారతదేశంలో గల మొఘల్ సామ్రాజ్యంలో ఎక్కడైనా వర్తక కేంద్రంను ఏర్పాటుచేసుకొనుటకు జహంగీర్ నుంచి అనుమతి పొందాడు.
- 1621 – వీరు పులికాట్ వద్ద వర్తక కేంద్రంను స్థాపించారు.
- 1633 – బాలాసోర్ వద్ద తూర్పు భారతదేశంలో బ్రిటీష్‌వారి తొలి వర్తక కేంద్రం స్థాపించబడింది. ఇదే సంవత్సరంలో హరిహరపుర వద్ద కూడా వర్తక కేంద్రం స్థాపించాడు.
- 1639 – చంద్రగిరి పాలకుడు 3వ వేంకటపతిరాయలు మద్రాస్ వద్ద వర్తక స్థావరం స్థాపించుకొనుటకు 'ఫ్రాన్సిస్‌డే' (మద్రాస్ నిర్మాత)కు అనుమతినిచ్చాడు. దీనికి మధ్యవర్తిత్వం చేసింది. దామెర్ల సోదరులైన వేంకటాద్రినాయుడు, అయ్యప్పనాయుడులు. బ్రిటీష్ వారు దామెర్ల సోదరుల తండ్రిగారైన చెన్నప్ప పేరుతో – చెన్నపట్టణంను ఏర్పాటు చేశారు. మద్రాస్‌లో బ్రిటీష్ వారు సెయింట్ జార్జ్ 1639 ఆగస్టు 22న ప్రారంభించి 1641సెప్టెంబర్ 24న పూర్తిచేశారు.
- 1651 – బెంగాల్, బీహార్, హుగ్లీ, కాశీంబజార్, పాట్నా, ఢాకాలలో వర్తక కేంద్రాలు స్థాపించారు.
- 1657 – BEIC చార్టర్ ఆఫ్ క్రామ్‌వెల్ ప్రకారం 'జాయింట్ స్టాక్ కంపెనీ'గా మార్చింది. BEICకి వ్యతిరేకంగా 'ఇంగ్లీష్ కంపెనీ ఆఫ్ మర్చంట్స్, ట్రేడింగ్ టుది ఈస్టిండీస్' అనే కంపెనీ'గా ఏర్పడింది.
- 1667 – మద్రాస్‌ను భారతదేశంలో తొలి మున్సిపాలిటీగా ప్రకటించారు. 1668 నుండి అమలులోకి వచ్చింది.
- 1668 – రెండవ చార్లెస్ సెయింట్ డేవిడ్ /బాంబే కోటను BEICనీకి శాశ్వతంగా లీజుకు ఇచ్చాడు.
- 1698 – కలీకత +గోవిందాపూర్+ సుతనౌతిలు BEICకి ఇవ్వబడ్డాయి. ఈ మూడు గ్రామాల కలయికనే కలకత్తా అంటారు. కలకత్తాలో బ్రిటీష్ వారు మూడవ విలియం జ్ఞాపకార్థం 'పోర్ట్‌విలియం'ను నిర్మించారు.
- 1715 – పోర్టు విలియం అధ్యక్షుడు – జాన్ సుర్మాన్, వైద్యుడు – విలియం హామిల్టన్ బ్రిటీష్ అధికారి స్టిఫెల్ సన్‌లు మొఘల్ చక్రవర్తి ఫరూక్షియర్ ఆస్థానాన్ని సందర్శించారు. ఫరూక్షియర్ కుష్ఠువ్యాధి లేదా రాచపుండుతో బాధపడుతున్నాడు. విలియం హామిల్టన్ ఫరూక్షియర్ రాచపుండు/ వ్యాధిని తక్కువ కాలంలో నయం చేశాడు.
- 1717– చాలా సంతోషపడ్డ ఫరూక్షియర్ బంగారు ఫర్మానాను/ ఫ్రీదస్తక్‌ను జారీ చేశాడు.
- దీని ప్రకారం BEICసం॥నికి 3వేలు చెల్లించి బెంగాల్, గుజరాత్, దక్కన్ (హైదరాబాద్)లలో ఎటువంటి సుంకములు చెల్లించకుండా యథేచ్ఛగా వర్తకం చేసుకునే అధికారం. దీనినే 'Magna Carta of Company' అంటారు.
- (Magna Carta అనగా పెద్ద/ గొప్ప ఒప్పందం అని అర్థం. Magna Carta of India 1854 – ఉడ్స్ ఎడ్యుకేషన్ డిస్పాచ్)
- 1636 ఆంధ్రలో బ్రిటిష్ వారికి స్వేచ్ఛగా వ్యాపారం కొరకు అబ్దుల్లా కుతుబ్ షా అనుమతినిచ్చాడు.
- ఇంగ్లాండ్ రవి అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యంగా పేరుగాంచి ప్రపంచంలో స్వాతంత్ర్యం పొందని ఏకైక దేశం – ఇంగ్లాండ్.

IV డేన్స్ /డెన్మార్క్/ డేనిష్ వారు

- రాజధాని – కొపెన్‌హాగన్.
- 'డేన్స్ ఈస్టిండియా కంపెనీ' 1616లో స్థాపించబడింది. భారతదేశంలో స్వల్ప కాలం వర్తకం సాగించినవారు.
- తమ రెండు స్థావరాలైన ట్రాంకోబార్ (తమిళనాడు), సేరంపూర్ (పచ్చిమ బెంగాల్) ప్రధానమైనది. 1845లో బ్రిటీష్ గవర్నర్ జనరల్ హర్డింజ్–1కు 120లక్షలు/1కోటి 20లక్షలు అమ్మేసి భారత్‌ను వదిలి వెళ్ళాడు.
- వీరు భారతదేశంలో క్రైస్తవ మిషనరీ కార్యకలాపాలను కొనసాగిస్తూ చైనాతో వర్తకం చేసేవారు.

V ఫ్రెంచ్ వారు

- రాజధాని పారిస్ – సీన్ నదీ ఒడ్డున కలదు.
- భారతదేశంలో వ్యాపార రంగంలో చిట్టచివర అడుగుపెట్టిన ఐరోపా వారు ఫ్రెంచి.
- ఫ్రెంచి వారి తొలి వర్తక కేంద్రం సూరత్ కాగా ప్రముఖ/ ప్రధానమైనది పాండిచ్చేరి.
- ఫ్రెంచ్ ఈస్టిండియా కంపెనీని ఫ్రాన్స్‌రాజైన 14వ లూయి యొక్క ఆర్థిక మంత్రి. కోల్బర్ట్ 1664లో స్థాపించాడు.
- దీని అసలు పేరు Compaignile Des Indies Orientals.
- ప్రభుత్వరంగానికి చెందిన ఏకైక ఈస్ట్ ఇండియా కంపెనీ.
- **నోట్ :** ఫ్రాన్స్ నుండి గతంలో అడిగిన ప్రశ్నలు
- ఫ్రాన్స్‌ను పాలించిన వంశం భూర్బన్, రాజులను లూయిలు అంటారు.
- 14వ లూయి – 30 సం॥ నిర్విరామ యుద్ధాల ద్వారా ఖజానా ఖాళీ అయ్యింది. వర్సెల్స్‌లో తొలిసారిగా అద్దాల భవనాన్ని నిర్మించాడు. వైభవోపేత చక్రవర్తి, Sunking అని ప్రకటించుకున్నాడు. I am the State /నేనే రాజ్యం. I am the God / నేనే దేవున్ని, నేను దేవుని నీడను అని ప్రకటించుకున్నాడు.
- 15వ లూయి – ప్రధాని –జోల్స్‌మాజరిన్ – భార్య – మేడం డిపాంపెండర్. నా తర్వాత ప్రళయం వస్తుందని పేర్కొన్నాడు.
- 16వ లూయి – భార్య – మేరి అంతువానేట్. ఆర్థిక మంత్రులు – టర్గో, నెక్కర్, కలోన్.
- 18వ లూయి – నెపోలియన్ ఎల్బాదీవికి బందీగా పంపబడినప్పుడు ఫ్రాన్స్ రాజు. నెపోలియన్ రాకతో ఇంగ్లాండుకు పారిపోయాడు.
- **పారిస్ :** UNESCO ప్రధానకార్యాలయం, ఈఫిల్‌టవర్‌లు పారిస్‌లో కలవు. 1919 నానాజాతి సమితి ఏర్పాటు కొరకు ఉడ్రోవిల్సన్, (నానాజాతి సమితి రూపశిల్పి) నేతృత్వంలో జరిగిన సమావేశం.
- ఫ్రాన్స్ ప్రస్తుత అధ్యక్షుడు – ఫ్రాంకోయిస్ హోలాండ్
- ప్రపంచ విప్లవాలకు మాత – ఫ్రెంచ్ విప్లవం బాస్టిల్‌కోట పతనం . 1789 జులై 14 ఫ్రాన్స్ జాతీయ దినం.
- స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం ఫ్రెంచ్ విప్లవ నినాదం.
- ఫ్రెంచి సైనికుని పేరు – పూలు.
- రూసో – 'The Social Centract Theory'/ సాంఘిక ఒడంబడిక సిద్ధాంతం.
- ఎమిలి (విద్యార్థి) అనే గ్రంథాలు రాశాడు.
- మానవుడు స్వేచ్ఛగా జన్మించబడినప్పటికీ, అన్నివేళలా సృంఖలాబద్ధుడు (Man is born Free but everywhere in his chains) – రూసో.
- ఫ్రాన్స్ అధ్యక్షుడి నివాస భవనం – ఎలిసీభవన్.
- Go back to Nature– రూసో.
- Go back to the Vedas – Swami Dayananda Saraswathi.
- 1668లో ఫ్రెంచి వారి తొలివర్తక స్థావరం – సూరత్ వద్ద స్థాపించారు. (ఫ్రాన్సిస్ కారన్)
- 1669లో 2వ స్థావరాన్ని – మచిలీపట్నం – మకారా స్థాపించాడు (తూర్పు తీరంలో).
- 1673లో ఆర్కాట్ పాలకుడైన షేర్‌ఖాన్‌లోడి వాలికొండాపూరంను ఫ్రెంచ్ అధికారులైన ఫ్రాంకోయిస్ మార్టిన్, బెల్లాంజిర్ – ఢి – లెస్పినేలకు ఇచ్చాడు.
- ఫ్రెంచ్ తొలి గవర్నర్ అయిన ఫ్రాంకోయిస్ మార్టిన్ వాలికొండాపురంను పాండిచ్చేరిగా అభివృద్ధి చేశాడు.
- 1721లో మారిషస్‌ను ఆక్రమించారు. 1725లో యానాం, మహే, కాలికట్ ప్రాంతాలను పొందిరి. 1739లో కరైకల్‌ను పొందారు.
- 1760లో వందవాసి/వాండివాష్ యుద్ధంలో బ్రిటీష్ జనరల్ ఐర్‌కూట్ మయియు ఫ్రెంచ్ గవర్నర్ జనరల్ కౌంట్ ఢి లాలీ, బుస్సీలను ఓడించడంతో ఫ్రెంచివారు భారతదేశంలో పూర్తిగా తమ ఆధిపత్యంను కోల్పోయి పాండిచ్చేరికి మాత్రమే పరిమితమైనారు.
- పాండిచ్చేరి/పుదుచ్చేరి అనగా తమిళంలో అభివృద్ధి చెందిన గ్రామం అని అర్థం.
- పాండిచ్చేరిలో నాలుగు ప్రాంతాలు కలవు.
- ఎ) పాండిచ్చేరి (తమిళనాడు), బి) కరైకల్ (తమిళనాడు), సి) యానాం (ఆంధ్రప్రదేశ్), డి) మహే (కేరళ)(భారతదేశంలో చిన్న జిల్లా – మహే).

ఆంగ్లేయులు -అధికార స్థాపన

- బ్రిటీష్ వారు భారతదేశాన్ని వివిధ దశలలో ఆక్రమించారు.
- మొదటిగా ఆర్కాట్ (1763) ఆ తర్వాత వరుసగా 2) బెంగాల్ (1764), 3) మైసూర్ (1799), 4) మరాఠా (1818), 5) సింధ్ (1843), 6) పంజాబ్ (1849), 7) అవద్ (1856)లను ఆక్రమించాడు.
- శాశ్వత శిస్తు నిర్ణయ పద్ధతిని 1793లో కారన్‌వాలీస్ ప్రవేశపెట్టాడు.
- సైన్య సహకార పద్ధతిని 1798లో వెల్లస్లీ ప్రవేశపెట్టాడు.
- దేశంలోనే దీనిని స్వీకరించిన మొదటి పాలకుడు హైదరాబాద్ నిజాం – నిజాం ఆలీఖాన్ (రెండవ నిజాం).
- రాజ్య సంక్రమణ సిద్ధాంతంను 1848లో డల్హౌసి ప్రవేశపెట్టాడు.
- బ్రిటీష్, ఫ్రెంచ్‌వారు భారతదేశ రాజుల బలహీనతను, అంతర్గత కలహాలను అవకాశంగా చేసుకుని వారి రాజకీయాలలో తలదూర్చడం మొదలుపెట్టారు.
- దక్కన్‌లో బ్రిటీష్, ఫ్రెంచ్‌వారు తమ ఆదిపత్యం కోసం చేసిన యుద్ధాలనే ఆంగ్లో (కర్ణాటక (ఫ్రెంచ్) యుద్ధాలు అంటారు.
- 1744 నుండి 1763 వరకు మూడు కర్ణాటక యుద్ధాలు జరిగాయి.
- మొగల్స్ బిజాపూర్, గోల్కొండల నుండి ఆక్రమించిన ప్రాంతాలను కర్ణాటక అంటారు. దీని రాజధాని – ఆర్కాట్.
- 1707లో ఔరంగజేబ్ మరణించడంతో కర్ణాటక నుండి స్వతంత్రంను ప్రకటించుకున్న రాజు – సాదుతుల్లా ఖాన్.



చైనా బాంబమ్మ..

శక్తివంతం...బహుళ విలయం

న్యూఢిల్లీ : ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన బాంబును చైనా రూపొందించింది. ఇది అన్ని బాంబుల అమ్మ అని, అత్యంత శక్తివంతమైన అణు పాటవ రహిత ఆయుధం అని చైనా అధికార పత్రిక గ్లోబల్ టైమ్స్ తెలిపింది. ఇది బ్రహ్మాండమైన బాంబు అని స్పష్టం చేసింది. అమెరికా తయారు చేసినట్లుగా చెపుతోన్న మదర్ ఆఫ్ ఆల్ బాంబ్సుకు తమ వద్ద ఉన్న బాంబు తగు జవాబు అని పత్రిక స్పష్టం చేసింది. చైనాకు చెందిన రక్షణ పరిశ్రమ దిగ్గజం నారిన్‌కోం వారు తొలిసారిగా ఈ వైమానిక బాంబును ప్రదర్శనకు పెట్టారు. ఈ శక్తివంతమైన బాంబును విమానం నుంచి భూతలంపై ప్రయోగించవచ్చు. అణ్వాయుధాల తరువాతి క్రమంలో ఇది అత్యంత శక్తివంతమైన బాంబు అని, మదర్ ఆఫ్ ఆల్ బాంబ్స్‌కు ఇది చైనా రూపం అని వెల్లడించారు. ఈ బాంబును రూపొందించినట్లు చెప్పడమే కాదు ..సదరు రక్షణ సంస్థ వారు దీనిని విమానం నుంచి కిందికి ఒక రహస్య స్థలంలో గురిచూసి విసరగా అత్యంత భారీ పేలుడు జరిగింది. హెచ్‌కె బాంబరు నుంచి దీనిని ప్రయోగించినట్లు తెలిపే వీడియోను రక్షణ ఉత్పత్తుల సంస్థ వారు తమ వెబ్ సైట్‌లో పొందుపర్చారు. డిసెంబర్ చివరిలో దీని విశేషాలను వెలువరించగా ఇప్పుడు దీనిని చైనా అధికారిక పత్రిక వెలుగులోకి తెచ్చింది. ఈ కొత్త బాంబు విధ్వంసక పాటవం గురించి బహిర్గతం చేయడం ఇదే తొలిసారి అని అధికారిక వార్తాసంస్థ జిన్హువా తెలిపింది. ఇటువంటి శక్తివంతమైన బాంబు తయారీలో అమెరికా పెట్టింది పేరుగా ఉంది. గత ఏడాది అఫ్ఘనిస్థాన్‌లో ఉగ్రవాదులపై పోరు సందర్భంగా అమెరికా సైన్యం భారీ స్థాయి వైమానిక ఆయుధ పేలుడు జరిపింది. ఈ మాబ్ దాడి ప్రపంచ చరిత్రలో ఇప్పటి వరకూ అత్యంత శక్తివంతం అయినదిగా విశ్లేషించారు. దీనిని మదర్ ఆఫ్ ఆల్ బాంబ్స్‌గా పేర్కొన్నారు. ప్రత్యేకించి ఉగ్రవాద బెడద ఉన్న ఇస్లామిక్ దేశాలలో ప్రత్యర్థులను దెబ్బతీసేందుకు అమెరికా అరుదుగా ఇటువంటి ఆయుధాలను వాడుతోంది. ఇక ఇప్పుడు చైనా కూడా ఇటువంటి బాంబును తయారుచేసుకున్నట్లు వెల్లడైంది. బాంబుల అమ్మగా దీనికి పేరు పెట్టుకుంది. అమెరికా బాంబుతో పోలిస్తే తమ కొత్త బాంబు అతి తేలికైనదని, చిన్నదని చైనా అధికారిక వర్గాలను ఉటంకిస్తూ చైనా పత్రిక వార్తాకథనం వెలువరించింది. వీడియోలో దృశ్యాల ప్రాతిపదికన విశ్లేషించుకుంటే చైనా బాంబు ఐదు నుంచి ఆరు మీటర్ల పొడువు ఉంటుందని వెల్లడైంది.


ఈ చైనా బాంబు బహులార్థకం

నేలపై ఉండే శత్రు పక్షాలను సమూలంగా తుడిచిపెట్టడం, అక్కడి స్థావరాలను దెబ్బతీయడం వంటి ప్రత్యేక లక్షణాలు చైనా బాంబుకు ఉన్నాయి. దీనితో పాటు ఏ అటవీ లేదా పర్వత ప్రాంతాలలో ఉన్నట్లుండి సైనిక స్థావరాలను ఏర్పాటు చేసుకోవాలనుకుంటే దీనిని ప్రయోగిస్తే చాలు, అక్కడి నేలంతా చదును అవుతుందని బీజింగ్‌కు చెందిన సైనిక విశ్లేషకులు వీయి డొంగ్జు గ్లోబల్ టైమ్స్‌కు తెలిపారు. అమెరికా చైనా బాంబుల మధ్య చాలా తేడా ఉంది. అమెరికా బాంబును అతి పెద్ద రవాణా విమానంలో అతి నెమ్మదిగా తీసుకువెళ్లాల్సి ఉంటుంది. అదే చైనా బాంబును క్షణాలలోనే లక్ష్యాల వద్దకు చేర్చవచ్చు. దాడికి దిగవచ్చునని విశ్లేషకులు తెలిపారు. అమెరికాకు పోటీగా రష్యా చాలా కాలం క్రితమే బాంబుల తండ్రి పేరిట శక్తివంతపు బాంబును తయారుచేసుకుంది. ఇది చాలా పెద్దది అంతేకాకుండా వాయుశక్తితో కూడినది. ప్రయోగించిన స్థలంలో ప్రకంపనలకు బదులుగా భారీ స్థాయి అగ్నివలయాలను సృష్టిస్తుందని వెల్లడైంది.

అంతరిక్షంలో స్నోమ్యాన్

భూమికి 640కోట్ల కి.మీ దూరంలో కనుగొన్న న్యూ హారిజాన్స్

వాషింగ్టన్ : న్యూ హారిజన్స్ తన ప్రయాణంలో 'స్నో మ్యాన్'(పల్లికాయ ఆకారం) ఆకృతిలో ఉన్న ఒక మంచు ప్రపంచాన్ని గుర్తించింది.'అల్టిమా టూలే' అని పిలిచే ఈ ప్రాంతం భూగ్రహం నుంచి నాలుగు వందల కోట్ల మైళ్ల దూరంలో ఉంది. తమ స్పేస్ క్రాఫ్ట్ ఈ ప్రాంతానికి చేరుకోగానే నాసా మిషన్ కంట్రోల్ రూమ్ లో సంబురాలు చేసుకున్నారు. మానవుడు ఇప్పటిదాకా శోధించని సుదూర ప్రాంతంలో అల్టిమా టూలే ఉందని ఆనంద పడ్డారు. నాలుగు వందల కోట్ల మైళ్ల దూరం అంటే ఈ ప్రాంతం దాదాపు ఆరు వందల నలభై కోట్ల కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇక్కడ కనిపించే రాతి పదార్థం ద్వారానే అనేక గ్రహాలు తయారయ్యాయని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. దీని గురించి వివరించిన న్యూ హారిజన్స్ ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ ఆలన్ స్టర్న్ సోమవారం అర్ధరాత్రి దాటాక అమెరికాకు చెందిన న్యూ హారిజన్స్ వ్యోమనౌక మనిషి చరిత్రలో ఇప్పటిదాకా శోధించని ప్రాంతానికి చేరుకుందని తెలియజేస్తున్నామని, ఈ స్పేస్ క్రాఫ్ట్‌లో ఉన్న వేలాది వ్యవస్థలు అన్నీ కలిసికట్టుగా సరిగ్గా పనిచేయడం వల్లనే ఇది సాధ్యమైంది అన్నారు.





ఆసక్తి రేపుతున్న అల్టిమా టూలే

ప్రస్తుతానికి ఇది లోరెసొల్యూషన్ ఫోటోలను మాత్రమే పంపించగలిగింది. కానీ ముందు ముందు ఇది మరింత స్పష్టమైన చిత్రాలు పంపించనుంది. కొన్ని గిగా బైట్ల కెపాసిటీ గల ఫోటోలను ఈ స్పేస్ క్రాఫ్ట్ ఇప్పటికే చిత్రీకరించిందని నాసా ప్రకటించింది. చివరగా ఇది నిన్న ఒక ఫోటోను పంపించింది. ఆ ఫొటోలో ఈ అల్టిమా టూల్ వేరుశనగ కాయ, లేదా స్నోమ్యాన్ ఆకారంలో కనిపిస్తోంది. 'ఇది ఎంత అద్భుతమైన రోజు. అల్టిమా టూలే తనలో దాచుకున్న రహస్యాలను ఇపుడు బయటపెడుతోంది. ఫోటోలు కాస్త అస్పష్టంగా ఉన్నాయి. కానీ ఆ అస్పష్టత కూడా అందంగానే ఉంది' అని న్యూ హారిజన్స్ ప్రాజెక్ట్ సైంటిస్ట్ హాల్ వీవర్ చెప్పారు.

మరింత ముందుకు...

అంతే కాదు, న్యూ హారిజన్స్ అల్టిమా టూలేను దాటి ఇంకా సుదూర ప్రాంతాలకు ప్రయాణిస్తుందని శాస్త్రవేత్తలు ఆశిస్తున్నారు. మొదట శాస్త్రవేత్తలు అల్టిమా డేటాను సేకరించే పనిని పూర్తి చేయనున్నారు. కానీ వారు ఈ మిషన్‌ను మరింత పొడిగించాలని కూడా నాసాను అడగనున్నారు. వచ్చే దశాబ్ద కాలంలో కైపర్ బెల్టులో కనీసం మరో ఆబ్జెక్ట్ గుర్తించాలని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. అయితే ఇది 2030 వరకూ తనలోని పరికరాలను ఉపయోగించడానికి వీలుగా విద్యుత్ నిల్వలు ఉపయోగించగలగాలి.

హైదరాబాద్‌కు రెండో ప్రపంచ యుద్ధవిమానం

మ్యూజియంలో సందర్శకులకు సిద్ధం

మన తెలంగాణ/హైదరాబాద్: మొదటి, రెండో ప్రపంచయుద్ధం తాలూకు జ్ఞాపకాలను ప్రజలకు పరిచయం చేయాలని ప్రభుత్వం భావిస్తుంది. రక్షణ రంగంలో ఎన్నో సంస్థలకు నిలయంగా ఉన్న హైదరాబాద్‌లో డిఫెన్స్ మ్యూజియం ఏర్పాటు చేయడానికి, తద్వారా దేశభక్తి పర్యాటకాన్ని పెంపొందించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తుంది. ఇందులో భాగంగా తొలి విడత సోవియన్ కాలం నాటి యుద్ధవిమానం (టియు 142)ను రాష్ట్రానికి కేటాయించాలని పర్యాటక కార్పోరేషన్ ఎండి బి. మనోహర్ , డిఆర్‌డిఓ చైర్మన్ సతీష్‌రెడ్డికి లేఖ రాశారు. అంతకు ముందే రాష్ట్ర పర్యాటక శాఖ తరపున కార్యదర్శి బుర్రా వెంకటేశం కేంద్ర రక్షణ శాఖకు డిఫెన్స్ మ్యూజియం ఏర్పాటుకు సహకరించాలని కోరారు. దీనికి కొనసాగింపుగా మనోహర్ లేఖ రాయగా, సతీష్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. విశాఖ బీచ్‌లో సబ్ మెరైన్ ప్రత్యేక ఆకర్షణగా ఉన్నట్లు, హైదరాబాద్‌లో ట్యాంక్‌బండ్ సమీపంలో యుద్ధవిమానాన్ని ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. ఈ తరహా యుద్ధ విమానాలు గతంలో జరిగిన ప్రపంచ యుద్ధాల్లో పాల్గొన్నాయి. రక్షణ శాఖ పరిధిలో మొత్తం సోవియట్ కాలానికి చెందిన 8 యుద్ధవిమానాలు ఉన్నాయి. ఇవి 1988 వరకు ప్రపంచవ్యాప్తంగా అత్యంత శక్తివంతమైన గాలిలో ఉన్న గూడచారి వేదికగా భావించేవారు. భారత నావికాదళంలోని అన్ని ప్రధాన చర్యల్లో కీలకంగా ఈ విమానాలు ఉపయోగించేవారు. ప్రస్తుతం ఇవి పనికిరాకుండా ఉన్నవి. ఇందులో ఒకటి ఆంధ్రప్రదేశ్‌లోని వైజాగ్‌కు, మరో యుద్ధవిమానాన్ని పశ్చిమబెంగాల్ ప్రభుత్వాలకు అందజేశారు. మిగిలిన యుద్ధ విమానాల్లో ఒకటి తెలంగాణ ప్రభుత్వానికి కేటాయించాలని కోరింది. విమానం అందించిన తర్వాత డిఆర్‌డిఓ సహకారంతో డిఫెన్స్ మ్యూజియం ఏర్పాటు చేయాలని పర్యాటక శాఖ యోచిస్తోంది. ఇది చాలా మంది యువకులను రక్షణ రంగం వైపు ప్రోత్సహించేదిగా ఉంటుందని సమాచారం.





> క్యాన్సర్‌తో పోరాడిన తర్వాత జీవితంలో చేసిన తప్పులన్నీ నాకు తెలిసి వచ్చాయి. అందుకే క్యాన్సర్ వ్యాధిని నా జీవితానికి ఒక బహుమతిగానే భావిస్తున్నా. నా జీవితంలోని కొన్ని సంఘటనలు నన్ను పూర్తిగా మారిపోయేలా చేశాయి.
>
> – బాలీవుడ్ నటి మనీషా కోయిరాలా

ముస్తాబైన ఎన్టీఆర్ కథానాయకుడు



నందమూరి బాలకృష్ణ ప్రధాన పాత్రలో నటించిన 'ఎన్టీఆర్‌కథానాయకుడు' చిత్రం సెన్సార్ పనులను పూర్తి చేసుకొని 'యు' సర్టిఫికెట్‌ను పొందింది. ఎలాంటి సెన్సార్ కట్స్ లేకుండా 2 గంటల 50 నిమిషాల నిడివితో ఈ చిత్రం ఈనెల 9న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. జాగర్లమూడి క్రిష్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో విద్యాబాలన్, రకుల్‌ప్రీత్ సింగ్ ప్రకాష్‌రాజ్, రానా దగ్గుబాటి, సుమంత్, కల్యాణ్‌రామ్ తదితరులు ముఖ్య పాత్రల్లో నటించారు. ఇప్పటికే విడుదలైన ట్రైలర్ 10 మిలియన్ వ్యూస్‌తో మంచి స్పందన దక్కించుకోవడంతో సినిమాపై అంచనాలు మరింతగా పెరిగాయి. ఎం.ఎం.కీరవాణి సంగీతాన్ని సమకూరుస్తున్న ఈ చిత్రానికి జ్ఞానశేఖర్ వి.ఎస్. సినిమాటోగ్రఫీ బాధ్యతలను నిర్వర్తించారు. ఈ చిత్రంలో నరేష్ వి.కె, మురళీశర్మ, కైకాల సత్యనారాయణ, నిత్యామీనన్, బ్రహ్మానందం తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటించారు.

శంకర్ స్ట్రయిట్ బాలీవుడ్ మూవీ

సౌత్ సినిమాల స్థాయిని అమాంతంగా పెంచిన దర్శకుల్లో శంకర్ ఒకరు. ఆయన బాలీవుడ్ సినిమాలను కూడా తలదన్నేలా పలు చిత్రాలను తెరకెక్కించిన విషయం తెలిసిందే. ఇటీవల ఆయన దర్శకత్వంలో వచ్చిన '2.0' చిత్రం ఏకంగా 550 కోట్ల బడ్జెట్‌తో రూపొందింది. ఈ చిత్రం సౌత్‌లోనే కాకుండా బాలీవుడ్, విదేశాల్లో కూడా భారీ వసూళ్లను రాబట్టింది. ఈ చిత్రంలో రజనీకాంత్, అక్షయ్‌కుమార్ కీలక పాత్రల్లో కనిపించిన విషయం తెలిసిందే.



శంకర్

అయితే ఇందులో పక్షిరాజు పాత్రకు మొదట అక్షయ్‌కుమార్‌కు బదులుగా పలువురు స్టార్స్‌ను పరిశీలించారు. ఈ క్రమంలోనే హృతిక్ రోషన్‌తో శంకర్ చర్చలు కూడా జరిపారు. అయితే హృతిక్ '2.0' చిత్రంపై పెద్దగా ఆసక్తి చూపించలేదు. దీంతో ఈ పాత్రను అక్షయ్‌కుమార్‌తో చేయించారు. సినిమా విడుదలై మంచి విజయాన్ని సొంతం చేసుకున్న నేపథ్యంలో హృతిక్ రోషన్ స్పందిస్తూ... సినిమా చాలా బాగుంది, ఇలాంటి సినిమాలు, పాత్రలను చేసేందుకు తాను ఆసక్తిగా ఉన్నట్టుగా చెప్పారు. దీంతో పాటు అతను స్వయంగా శంకర్‌తో మాట్లాడి ఓ సినిమా చేద్దామని అన్నారట. దీనికి శంకర్ కూడా ఓకే చెప్పారని తెలిసింది. ప్రస్తుతం 'భారతీయుడు' సీక్వెల్ 'ఇండియన్ 2' చిత్రాన్ని చేస్తున్న శంకర్ వచ్చే ఏడాది హృతిక్ రోషన్‌తో సినిమాను మొదలుపెట్టబోతున్నారు. '2.0' చిత్రాన్ని మించిన బడ్జెట్‌తో, అంతకు మించిన టెక్నికల్ ఎలిమెంట్స్‌తో హృతిక్‌తో మూవీ ఉంటుందని తన సన్నిహితులకు శంకర్ చెప్పారట. హృతిక్ మూవీతో శంకర్ స్ట్రయిట్ బాలీవుడ్ సినిమా చేయబోతున్నారంటూ బాలీవుడ్ మీడియాలో కూడా వార్తలు వస్తున్నాయి. అతి త్వరలోనే అధికారిక ప్రకటన కూడా వచ్చే అవకాశం ఉందని సినీ వర్గాల వారు అంటున్నారు.



హృతిక్ రోషన్



వెంకటేశ్, తమన్నా, మెహరీన్, వరుణ్‌తేజ్

కడుపుబ్బ నవ్వించే కామెడీ

సీనియర్ స్టార్ వెంకటేశ్, యంగ్ స్టార్ వరుణ్‌తేజ్ హీరోలుగా మిల్కీబ్యూటీ తమన్నా, మెహరీన్ కౌర్ హీరోయిన్లుగా తెరకెక్కిన మల్టీస్టారర్ 'ఎఫ్ 2'. యంగ్ డైరెక్టర్ అనిల్ రావిపూడి తెరకెక్కించిన ఈ చిత్రానికి 'ఫన్ అండ్ ఫ్రస్టేషన్' అనేది ట్యాగ్‌లైన్. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్‌రాజు నిర్మాణ సారథ్యంలో ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది. కడుపుబ్బ నవ్వించే కామెడీతో కుటుంబ కథా చిత్రంగా 'ఎఫ్2' తెరకెక్కింది. అయితే ఈ చిత్రం పోస్ట్‌ప్రొడక్షన్ వర్క్ శుక్రవారం పూర్తయింది. డబ్బింగ్‌కు సంబంధించిన చిన్న చిన్న కరెక్షన్స్‌ను దర్శకుడు అనిల్ రావిపూడి దగ్గరుండి చేయించారు. దేవిశ్రీ ప్రసాద్ సంగీతాన్ని అందించిన ఈ చిత్రంలో రాజేంద్రప్రసాద్ ఓ కీలక పాత్రలో నటించారు. ఈ చిత్రం సంక్రాంతి పండుగ కానుకగా ప్రేక్షకుల ముందుకు రానుంది.

మదర్ ఆఫ్ బయోపిక్స్



కంగనారనౌత్, విజయేంద్ర ప్రసాద్

కంగనా రనౌత్ టైటిల్ పాత్రలో నటించిన చిత్రం 'మణికర్ణిక'. జీ స్టూడియోస్, కమల్ జైన్ నిర్మాణంలో జాగర్లమూడి క్రిష్, కంగనా రనౌత్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. ఈ చిత్రం ఈనెల 25న విడుదలకానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటైన విలేకరుల సమావేశంలో కంగనారనౌత్ మాట్లాడుతూ ''తెలుగులో ఈ సినిమా ట్రైలర్‌ను చూశాను. అయితే క్యారెక్టర్‌కు తెలుగు వాయిస్ అందించిన ప్రతి ఒక్కరూ న్యాయం చేశారు. ఇక రచయిత విజయేంద్ర ప్రసాద్ కూడా ట్రైలర్ మీద వర్క్ చేశారు. తెలుగులో ఓ పవర్ ఉంటుంది. అందుకే నేను 'బాహుబలి'ని హిందీ, తెలుగులో కూడా చూశాను. ఇక నేను ఈ సినిమాకు డైరెక్షన్ చేయడమనేది ప్లానింగ్ ప్రకారం జరగలేదు. అది యాక్సిడెంటల్‌గా జరిగింది. ఆగస్టులో రావాల్సిన ఈ సినిమాను అనుకున్న సమయంలో పూర్తి చేయలేకపోయాం. ఆ సమయంలో దర్శకుడు క్రిష్ మరో ప్రాజెక్ట్ 'యన్.టి.ఆర్' బయోపిక్‌ను పూర్తి చేయాల్సి ఉంది. కాబట్టి ఈ సినిమాను జనవరిలో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని నేను డైరెక్ట్ చేశాను. ఇక నెక్స్ట్ కూడా ఓ సినిమాకు డైరెక్షన్ చేస్తాను. ఆ సినిమాకు విజయేంద్ర ప్రసాద్‌ను కథను అందించమని చెప్పాను. తప్పకుండా మేం కలిసి పనిచేస్తాం. ఇక దేశం కోసం రక్తం ధారపోసిన వీరుల గురించి మనం పట్టించుకోవడం లేదు. వారు మన చరిత్ర. అలాంటి వారికి గౌరవం ఇవ్వాలి. చరిత్రలో మరుగున పడిపోయిన వీరులు ఎందరో ఉన్నారు. అందుకే ఝాన్సీ రాణి కథను సినిమాగా చేయాలని అనుకున్నాం. ఈ సినిమా మేకింగ్‌లో చాలా సమస్యలను ఎదుర్కొన్నాను. షూటింగ్ ప్రారంభంలోనే నా నుదుటికి గాయమైంది. అలాగే డైరెక్టర్‌గా మారాలని కమల్ చెప్పినప్పుడు నేను ఇంత పెద్ద సినిమాను హ్యాండిల్ చేయగలనా అనే సందేహం కలిగింది. ఆ సమయంలో చాలా ఆలోచించి ఈ సినిమాకు దర్శకత్వం వహించాలని నిర్ణయం తీసుకున్నాను''అని అన్నారు. నిర్మాత కమల్ జైన్ మాట్లాడుతూ ''ప్రస్తుతం చాలా బయోపిక్స్ రూపొందుతున్నాయి. వాటి సక్సెస్ శాతం కూడా ఎక్కువగానే ఉంది. ఇప్పటివరకు వచ్చిన బయోపిక్స్‌కు 'మణికర్ణిక'ను మదర్ ఆఫ్ బయోపిక్స్ అని చెప్పవచ్చు. ఈ సినిమా చేసే సమయంలో చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నాం. వాటన్నింటినీ దాటి చేసిన సినిమా ఇది. విజయేంద్ర ప్రసాద్ అద్భుతమైన స్క్రిప్ట్‌ను అందించారు''అని పేర్కొన్నారు. ఆర్.నారాయణమూర్తి మాట్లాడుతూ ''ఎల్.వి.ప్రసాద్ నుండి రామ్‌గోపాల్ వర్మ వరకు చిత్ర పరిశ్రమలో మన తెలుగు ఖ్యాతిని చాటిన వాళ్లు ఎందరో ఉన్నారు. ఇప్పుడు 'మణికర్ణిక'కు కథ, స్క్రీన్‌ప్లే విజయేంద్ర ప్రసాద్, దర్శకుడు జాగర్లమూడి క్రిష్ అని చూసిన తర్వాత చాలా సంతోషంగా అనిపించింది. బ్లాక్‌బస్టర్ చిత్రాలకు కథ అందించిన గొప్ప రచయిత విజయేంద్ర ప్రసాద్. కేవలం తెలుగులోనే కాదు హిందీ, తమిళం, కన్నడలో గొప్ప చిత్రాలకు ఆయన పనిచేశారు. ఇప్పుడు 'మణికర్ణిక' రూపొందడంలో ఆయన కీలకభూమిక పోషించారు''అని తెలిపారు. ఈ సమావేశంలో విజయేంద్ర ప్రసాద్, తమ్మారెడ్డి భరద్వాజ పాల్గొన్నారు.

ఫైనల్‌గా ఓ ట్విస్ట్



అదా శర్మ

యంగ్ బ్యూటీ అదా శర్మ ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్‌లో జోరుగా దూసుకుపోతోంది. నిరంతరం కుర్రకారును మురిపించడం ఈ భామకు అలవాటు. అదాకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ఇప్పటికే సోషల్ మీడియాలో జోరుగా వైరల్ అవుతున్నాయి. సామాజిక మాధ్యమాల్లో తన ఫాలోయింగ్‌ను పెంచుకునేందుకు ఈ భామ వేసే ఒక్కో ఎత్తుగడ మామూలుగా లేదు. తాజాగా ఈ బ్యూటీ బెల్లీ నృత్యం, బీర్ బాటిల్ కాన్సెప్ట్‌తో మరోసారి ఓ రేంజులో విరుచుకుపడింది. బెల్లీ డ్యాన్స్‌తో అదరగొడుతున్న లేటెస్ట్ వీడియో ఇప్పుడు జోరుగా వైరల్ అవుతోంది. అదా చేసిన బెల్లీ డ్యాన్స్ కుర్రకారుకు ఊపిరి సలపనివ్వడం లేదు. ఈ వీడియోలో ఫైనల్‌గా ఓ ట్విస్ట్ ఇచ్చింది ఈ బ్యూటీ. మద్యానికి బానిసై జీవితాలను నాశనం చేసుకుంటున్న వారికి కనువిప్పు కలిగేలా ఈ వీడియోను ఆమె పోస్టు చేయడం విశేషం.

భాష ఏదైనా స్క్రిప్ట్ బావుంటే చేస్తా

రామ్‌చరణ్ హీరోగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కిన భారీ కమర్షియల్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'వినయ విధేయ రామ'. బాలీవుడ్ బ్యూటీ కియారా అద్వాని హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రాన్ని డివివి ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై దానయ్య డి.వి.వి. నిర్మించారు. ఈ చిత్రం ఈనెల 11న విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ కియారా అద్వానీతో ఇంటర్వ్యూ విశేషాలు...



కియారా అద్వానీ

అద్భుతమైన అనుభవం...

ఈ సినిమాలో రామ్‌చరణ్, వివేక్ ఒబెరాయ్, ప్రశాంత్, ఆర్యన్ రాజేష్, స్నేహ వంటి 15 మంది అగ్ర నటులతో కలిసి నటించడమనేది అద్భుతమైన అనుభవం. సినిమా చాలా గ్రాండ్‌గా వచ్చింది.

చాలా రోజుల తర్వాత...

దర్శకుడు బోయపాటి శ్రీను ఈ సినిమా కథ చెప్పినప్పుడు పూర్తి సినిమా చూసేశాననే ఫీలింగ్ కలిగింది. చాలా రోజుల తర్వాత ఒక మంచి ఫ్యామిలీ స్టోరీ విన్నాననిపించింది. దీంతో వెంటనే ఈ సినిమాకు ఓకే చెప్పేశాను.

అది బోయపాటికే సాధ్యం...

బోయపాటి అద్భుతమైన దర్శకుడు. సహజమైన అంశాలను తెరకెక్కించడం వేరు... కానీ ఏదైతే నమ్మడానికి వీల్లేకుండా ఉంటాయో వాటిని నమ్మేంతగా, మైమరపించేవిధంగా స్క్రీన్‌పై చూపించడం చాలా కష్టం. అది బోయపాటి వంటి ఫిల్మ్‌మేకర్స్‌కే సాధ్యమవుతుంది. ఇది ఆయన బ్రాండ్ ఫిలిం.

వినయంగా ఉంటా...

సినిమాలో నాకు, చరణ్‌కు మధ్య కెమిస్ట్రీ ఎంతో ఆసక్తికరంగా ఉంటుంది. ఇందులో నా క్యారెక్టర్ పేరు సీత. కుటుంబంలో అందరి ముందు చాలా వినయంగా ఉంటూ రామ్ ఏది చెబితే అది అన్నట్టుగా ఉంటాను. కానీ బయట మాత్రం చాలా దూకుడుగా ఉంటాను. చరణ్, నా కాంబినేషన్‌లోని సీన్స్ ప్రేక్షకులను ఎంతగానో అలరిస్తాయి.

అదే అనుభూతి కలిగింది...

నాకు డ్యాన్స్ అంటే చాలా ఇష్టం. పూర్తిగా డ్యాన్స్, కామెడీకి మంచి స్కోప్ ఉన్న సినిమాలో నటించే అవకాశం దొరికినప్పుడు ఎంతో ఆనందం కలుగుతుంది. 'వినయ విధేయ రామ' చేసినప్పుడు అదే అనుభూతి కలిగింది.

చాలా ఎంజాయ్ చేశా...

రామ్‌చరణ్ వంటి మంచి డ్యాన్సర్‌తో స్టెప్స్ వేస్తూ చాలా ఎంజాయ్ చేశాను. ఇందులోని 'రామా వెడ్స్ సీత...' పాట ఇప్పటివరకు నేను చేసిన సాంగ్స్‌లో ఫేవరేట్. ఈ పాటను 800 మంది డ్యాన్సర్లతో చాలా గ్రాండ్‌గా తెరకెక్కించారు.

గ్లోబల్ ఆడియన్స్‌ను...

నేను కేవలం ఒకే భాషలో సినిమాలు చేయాలనుకోను. గ్లోబల్ ఆడియన్స్‌ను ఎంటర్‌టైన్ చేయాలని కోరుకుంటాను. భాష ఏదైనా స్క్రిప్ట్ బావుంటే సినిమా చేయడానికి నేను సిద్ధమే.

నెక్స్ట్ మూవీ...

'అర్జున్ రెడ్డి' రీమేక్‌లో నటిస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది. సినిమాలోని చివరి సీన్ నుండి షూటింగ్‌ను ప్రారంభించారు. అయితే బాలీవుడ్ నేటివిటీకి అనుగుణంగా ఈ రీమేక్‌లో చిన్న చిన్న మార్పులు చేశారు. ఈ రీమేక్ ఢిల్లీ బ్యాక్‌డ్రాప్‌లో ఉంటుంది.

ముక్కు పిండి వసూలు చేస్తోంది

శృతిహాసన్ తన కెరీర్‌ను ఫ్లాపులతో మొదలుపెట్టింది. కానీ పవన్‌కళ్యాణ్ చిత్రం 'గబ్బర్‌సింగ్'లో నటించిన తర్వాత ఈ భామ కెరీర్ పూర్తిగా మారిపోయింది. అతి తక్కువ కాలంలోనే స్టార్ హీరోయిన్‌గా మారింది. కానీ గత రెండేళ్లలో మళ్లీ ఫ్లాపులతో శృతికి సినిమా అవకాశాలు తగ్గాయి. బాయ్‌ఫ్రెండ్ మైఖేల్ కోర్సలేతో ప్రేమ వ్యవహారం కూడా ముదిరి పాకాన పడడంతోనే ఆమె సినిమాలకు దూరమైందనే టాక్ కూడా ఉంది. తాజాగా శృతిహాసన్ ఒక హిందీ సినిమాకు సైన్ చేసింది. 'ఠాకూర్ దేవదాస్' అనే టైటిల్‌తో తెరకెక్కే ఈ సినిమాలో విద్యుత్ జమ్వాల్ హీరోగా నటిస్తున్నాడు. నసీరుద్దీన్ షా, అమోల్ పాలేకర్ ఈ చిత్రంలో ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. అయితే ఈ సినిమాలో హీరో విద్యుత్ కంటే శృతి డబుల్ రెమ్యునరేషన్ తీసుకుంటోందట. అంతేకాదు ఈ సినిమాకు పేమెంట్‌ను డెయిలీ బేసిస్‌లో అడ్వాన్సుగా తీసుకుంటోందని తెలిసింది. తన మేనేజర్ అడ్వాన్సు ముట్టిందని చెబితేనే ఆ రోజు షూటింగ్‌లో పాల్గొంటోందట. శృతి వాలకం చూస్తుంటే ముక్కు పిండి మరీ నిర్మాతల దగ్గర డబ్బు వసూలు చేస్తున్నట్టుగా అనిపిస్తోంది. ప్రస్తుతం శృతిహాసన్ ఈ ఒక్క సినిమాలోనే నటిస్తోంది. అయితే రాబోయే రోజుల్లో ఈ భామ మళ్లీ తెలుగు, తమిళ్ సినిమాలలో కూడా నటించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇస్తుందా అనేది ఇంకా తెలియదు.



శృతిహాసన్

'యోనో' యాప్‌కు అద్భుత స్పందన

వార్షిక 'మీట్ టు గ్రీట్'లో ఎస్‌బిఐ చీఫ్ జిఎం మణి పాల్వేసన్



మన తెలంగాణ/ హైదరాబాద్: ఎస్‌బిఐ ఎల్‌హెచ్‌ఒ అమరావతి వార్షికోత్సవం సందర్భంగా 'మీట్ టు గ్రీట్' నిర్వహించింది. ఆంధ్రప్రదేశ్‌లో ఎస్‌బిఐ ఆపరేషన్ల ముఖ్యాంశాలను బ్యాంక్ చీఫ్ జనరల్ మేనేజర్ మణి పాల్వేసన్ ఈ సందర్భంగా వెల్లడించారు. ఏడాది క్రితం ఎస్‌బిఐ 'యోనో' యాప్‌ను ప్రారంభించింది. సమగ్ర డిజిటల్ బ్యాంకింగ్ వేదికగా రూపొందించిన ఈ యోనో(యు ఓన్లీ నీడ్ వన్) యాప్ వినియోగదారులకు టాక్సి, విమాన, రైల్వే బుకింగ్, ఆన్‌లైన్ షాపింగ్ వంటి పలు రకాల ఆర్థిక సేవలను అందిస్తోంది. ఒక్క యాప్ ద్వారా ఎన్నో సేవలను పొందవచ్చని, ఈ యాప్‌ను తమ పాత, కొత్త కస్టమర్లు స్వాగతించారని ఆయన అన్నారు.

వాణిజ్య అవసరాల కోసం ఎయిర్ వింగ్స్ ఎయిర్ కూలర్లు

హైదరాబాద్: తాత్కాలిక, తక్షణ వాణిజ్య, ఇతర అవసరాల కోసం ఎయిర్ వింగ్స్ ఎయిర్ కూలర్లను ప్రారంభించింది. కంపెనీ ఎండి వెంకటేశ్వర్ దీనిని ఆవిష్కరించారు. ఎయిర్ వింగ్స్ ఎయిర్ కండిషనర్లు ఈవెంట్‌లు, ప్రదర్శలు, వివాహాలు, కార్పొరేట్ ఈవెంట్లు, ఇతర బాహ్య కార్యక్రమాలకు ఉపయోగపడతాయి. తొలిసారిగా దక్షిణ భారత్‌లో ఈ కార్యక్రమాలను నిర్వహించి, ఆ తర్వాత ఉత్తర భారత్‌కు విస్తరించాలని కంపెనీ ప్రయత్నిస్తోంది.

కేర్ అండ్ షేర్‌కు రాయబారిగా కబీర్ బేడీ

హైదరాబాద్: ఇటలీకి చెందిన కేర్ అండ్ షేర్ ఇటాలియాకు రాయబారిగా నటుడు కబీర్ బేడిని నియమించారు. ఈ విషయాన్ని కేర్ అండ్ షేర్ ప్రెసిడెంట్ టోమసో కారరో ప్రకటించారు. దేశంలో అట్టడుగు వర్గాలకు చెందిన, విద్యా వ్యవస్థకు దూరమైన పిల్లలకు తన 'స్ట్రీట్2స్కూల్' కార్యక్రమంతో ఇటలీకి చెందిన కేర్ అండ్ షేర్ మద్దతును అందిస్తోంది.

ఎస్‌బిఐతో జెట్ ఎయిర్‌వేస్ చర్చలు

న్యూఢిల్లీ: అప్పుల ఊబిలో కూరుకుపోయిన ప్రైవేటు విమానయాన సంస్థ జెట్ ఎయిర్‌వేస్ నిధుల సమీకరణ కోసం ఎస్‌బిఐ(స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా) అధికారులతో చర్చలు నిర్వహిస్తోంది. వర్కింగ్ క్యాపిటల్ అవసరాల కోసం రూ.1500 కోట్లు సమీకరించేందుకు జెట్ ఎయిర్వేస్ ప్రయత్నాలు చేస్తోంది. ఈమేరకు కంపెనీకి చెందిన అధికారులు మీడియాతో పేర్కొన్నారు. ఇప్పటికే విమాన సంస్థ రుణాలకు వడ్డీలు చెల్లించలేక ఆలస్యం చేసింది. ఈ పరిస్థితుల్లో రుణ భారం నుంచి బయటపడేందుకు నిధుల సమీకరణకు ప్రయత్నిస్తోంది. నగదు కొరత సమస్య వల్ల ఎస్‌బిఐ ఆధ్వర్యంలోని రుణదాతల కన్సార్టియంకు వడ్డీ చెల్లింపు ఆలస్యమైందని రెండు రోజుల క్రితం జెట్ ఎయిర్‌వేస్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు తెలియజేసింది. తొలిసారి జెట్ ఎయిర్‌వేస్ రుణాల వడ్డీ చెల్లింపులో డిఫాల్ట్ అయింది. అదే సమయంలో జెట్ ఎయిర్‌వేస్ క్రెడి ట్ రేటింగ్‌ను 'సి' నుంచి 'డి'కి ఐసిఆర్‌ఎ తగ్గించింది.

స్టాక్ మార్కెట్

ఈ రోజు మార్కెట్ ముగింపు		మార్పు	%
సెన్సెక్స్	35,695.10	181.39	(0.51%)
నిఫ్టీ	10,727.35	55.10	(0.52%)

కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	70.03
యూరో	79.75
బ్రిటిష్ పౌండ్	88.44
ఆస్ట్రేలియన్ డాలర్	49.18
కెనెడియన్ డాలర్	51.91
సింగపూర్ డాలర్	51.40
స్విస్ ఫ్రాంక్	70.92
చైనీస్ యువాన్	10.20
మలేషియన్ రింగిట్	16.92
న్యూజిలాండ్ డాలర్	46.88
హాంకాంగ్ డాలర్	8.94
జపనీస్ యెన్	0.65
కువైట్ దినార్	230.86
సౌతాఫ్రికన్ రాండ్	4.90

బులియన్



బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22 క్యారట్	24 క్యారట్	మార్పు(%)
చెన్నై	30480	32598.93	0.13%
ముంబై	31280	33454.55	2.02%
ఢిల్లీ	31200	33368.98	0.16%
కోల్‌కతా	31610	33807.49	0.25%
కేరళ	29750	31818.18	1.19%
బెంగళూరు	29950	32032.09	0.3%
హైదరాబాద్	30480	32598.93	0.13%
గల్ఫ్	137.68	147.25	1.38%

వెండి ధర (రూ./ కిలో)

చెన్నై	₹ 42365.00
ముంబై	₹ 42365.00
ఢిల్లీ	₹ 42365.00
కోల్‌కతా	₹ 42365.00
హైదరాబాద్	₹ 42365.00



విలీనం వల్ల ఉద్యోగాలు పోవు

- పెద్ద బ్యాంకును సృష్టించేందుకే ఈ విలీనం
- దివాలా చట్టంతో ఎన్‌పిఎలు తగ్గాయి
- కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ



న్యూఢిల్లీ : ప్రభుత్వరంగ బ్యాంకుల విలీనం వల్ల ఎలాంటి ఉద్యోగాల కోత ఉండబోదని కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ స్పష్టం చేశారు. బ్యాంక్ ఆఫ్ బరోడాలో విజయా బ్యాంక్, దేనా బ్యాంక్‌లను విలీనానికి ఇటీవల కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. 'ప్రభుత్వరంగ బ్యాంకుల విలీనం వల్ల ఉద్యోగాల్లో ఎలాంటి కోత ఉండదు. ఎస్‌బిఐ(స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా) వంటి పెద్ద బ్యాంకులను సృష్టించే ప్రక్రియలో భాగంగానే ఈ విలీనం నిర్ణయం తీసుకున్నాం' అని జైట్లీ శుక్రవారం లోక్‌సభలో వెల్లడించారు. పెద్ద బ్యాంకుల సృష్టితో రుణ వ్యయం కూడా తగ్గుతుందని అన్నారు. 21 ప్రభుత్వరంగ బ్యాంకుల్లో 11 బ్యాంకులు పిఏసి(తక్షణ దిద్దుబాటు చర్య) పరిధిలో ఉన్నాయి. మొండి బకాయిలు ఎక్కువగా ఉన్న బ్యాంకుల కోసం ఆర్‌బిఐ పిఏసి నిబంధనలను విధించింది. ఎస్‌బిఐ లాంటి ప్రభుత్వ రంగ బ్యాంకులు లాభాల్లో నడుస్తున్నాయని, అయితే బ్యాంకుల్లో పేరుకుపోయిన మొండి బకాయిల వల్ల నష్టాలు తప్పడం లేదని జైట్లీ అన్నారు. దివాల చట్టం సాయంతో రూ. 3లక్షల కోట్లను తిరిగి వ్యవస్థలోకి తెవడమే కాక ఎన్‌పిఎ(నిరర్థక ఆస్తులు)లు కూడా గణనీయంగా తగ్గాయని తెలిపారు. ప్రభుత్వ రంగ బ్యాంకుల రీక్యాపిటలైజేషన్ కింద డిసెంబరు 31 నాటికి రూ. 51,533 కోట్లను బ్యాంకులకు ఇచ్చినట్లు జైట్లీ వివరించారు. దీని గురించి జైట్లీ 2018–19 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ అంచనాల్లో రూ. 65వేల కోట్లను ప్రభుత్వ రంగ బ్యాంకుల రికాపిటలైజేషన్ కోసం కేటాయించామని, దీనిలో భాగంగా డిసెంబరు 31 నాటికి రూ. 51,533 కోట్లను బ్యాంకులకు అందజేశామని ఆయన అన్నారు. కాగా ఈ నెల 2వ తేదీనాడు మూడు ప్రభుత్వ రంగ బ్యాంకులను విలీనం చేసేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 2019 ఏప్రిల్ 1 నుంచి ఈ విలీనం అమల్లోకి రానుంది. విజయా బ్యాంక్, దేనా బ్యాంక్ ఉద్యోగులు అంతా బ్యాంక్ ఆఫ్ బరోడాకు బదలీ కానున్నారని కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్ ప్రకటించారు. అయితే కేబినెట్ బేటీ అనంతరం మంత్రి రవిశంకర్ ప్రసాద్ కూడా విలీనంతో ఉద్యోగుల సేవల పరిస్థితులపై ఎలాంటి ప్రభావం ఉండదని అన్నారు. విలీనం వల్ల ఎవరి తొలగింపు ఉండబోదని కూడాస్పష్టం చేశారు. బ్యాంక్ ఆఫ్ బరోడాను అంతర్జాతీయంగా పోటీపడే బ్యాంక్‌గా రూపొందించాలనే ఆలోచనతోనే ఈ విలీనం చేపట్టామని ఆయన వివరించారు.

గతేడాది సెప్టెంబర్‌లో ప్రభుత్వం ప్రకటించినట్టుగా విజయా బ్యాంక్, దేనా బ్యాంక్‌లు బ్యాంక్ ఆఫ్ బరోడా(బిఒబి)లో విలీనం కానున్నాయి. గతంలో ఓ పెద్ద బ్యాంకుతో చిన్న బ్యాంకును విలీనం చేసేవారు. అయితే దేశంలో మూడు బ్యాంకులను ఇలా విలీనం చేయడం ఇదే తొలిసారి. ఈ విలీనంతో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బిఐ) తర్వాత ఇది రెండో అతిపెద్ద ప్రభుత్వరంగ బ్యాంక్ కానుంది. విజయా బ్యాంక్, దేనా బ్యాంక్ విలీనం కోసం బిఒబి కూడా షేర్ స్వాప్ రేషియోను ఖరారు చేసింది. దీని ప్రకారం, విలీనంలో భాగంగా విజయా బ్యాంక్ వాటాదారులు ప్రతి వెయ్యి షేర్లకు గాను 402 ఈక్విటీ షేర్లను పొందనున్నారు. అలాగే దేనా బ్యాంక్ వాటాదారులు ప్రతి వెయ్యి షేర్లకు గాను 110 ఈక్విటీ షేర్లను పొందుతారు. గతంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో దాని అనుబంధ బ్యాంకులను ప్రభుత్వం విలీనం చేసింది. రెండో దశలో ఇప్పుడు బ్యాంక్ ఆఫ్ బరోడాలో దేనా బ్యాంక్, విజయాబ్యాంక్‌లను విలీనం చేయడానికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది.

ఎస్‌బిఐఐ విలీనం సక్సెస్ కావడంతో రెండో దశ మీద అందరి దృష్టి నెలకొంది. ఇక మూడో దశలో పలు ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల విలీనానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. ఈ మూడు బ్యాంకుల్లో బ్యాంక్ ఆఫ్ బరోడా వ్యాపారం రూ.10,29,811 కోట్లుగా ఉంది. ఆ తర్వాత విజయా బ్యాంక్ రూ.2,79,674 కోట్లు, దేనా బ్యాంక్ రూ.1,72,937 కోట్లు వ్యాపారం చేస్తున్నాయి. ఈ మూడు బ్యాంకులు విలీనం అయితే మొత్తం వ్యాపార విలువ రూ.14,82,422 కోట్లకు చేరుతుంది. బ్యాంక్ ఆఫ్ బరోడాలో 56,361 మంది సిబ్బంది, విజయా బ్యాంక్‌లో 15,874, దేనా బ్యాంక్‌లో 13,440 మంది ఉద్యోగులు ఉన్నారు. విలీనం పూర్తయితే 85,675 మంది ఉద్యోగులు అవుతారు. ఈ విలీనానికి వ్యతిరేకంగా గతేడాది డిసెంబర్ 26న బ్యాంక్ ఉద్యోగులు సమ్మె నిర్వహించిన విషయం తెలిసిందే.

రూ.40 వేలు దాటిన కిలో వెండి

పసిడి పరుగుకు బ్రేకులు



న్యూఢిల్లీ: వరుసగా మూడు రోజులుగా పెరుగుతూ వస్తున్న బంగారం పరుగుకు శుక్రవారం బ్రేక్ పడింది. అయితే మరోవైపు వెండి ధర మాత్రం గణనీయంగా పెరిగింది. వరుసగా నాలుగో రోజు ధర పెరగడంతో బులియన్ మార్కెట్లో కిలో వెండి రూ.40వేల మార్క్ దాటింది. శుక్రవారం ఒక్కరోజే రూ. 440 పెరిగి కిలో ధర రూ. 40,140కు చేరింది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి డిమాండ్ ఊపందుకోవడంతో ధర పెరిగినట్లు మార్కెట్ వర్గాలు తెలిపాయి. మరోవైపు బంగారం ధర మాత్రం కాస్త దిగొచ్చింది. డాలర్‌తో రూపాయి బలపడటంతో పాటు స్థానికంగా కొనుగోళ్లు తగ్గడంతో 10 గ్రాముల పసిడి ధర రూ. 145 తగ్గి రూ. 32,690గా చేరింది. అంతర్జాతీయంగా ఈ లోహాల ధరలు స్వల్పంగా పెరగ్గా, గత మూడు రోజుల్లో బంగారం ధర రూ. 565 పెరిగింది. న్యూయార్క్ మార్కెట్లో ఔన్సు బంగారం ధర 1293.61 డాలర్లు, ఔన్సు వెండి ధర 15.75 డాలర్లుగా ఉంది. దేశ రాజధాని ఢిల్లీలో 10 గ్రాముల 99.9 శాతం స్వచ్ఛత కల్గిన బంగారం ధర రూ. 145 తగ్గి రూ. 32, 690కు చేరగా, 99.5 శాతం శాతం స్వచ్ఛత కల్గిన బంగారం ధర స్వల్పంగా తగ్గి రూ. 32, 540గా నమోదైంది. ఇక గోల్ బాండ్ల ధరల్లో పెద్దగా మార్పు లేదు. ఎనిమిది గ్రాముల గోల్ బాండ్ ధర రూ. 25, 200గా ఉంది.

అనిల్ అంబానీని జైలులో పెట్టండి

సుప్రీంకోర్టులో ఎరిక్సన్ పిటిషన్



న్యూఢిల్లీ: రిలయన్స్ కమ్యూనికేషన్స్(ఆర్‌కామ్) ఛైర్మన్ అనిల్ అంబానీకి వ్యతిరేకంగా స్వీడన్ టెలికామ్ పరికరాల సంస్థ ఎరిక్సన్ తాజాగా సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దేశం విడిచి వెళ్లకుండా నిరోధించాలని, తమ కంపెనీకి రూ.550 కోట్లు చెల్లించేంత వరకు ఆయన్ని జైలులో నిర్బంధించాలని ఎరిక్సన్ కోరింది. అనిల్ అంబానీ తమ కంపెనీకి అప్పులు చెల్లించకుండా విదేశాలకు పారిపోకుండా చూడాలని పిటిషన్‌లో ఎరిక్సన్ పేర్కొంది. అలాగే కంపెనీ ఛైర్మన్ అనిల్ సహా ఈ కంపెనీలకు చెందిన ఇతర అధికారులు దేశం విడిచిపోకుండా నివారించాలని, హోం మంత్రిత్వశాఖ ద్వారా చర్యలు తీసుకోవాలని కోరింది. అంతేకాదు గడువులోపు బాకీ చెల్లించకుండా కోర్టు ధిక్కరణకు పాల్పడినందుకుగాను అనిల్ అంబానీని జైలుకు పంపాలని డిమాండ్ చేసింది. చాలాకాలంగా ఆర్‌కాం చెల్లింపుల కోసం ఎదురుచూస్తున్నామని సంస్థ పేర్కొంది. రూ.550 కోట్ల చెల్లింపునకు అంబానీ కోర్టులో వ్యక్తిగత హామీ ఇచ్చారు, అయితే కోర్టు ఆదేశాలను ఉల్లంఘించడం ఇది రెండవసారి అని ఆ సంస్థ వెల్లడించింది. ఈ నేపథ్యంలో ఆర్‌కాంపై దివాలా చర్యలు చేపట్టాలని ఎరిక్సన్ సీనియర్ అడ్వకేట్ అనిల్ ఖేర్ కోర్టును కోరారు.

త్వరలో ముసాయిదా

ఇ–కామర్స్ విధానం ధ్రువీకరిస్తాం



– కేంద్ర మంత్రి సురేష్ ప్రభు

న్యూఢిల్లీ: ఇ–కామర్స్ సంస్థలకు కఠిన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు(ఎఫ్‌డిఐ) నిబంధనలను ప్రతిపాదించడం పట్ల సిఎఐటి(అఖిల భారత వ్యాపారుల సమాఖ్య) హర్షం వ్యక్తం చేసింది. ఎలాంటి మార్పులు చేయకుండా ముసాయిదా ఇ–కామర్స్ ఎఫ్‌డిఐ విధానానికి ఆమోదం తెలపాలని కేంద్ర వాణిజ్య మంత్రి సురేష్ ప్రభును సిఎఐటి కోరింది. సిఎఐటి బృందంతో మాట్లాడిన ప్రభు.. త్వరలో ప్రభుత్వం కొత్త ఇ–కామర్స్ విధానాన్ని ధ్రువీకరిస్తుందని అన్నారు. ప్రతిపాదిత ఇ–కామర్స్ నిబంధనలపై ఆన్‌లైన్ సంస్థలు వ్యతిరేకత వ్యక్తం చేయడంపై సిఎఐటి ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ఖాండేల్వాల్ స్పందించారు. ఇటీవల ఇ–కామర్స్‌లో సవరించిన ఎఫ్‌డిఐ నిబంధనలను అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి సంస్థలు వ్యతిరేకించడాన్ని సిఎఐటి తీవ్రంగా ఖండిస్తోందని అన్నారు.

ఫ్యూచర్ రిటైల్‌పై కొత్త నిబంధనల ఎఫెక్ట్

ఇ–కామర్స్ వ్యాపారంపై కేంద్ర ప్రభుత్వం కఠిన నిబంధనలు రూపొందించడంతో ఆన్‌లైన్ సంస్థలు తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నాయి. అయితే మరోవైపు ఈ కొత్త నిబంధనలు ఫ్యూచర్ రిటైల్‌పై ప్రభావం చూపుతున్నాయి. మార్కెట్లో ఈ షేరు విక్రయాలు పెరిగాయి. దీంతో ఈ కౌంటర్ నేల చూపులకే పరిమితమవుతోంది. ఈ బాటలో ప్రస్తుతం ఫ్యూచర్ రిటైల్ షేరు ఎన్‌ఎస్‌ఇలో మరోసారి 2 శాతం పతనమైంది. తొలుత రూ. 441 వద్ద 52 వారాల కనిష్టాన్ని తాకిన షేరు విలువ, ఆఖరికి రూ.450 వద్ద ముగిసింది. దీంతో కంపెనీలో 10 శాతం వాటా కొనుగోలుకి ఒప్పందాన్ని కుదుర్చుకున్న ఈకామర్స్ సంస్థ అమెజాన్ వెనకడుగు వేసే అవకాశమున్నట్లు పరిశ్రమవర్గాలు పేర్కొంటున్నాయి. విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ మార్గంలో ఫ్యూచర్ రిటైల్‌లో రూ. 2,000 కోట్లతో వాటాను కొనుగోలు చేసేందుకు ఇప్పటికే అమెజాన్ ఆసక్తి చూపినట్లు వార్తలు వెలువడ్డాయి.

రూ.2 వేల నోట్ల ముద్రణపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు

ఆర్థికశాఖ కార్యదర్శి సుభాష్ గార్గ్



న్యూఢిల్లీ: రూ.2 వేల నోట్లపై వెలువడుతున్న ఊహాగానాలపై ఆర్థికశాఖ కార్యదర్శి సుభాష్ చంద్ర గార్గ్ స్పష్టతనిచ్చారు. ప్రస్తుతం వ్యవస్థలో అవసరమైన దాని కంటే ఎక్కువగానే రూ.2వేల నోట్లు చలామణిలో ఉన్నాయని, రూ.2వేల నోట్ల ముద్రణ విషయంపై ఇంకా ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని అన్నారు. రూ.2వేల నోట్లు దాదాపు 35 శాతం నోట్లు చలామణీలో ఉన్నాయి. రూ.2వేల నోట్ల ముద్రణకు సంబంధించి ప్రస్తుతం ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని ఆయన స్పష్టం చేశారు. అవసరాన్ని బట్టి నోట్ల ముద్రణ ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. రిజర్వు బ్యాంకు రూ.2000 నోట్ల ముద్రణను తగ్గించిందని ఆర్థికశాఖ ఉన్నతాధికారి వెల్లడించినట్టు వార్తలు వెలువడిన విషయం తెలిసిందే. 2016 నవంబరు 8న రూ.1000, రూ.500 నోట్లను రద్దు చేసిన తర్వాత కొత్త రూ.2వేల నోటును ప్రవేశపెట్టారు.

రెండు రోజుల నష్టాలకు బ్రేక్



న్యూఢిల్లీ: రెండు రోజుల నష్టాలకు బ్రేక్ పడింది. శుక్రవారం ప్రభుత్వరంగ బ్యాంకులు, మెటల్ స్టాక్స్‌లో కొనుగోళ్లు వెల్లువెత్తడంతో మార్కెట్లు లాభపడ్డాయి. చివరి రెండు గంటల్లో కొనుగోళ్లు ఊపందుకున్నాయి. ఆఖరికి సెన్సెక్స్ 181 పాయింట్లు పెరిగి 35,695 వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ 55 పాయింట్లు పుంజుకుని 10,727 వద్ద స్థిరపడింది. అయితే గురువారం అమెరికా స్టాక్ మార్కెట్లు భారీగా నష్టపోయినప్పటికీ హుషారుగా ప్రారంభమై హెచ్చుతగ్గుల మధ్య లాభాలతో ముగిసాయి. ఆసియాలో మిశ్రమ ట్రెండ్ కనిపించినా యూరోపియన్ మార్కెట్లు లాభాలతో ప్రారంభంకావడంతో దేశీయంగానూ సూచీలు సానుకూలంగా స్పందించాయని విశ్లేషకులు పేర్కొన్నారు. ఎన్‌ఎస్‌ఇలో ఐటీ ఇండెక్స్ 1.25 శాతం క్షీణించగా, మిగిలిన అన్ని రంగాలూ లాభపడ్డాయి. పిఎస్‌యు బ్యాంక్స్ 2.3 శాతం లాభపడ్డాయి. మెటల్, రియల్టీ, ప్రయివేట్ బ్యాంక్స్, ఫార్మా 1.40.7 శాతం మధ్య ఎగశాయి. ప్రధానంగా భారతి ఇన్‌ఫ్రాటెల్, వేదాంత, యస్ బ్యాంకు, టాటా మోటార్స్, భారతి ఎయిర్‌టెల్ వంటి కంపెనీల షేర్లు లాభపడ్డాయి. హెచ్‌సిఎల్ టెక్, టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, టిసిఎస్, హీరో మోటోకార్ప్ తదితర కంపెనీల షేర్లు నష్టపోయాయి. బిఎస్‌ఇ మిడ్ క్యాప్ ఇండెక్స్ 0.5 శాతం బలపడింది. ట్రేడైన మొత్తం షేర్లలో 1,340 లాభపడగా, 1,260 షేర్లు నష్టాలతో ముగిశాయి. గురువారం విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పిఐలు) రూ. 973 కోట్ల విలువైన స్టాక్స్ విక్రయించారు. మరోవైపు దేశీ ఫండ్స్(డిఐఐలు) రూ. 34.5 కోట్లు మాత్రమే ఇన్వెస్ట్ చేశాయి.

టాప్ గెయినర్స్ (+)

కంపెనీ పేరు	గరిష్టం	కనిష్టం	ముగింపు ధర	క్రితం ముగింపు	మార్పు	లాభం%
భారతీ ఇన్‌ఫ్రాటెల్	288.50	272.00	285.05	271.60	13.45	4.95
యస్ బ్యాంక్	190.30	181.55	189.65	184.10	5.55	3.01
టాటా మోటర్స్	171.95	168.50	170.95	166.05	4.90	2.95
భారతీ ఎయిటెల్	324.70	312.45	322.45	313.50	8.95	2.85
వేదాంత	194.45	186.65	192.90	187.95	4.95	2.63
ఒఎన్‌జిసి	146.20	142.05	145.70	142.40	3.30	2.32
ఎస్‌బిఐ	299.00	291.50	297.65	291.10	6.55	2.25
బిపిసిఎల్	361.70	351.50	359.45	352.50	6.95	1.97
యాక్సిస్ బ్యాంక్	624.75	609.50	619.60	607.95	11.65	1.92
జెఎస్‌డబ్ల్యూ స్టీల్	289.45	280.70	287.95	282.65	5.30	1.88

టాప్ లూజర్స్ (-)

కంపెనీ పేరు	గరిష్టం	కనిష్టం	ముగింపు ధర	క్రితం ముగింపు	మార్పు	నష్టం%
హెచ్‌సిఎల్	950.55	925.00	932.35	948.35	16.00	1.69
టెక్ మహీంద్ర	697.05	672.50	681.10	691.25	10.15	1.47
టిసిఎస్	1,901.20	1,841.00	1,876.85	1,899.95	23.10	1.22
ఇన్ఫోసిస్	673.90	651.00	661.05	669.15	8.10	1.21
హీరో మోటోకార్ప్	3,045.00	2,972.05	2,987.85	3,014.65	26.80	0.89
ఇండస్‌ఇండ్ బ్యాంకు	1,571.00	1,540.20	1,548.20	1,560.10	11.90	0.76
ఐచర్ మోటర్స్	20,648.05	20,001.00	20,103.60	20,211.45	107.85	0.53
సన్‌ఫార్మా	439.90	432.20	433.80	436.10	2.30	0.53
లార్సన్	1,407.60	1,373.55	1,388.05	1,395.00	6.95	0.50
బజాజ్ ఫైనాన్స్	2,611.90	2,563.65	2,576.05	2,586.20	10.15	0.39





సుందర కశ్మీర్ మంచుదుప్పటి కప్పుకుంది. వీధులన్నీ మంచుతో శ్వేతవర్ణాన్ని సంతరించుకున్నాయి. అయితే నిరాటంకంగా కురుస్తున్న మంచువల్ల కశ్మీరీలు బయటికి రాలేకపోతున్నారు. రోజువారీ కార్యకలాపాలు చేసుకోలేకపోతున్నారు.

ఎరువుల సబ్సిడీ నేరుగా బదిలీ?

నీతి ఆయోగ్ కమిటీ పరిశీలన

న్యూఢిల్లీ: ఎరువుల సబ్సిడీని రైతులకు నేరుగా బదిలీ చేసే విషయాన్ని నీతి ఆయోగ్ ఏర్పాటు చేసిన ఒక కమిటీ పరిశీలిస్తోందని, దాని నివేదిక అందాల్సి ఉందని కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి రావు ఇందర్‌జిత్ సింగ్ శుక్రవారం రాజ్యసభలో చెప్పారు. సబ్సిడీని నేరుగా రైతులకు అందజేయాలన్నది ప్రభుత్వ ఆలోచన అని ప్రశ్నోత్తరాల సమయం సందర్భంగా ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. జిల్లాలో ఎరువులు అందుకొన్నప్పుడు సబ్సిడీ అందించే విధానంనుంచి పాయింట్ ఆఫ్ సేల్ మిషన్ల ద్వారా ఎరువుల విక్రయానికి మారుస్తూ నేరుగా ప్రయోజనాల బదిలీ(డిటిపి) నిబంధనల్లో మార్పులు చేశారా అన్న ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ 2016లో సబ్సిడీ పాలసీని ఒక పైలట్ ప్రాజెక్టుగా అమలు చేయడం జరిగిందన్నారు.21018 మార్చినుంచి ఈ పథకం మొదటి దశను దేశవ్యాప్తంగా2 లక్షల సేల్స్ పాయింట్ల ద్వారా అమలు చేయడం జరిగిందని, కమిటీ నివేదిక అందిన తర్వాత రెండో దశను అమలు చేయడం జరుగుతుందని మంత్రి చెప్పారు.

సుదూర రైళ్లకు కొత్త బోగీలు

న్యూఢిల్లీ : దూర ప్రాంతాలకు వెళ్లే రైళ్లకు అధునాతన నమూనా ఎల్‌హెచ్‌బి బోగీలను అమరుస్తారు. ఇప్పుడున్న పాత పద్ధతి కోచ్‌ల స్థానంలో ఇవి వస్తాయని రైల్వే మంత్రి పియూష్ గోయల్ శుక్రవారం రాజ్యసభకు తెలిపారు. దీని వల్ల ప్రయాణికులకు సౌలభ్యం ఉంటుందని చెప్పారు.ఇంతకు ముందు చేసిన ప్రకటనలకు అనుగుణంగా మరిన్ని రైళ్లను ప్రవేశపెట్టడం జరిగితీరుతుందని మంత్రి హామీ ఇచ్చారు. గువహతిలో గత వారం సమీక్షా సమావేశం జరిగిందని , సరికొత్త బోగీల అమరికకు నిర్ణయం తీసుకున్నారని వివరించారు. దశలవారిగా ఈ కోచ్‌ల మార్పిడి జరుగుతుంది. ప్రస్తుతం ఈశాన్య సరిహద్దు ప్రాంత రైల్వే విభాగం పరిధిలోని రైళ్లన్నీ కూడా ఈ ఎల్‌హెచ్‌వి బోగీలతోనే నడుస్తున్నాయి.

జర్మనీలో నేతల డాటా హ్యాక్

బెర్లిన్ : జర్మనీలో అతి భారీ స్థాయిలో అత్యున్నత హోదాలోని వారి వ్యక్తిగత సమాచారం చోరీ అయింది. వ్యక్తిగత డాటా తస్కరణకు గురి అయిన వారిలో జర్మనీ దేశాధ్యక్షులు అంగెలా మెర్కెల్‌తో పాటు వందలాది మంది రాజకీయ నేతలు కూడా ఉన్నారు. ఇప్పుడు ఈ డాటా అంతా ఆన్‌లైన్‌లో ప్రసారం అవుతున్నట్లు గుర్తించామని ప్రభుత్వం శుక్రవారం తెలిపింది. నేతలకు సంబంధించిన ఇళ్ల చిరునామాలు, మొబైల్ ఫోన్ నెంబర్లు, లేఖలు, వారి కీలక పత్రాలు, గుర్తింపు కార్డుల ప్రతులు ట్విట్టర్‌లో డిసెంబర్ నుంచే ప్రదర్శితం అవుతూ వస్తున్నాయి. అయితే ఇప్పుడు వీటి గురించి అధికారికంగా నిర్ధారణ అయిందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. డాటా చోరీ అయిన వారిలో ఉన్నతాధికారులు కూడా ఉన్నారు. ఈ వ్యవహారం ఏ విధంగా జరిగిందనేది వెల్లడికావడం లేదు. హ్యాకర్లు ఈ పనిచేశారా? లేక అంతర్గతంగా ఇవి లీక్ అయ్యాయా? అనేది స్పష్టం కాలేదని అధికారులు తెలిపారు.

35 ఏళ్ల విచారణ... శిక్షకాదా?

న్యూఢిల్లీ : ఓ వ్యక్తి 35 ఏళ్ల పాటు విచారణలో మగ్గడం అంటేనే అంత కాలం శిక్షను అనుభవించడం అని సుప్రీంకోర్టు పేర్కొంది. సరైన సాక్ష్యాలను చూపెట్టకుండానే విచారణను సాగదీయడం ఎంత వరకూ భావ్యం అని సిబిఐని అత్యున్నత న్యాయస్థానం శుక్రవారం మందలించింది. 1983లో దిగువ న్యాయస్థానంలో సాక్షిని ప్రవేశపెట్టడంలో వైఫల్యం చెందిన వైనం ఆ వ్యక్తికి సుదీర్ఘ విచారణకు దారితీసిందని న్యాయమూర్తులు సిక్రీ, అబ్దుల్ నజీర్‌తో కూడిన ధర్మాసనం పేర్కొంది. ఒక కేసులో నిందితుడు అయిన వ్యక్తి కలకత్తా హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. కేసులో ప్రాసిక్యూషన్ సాక్షిని విచారించాలనే ఆదేశాలను 1983లో వెలువరించారు. ఈ కేసు 1983 నాటిది. ఇప్పుడు వచ్చింది 2019జ 35 ఏండ్ల నాటి కేసు. కోర్టు ఆదేశాల మేరకు ఇన్నేళ్లు అయినా సాక్షిని ప్రవేశపెట్టలేదు. ఇన్ని ఏళ్లుగా ఆ వ్యక్తిపై విచారణ సాగుతోంది. ఇదే ఒక సుదీర్ఘ శిక్షగా నిర్ధారించాల్సి ఉంటుందని న్యాయస్థానం తీవ్రస్థాయిలో స్పందించింది.

సంచలనిజం మంచిది కాదు : రాజ్‌నాథ్

గోయెంకా అవార్డుల బహుకరణ



న్యూఢిల్లీ : వార్తా సంచలనిజం జర్నలిజంలో సరైన సంవిధానం కానేరదని హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. సంచలనం కోసం వార్తలకు మసిపూయడం జర్నలిజాన్ని అవమానించినట్లే అని విమర్శించారు. మీడియా వారు ఇటువంటి పద్ధతులను మానుకోవాలని హితవు పలికారు. శుక్రవారం ఇక్కడ జరిగిన రామ్‌నాథ్ గోయెంకా జర్నలిజం పురస్కారాల ప్రదానంకార్యక్రమంలో గోయెంకా మాట్లాడారు. వ్యక్తులు లేదా ప్రభుత్వ వర్గాలపై విమర్శనాత్మక వార్తలను తీవ్రంగా పరిగణించరాదని మంత్రి సూచించారు. మీడియా పలు అంశాలలో ప్రభుత్వంతో వారధిగా పనిచేస్తుందని తాను భావిస్తున్నట్లు , అయితే వాస్తవికతకు అద్దం పట్టే పత్రికలు ఇతర ప్రసార సాధనాలు రంగులు పులమవద్దని, దీనితో విశ్వసనీయత దెబ్బతింటుంది. పైగా ఈ అద్దం రూపమే మారిపోతుందని కేంద్ర మంత్రి హెచ్చరించారు. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రిక వ్యవస్థాపకులు అయిన దివంగత రామ్‌నాథ్ గోయెంకా విశిష్ట స్థాయిలో ధీరోదాత్త జర్నలిజాన్ని అందించారని, ప్రత్యేకించి అత్యవసర పరిస్థితి దశలో కీలక భూమికను ఈ పత్రిక పోషించిందని కొనియాడారు.ఏదో ఆశించి వార్తలకు రంగులు పులమడాన్ని గోయెంకా వంటి వారు ఎప్పుడూ అనుమతించలేదని రాజ్‌నాథ్ తెలిపారు. ప్రభుత్వానికి మీడియాకు మధ్య సరైన సమన్వయం అత్యవసరం అన్నారు. రెండింటి మధ్య దోస్తానా లేకపోయినా ఫర్వాలేదు కానీ పరస్పర ఘర్షణ మంచిది కాదన్నారు.

సికింద్రాబాద్‌కు 12 ప్రత్యేక రైళ్ళు

మన తెలంగాణ / హైదరాబాద్ : సంక్రాంతి పర్వదినం నేపథ్యంలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో దక్షిణ మధ్య రైల్వే పలు ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. ఇప్పటికే అనేక ప్రత్యేక రైళ్ల వివరాలను ప్రకటించగా రైల్వే అధికారులు తాజాగా సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నానికి మరో 12 ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు తెలిపింది. ఈ రైళ్లకు సంబంధించిన షెడ్యూల్‌ను శుక్ర వారం అధికారులు విడుదల చేశారు.

టిఎస్ఎస్‌పి బెటాలియన్స్ పనితీరు భేష్

రాష్ట్ర డిజిపి మహేందర్‌రెడ్డి

మన తెలంగాణ/హైదరాబాద్ : నూతన సంవత్సర వేడుకల సందర్భంగా టిఎస్ఎస్‌పి బెటాలియన్స్ ఐజిపి అభిలాష్ బిస్త్ అధ్యక్షతన రాష్ట్రంలోని అన్ని బెటాలియన్ల కమాండర్‌లతో ఏర్పాటు కాన్ఫరెన్స్‌కు రాష్ట్ర డిజిపి మహేందర్‌రెడ్డి, ఎడిజిపి జితేంతర్‌లు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డిజిపి మాట్లాడుతూ ఇటీవల జరిగిన రాష్ట్ర అంసెంబ్లీ ఎన్నికలలో టిఎస్ఎస్‌పి పోలీసులు ముఖ్యపాత్ర పోషించారని అభినందించారు. కేంద్రం, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన పోలీసులను రాష్ట్రవ్యాప్తంగా మోహరించడంలో టిఎస్ఎస్‌పి అధికారులు కీలక పాత్ర వహించారి డిజిపి ప్రశంసించారు. పోలీసులు,వారి కుటుంబ సభ్యులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పోలీసులు ప్రజలతో సత్సంబంధాలు కలిగిఉండాలని అదే విధంగా పోలీసులు ప్రజలకు జవాబుదారి తనంతో విధులు నిర్వహించాలని సూచించారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షించడంలో పోలీసు శాఖలో అన్ని విభాగాలు కలిసికట్టుగా పనిచేస్తున్న అధికారులను ఆయన అభినందించారు. పోలీసు ఉన్నతాధికారులను పేరుపేరున నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఉత్సాహంగా పనిచేసిన పోలీసు అధికారులు పంచాయతీ, పార్లమెంట్ ఎన్నికల్లో రెట్టింపు ఉత్సాహంతో పనిచేయాలని డిజిపి సూచించారు. 2018లో నేరాలను పోలీసులు సమిష్టి కృషితో తగ్గుముఖం పట్టించారన్నారు.

బడ్జెట్ ప్రతిపాదనలపై కసరత్తు

- ఉత్తర్వులు జారీ చేసిన ఆర్థిక శాఖ
- 18వ తేదీ కల్లా ఆన్‌లైన్‌లో పంపాలని ఆదేశాలు

మన తెలంగాణ/హైదరాబాద్: రానున్న ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ ప్రతిపాదనలపై ఆర్థిక శాఖ కసరత్తును ప్రారంభించింది. అన్ని ప్రభుత్వ శాఖలు 2019–20 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రతిపాదనల వివరాలు పంపాలని రాష్ట్ర ఆర్థిక శాఖ ఆదేశించింది. ఈ మేరకు ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి రామక్రిష్ణరావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సవరించిన బడ్జెట్ వివరాలతో పాటు, రానున్న ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ప్రతిపాదనలను సూచించిన నమూనా ప్రకారం ప్రభుత్వ శాఖలన్నీ పంపాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అన్ని శాఖలు ఆయా శాఖల్లోని అడ్మినిస్ట్రేటివ్ విభాగాలకు ఈ నెల 11వ తేదీకల్లా పంపాలని, పరిశీలించిన అనంతరం ఈ నెల 18వ తేదీ కల్లా ఆర్థిక శాఖ వెబ్‌సైట్‌కు ఆన్‌లైన్ ద్వారా వివరాలను అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏవైనా కొత్త పథకాలు ఏమైనా ప్రవేశపెట్టి ఉన్నట్లయితే వాటిని ప్రారంభించిన తేదీ, ఖర్చు చేసిన మొత్తం తదితర వివరాలను కూడా సమర్పించాలని ఆదేశించారు. రానున్న ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ ప్రతిపాదనలను కూడా పంపాలని పేర్కొన్నారు. అలాగే కాంట్రాక్టు ఉద్యోగుల జీత భత్యాలు, వారి సంఖ్యను అయ్యే ఖర్చుల వివరాలను కూడా పంపాలన్నారు. ప్రతిపాదనలు విలువ లక్షల రూపాయాల్లోనే ఉండాలని ఉత్తర్వుల్లో తెలిపారు. అంచనాల ప్రకారం కాకుండా వాస్తవికమైన, శాస్త్రీయ పద్ధతిలో చేసిన గణాంకాలనే పంపాలని స్పష్టం చేశారు. ఆయా శాఖలకు ఉన్న అప్పులు, వాటిపై పడుతున్న వడ్డీ, అలాగే గ్రాంట్ల వివరాలు కూడా సూచించిన నమూనా ప్రకారం పంపాలని ముఖ్యకార్యదర్శి రామక్రిష్ణరావు ఆదేశించారు. ఇదిలా ఉండగా ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టాలా లేక పూర్తిస్థాయిలో పెట్టాలా అనే దానిపై ఇంకా రాష్ట్ర ప్రభుత్వం స్పష్టతకు రాలేదు. కేంద్ర ప్రభుత్వం ఫిబ్రవరి మొదటి వారంలో ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెడుతోంది. దీంతో కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, గ్రాంటులపై స్పష్టత లేనందున రాష్ట్రంలోనూ ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ పెడితేనే బాగుంటుందని ఆర్థిక శాఖ అధికారులు ఇటీవల సిఎం కెసిఆర్ నిర్వహించిన సమీక్షలో వారి అభిప్రాయాన్ని వ్యకపర్చినట్లు తెలిసింది. రాష్ట్రంలో పూర్తిస్థాయి ప్రభుత్వం ఉన్నప్పటికీ ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టడంపై దృష్టిసారించినట్లు తెలుస్తోంది. ఫిబ్రవరి మూడో వారంలో ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టే అవకాశం ఉంది.

టిఎన్‌జిఒల క్యాలండర్ ఆవిష్కరణ

మన తెలంగాణ/హైదరాబాద్ : తెలంగాణ ఉద్యమంతో పాటు ప్రభుత్వ పథకాలు ముందుకు తీసుకెళ్లడంలో ఉద్యోగుల పాత్ర కీలకమని హోంమంత్రి మహమూద్‌అలీ పేర్కొన్నారు. శుక్రవారం రవీంద్రభారతిలో జరిగిన టిఎన్జీఓ క్యాలండర్, డైరీ ఆవిష్కరణ 2019 కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హోంమంత్రి మహమూద్ అలీ మాట్లాడుతూ ఉద్యోగులు సమస్యలను సిఎం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రతి ఇంటికీ చేరువకావడంలో ఉద్యోగుల పాత్ర కీలకమన్నారు. సిఎం కెసిఆర్ ఉద్యోగుల సంక్షేమానికి అనేక రకాలుగా కృషి చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. బేవరేజస్ కార్పొరేషన్ చైర్మన్ దేవిప్రసాద్ మాట్లాడుతూ మొదటి నుంచి ఉద్యోగులకు అండగా సిఎం కెసిఆర్ నిలిచారని ఆయన పేర్కొన్నారు. ఉద్యోగుల బాధలు కెసిఆర్‌కు తెలుసని తప్పకుండా సమస్యలను పరిష్కరిస్తారన్న నమ్మకం తనకు ఉందని ఆయన తెలిపారు. ఉద్యోగులు కూడా ప్రభుత్వ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కష్టపడి పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఆయన సూచించారు. రానున్న రోజుల్లో కెసిఆర్ ఉద్యోగుల కోసం వరాలు ప్రకటిస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిఎన్జీఓ రాష్ట్ర అధ్యక్షుడు కారెం రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎన్‌ఆర్‌సి నుంచి ఎవర్నీ విడిచిపెట్టం

అసోం ప్రజలకు ప్రధాని మోడీ హామీ



సిల్చార్ (అసోం): జాతీయ పౌర రిజిస్టర్ (ఎన్‌ఆర్‌సి)నుంచి నిజమైన ఏ పౌరుడ్ని వదిలిపెట్టడం జరగదని ప్రధాని నరేంద్ర మోడీ అసోం ప్రజలకు హామీ ఇచ్చారు. పౌరసత్వ బిల్లు త్వరలోనే పార్లమెంటు ఆమోదం పొందుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఎన్‌ఆర్‌సి ప్రక్రియ సమయంలో చాలామంది ఇబ్బందులు, సమస్యలు ఎదుర్కొన్న విషయం తనకు తెలుసునని, అయితే నిజమైన భారత పౌరుడెరికి కూడా అన్యాయం జరగదని తాను హామీ ఇస్తునిస్తున్నానని ృక్రవారం ఇక్కడికి సమీపంలోని కాళీనగర్‌లో బిజెపి విజయ్ సంకల్ప్ సమావేశ్ ర్యాలీలో మాట్లాడుతూ మోడీ అన్నారు. అంతేకాకుడా పౌరసత్వ బిల్లుకు సవరణను తీసుకు వచ్చే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఆయన అంటూ పార్లమెంటులో ఈ బిల్లు త్వరలోనే ఆమోదం పొందుతుందని ఆశిస్తున్నానని కూడా ప్రధాని అన్నారు.ఈ ర్యాలీ ద్వారా ఈశాన్య రాష్ట్రాల్లో పార్లమెంటు ఎన్నికల ప్రచారానికి బిజెపి శ్రీకారం చుట్టినట్లయింది.

గత 35 ఏళ్లుగా అమలుకాకుండా ఉండిపోయిన అసోం ఒప్పందంలోని 6వ క్లాజును అమలు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయం గురించి కూడా ప్రధాని ప్రస్తావిస్తూ, దీనితో ఇప్పుడు అసోం సామాజిక, సాంస్కృతిక, భాషా పరమైన గుర్తింపును పరిరక్షించడానికి మార్గం సుగమమైందన్నారు. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో బిజెపికి ఓటేసినందుకు తాను అసోం ప్రజలకు రుణపడి ఉన్నానని, రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడం ద్వారా ఈ రుణాన్ని తీర్చుకోవడానికి తాను కృతనిశ్చయంతో ఉన్నానని ప్రధాని అన్నారు.గత నెల 25న ఎగువ అసోంలో బొగిబీల్ రైల్‌కమ్ రోడ్డు వంతెనని తాను ప్రారంభించిన విషయాన్ని మోడీ గుర్తు చేస్తూ, పది రోజుల్లోపై రెండో సారి అసోం ప్రజలతో గడపడంతన అదృష్టమన్నారు. బారక్, బ్రహ్మపుత్ర లోయలు ఒక్క అసోంకు కాక మొత్త దేశానికి స్ఫూర్తిదాయకమని ఆయన అన్నారు. పార్లమెంటు ఎన్నికల ప్రచారం మొదటి దశలో భాగంగా ప్రధాని ఇంఫాల్‌నుంచి శుక్రవారం ఉదయం సిల్చార్‌కు వచ్చారు. పార్లమెంటు ఎన్నికల కోడ్ అమలులోకి రావడానికి ముందే ప్రధాని మోడీ వంద రోజుల్లో 20 రాష్ట్రాల్లో పర్యటించి వీలయినన్ని ఎక్కువ ర్యాలీల్లో ప్రసంగించాలన్నది బిజెపి ఎన్నికల వ్యూహం.

కౌరవులు టెస్ట్ ట్యూబ్ బేబీలు!

వేల ఏళ్ల క్రితమే భారత్‌లో మూలకణ టెక్నాలజీ
ఎయు వైస్ చాన్సలర్ నాగేశ్వర రావు సంచన వ్యాఖ్యలు



జలంధర్: భారతంలో వంద మంది కౌరవులు ఎలా పుట్టారో మీకు తెలుసా? మూల కణం, టెస్ట్ ట్యూబ్ టెక్నాలజీ కారణంగానే వీరంతా పుట్టారని ఆంధ్రా విశ్వ విద్యాలయం వైస్ చాన్సలర్ జి నాగేశ్వర రావు అంటున్నారు. జలంధర్‌లో జరుగుతున్న ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌లో శుక్రవారం ప్రజంటేషన్ ఇస్తూ నాగేశ్వర రావు ఈ విషయం చెప్పారు. వేల ఏళ్ల క్రితమే భారత దేశం ఈ విజ్ఞానాన్ని కలిగి ఉండిదని కూడా ఆయన చెప్పారు. శత్రువులను వెంటాడి వారిని చంపి తిరిగి వెనక్కి వచ్చే అస్త్ర శస్త్రాలు శ్రీరాముడి వద్ద ఉండేవని, అంటే ఇప్పుడు మనం చెప్పుకునే గైడెడ్ మిస్సైల్ టెక్నాలజీ అప్పుడే ఉండేదని దీన్ని బట్టి అర్థమవ్వుతుందని ఆయన అన్నారు. రావణుడికి పుష్పక విమానమే కాకుండా చిన్నా పెద్దవి మరో 24 విమానాలు కూడా ఉండేవని రామాయణం చెప్తోందని నాగేశ్వర రావు అన్నారు. అంతేకాదు లంకలో అతనికి చాలా విమానాశ్రయాలు కూడా ఉండేవని, ఈ విమానాలను అతను వేర్వేరు అవసరాలకు ఉపయోగించేవాడని ఆయన తెలిపారు.' గాంధారి వంద మంది పిల్లలకు జన్మనిచ్చిందంటే ఎవరూ నమ్మరు. మనిషికి ఇది సాధ్యమా? ఏ స్త్రీ అయినా తన జీవిత కాలంలో వందమందికి జన్మనిస్తుందా? అయితే ఇప్పుడు టెస్టు ట్యూబ్ బేబీలను మనం చూస్తున్నాం. అలాగే వంద గుడ్లను వంద మట్టికుండల్లో ఉంచితే వారే శిశువులుగా మారారని మహాభారతం చెప్తోంది. వాళ్లు టెస్టు ట్యూబ్ బేబీలు కాదా? అని ప్రశ్నించారు.

పొత్తుల జాప్యమే కొంప ముంచింది

- చేజేతులారా అదృష్టాన్ని జార విడుచుకున్నాం
- అభ్యర్థుల ప్రకటన కోసం చివరి క్షణం వరకు తేల్చలేదు
- ప్రచారం చేసుకునే సమయం దక్కలేదు
- కాంగ్రెస్ అగ్రనాయకులకు తేల్చిచెప్పిన పార్టీ నేతలు

మన తెలంగాణ/హైదరాబాద్ : ప్రజాకూటమి పొత్తుల్లో జాప్యమే రాష్ట్రంలో కాంగ్రెస్ ఓటమికి దారితీసిందని పలువురు కాంగ్రెస్ నేతలు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చే అవకాశం పుష్కలంగా ఉన్నప్పటికీ దానిని సద్వినియోగం చేసుకోలేకపోవడం వల్ల ఘోరపరాజయాన్ని చవిచూడాల్సి వచ్చిందని వ్యాఖ్యానించారు. పొత్తుల అంశాన్ని చివరి వరకూ సాగదీయడం, ఏ నియోజకవర్గం ఎవరికి పోతుందో స్పష్టత లేకపోవడం, అభ్యర్థులను త్వరగా ప్రకటించకపోవడం వల్ల ప్రచారంలో పూర్తిగా వెనుకపడ్డామని వ్యాఖ్యానించారు. ఫలితంగా రాష్ట్రంలో కాంగ్రెస్‌కు ఊహించని నష్టం వాటిల్లిందన్నారు. దీంతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే మంచి అవకాశాన్ని చేజేతులారా జారవిడుచుకున్నట్లు అయిందని వ్యాఖ్యానించినట్లు తెలిసింది. పార్లమెంట్ ఎన్నికల కసరత్తులో భాగంగా మూడు రోజుల పాటు తలపెట్టిన లోక్‌సభ నియోజకవర్గాల సమీక్షా సమావేశం శుక్రవారం గాంధీభవన్‌లో ప్రారంభమైంది. ఏఐసిసి కార్యదర్శి శ్రీనివాసన్, టిపిసిసి ఇన్‌ఛార్జీ కుంతియా, టిపిసిసి అధ్యక్షుడు ఉత్తంకుమార్‌రెడ్డి అధ్యక్షతన ఆదిలాబాద్, పెద్దపల్లి, నిజామాబాద్, కరీంనగర్, జహీరాబాద్, వరంగల్ లోక్‌సభ నియోజకవర్గాల సమీక్ష జరిగింది. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంతో పాటు త్వరలో జరగనున్న పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించాల్సిన అంశాలపై చర్చించేందుకు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అలాగే ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓటమికి దారితీసిన పరిస్థితులు, పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆసక్తి చూపిస్తున్న నేతల వివరాలను కూడా ఈ సమావేశంలో పార్టీ అగ్రనేతలు తెలుసుకునే ప్రయత్నం చేశారు. అయితే పార్టీ ఓటమికి గల కారణాలపై సమావేశానికి హాజరైన పలువురు నేతలు తమ అభిప్రాయాలను కుండబద్దలు కొట్టిన చందంగా చెప్పారని తెలిసింది. పార్టీ హైకమాండ్ పొత్తులు పెట్టుకోవాలని



నిర్ణయం తీసుకున్నప్పటికీ... రాష్ట్ర నేతలు త్వరగా ఈ ప్రక్రియను పూర్తి చేయలేకపోయారని తమ అసంతృప్తిని వ్యక్తం చేసినట్లు తెలిసింది. టిఆర్ఎస్ పార్టీ రెండు నెలల ముందుగానే ఏకకాలంలో 105 మందితో తొలి జాబితాను ప్రకటించడం వల్ల ప్రచారంలో ఆ పార్టీ అభ్యర్థులు దూసుకపోయారన్నారు. కానీ మహాకూటమిలో కాంగ్రెస్, టిడిపి, సిపిఐ, టిజెఎస్‌ల మధ్య నామినేషన్ల పర్వం ప్రారంభం అయ్యేంత వరకు సాగదీశారని ఆరోపించారు. ఫలితంగా కూటమి అభ్యర్థుల్లో పెద్దఎత్తున గందరగోళం ఏర్పడిందన్నారు. దీంతో టిఆర్ఎస్‌కు దీటుగా ఎన్నికల ప్రచారం చేయలేక చతికిలపడాల్సి వచ్చిందన్నారు. వాస్తవానికి టిఆర్ఎస్ పట్ల ప్రజల్లో వ్యతిరేకత నెలకొని ఉన్నప్పటికీ దానిని ఓటు రూపంలో సద్వినియోగం చేసుకోవడంలో పూర్తిగా విఫలం చెందామన్నారు. దీని కారణంగానే కాంగ్రెస్‌కు పెద్ద పరాజయం ఎదురైందని వ్యాఖ్యానించినట్లుగా తెలుస్తోంది. ఈ తప్పులను రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో దొర్లకుండా ఏఐసిసి ఇన్‌ఛార్జీలు, రాష్ట్రానికి పార్టీ అగ్రనేతలు ఇప్పటి నుంచే దృష్టి సారించాలని కోరారు. అలాగే కాంగ్రెస్‌పై టిఆర్ఎస్ చేసున్న ఆరోపణలపై మరింత దీటుగా పార్టీ అగ్రనేతలు స్పందించాల్సిన అవసరముందన్నారు. పార్లమెంట్ ఎన్నికలు తరుముకొస్తున్న నేపథ్యంలో దీటైన అభ్యర్థులను ఎంపిక చేయాలని సూచించారు. పొత్తుల విషయంపై కూడా త్వరగా తేల్చాలని సూచించారు. ఏ పార్టీ...ఎక్కడి నుంచి పోటీ చేస్తుందన్న విషయంపై త్వరగా స్పష్టత ఇవ్వాలని పలువురు కాంగ్రెస్ నాయకులు కోరినట్లు తెలిసింది. ఈ నెలలో జరిగే పంచాయతీ ఎన్నికల్లో కూడా అర్హులైన అభ్యర్థులను రంగంలోకి దించాలని సూచించారు. పార్టీకి తిరిగి పూర్వవైభవం తీసుకరావాలంటే అగ్రనేతలు సైతం పరస్పరం సమన్వయంతో పనిచేయాల్సిన అవసరముందన్నారు. ఇంకా పార్టీలో కొందరు నాయకులు ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా వ్యవహరిస్తున్నారని ఫిర్యాదు చేశారు. అలాంటి నేతలపై దృష్టి సారించి అందరిని కలుపుకుని పోయే విధంగా పార్టీ అగ్రనేతలు దృష్టి సారించాల్సిన అవసరముందని వ్యాఖ్యానించారు. ఈ సమీక్షా సమావేశంలో లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

రెండో రోజూ భారత్‌దే

కదం తొక్కిన రిషబ్, చెలరేగిన జడేజా, పుజారా డబుల్ మిస్, భారత్ 622/7 డిక్లేర్డ్, ఆస్ట్రేలియా 24/0, చివరి టెస్టు







సిడ్నీ: ఆస్ట్రేలియాతో జరుగుతున్న చివరి టెస్టులో టీమిండియా భారీ స్కోరు సాధించింది. టీమిండియా తొలి ఇన్నింగ్స్‌లో 167.2 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 622 పరుగుల రికార్డు స్కోరు సాధించి ఇన్నింగ్స్‌ను డిక్లేర్డ్ చేసింది. తర్వాత బ్యాటింగ్ చేపట్టిన ఆస్ట్రేలియా శుక్రవారం రెండో రోజు ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టపోకుండా 24 పరుగులు చేసింది. భారత్ తొలి ఇన్నింగ్స్ స్కోరును అందుకోవాలంటే ఆస్ట్రేలియా ఇంకా 598 పరుగులు చేయాలి. అంతకుముందు 303/4 ఓవర్‌నైట్ స్కోరుతో రెండో రోజు బ్యాటింగ్ చేపట్టిన భారత్‌ను చటేశ్వర్ పుజారా, రిషబ్ పంత్, రవీంద్ర జడేజాలు అండగా నిలిచారు. పుజారా (193) తృటిలో డబుల్ సెంచరీ చేసే అవకాశాన్ని చేజార్చుకున్నాడు. చెలరేగి ఆడిన వికెట్ కీపర్ రిషబ్ పంత్ 159 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. అసాధారణ బ్యాటింగ్‌ను కనబరిచిన ఆల్ రౌండర్ రవీంద్ర జడేజా 81 పరుగులు సాధించాడు. హనుమ విహారి 42 పరుగులు చేసి ఔటయ్యాడు. ఆస్ట్రేలియా బౌలర్లలో నాథన్ లియాన్‌కు నాలుగు వికెట్లు దక్కాయి. హాజిల్‌వుడ్ రెండు వికెట్లు తీయగా, స్టార్క్‌కు ఒక వికెట్ లభించింది. నాలుగు మ్యాచ్‌ల సిరీస్‌లో టీమిండియా 2–1 ఆధిక్యంలో ఉంది. ఇక, ఈ మ్యాచ్‌లో భారత్ భారీ స్కోరు సాధించడంతో ఆస్ట్రేలియా గెలుపు అవకాశాలు అడుగంటాయి. ప్రస్తుత పరిస్థితుల్లో భారత్‌కే గెలుపు అవకాశాలున్నాయి. ఒక లేకుంటే మ్యాచ్ ఫలితం తేలకుండా డ్రా అయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇదే జరిగితే టీమిండియా కంగారూల గడ్డపై తొలిసారి టెస్టు సిరీస్ గెలుచు కోవడం ఖాయమనే చెప్పాలి.

పుజారా జోరు

శుక్రవారం బ్యాటింగ్ చేపట్టిన భారత్‌కు ప్రారంభంలోనే షాక్ తగిలింది. ఓవర్‌నైట్ బ్యాట్స్‌మన్ హనుమ విహారి ఎక్కువ సేపు క్రీజులో నిలువలేక పోయాడు. కిందటి స్కోరుకు రెండు పరుగులు మాత్రమే జోడించి ఔటయ్యాడు. అయితే ఈ దశలో బ్యాటింగ్‌కు వచ్చిన యువ వికెట్ కీపర్ రిషబ్ పంత్ అండతో మిస్టర్ డిపెండబుల్ చటేశ్వర్ పుజారా ఇన్నింగ్స్‌ను కుదుట పరిచాడు. ఆస్ట్రేలియా బౌలర్లపై ఎదురు దాడికి దిగిన పుజారా స్కోరును పరిగెత్తించాడు. పంత్ కూడా చూడ చక్కని షాట్లతో అలరించాడు. ఇద్దరు కుదురుగా ఆడుతూ భారత్‌ను పటిష్టస్థితికి చేర్చారు. మరోవైపు రెండో రోజు భారత్‌ను తక్కువ స్కోరుకే పరిమితం చేయాలనే ఆస్ట్రేలియా ఆశలపై వీరు నీళ్లు చల్లారు. లంచ్ విరామ సమయానికి భారత్ స్కోరు 5 వికెట్ల నష్టానికి 389 పరుగులకు చేరింది. అయితే భోజన విరామం సమయం ముగిసిన వెంటనే పుజారా పెవిలియన్ చేరాడు. డబుల్ సెంచరీ దిశగా అడుగులు వేస్తున్న పుజారాను లియాన్ వెనక్కి పంపాడు. చిరస్మరణీయ ఇన్నింగ్స్ ఆడిన పుజారా 373 బంతుల్లో 22 ఫోర్లతో 193 పరుగులు చేశాడు. చటేశ్వర్ ఏడు పరుగుల తేడాతో డబుల్ సెంచరీ సాధించే అవకాశాన్ని కోల్పోయాడు.

పంత్, జడేజా వీరవిహారం


ఈ దశలో ఇన్నింగ్స్‌ను ముందుకు తీసుకెళ్లే బాధ్యతను యువ ఆటగాడు, వికెట్ కీపర్ పంత్ తనపై వేసుకున్నాడు. అతనికి రవీంద్ర జడేజా అండగా నిలిచాడు. ఇద్దరు ఆసీస్ బౌలర్లను ఉతికి ఆరేశారు. ఈ జోడీని విడగొట్టేందుకు ఆస్ట్రేలియా బౌలర్లు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ప్రారంభంలో కాస్త జాగ్రత్తగా ఆడిన పంత్ తర్వాత దూకుడును పెంచాడు. జడేజా కూడా వేగంగా ఆడాడు. దీంతో అప్పటి వరకు మెల్లగా సాగిన భారత స్కోరు వేగాన్ని అందుకుంది. టి–విరామ సమయానికి భారత్ ఆరు వికెట్ల నష్టానికి 491 పరుగులు చేసింది. ఆ తర్వాత జడేజా, పంత్‌లు మరింత చెలరేగిపోయారు. చూడచక్కని షాట్లతో పరుగుల వరద పారించారు. ఇదే క్రమంలో పంత్ 137 బంతుల్లో 8 ఫోర్లతో సెంచరీని పూర్తి చేశాడు. టెస్టుల్లో పంత్‌కు ఇది రెండో సెంచరీ. మరోవైపు జడేజా అర్ధ సెంచరీ మార్క్‌ను అందుకున్నాడు. ఈ జోడీని విడగొట్టేందుకు ఆస్ట్రేలియా బౌలర్లు చేసిన ప్రయత్నాలన్నీ వృథాగా మారాయి. ఇదే క్రమంలో పంత్, జడేజాలు కలిసి ఏడో వికెట్‌కు రికార్డు స్థాయిలో 150 పరుగుల భాగస్వామ్యాన్ని నమోదు చేశారు. చిరస్మరణీయ ఇన్నింగ్స్ ఆడిన జడేజా 114 బంతుల్లో ఏడు ఫోర్లు, సిక్స్‌తో 81 పరుగులు చేసి ఔటయ్యాడు. జడేజా ఔట్ అయిన వెంటనే భారత్ ఇన్నింగ్స్‌ను డిక్లేర్డ్ చేశారు. అప్పటికే టీమిండియా స్కోరు ఏడు వికెట్ల నష్టానికి 622 పరుగులకు చేరింది. కీలక ఇన్నింగ్స్ ఆడిన రిషబ్ పంత్ 189 బంతుల్లో 15 ఫోర్లు, ఒక సిక్స్‌తో 159 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. తర్వాత తొలి ఇన్నింగ్స్ చేపట్టిన ఆస్ట్రేలియా వికెట్ నష్టపోకుండా 24 పరుగులు చేసింది. మార్కస్ హారిస్ 15 (బ్యాటింగ్), ఉస్మాన్ ఖ్వాజా 5 (బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.

కంగారూలకు కష్టమే

ప్రస్తుతం టీమిండియా చేసిన స్కోరును చూస్తే సిడ్నీలోనూ ఆస్ట్రేలియాకు కష్టాలు ఖాయంగా కనిపిస్తున్నాయి. ఈ మ్యాచ్‌లో విజయం సాధించడం ఆస్ట్రేలియాకు దాదాపు అసాధ్యంగా కనిపిస్తోంది. దీనికి భారత్ సాధించిన భారీ స్కోరే కారణంగా చెప్పొచ్చు. 600 పరుగులు చేసిన టీమిండియాకు మ్యాచ్‌లో ఓడిపోయే పరిస్థితులు కనిపించడం లేదు. ఒకవేళ మూడు, నాలుగు రోజుల్లో ఆస్ట్రేలియా భారీ స్కోరు సాధిస్తేనే భారత్‌కు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశాలున్నాయి. శని, ఆది వారాల్లో ఆస్ట్రేలియా పూర్తిగా బ్యాటింగ్ చేయాలి. ఇదే క్రమంలో భారత్‌పై కనీసం 150 పరుగుల ఆధిక్యాన్ని అందుకోవాలి. అప్పుడే రెండో ఇన్నింగ్స్‌లో భారత్‌ను ఒత్తిడికి గురి చేసే అవకాశం ఉంటుంది. అయితే బుమ్రా, షమి, జడేజా, కుల్దీప్‌లతో కూడిన బౌలింగ్‌ను ఎదుర్కొని కంగారూలు భారీ స్కోరు సాధించడం అనుకున్నంత తేలిక కాదు. ఏదైన అనూహ్యం జరిగితే తప్ప మ్యాచ్‌లో ఆస్ట్రేలియా గెలిచే అవకాశాలు కనిపించడం లేదు. ఒకవేళ గెలిస్తే భారత్ గెలవాలి లేకుంటే మ్యాచ్ డ్రాగా ముగియాల్సిందే. ఇదే జరిగితే ఆస్ట్రేలియా గడ్డపై భారత్ తొలి టెస్టు సిరీస్‌ను గెలుచు కోవడం ఖాయం.

పంత్ భావోద్వేగం

టీమిండియా యువ వికెట్ కీపర్ రిషబ్ పంత్ భావోద్వేగానికి గురయ్యాడు. ఆస్ట్రేలియాతో జరుగుతున్న చివరి టెస్టులో పంత్ అజేయ సెంచరీ సాధించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో పంత్ రెండు రికార్డులను తన పేరిట లిఖించుకున్నాడు. ఆస్ట్రేలియా గడ్డపై సెంచరీ సాధించిన తొలి భారత వికెట్ కీపర్‌గా రిషబ్ పంత్ నిలిచాడు. అంతేగాక 150కి పైగా పరుగులు చేసిన భారత కీపర్లలో నాలుగో వాడిగా పంత్ మరో రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు.



కాగా, ఈ రెండు రికార్డులను తన తల్లి పుట్టిన రోజునే సాధించడంతో పంత్ భావోద్వేగానికి గురయ్యాడు. ఈ సందర్భంగా తన తల్లికి పుట్టిన రోజు శుభాకాంక్షలు చెబుతూ ఆనంద భాష్పాలు రాల్చాడు. హ్యాపి బర్త్‌డే అమ్మా, ఎల్లప్పుడూ నా వెన్నంటి నిలిచి ముందుకు నడిపించిన నువ్వంటే నాకు ప్రాణం. నిన్నెంతగానో ప్రేమిస్తున్నా. ఊహ తెలిసి నప్పటినుంచి నా వెంటే ఉన్న నీకు ఏమిచ్చిన రుణం తీర్చుకోలేను. నన్ను ఈ స్థాయికి చేర్చడంలో సర్వం ధారపోసిన నీకు కృతజ్ఞతలు చెప్పేందుకు మాటలు సరిపోవు. లవ్ యూ మామ్ అండ్ హ్యాపి బర్త్‌డే వన్స్ అగైన్ అంటూ పంత్ ఇన్‌స్టాగ్రామ్‌లో చేసిన పోస్ట్ అభిమానులను కట్టి పడేసింది. ఈ పోస్ట్ ద్వారా తల్లిపై తనకున్న ప్రేమను పంత్ చాటుకున్నాడు.

స్కోరు బోర్డు

భారత్ మొదటి ఇన్నింగ్స్: మయాంక్ అగర్వాల్ (సి) స్టార్క్ (బి) నాథన్ లియాన్ 77, లోకేశ్ రాహుల్ (సి) షాన్ మార్ష్ (బి) హాజిల్‌వుడ్ 9, చటేశ్వర్ పుజారా 130 (సి) అండ్ (బి) లియాన్ 193, విరాట్ కోహ్లి (సి) పైన్ (బి) హాజిల్‌వుడ్ 23, అజింక్య రహానె (సి) పైన్ (బి) స్టార్క్ 18, హనుమ విహారి (సి) మర్నూస్ (బి) లియాన్ 42, రిషబ్ పంత్ నాటౌట్ 159, రవీంద్ర జడేజా (బి) లియాన్ 81, ఎక్స్‌ట్రాలు 20, మొత్తం 167.2 ఓవర్లలో 622/7 డిక్లేర్డ్.
బౌలింగ్: మిఛెల్ స్టార్క్ 26–0–123–1, జోష్ హాజిల్‌వుడ్ 35–11–105–2, పాట్ కమిన్స్ 28–5–101–0, నాథన్ లియాన్ 57.2–8–178–4, మార్నస్ లబిస్చాంగే 16–0–76–0, ట్రావిస్ హెడ్ 4–0–20–0, ఉస్మాన్ ఖ్వాజా 14–0–4–0.

ఆస్ట్రేలియా మొదటి ఇన్నింగ్స్: మార్కస్ హారిస్ (బ్యాటింగ్) 19, ఉస్మాన్ ఖ్వాజా (బ్యాటింగ్) 5, ఎక్స్‌ట్రాలు 0, మొత్తం 10 ఓవర్లలో 24/0.
బౌలింగ్: మహ్మద్ షమి 3–0–9–0, జస్‌ప్రిత్ బుమ్రా 3–0–12–0, రవీంద్ర జడేజా 2–1–1–0, కుల్దీప్ యాదవ్ 2–1–2–0.





సిడిల్, లియాన్‌లకు చోటు

వన్డే సిరీస్‌కు ఆస్ట్రేలియా జట్టు ఎంపిక

సిడ్నీ: భారత్‌తో జరిగే మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌కు ఆస్ట్రేలియా జట్టును ప్రకటించారు. జట్టులో వెటరన్ ఫాస్ట్ బౌలర్ పీటర్ సిడిల్‌కు చోటు కల్పించడం చర్చనీయాంశంగా మారింది. సిడిల్ చివరి సారిగా 2010 వన్డే జట్టులో ఉన్నాడు. ఇంత సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ వన్డే జట్టులో స్థానం దక్కించుకున్నాడు. ఇక, సీనియర్ స్పిన్నర్ నాథన్ లియాన్‌కు కూడా వన్డే జట్టుల చోటు లభించింది. భారత్‌తో జరుగుతున్న టెస్టు సిరీస్‌లో నిలకడగా రాణించడంతో సిడిల్‌కు చోటు దక్కింది. మరోవైపు ఆడమ్ జంపా కూడా వన్డే సిరీస్‌కు ఎంపికయ్యాడు. టెస్టు సిరీస్‌లో ఆడిన ఉస్మాన్ ఖ్వాజాను కూడా వన్డేల్లో చోటు కల్పించారు. షాన్ మార్ష్, మిఛెల్ మార్ష్‌లు కూడా స్థానాన్ని నిలబెట్టుకున్నారు. అయితే ట్రావిస్ హెడ్, టిమ్ పైన్, డిఆర్సీ షార్ట్, మెక్‌డార్మెట్, అస్టన్ అగర్ తదితరులు జట్టుకు ఎంపిక కాలేదు. అంతేగాక టెస్టు సిరీస్‌లో ఆడిన మిఛెల్ స్టార్క్, కమిన్స్, హాజిల్‌వుడ్‌లకు విశ్రాంతి ఇచ్చారు. వన్డేలకు వీరిని ఎంపిక చేయలేదు. నాథన్ కౌల్టర్ నైల్‌కు కూడా చోటు లభించలేదు. స్టాన్‌లేక్, బెన్‌డ్రాఫ్, రిచర్డ్‌సన్‌లు చోటు దక్కించుకున్నారు. ఆల్‌రౌండర్ మాక్స్‌వెల్‌ను ఊహించినట్టే జట్టుకు ఎంపిక చేశారు. జట్టు సారథ్య బాధ్యతలను అరోన్ ఫించ్‌కు అప్పగించారు. అలెక్స్ కారే, మార్కస్ స్టోయినిస్, హాండ్స్‌కొంబ్‌లు కూడా ఎంపికయ్యారు.

జట్టు వివరాలు: అరోన్ ఫించ్ (కెప్టెన్), ఉస్మాన్ ఖ్వాజా, షాన్ మార్ష్, పీటర్ హాండ్స్‌కొంబ్, గ్లెన్ మాక్స్‌వెల్, మార్కస్ స్టోయినిస్, మిఛెల్ మార్ష్, అలెక్స్ కారే, రిచర్డ్‌సన్, బిల్లీ స్టాన్‌లేక్, బెహ్రన్‌డ్రాఫ్, పీటర్ సిడిల్, నాథన్ లియాన్, ఆడమ్ జంపా.

సౌతాఫ్రికాకు భారీ ఆధిక్యం

పాకిస్థాన్‌తో రెండో టెస్టు

కేప్‌టౌన్: పాకిస్థాన్‌తో జరుగుతున్న రెండో టెస్టులో సౌతాఫ్రికా పట్టు బిగించింది. పాకిస్థాన్ తొలి ఇన్నింగ్స్‌లో 177 పరుగులకే కుప్పకూలింది. తర్వాత మొదటి ఇన్నింగ్స్ చేపట్టిన ఆతిథ్య దక్షిణాఫ్రికా జట్టు శుక్రవారం రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఆరు వికెట్ల నష్టానికి 382 పరుగుల భారీ స్కోరును సాధించింది. ఇప్పటికే సఫారీ జట్టు 205 పరుగుల భారీ ఆధిక్యం సాధించి మ్యాచ్‌ను శాసించే స్థితికి చేరింది. సౌతాఫ్రికా జట్టులో ఓపెనర్ ఐడెన్ మార్క్రామ్ 14 ఫోర్లు, ఒక సిక్స్‌తో 78 పరుగులు చేశాడు. కెప్టెన్ డు ప్లెసిస్ శతకంతో కదం తొక్కాడు. పాకిస్థాన్ బౌలర్లను దీటుగా ఎదుర్కొన్న డుప్లెసిస్ 226 బంతుల్లో 13 ఫోర్లతో 103 పరుగులు చేశాడు. అతనికి బవుమా అండగా నిలిచాడు. వీరిద్దరూ ఐదో వికెట్‌కు 154 పరుగుల జోడించారు. కీలక



ఇన్నింగ్స్ ఆడిన బవుమా పది ఫోర్లతో 75 పరుగులు చేశాడు. మరోవైపు వికెట్ కీపర్ క్వింటాన్ డికాక్ ఏడు ఫోర్లతో 55 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. పాకిస్థాన్ బౌలర్లలో షాహిద్ అఫ్రిది మూడు వికెట్లు తీశాడు. కాగా, మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో సౌతాఫ్రికా 1–0 ఆధిక్యంలో ఉంది. తొలి టెస్టులో సౌతాఫ్రికా ఆరు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లోనూ గెలిచి సిరీస్ సొంతం చేసుకునేందుకు దక్షిణాఫ్రికా మార్గం సుగమం చేసుకుంది. ఏదైన అనూహ్యం జరిగితే తప్ప ఈ మ్యాచ్‌లోనూ పాకిస్థాన్‌కు ఓటమి ఖాయంగా కనిపిస్తోంది.





ఇటీవల జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో పతకం సాధించిన తెలంగాణ క్రీడాకారిణి సంజనను అభినందిస్తున్న శాట్స్ చైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు



లండన్ వేదికగా జరుగుతున్న ఇంగ్లీష్ ప్రీమియర్ లీగ్ సాకర్ పోటీల్లో ఆటగాళ్ల హోరాహోరీ

ప్రధాని నరేంద్ర మోడీ అభిమానులకు ఒక శుభవార్త. మోడీ బయోపిక్‌పై వస్తున్న వదంతులకు తెరపడింది. నరేంద్ర మోడీగా బహుభాషా నటుడు వివేక్ ఒబెరాయ్ నటిస్తున్నట్లు రూఢీ అయింది. నరేంద్ర మోడీ జీవితకథ ఆధారంగా నిర్మిస్తున్న ఈ చిత్రం ఫస్ట్ లుక్ జనవరి 7న విడుదల కానున్నది. ఈ విషయాన్ని ప్రముఖ సినీ విమర్శకుడు తరన్ ఆదర్శ్ ట్వీట్ ద్వారా శుక్రవారం తెలిపారు.

విశాల

కేరళలో 1400 మంది అరెస్టు

ప్రధాని మోడీ పర్యటన రద్దు • బాంబుల దాడులు .. ఆగని హింస • అయ్యప్ప పూజారికి నోటీసులు





తిరువనంతపురం : మహిళల ఆలయ ప్రవేశంపై శబరిమల ఇంకా రగులుతూనే ఉంది. శుక్రవారం చెలరేగిన తీవ్రస్థాయి హింసాకాండకు సంబంధించి ఇప్పటికీ 1400 మందిని అరెస్టు చేసినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. ఆదివారం ప్రధాని మోడీ కేరళ పర్యటన రద్దయిందని బిజెపి నేతలు వెల్లడించారు. అల్లరిమూకలను అణచివేసేందుకు అన్ని చర్యలూ చేపడుతున్నట్లు, ఇందులో భాగంగానే పలువురిని అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. జనవరి 6వ తేదీన ప్రధాని మోడీ పతనంతిట్టను సందర్శించాల్సి ఉంది. అయితే వేరే కార్యక్రమాలతో ఈ పర్యటన రద్దయినట్లు బిజెపి సీనియర్ నేత ఒకరు తెలిపారు. ప్రస్తుత కేరళ పరిస్థితికి ప్రధాని పర్యటన రద్దుకు సంబంధం లేదని వివరించారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మోడీ ఈ ఏడాది తొలిసారిగా కేరళలో బహిరంగ సభలో పాల్గొనాల్సి ఉంది. మరో వైపు రాష్ట్రంలో అనేకప్రాంతాలలో పరిస్థితి ఉద్రిక్తంగానే ఉంది.

కోజికోడ్ జిల్లాలో బాంబుల మోత

తెల్లవారుజామున కోజికోడ్ జిల్లాలోని పేరాంబ్రాలో మలబార్ దేవస్థానం బోర్డు సభ్యుడి నివాసంపై కొందరు బాంబులు విసిరారు. ఈ పని ఆర్‌ఎస్‌ఎస్ వారిదే అని సిపిఎం వర్గాలు విమర్శించాయి. మరో వైపు సిపిఎం ఇతర కమ్యూనిస్టు పార్టీల కార్యకర్తలు కూడా హింసాకాండకు పాల్పడ్డారు. కొందరు బిజెపి నేతల ఇళ్లపై దాడులు జరిగాయి. సిపిఎం కార్యకర్తల నివాసాలపై కూడా రాళ్లు రువ్విన ఘటనలు జరిగినట్లు వెల్లడైంది.

సంప్రోక్షణపై వివరణకు ఆదేశాలు


మహిళల ప్రవేశం వెంటనే అయ్యప్ప దేవాలయ సంప్రోక్షణ క్రతువు ఇప్పుడు వివాదానికి దారితీసింది. సంప్రోక్షణం ఎందుకు జరిపారో తెలియచేయాలని ట్రావన్‌కోర్ దేవస్థానం బోర్డు అధికారులు శుక్రవారం ఆలయ ప్రధాన పూజారి రాజీవరు కందరవూకు నోటీసులు వెలువరించారు. వివరణను కోరారు. రెండు వారాలలో సమాధానం ఇవ్వాలని సూచించారు. ప్రధాన పూజారి చర్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఖండించారు. బోర్టుకు చెప్పకుండానే పూజారి వెనువెంటనే సంప్రోక్షణకు దిగారని, ఇది సుప్రీంకోర్టు తీర్పును ఉల్లంఘించినట్లే అవుతుందని దేవస్థానం మండలి అధ్యక్షులు ఎ పద్మకుమార్ విమర్శించారు. ఈ విధంగా ఎందుకు చేయాల్సి వచ్చిందో చెప్పాల్సి ఉందన్నారు. గురువారం రాత్రి శశికళ అనే శ్రీలంక మహిళ ఆలయంలోకి వెళ్లడంతో శుక్రవారం ఉదయం నుంచే రాష్ట్రంలో తిరిగి ఉద్రిక్తత నెలకొంది.ఈ మహిళ 18 మెట్లు ఎక్కి ఆలయంలోకి చేరుకుని ఈ విధంగా అయ్యప్పను దర్శించుకున్న తొలి మహిళగా నిలిచింది. భర్త వెంట రాగా ఆమె దర్శనానికి నేరుగా వెళ్లింది. అయితే ఆపరేషన్ తరువాత తన గర్భాశయాన్ని తొలిగించారని తాను దర్శన నిషేధిత స్త్రీల జాబితాలో లేనని, కేవలం అయ్యప్ప దర్శనానికే తాను వచ్చినట్లు శశికళ తెలియచేసుకుంది. ఈ మహిళకు పోలీసులు భద్రత కల్పించి ఇంటికి పంపించారు. తమ సంస్థకు చెందిన వంద బస్సులకు ఆందోళనకారుల చర్యలతో నష్టం జరిగిందని కేరళ రాష్ట్ర రవాణా సంస్థ ఎండి టోమిన్ తచంకరే తెలిపారు.

పలక్కాడ్‌లో నిషేధ ఆజ్ఞలు

శబరిమల ఆలయంలోకి ఇద్దరు మహిళల ప్రవేశాన్ని నిరసిస్తూ కేరళలో పెద్ద ఎత్తున ఆందోళనలు చెలరేగుతున్నాయి. పాలక్కాడ్ పట్టణం, కాసర్‌గోడ్ జిల్లాలోని మంజేశ్వరం తాలుకాలో ప్రభుత్వం గురువారం రాత్రి నిషేధాజ్ఞలు విధించింది. జిల్లా పోలీసు చీఫ్ సహా పలు అధికారుల నివేదికలను పరిగణలోకి తీసుకున్న పలక్కాడ్ జిల్లా కలెక్టర్ డి బాల మురళి కృష్ణ నగరంలో ఉద్రిక్త పరిస్థితులు నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం ఆరు గంటల వరకు నిషేధాజ్ఞలు విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మంజేశ్వరం తాలుకాలో 144 సెక్షన్ అమలులో ఉండడంతో జిల్లా కలెక్టర్ డి సాజిత్ బాబు నిషేధాజ్ఞలు విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సిపిఎం, సిపిఐ, బిజెపి ఆఫీసులపై ఆందోళనకారులు దాడి చేయడంతో బుధవారం ఉదయం నుంచి పెద్ద ఎత్తున హింసాకాండ చోటు చేసుకుంది.

10న అయోధ్యపై తదుపరి కార్యాచరణ

ఆ రోజు ఏర్పడే ధర్మాసనం ఉత్తర్వులిస్తుంది : సుప్రీం



న్యూఢిల్లీ: అయోధ్యలో రామజన్మభూమి, బాబ్రీ మసీదు స్థల వివాదం కేసుపై తదుపరి ఉత్తర్వులను జనవరి 10న ఏర్పడే ధర్మాసనం జారీ చేస్తుందని సుప్రీంకోర్టు శుక్రవారం తెలిపింది. ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్, జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్‌తో కూడిన ధర్మాసనం శుక్రవారం సమావేశమైన వెంటనే తదుపరి ఉత్తర్వుల కోసం ఈ నెల 10వరకు వేచి ఉండాలని ఇరు పక్షాలకు చెందిన సీనియర్ న్యాయవాదులు హరీష్ సాల్వే, సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాలకు సూచించింది. ఏకవాక్య ఉత్తర్వును జారీచేసిన న్యాయమూర్తులు జనవరి 10న ఈ కేసు సముచితమైన ధర్మాసనం ఎదుటకు వస్తుందని తెలిపారు. 2010లో అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దాదాపు 14 అప్పీళ్లు దాఖలు కాగా వీటిపై విచారణ జరిపేందుకు ముగ్గురు సభ్యుల ధర్మాసనాన్ని సుప్రీంకోర్టు ఏర్పాటు చేసే అవకాశం ఉంది. నాలుగు సివిల్ వ్యాజ్యాలపై ఇచ్చిన తీర్పులో 2.77 ఎకరాలు భూమిని ముగ్గురు కక్షిదారులైన సున్నీ వక్ఫ్ బోర్డు, నిర్మోహి అఖారా, రామ్ లల్లాల మధ్య సమానంగా పంచాలని అలహాబాద్ హైకోర్టు పేర్కొంది.

ఢిల్లీ కాంగ్రెస్ చీఫ్ రాజీనామా



న్యూఢిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్)తో కాంగ్రెస్ పొత్తు ప్రతిపాదన రెండు పార్టీలలో తీవ్ర అసమ్మతికి దారితీస్తోంది. ఈ ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ ఆప్ నాయకుడు హెచ్‌ఎస్ ఫూల్కా గురువారం రాజీనామా చేసిన 24 గంటల్లోనే ఢిల్లీ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి అజయ్ మాకెన్ రాజీనామా చేశారు. 2015 ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ పరాజయం పాలైన తర్వాత కూడా తనకు మద్దతుగా నిలిచినందుకు కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీకి, మీడియాకు అజయ్ మాకెన్ శుక్రవారం ఉదయం ఒక ట్వీట్‌లో ధన్యవాదాలు తెలిపారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్, ఆప్ మధ్య పొత్తును మాకెన్, ఫూల్కా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. మాకెన్ తన రాజీనామా లేఖలో అనారోగ్య కారణాల వల్లే తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

మధ్యప్రదేశ్ పోలీసులకు వీక్లీఆఫ్!

భోపాల్: మధ్యప్రదేశ్‌లో పోలీసులకు "మంచి రోజులు" వచ్చేశాయి. పోలీసు సిబ్బంది అందరికీ తప్పనిసరిగా వారానికి ఒకరోజు సెలవును(వీక్లీ ఆఫ్) అమలు చేస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకుంది. గతంలో మధ్యప్రదేశ్ పోలీసులకు వీక్లీ ఆఫ్‌లు తీసుకునే వెసులుబాటు లేదు. వారికి కేవలం సిక్ లీవులు, క్యాజువల్ లీవులు, ఆర్జిత సెలవులు మాత్రమే ఉండేవి. మంగళవారం మధ్యప్రదేశ్ డిజిపిగా బాధ్యతలు చేపట్టిన రిషి కుమార్ శుక్లా పోలీసు స్టేషన్లలో పనిచేసే సిబ్బందితోపాటు జిల్లాలలో నియమితులైన ప్రత్యేక సాయుధ దళాల సిబ్బంది అందరికీ వీక్లీ ఆఫ్‌లు ప్రకటించారు. పోలీసు సిబ్బందికి వీక్లీ ఆఫ్‌లు అమలులోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి కమల్‌నాథ్ ఒక ట్వీట్ చేస్తూ పోలీసు సిబ్బందికి ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నెరవేర్చామని తెలిపారు. పోలీసులకు ఆయన శుభాకాంక్షలు తెలియచేస్తూ వారు తమ కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు.

మళ్లీ కన్నుగీటిన రాహుల్




న్యూఢిల్లీ : కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ మరోసారి కన్ను గీటి కెమెరాల కంటపడ్డారు. శుక్రవారంనాడు రాఫెల్ ఒప్పందంపై చర్చ సందర్భంగా ఇది చోటుచేసుకుంది. గతంలో ప్రధాని నరేంద్ర మోడీని కౌగిలించుకోవడం, కన్ను గీటిన రాహుల్ మరోసారి అదే తరహా చర్యతో కెమెరాలకు చిక్కారు. రాఫేల్‌పై చర్చలో ఏఐఏడీఎంకే ఎంపీ, డిప్యూటీ స్పీకర్ తంబిదురై మాట్లాడుతుండగా ఆయనను అభినందించిన రాహుల్ అనూహ్యంగా వేరొకరిని చూస్తూ కన్నుగీటారు. కాగా అంతకుముందు ఇదే అంశంపై రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ రాహుల్‌పై విమర్శలు గుప్పించారు. రాహుల్ కన్నుగీటిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

శ్రీలంక మహిళకు శబరిమలలో నో ఎంట్రీ

పథనంతిట్ట: కేరళ పోలీసుల భద్రత మధ్య 46 సంవత్సరాల శ్రీలంక మహిళ ఒకరు గురువారం రాత్రి శబరిమలలో పరమ పవిత్రంగా భావించే "18 మెట్ల"పై నుంచి ఆలయాన్ని చేరుకున్నప్పటికీ గర్భాలయంలోకి ప్రవేశించి స్వామి అయ్యప్పను దర్శించుకునే అవకాశాన్ని మాత్రం ఆలయ పూజారులు కల్పించలేదు. అయితే, శ్రీలంక జాతీయురాలైన శశికళ అనే మహిళ(తండ్రిపేరు అశోక్ కుమరన్)గురువారం రాత్రి 9.30 గంటలకు స్వామివారిని దర్శించుకున్నట్లు పోలీసులు చెప్పడం విశేషం. అయ్యప్ప దర్శన భాగ్యం తనకు దక్కలేదని శశికళ ధృవీకరించారు. "పవిత్రమైన మెట్ల ద్వారా ఆలయాన్ని చేరుకున్నాను. కాని గుడిలోకి వెళ్లి అయ్యప్ప స్వామిని దర్శించుకోవడానికి పూజారులు అనుమతి నిరాకరించారు. నా వద్ద మెడికల్ సర్టిఫికెట్ కూడా ఉంది" అని శశికళ చెప్పారు. ఇదిలా ఉండగా, 50 సంవత్సరాల లోపు వయసు గల ఇద్దరు మహిళలు బుధవారం తెల్లవారుజామున అయ్యప్పను దర్శించుకున్నట్లు వార్తలు వెలువడిన తర్వాత కేరళ వ్యాప్తంగా నిరసనలు పెల్లుబికాయి. శబరిమల పరిరక్షణ సంస్థ, బిజెపి గురువారం రాష్ట్ర వ్యాప్తంగా బంద్ నిర్వహించగా అనేక చోట్ల హింసాత్మక సంఘటనలు కూడా చోటుచేసుకున్నాయి.

మృత్యుంజయుడు ఈ పసి బాలుడు!



ముంబయి: నాలుగవ అంతస్తులోని కిటికీ నుంచి జారిపడిన ఒక 14 నెలల పసివాడు తృటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. ఈ సంఘటన ముంబయిలోని గోవండి ప్రాంతంలో గురువారం ఉదయం జరిగింది. నాలుగవ అంతస్తులో ఉన్న తమ ఫ్లాట్‌లోని హాలులోని కిటికీ నుంచి జారిపడిన ఆ పిల్లవాడు నేరుగా చెట్టు మీద పడి అక్కడి నుంచి కింద పడడంతో స్వల్ప గాయాలతో ప్రాణాలు దక్కించుకోగలిగాడు. శ్రీ అని ముద్దుగా పిలుచుకునే అథర్వ బర్కడే తండ్రి అజిత్ బర్కడే, తల్లి జ్యోతితోపాటు తాతలు, నానమ్మ, అమ్మమ్మ, అత్త, మామ, అక్క అంతా గోపీకృష్ణ అపార్ట్‌మెంట్‌లోని నాలుగవ అంతస్తు ఫ్లాట్‌లో నివసిస్తున్నారు. అథర్వ నానమ్మ మంగళ్ గురువారం ఉదయం 8.30 గంటల ప్రాంతంలో ఆరేసిన బట్టలు తీయడానికి హాలులోని కిటికీ తెరిచింది. అయితే ఆ కిటికీ రక్షణ ఊచలు లేకపోవు. ఆమె కిటికీ మూయడం మరచిపోవడంతో అదే హాలులో ఆడుకుంటున్న అథర్వ నేరుగా కిటికీ వద్దకు వచ్చి అందులో నుంచి తొంగి చూస్తూ కిందకు పడిపోయాడు. అది చూసిన కుటుంబ సభ్యులు ఆందోళనతో కిందకు పరుగులు తీయగా అక్కడ చెట్టుకు తట్టుకుని కిందకు జారిపడిన అథర్వ కనిపించాడు. ఎత్తుకున్న వెంటనే ఏడుపు అందుకున్న అథర్వను అస్పత్రిలో చేర్పించారు. పెదాలకు, ఒక కాలికి గాయాలయ్యాయని, ప్రస్తుతం పిల్లాడి పరిస్థితి నిలకడగా ఉందని ఆస్పత్రి వైద్యులు తెలిపారు.

మహిళా బిల్లుకు మోక్షమెప్పుడు?

- దిగువ సభలో బలమున్నా ఆమోదించకపోవడం దారుణం
- వివిధ పార్టీల మహిళా సభ్యుల నిరసన



న్యూఢిల్లీ : మహిళా బిల్లు ఆమోదానికి లోక్‌సభలో ప్రభుత్వం తన బలాన్ని వినియోగించుకోవల్సి ఉందని రాజ్యసభ ఎంపీలు సూచించారు. ఇప్పటికీ మహిళా బిల్లు ఆమోదం పొందకపోవడం దారుణం అని ఆవేదన వ్యక్తం చేశారు. బిజెపి ఆధ్వర్యపు ప్రభుత్వానికి లోక్‌సభలో చాలినంత బలం ఉంది. ప్రభుత్వం తల్చుకుంటే ఈ మహిళా సాధికారత కోటా బిల్లుకు ఎదురే ఉండదు. ఇకనైనా బిల్లు ఆమోదానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పార్టీలకు అతీతంగా అన్ని పార్టీలూ డిమాండ్ చేశాయి. పార్లమెంట్, రాష్ట్ర చట్టసభలలో మహిళలకు 33 శాతం కోటా కల్పన నిజం కావాల్సి ఉందని తెలిపారు. 2010లోనే మహిళా రిజర్వేషన్ల బిల్లుకు రాజ్యసభలో ఆమోదం దక్కింది. అయితే వివి పార్టీల వైఖరితో దిగువ సభలో పెండింగ్‌లో ఉంది. మహిళా బిల్లు జాప్యంపై మాట్లాడేందుకు సభాధ్యక్షులు వెంకయ్యానాయుడు స్వల్పకాలిక ప్రస్తావనకు అవకాశం ఇచ్చారు. దీనితో మహిళా ఎంపీలు ఈ బిల్లు ఆమోదం గురించి పట్టుపట్టారు. సమాజ్‌వాది పార్టీ సభ్యురాలు జయా బచ్చన్ మాట్లాడుతూ తమ పార్టీ బిల్లుకు వ్యతిరేకంగా లేదని, అయితే ఉప వర్గీకరణలు కోరుతోందని తెలిపారు. 33 శాతం కోటా విషయంలో సంబంధిత రాజకీయ పార్టీలకు అధికారం ఇవ్వాలని, వారు ఏ స్థానాల నుంచి మహిళలను పోటీకి దింపేది నిర్ణయించుకునే హక్కు పార్టీలకు చెందాల్సి ఉందన్నారు. లోక్‌సభలో బిజెపికి తిరుగులేదని, అయితే ఇప్పటికీ అక్కడ బిల్లు పెండింగ్‌లో ఉండటం అన్యాయం అని సిపిఎం సభ్యులు జర్నాదాస్ బైద్యా విమర్శించారు. టిడిపి సభ్యురాలు తొట సీతారామ లక్ష్మి మాట్లాడుతూ తమ పార్టీ ఈ బిల్లుకు మద్దతు ఇస్తోందని, లోక్‌సభలో దీనికి అడ్డంకులు తొలిగిపోవల్సి ఉందని చెప్పారు. పశ్చిమ బెంగాల్‌లో తమ పార్టీ ప్రభుత్వం మహిళలకు అత్యధిక ప్రాధాన్యతను ఇస్తోందని, స్థానిక సంస్థల ఎన్నికలలో మహిళలకు 50 శాతం సీట్లు ఇచ్చారని, ఇక గత లోకసభ ఎన్నికలలో ముప్పయి శాతం సీట్లు కల్పించారని టిఎంసి ఎంపి శాంత ఛెత్రి తెలిపారు. ఈ అంశంపై అన్నాడిఎంకె, డిఎంకె ఇతర పార్టీల సభ్యులు గళమెత్తారు. మహిళలకు విధాన నిర్ణాయక అధికారం దక్కే వరకూ వారికి సాధికారత ఉత్తుత్తి మాటగానే మిగులుతుందని కాంగ్రెస్ సభ్యురాలు విప్లవ్ ఠాకూర్ స్పష్టం చేశారు. ఇచ్చిన మాట ప్రకారం బిజెపి వారు మహిళకు చట్టసభలో సరైన కోటా కల్పించాలని సభ్యులు తెలిపారు. బిజెపి సభ్యురాలు సంత్య ఉయికీ స్పందిస్తూ తమ పార్టీ మహిళా సాధికారతకు కట్టుబడి ఉందన్నారు. బిల్లుపై వైఖరిని స్పష్టం చేయలేదు.


అయోధ్య సత్వర పరిష్కారానికి పార్లమెంటులో చట్టమే మార్గం

పదవీ కాలం ముగిసే లోగా కేంద్రం ఈ చట్టం తేవాలి: విహెచ్‌పి



న్యూఢిల్లీ: అయోధ్య వివాదం సత్వర పరిష్కారం కావాలంటే పార్లమెంటు చట్టం చేయడం ఒక్కటే మార్గమని విశ్వ హిందూ పరిషత్ మరోసారి స్పష్టం చేసింది. అయోధ్య రామజన్మభూమి వివాదం కేసులో ఈ నెల 10న తాము ఏర్పాటు చేయబోయే బెంచ్ తగిన తీర్పు ప్రకటిస్తుందని సుప్రీంకోర్టు శుక్రవారం ప్రకటించిన తర్వాత విహెచ్‌పి ఈ వ్యాఖ్యలు చేసింది. తన పదవీ కాలం ముగిసే లోగా కేంద్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని తీసుకు రావాలని విహెచ్‌పి వర్కింగ్ ప్రెసిడెంట్ అలోక్ కుమార్ కోరారు. గత ఏడాది అక్టోబర్ 20న జరిగిన విచారణ సందర్భంగానే సుప్రీంకోర్టు రామజన్మభూమి అపీళ్లను విచారించడానికి బెంచ్‌ని ఏర్పాటు చేసి ఉంటే బాగుండేదని ఆయన అన్నారు. ఈ విషయంలో ముఖ్యంగా రోజువారీ విచారణ జరిపి వీలయినంత త్వరగా అపీళ్లపై విచారణను పూర్తి చేయాలన్న డిమాండ్‌పై బెంచ్ ఎలా స్పందిస్తుందో వేచి చూడాల్సి ఉందని ఆయన అన్నారు. ఈ వివాదాలను త్వరగా పరిష్కరించడానికి పార్లమెంటు చట్ట ంచేయడం ఒక్కటే మార్గమని విహెచ్‌పి ఇప్పటికీ బలంగా పమ్ముతోందని, తన పదవీ కాలం ముగిసే లోగా ఈ చట్టాన్ని తీసుకు రావాలని కేంద్రాన్ని కోరుతోందని అలోక్ కుమార్ చెప్పారు. కాగా అంతకు ముందు ఈ వివాదం ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్, జస్టిస్ ఎస్‌కె కసల్‌లతో కూడిన బెంచ్ ముందుకు రాగా, సరయిన ధర్మాసనం జనవరి 10న ఈ అంశంపై విచారణ జరుపుతుందని బెంచ్ ప్రకటించింది. కేవలం నలభై సెకన్లలోనే బెంచ్ ఎలాంటి వాద ప్రతివాదాలకు అవకాశమివ్వకుండా ఈ విషయాన్ని ప్రకటించింది. ముగ్గురు న్యాయమూర్తులతో కూడిన బెంచ్ ఈ వ్యవహారాన్ని విచారిస్తుందని తెలుస్తోంది.

జాబిల్లిపై మా అడుగుజాడలివే...



ఛాంగే వ్యోమనౌక దిగిన చిత్రాలను చూపిన చైనా

బీజింగ్ : కమ్యూనిస్టు దేశం చైనా జాబిల్లి పెరటి వేటలో పడింది. చైనా అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రయోగించిన ఛాంగే వ్యోమనౌక ఇప్పుడు అత్యంత అరుదైన చంద్ర మండల ప్రాంతాల ఛాయాచిత్రాలను నేలపైకి పంపించింది. నేరుగా చంద్రుడిని ఇంతకాలం అంతా చూశారు. అయితే చంద్రుడి వెనుక భాగపు అత్యద్భుతాల అడుగుజాడలను ఈ రోబో వ్యోమనౌక అత్యంత స్పష్టంగా చైనాలోని అంతరిక్ష కేంద్రానికి ఇప్పుడు పంపించింది. భూమికి ఉపగ్రహంగా ఉన్న చంద్రుడి ఆసాంతం ఇప్పటివరకూ ఎవరి దృష్టికీ రాలేదు. అయితే తొట్టతొలిసారిగా ఛాంగే వ్యోమనౌక ఈ వెనుక వైపు విజయవంతంగా దిగింది. ప్రపంచ వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. వాణిజ్య దౌత్య ప్రత్యర్థి అయిన అమెరికా నుంచి కూడా ఈ విజయం పట్ల మన్ననలు వెలువడ్డాయి. ఈ మర నౌక గాలిలో ఎగిరే, ఉపరితలంపై దిగే వేర్వేరు ఏర్పాట్లుతో ఉంది. చంద్రుడి అపూర్వ ఉపరితలంపై ఉండే విశేషాలను సంగ్రహించి క్షణాలలోనే చైనా అంతరిక్ష కేంద్రానికి పంపించేందుకు వీలుగా రోబో శక్తియుక్తులను సంతరించుకుని ఉంది. లూనార్ రోవర్ యూతు –2 లేదా జాడే రాబిట్ 2 తొలి అడుగుజాడలను పంపించిందని ఇప్పుడు లాంఛర్ నుంచి విడిపోయిన రోవర్ అంతరిక్షంలో పరిభ్రమిస్తోందని అధికారిక వార్తా సంస్థ జిన్హువా తెలిపింది. ఈ వ్యోమనౌక నుంచి అందే ఛాయాచిత్రాలు ఇతరత్రా సంకేతాలను భూమిపైకి ప్రసార ఉపగ్రహం క్యూక్వియావో ద్వారా భౌగోళ కేంద్రానికి పంపించడం జరుగుతోందని వెల్లడించారు. చంద్రుడి వెనుక వైపున దట్టమైన చీకటి ప్రాంతంలోని దృశ్యాలు భూమి పైకి తొలిసారిగా చేరుకున్నాయి. వెన్నెలు విసిరే చంద్రుడి వేరే రూపంపై తమ ఛాంగే వ్యోమనౌక తీవ్రస్థాయిలో అన్వేషణ నిర్వహిస్తుందని చైనా అంతరిక్ష సంస్థతెలిపింది. గత మే నెలలోనే చైనా విజయవంతగా భూమి, చంద్రుడి ఆవలివైపు శోధనకు ఉపగ్రహాన్ని పంపించింది. భూమికి చంద్రుడికి మధ్య అనుసంధాన వేదికగా ఇది ఇప్పటివరకూ పనిచేస్తోంది. దీనికి ఇప్పుడు అనుబంధంగా ఈ వ్యోమనౌక మారింది. ప్రస్తుతం చంద్రుడిపై విడిది చేసి ఉన్న వ్యోమనౌక తగు విధంగా స్పందించేందుకు సరైన దిశలో అన్వేషణలు సాగించేందుకు అవసరం అయిన సాంకేతిక సందేశాలు అన్నీ కూడా ఇప్పుడు ఈ శాటిలైట్ నుంచి నిర్వహిస్తున్నారని బీజింగ్‌లోని ఎరోస్పేస్ కంట్రోల్ సెంటర్ వర్గాలు తెలిపాయి. చంద్రుడిపై ఉన్న చైనా రోవర్ పలు ప్రత్యేకతలతో ఉంది. దీనికి ఆరు చక్రాలు ఉన్నాయి. ఐదింటితో అయినా పనిచేస్తుంది. అంతేకాకుండా ఎతైన ప్రాంతాలను అధిగమించగలదు, అడ్డంకులను దాటివేయగలదు.

థాయిలాండ్‌లో 'పబుక్' బీభత్సం

తుపాను ధాటికి భారీగా ఆస్తి నష్టం





బ్యాంకాక్ : థాయ్‌లాండ్ గజగజ వణుకుతోంది. దక్షిణ చైనా సముద్రంలో ఏర్పడిన పబుక్ తుఫాన్ ధాటికి తీర ప్రాంతాలు బెంబేలెత్తుతున్నాయి. తుపాను థాయిలాండ్ దక్షణి తీరాన్ని తాకడంతో భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నేల కూలడంతో పాటు ఇండ్ల పైకప్పులు లేచిపోయాయి. గాలుల వేగం కొంచెం తగ్గుముఖం పట్టిందని ఆదేశ వాతావరణశాఖ అధికారులు తెలిపారు. గత మూడు దశాబ్దాల్లో ఇలాంటి భీకరమైన తుఫాను రావడం ఇదే తొలిసారి అని అధికారులు పేర్కొన్నారు. పట్టాని ప్రావిన్స్‌కు సమీపంలో ఉన్న తీరంలో చేపల వేటకు వెళ్లే బృందంలోని ఒక వ్యక్తి మృతిచెందినట్లు అధికారులు వెల్లడించారు. మరొక వ్యక్తి గల్లంతయ్యాడు. థాయ్‌లాండ్ సౌత్‌లోని 15 ప్రావిన్స్‌లలో కుండపోత వర్షంతో పాటు ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. సముద్రపు అలలు 22 అడుగుల ఎత్తుకు ఎగిసిపడుతున్నాయి. తుఫాను హెచ్చరిక నేపథ్యంలో కొన్ని రోజులుగా సుమారు 6,176 మంది ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. థాయ్‌ను తుఫాను తాకనుండటంతో రెండు విమానాశ్రయాలను ముందస్తుగానే మూసివేశారు. తుపాను ఈ నెల 6న అండమాన్, నికోబార్ దీవుల్ని తాకొచ్చనని అంచనా వేస్తున్నారు. తుపాన్ నేపథ్యంలో ఒడిశా సైతం తీర ప్రాంత జిల్లాలను అప్రమత్తం చేసింది.

Printed and Published by **Tumu Mohan Rao** on behalf of Moveon Media Private Limited, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037 Medchel-Malkajgiri District, TELANGANA and Published from H.No.1-1-60/7A, 4th floor Beacon towers, street no.13, Jawaharnagar, near RTC X Roads Hyderabad-500020 Telangana state, Editor : **Anjaiah Polisetty**, RNI No. TELTEL/2012/42234. Email Id. editor@manatelangana.org. Phone No.040-27655666